

'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే
నాకు అసలైన పండుగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 172

శుక్రవారం 12-9-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

cinq AT FINANCIAL DISTRICT

RAGHAVA





An Oasis Above the City

EXCLUSIVE AMENITY ZONE IN EVERY TOWER

Pool • Jacuzzi • Walking Track • Party Area • Viewing Deck • Forest Nook • Kids' Pool • Adventure Play Area
Kids' Tunnel • Jumping Beam • Climbing Cargo Net • Trampoline • Spring Rider • Ball Pit

AN ECOSYSTEM DESIGNED FOR AN ACTIVE LIFESTYLE

Amenities thoughtfully designed across Rooftops, exclusive Oasis, Stilt Levels, and Clubhouse.


60,000 SQ. FT. CLUBHOUSE


PET PARK ON CAR-FREE STILT AREA


FITNESS HAVEN


PICKLEBALL ON ROOFTOP SKYDECK

cinq AT FINANCIAL DISTRICT

Closer to What Matters Most

LOCATED IN FINANCIAL DISTRICT

HEALTHCARE: Continental Hospital *2 Minutes*, Star Hospital *4 Minutes*

EDUCATION: Shriram Universal School *3 Minutes*, Indian School of Business *5 Minutes*

BUSINESS: Google *1 Minute*, Cyient *1 Minute*, Honeywell *1 Minute*, Capgemini *1 Minute*, Amazon Development Centre *2 Minutes*, ICICI Corporate *3 Minutes*, Accenture *3 Minutes*, Microsoft *4 Minutes*

LEISURE: Hyatt Hyderabad *1 Minute*, Sheraton Hyderabad *2 Minutes*

Road No. 2, Financial District, Nanakramguda, Hyderabad, Telangana - 500032.

www.cinqbyraghava.world | +91 9289 21 21 21

సంక్షుభిత సమయంలో ఒక జాతి తమను నడిపే నేతగా
ఒక స్త్రీ వైపు చూడటం అరుదు.
నేపాల్‌లో ఇప్పుడు అక్కడి యువత అలాంటి ఒక స్త్రీ వైపు చూస్తోంది.
అక్కడ ఏర్పడబోతున్న ఆపద్ధర్మ ప్రభుత్వానికి అధినేతగా
మాజీ చీఫ్ జస్టిస్ సుశీలా కర్కి ఉంటే బాగుంటుందని ఆశిస్తోంది.
ఆమె ఆర్మీ చీఫ్‌ను కలిశారు కూడా! భారతదేశంలో చదువుకుని,
టీచర్ స్థాయి నుంచి సుప్రీంకోర్టు
తొలి మహిళా న్యాయమూర్తి వరకూ
ఎదిగిన సుశీలా కర్కిది వెరవని వ్యక్తిత్వం.
ఆమె రచయిత కూడా. వివరాలు...

వెరవని వ్యక్తిత్వం


సుశీలా కర్కి

'ఇండియా- నేపాల్ దేశాల మధ్య అనుబంధం ఈనా టిది కాదు. దశాబ్దాలది. ప్రభుత్వాలు వాటి వాటి విధానాల వల్ల పని చేస్తుండొచ్చు. కాని ఇరుదేశాల ప్రజలు ఏనాటి నుంచో స్నేహంగా ఉన్నారు. ప్రధాని మోదీపై నాకు మంచి అభిప్రాయం ఉంది. మా స్నేహితులు, బంధువులు ఎందరో ఇండియాలో ఉన్నారు. మావారు ఎక్కువ కాలం ఇండియాలోనే గడిపారు. భారతీయులు నేపాలీలను ఆదరిస్తూనే ఉన్నారు' అన్నారు సుశీలా కర్కి.

73 ఏళ్ల ఈ మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి నేపాల్‌లో ఏర్పడనున్న ఆపద్ధర్మ ప్రభుత్వానికి ప్రధాని అయ్యే అవకాశాలు ఖరారయ్యాయి. నేపాల్‌లో ఉద్యమం కొనసాగిస్తున్న జెన్ జి విద్యార్థుల బృందం తాజా ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టి సుశీలా కర్కి మా ఎంపిక అని తేల్చి చెప్పింది. సుశీలా కర్కి తన సోషల్ మీడియా అకౌంట్‌లో 'దేశ పరిస్థితుల రీత్యా నాకు అప్పజెప్పే బాధ్యతను స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నాను' అని తెలియచేశారు.

'నేను బెనారస్ హిందూ యూనివర్సిటీలో చదువుకున్నాను. మా హాస్టల్ నుంచి నిత్యం పారే గంగను చూసే దాన్ని. ఎండాకాలం హాస్టల్ టెర్రస్ మీద పడుకునేవారం. ఉదయాన్నే గంగను చూసేవారం. అక్కడ నాతో పాటు చదువుకున్న విద్యార్థులు, పాఠాలు చెప్పిన గురువులు ఇంకా స్పష్టంగా గుర్తున్నారు' అన్నారామె. 'మా ఊరు విరాట్‌నగర్ నుంచి భారత్ సరిహద్దు 25 మైళ్లు ఉంటుంది. మేము తరచూ బోర్డర్ మార్కెట్‌కు వెళ్లేవాళ్లం. నాకు హిందీ వచ్చు' అని తెలిపారామె.

ప్రభుత్వంలో అవినీతి, మంత్రుల పట్ల వ్యతిరేకత, నయా సంపన్నుల వైఖరి, సోషల్ మీడియాపై నిర్బంధం... వీటన్నింటి దరిమిలా నేపాల్‌లో యువతరం తెచ్చిన తిరుగుబాటు వల్ల నాయకత్వ మార్పు స్పష్టమైంది. సుశీలా కర్కి ఆపద్ధర్మ ప్రధాని అయితే త్వరలో ఎన్నికలు నిర్వహించి ప్రభుత్వ ఏర్పాటు చేయించి తప్పుకోవడమే ఆమె ప్రధాన బాధ్యత. ఆ బాధ్యతకు ఆమె సమర్థురాలని యువత భావిస్తోంది.

> సుశీలా కర్కిది వెరవని వ్యక్తిత్వం అని అందరూ అంటారు. ఆమె న్యాయనిపుణత, అవినీతి రహిత నేపథ్యం చాలా కేసుల్లో కీలకమైన తీర్పులు ఇచ్చేలా చేసింది. ఒక అవినీతి కేసులో మంత్రిని జైలుకు పంపించడానికి సైతం ఆమె వెనుకాడలేదు. ఇవన్నీ ఆమెకు సానుకూలంగా మారాయని చర్చ సాగుతోంది. ఆ పేరు బయటకు వచ్చాక నేపాల్‌లో ముఖ్యంగా ఖాట్మండులో శాంతి నెలకొనడం ఆమె మాటకు విలువ ఉంటుందనడానికి ఉదాహరణ.

టీచర్‌గా మొదలై

సుశీలా కర్కి నేపాల్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పదవిని నిర్వహించిన ఏకైక మహిళగా ఆ దేశవాసుల్లో గుర్తింపు, గౌరవం పొందారు. జూన్ 7, 1952న నేపాల్‌లోని శంకర్‌పూర్‌కు చెందిన ఓ కుటుంబంలో పుట్టిన కర్కి ఏడుగురు పిల్లలలో మొదటి సంతానం. 1972లో బిరాట్‌నగర్‌లోని మహేంద్ర మొరాంగ్ క్యాంపస్ నుండి బీఏ డిగ్రీ చేసి మన బనారస్ హిందూ విశ్వవిద్యాలయం నుండి రాజకీయ శాస్త్రం చదివారు. అక్కడ చదువుతున్న సమయంలోనే నేపాలీ కాంగ్రెస్ సభ్యుడు, యువజన విభాగ నాయకుడు దుర్గా ప్రసాద్ సుబేదిని కలుసుకున్నారు. అనంతరం వారిద్దరూ వివాహం చేసుకున్నారు.

1979లో కార్కి బిరాట్‌నగర్‌లో లాయర్‌గా ప్రాక్టీస్ మొదలుపెట్టారు. 1985లో ధరణ్‌లోని మహేంద్ర మల్టిపుల్ క్యాంపస్‌లో అసిస్టెంట్ టీచర్‌గా పనిచేశారు. 2007లో సీనియర్ అడ్వకేట్‌గా 2009లో ఆ దేశ సుప్రీంకోర్టులో అడ్-హాక్ జస్టిస్‌గా నియమితులయ్యారు. నవంబర్ 18, 2010న శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2016 ఏప్రిల్ నుండి 2016 జూలై వరకు నేపాల్ సుప్రీంకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా, 2017 జూన్ వరకు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు.

రచయితగా...

కర్కి 2018లో 'న్యాయ' పేరుతో తన ఆత్మ కథ రాశారు. 2019 డిసెంబర్‌లో 'కారా' అనే నవల ప్రచురించారు. నేపాల్‌లో 1960 నుంచి 90ల మధ్యకాలంలో రాజు కనుసన్నల్లో సాగిన 'పంచాయత్' ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో ప్రజల అనుభవాలను ఆమె తన రచనల్లో ఉటంకించారు. ఆపద్ధర్మ అధినేతగా తన ఎంపిక జరిగితే శాంతి నెలకొల్పడం, చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు భరోసా ఇవ్వడం తన తొలి ప్రాధాన్యం అని ఆమె అన్నారు.

•••

గమనిక: ఈ కథనం రాసే సమయానికి సుశీలా కర్కితోపాటు మరికొన్ని పేర్లు కూడా ఆపద్ధర్మ ప్రధాని పదవికి పరిశీలనలోకి వచ్చాయి.

ట్రెండ్ సెట్టర్

సూపర్ బైకర్

'ఆడపిల్లలకు బైక్‌లు ఎందుకు!' అని ఆ తండ్రి నిరాశపరిచి ఉంటే ఆ అమ్మాయి భవిష్యత్‌లో ఎంతోమంది అమ్మాయిలకు స్ఫూర్తినిచ్చేది కాదు.


జగతిశ్రీ కుమరేశన్

'బైక్ రేసింగ్ అంటే బాయ్స్‌కు మాత్రమే' అనే అలిఖిత నిబంధనను
జగతిశ్రీ కుమరేశన్ బ్రేక్ చేసింది.

ప్రొఫెషనల్ మోటర్ సైకిల్ రేసర్‌గా దూసుకుపోతోంది.

ట్రిపుల్ నేషనల్ చాంపియన్ జగత్‌శ్రీ కుమరేశన్ థాయ్‌లాండ్‌లో జరిగే ఎఫ్ఐఎం ఆసియా మహిళల కప్ ఆఫ్ సర్క్యూట్ రేసింగ్(ఏసీసీఆర్)లో మన దేశం నుంచి ప్రాతినిధ్యం వహిస్తోంది. కొన్ని సంవత్సరాలు వెనక్కి వెళితే...

చెన్నైకి చెందిన జగత్‌శ్రీ ఒకానొక రోజు బైక్ రేసింగ్ చూసి ఆహా అనుకుంది. ఆరోజు నుంచి బైక్ రేసింగ్‌పై పాషన్ మొదలైంది. తండ్రికి తన మనసులోని మాట చెబితే సరే అని ప్రోత్సహించాడు. అలా శిక్షణ మొదలైంది. పెద్ద పెద్ద బైక్‌లపై ప్రాక్టీస్ మొదలుపెట్టేది. 2021లో టీవీఎస్ రూకీస్ ఛాంపియన్‌షిప్ కోసం బాయ్స్‌తో పోటీ పడి సత్తా చాటింది. చదువు కారణంగా 2022లో పోటీలకు విరామం ఇచ్చింది. 2023లో ఎంఎంఎస్‌సీ ఎఫ్ఎంఎస్‌సీఐ ఇండియన్ నేషనల్ డ్రాగ్ రేసింగ్ చాంపియన్‌షిప్‌లో నేషనల్ టైటిల్ గెలుచుకుంది.

మద్రాస్ క్రిస్టియన్ కళాశాల ఆర్కియాలజీ గ్రాడ్యుయేట్ అయిన జగత్‌శ్రీ ఎఫ్ఐఎం ఉమెన్స్ సర్క్యూట్ రేసింగ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్(వరల్డ్ డబ్ల్యూసీఆర్) తనదైన స్థానాన్ని నిలుపుకోవాలని పట్టుదలగా ప్రయత్నిస్తోంది.

నయా నానో బనానా ట్రెండ్

సోషల్ మీడియా

రోజుల వ్యవధిలోనే సోషల్ మీడియాలో రకరకాల ట్రెండ్స్ వస్తున్నాయి. ఇప్పుడు నడుస్తున్న ట్రెండ్ నానో బనానా ట్రెండ్. తాజాగా అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ 'గో విత్ ది ట్రెండ్' అంటూ బనాన ట్రెండ్ ఫాలో కావడం విశేషం.

ఇంతకీ ఏమిటీ ట్రెండ్?

ఈ సరికొత్త వైరల్ త్రీడి ఫిగరీన్ ట్రెండ్ అనేది గూగుల్ వారి జెమిని 2.5 ఫ్లాష్ ఇమేజ్ టూల్‌కు సంబంధించింది. ఈ ట్రెండ్‌ను 'నానో బనానా' అనే నిక్‌నేమ్‌తో కూడా పిలుస్తున్నారు. ఈ పవర్‌ఫుల్ ఏఐ టూల్ క్షణాల వ్యవధిలోనే ఏ ఫోటోను అయినా వాస్తవికత ఉట్టిపడేలా త్రీడీ మోడల్‌లోకి మారుస్తుంది. ఈ టూల్‌ను ఉచితంగా ఉపయోగించుకోవచ్చు.

టాలీవుడ్ నుంచి హాలీవుడ్ వరకు హీరోల అభిమానులు ఈ ట్రెండ్‌ను ఫాలో అవుతున్నారు. ఈ ట్రెండ్‌లో మీరూ భాగం కావాలనుకుంటే ఇలా చేయండి...

- **గూగుల్ ఏఐ స్టూడియో వెబ్‌సైట్:** గో టు గూగుల్ ఏఐ స్టూడియోలోకి వెళ్లాలి.
- ట్రై నానో బనాన ఆప్షన్ ఎంచుకోవాలి
- ఫొటో ప్లస్ ప్రాంప్ట్ అనేది రికమెండెడ్ మెథడ్
- ప్లస్ బటన్ నొక్కి ఇమేజ్‌ను అప్‌లోడ్ చేయాలి
- ప్రాంప్ట్ ఇవ్వాలి



• బ్యూటిప్



రెండు బాదం పప్పులను రాత్రి నీటిలో నానబెట్టి ఉదయాన్నే మెత్తగా గ్రైండ్ చేసి ముఖానికి పట్టించి గంట తర్వాత కడిగేయాలి. ఇలా చేయడం వల్ల చర్మం నాజూకుదనం సంతరించుకుంటుంది. ఈ విధంగా రోజు క్రమం తప్పకుండా చేస్తుంటే కొద్ది రోజుల్లోనే మంచి ఫలితం కనిపిస్తుంది.

ఈ రోజుల్లో పిల్లలందరూ ప్రతిభాఘనులే!
అయితే చదువు ఒత్తిడిలో అది మసకబారుతోంది!
అలాంటి పిల్లలు ముఖ్యంగా అమ్మాయిలు తమ ప్రజ్ఞను ప్రదర్శించడానికి భువనేశ్వర్‌లోని కిట్స్ (కళింగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ) వేదిక కల్పిస్తోంది.. 'నన్హీ పరీ లిటిల్ మిస్ ఇండియా' పేరుతో!
ఈ పోటీల్లో పదమూడేళ్ల నుంచి పదిహేనేళ్ల బాలికలందరూ పాల్గొనవచ్చు! విజేతలకు క్యాష్‌ప్రైజ్‌తోపాటు గెలుపొందిన స్థానాన్ని బట్టి కిట్స్‌లో తమకు ఇష్టమైన కోర్స్‌లో ఉచిత, భారీ రాయితీలతో విద్యనూ అందిస్తోంది. ఆ వివరాలు..

నన్హీ పరీ

లిటిల్ మిస్ ఇండియా



టాలెంట్ లేని పిల్లలు కనపడట్లేదిప్పుడు. ఇంజినీరింగ్, మెడిసిన్ చదువులకు స్కూల్ నుంచే పునాది వేస్తూ పిల్లల్లోని సహజమైన ప్రతిభను బయటకు రానీకుండా చేస్తున్నాం. దానివల్ల వాళ్లు తమకు పరిచయంలేని పదిమంది ముందుకు రావడానికి జంకుతున్నారు. మాట్లాడ్డానికి వణుకుతున్నారు. వేదికెక్కడానికి వెనుకాడుతున్నారు. దాన్ని గమనించింది.. ఆడపిల్లల చదువు కోసం కొన్ని దశాబ్దాలుగా పాటుపడుతున్న కిట్స్. ఒక్క చదువుకే కాదు బాలికల ప్రతిభాపాటవాలకూ ప్లాట్‌ఫామ్ కావాలని నిశ్చయించుకుంది. 2001లో ఒడిశాలో 'నన్హీ పరీ లిటిల్ మిస్ ఇండియా' పోటీలను మొదలుపెట్టింది. 2004కల్లా ఉత్తర భారతంలోని ప్రతి రాష్ట్రం పాల్గొనే స్థాయికి ఎదిగింది. 2015లో దక్షిణాది రాష్ట్రాలకూ చేరిన ఈ పోటీలు ఇప్పుడు జాతీయ స్థాయిని అందుకున్నాయి. ఈ ఏడు పాతికేళ్ల సంబరాన్ని జరుపుకోనున్నాయి. వీటి కోసం తెలుగు రాష్ట్రాల బాలికలకు ఈ నెల 20న హైదరాబాద్‌లోని తెలుగు యూనివర్సిటీలో ఆడిషన్స్ జరగనున్నాయి. తెలుగు రాష్ట్రాల్లోని 13-15 ఏళ్ల బాలికలు తమ పరిచయంతోపాటు తమ ప్రతిభను చూపే వన్ మినిట్ వీడియోను https://forms.gle/1QzSwfVcuPy5jTto8 అనే లింక్‌కి గానీ, 8790161155/ 8790163355 నంబర్లకు వాట్సాప్ గానీ, kiitnanhipari.hyd@gmail.comకి మెయిల్ గానీ చేయొచ్చు. ఆఖరు తేదీ 15 సెప్టెంబర్. 20వ తేదీన జరిగే ఆడిషన్స్‌లో ఇంట్రడక్షన్, పెర్‌ఫార్మెన్స్ అనే రెండు రౌండ్లు ఉంటాయి. ఇందులోంచి ఇద్దరు భువనేశ్వర్‌లో జరిగే ఫైనల్స్‌కి ఎంపిక అవుతారు. అలా దేశమంతటా ఆడిషన్స్ జరిగి.. ప్రతి రాష్ట్రం నుంచి ఇద్దరు ఎంపికై ఫైనల్ పోటీలకు వస్తారు. రెండు రోజులు జరిగే ఈ పోటీల్లోంచి ముగ్గురు విజేతలను ఎంపిక చేస్తారు. మొదటి బహుమతిగా పదిలక్షల క్యాష్ ప్రైజ్, కళింగ ఇన్‌స్టిట్యూట్‌లో ఉచిత విద్య, ఫస్ట్ రన్నరప్‌కి రూ. అయిదు లక్షల క్యాష్ ప్రైజ్, కిట్స్‌లో యాభై శాతం ఫీజు డిస్కౌంట్, సెకండ్ రన్నరప్‌కి రూ. మూడు లక్షల క్యాష్ ప్రైజ్, కిట్స్‌లో యాభై శాతం ఫీజు డిస్కౌంట్ ఉంటుంది. ఇవికాక మరో పది కేటగిరీల్లో కేటగిరీకి రూ. 20 వేల చొప్పున మొత్తం రూ. 2 లక్షల క్యాష్ ప్రైజ్ ఉంటుంది.

ఇలా ఈ పోటీలు భవిష్యత్‌లో అమ్మాయిలు పలు అంతర్జాతీయ వేదికల మీద బెరుకు లేకుండా పెర్‌ఫార్మెన్స్ ఇచ్చేలా... ఇలాంటి పోటీల్లో నిర్భయంగా పాల్గొనేలా తర్ఫీదునిస్తున్నాయి.

డిజైనింగ్ సౌరభాలు

ఫ్యాషన్

కలలకు ఆకాశమే హద్దు అనడానికి ఉదాహరణ డిజైనర్ సౌరభ్ పాండే.
ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఒక చిన్న గ్రామంలో పుట్టిన అతని పేరు ఈరోజు ప్రపంచ ఫ్యాషన్ వేదికలపై వినిపిస్తోంది.
సాధారణ మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన ఈ యువకుడు, తన కలలకోసం కష్టపడుతూ, పట్టుదలతో ఫ్యాషన్ ఇండస్ట్రీలోకి అడుగు పెట్టి ఓ ప్రత్యేకతను చూపుతున్నాడు.

స్కూల్ కెళ్లే సమయంలోనే సౌరభ్‌కి డ్రాయింగ్, డిజైన్‌పై ప్రత్యేక ఆసక్తి. పాత బట్టలను కొత్తగా కట్ చేసి, రంగులు కలిపి, తన గ్రామంలోనే చిన్న చిన్న డిజైన్స్ చేస్తూ, 'ఫ్యాషన్ అంటే ఏంటి?' అనే ప్రశ్నకు తన స్టైల్లో సమాధానం చెప్పేవాడు.



సవాళ్లే అవకాశాలకు మార్గం

ఉన్న ఆ చిన్న ఊళ్లో అవకాశాలు లేవు. ఫ్యాషన్ కోర్సులు, స్టడీ మెటీరియల్, ఫ్యాబ్రిక్ అందనంత దూరంలో ఉన్నాయి. అయినా అతని కృషి ఆగలేదు. నీరసపడలేదు. పేపర్‌పైన స్కెచ్‌లు వేసి, సోషల్ మీడియాలో తన టాలెంట్‌ను ప్రదర్శించాడు. అదే అతనికి పెద్ద అవకాశాలు తెచ్చిపెట్టింది.


అంతర్జాతీయ బ్రాండ్ల దృష్టి

సౌరభ్ పనిని గమనించిన ప్రతిభావంతులు అతన్ని మొదట స్థానిక ఈవెంట్లలో పాల్గొనమని ఆహ్వానించారు. అటు నుంచి 17 ఏళ్ళ వయసులో అతన్ని ముంబై వైపుగా నడిపించింది. ఆ మహా నగరంలో మనుగడ కష్టమే. ఒక చిన్న ఇల్లు లాంటి గదిలో తల్లిదండ్రులు, తోబుట్టువులతో కలిసి ఉండేవాడు. ఇల్లు గడవడం కోసం ఒక మాల్‌లో 12 గంటలు షిఫ్టులో పని చేస్తూ, రాత్రిళ్లు ఫ్యాషన్ డిజైన్లు గీస్తూ వాటిని సోషల్‌మీడియాలో పోస్ట్ చేస్తూ ఉన్నాడు. అతను తన పరిస్థితుల కంటే పెద్ద లక్ష్యాన్ని చాలా ఏకాగ్రతతో నడిపించాడు. ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ మనీష్ మల్హోత్రా సౌరభ్ పనిని గమనించినప్పుడు అతని జీవితం గొప్ప మలుపు తిప్పింది. ఒక అవకాశం మరికొన్ని మార్గాలను చూపించింది. అక్కడి నుంచి అతని డిజైన్లు గూచీ, డియోర్, ప్రాడా వంటి ప్రపంచ లగ్జరీ బ్రాండ్ల దృష్టికి వచ్చాయి. ఇప్పుడు అతను ఈ ఫ్యాషన్ హౌస్‌లతో కలసి ప్రత్యేక కలెక్షన్‌లు రూపొందిస్తున్నాడు.

స్టైల్ ప్రత్యేకత

భారతీయ సంప్రదాయ బట్టల టెక్స్చర్స్‌కి ఆధునిక డిజైన్‌ల కలయిక, నేచురల్ కలర్స్, ఎకో-ఫ్రెండ్లీ ఫాబ్రిక్‌ల వాడకం, సింపుల్ కట్‌లు, గ్లోబల్ లుక్.. ఈ ప్రత్యేకతలు అతన్ని అందరిలో ముందుంచుతున్నాయి. ఫ్యాషన్ వేదికల మీద అతని డిజైన్స్ ప్రదర్శించేంతగా వెళ్లింది. సోషల్ మీడియాలో అతని విచిత్రమైన వీడియోలకు ఎగతాళి చేసిన జనమే, ఆ తర్వాత అవే వీడియోలకు కనెక్ట్ అవ్వడం ప్రారంభించారు. తిరస్కరణ, ఎగతాళి నుండి ఇప్పుడు అతను కోట్లు సంపాదించేంతగా ఎదిగాడు. తన కథను తానే తిరగ రాసుకున్నాడు. అతన్ని సక్సెస్ గురించి అడిగితే 'ఎవ్వరు ఏమనుకున్నా నేను నాలా ఉండటమే నాకు ఇష్టం. అదే నా నిజమైన ఫ్యాషన్ స్టేట్‌మెంట్' అంటాడు.

మారుమూల గ్రామాల యువతకు సౌరభ్ ఒక స్ఫూర్తి. 'కల అంటే పెద్దది కావాలి. మన దగ్గర వనరులు లేకపోయినా, కష్టపడితే ప్రపంచమే మన దారికి రావచ్చు' అని అతను చెప్పే సందేశం ప్రతి యువకుడిలో కొత్త ఆశను నింపుతోంది.


సౌరభ్ పాండే





బులియన్ (బంగారం 10 గ్రా.; వెండి కిలో) సెప్టెంబర్ 11న ముగింపు రూ.లలో

హైదరాబాద్		విజయవాడ		విశాఖపట్నం		రాజమండ్రి		ప్రొద్దుటూరు		చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	1,13,600	బంగారం (24 క్యారెట్లు)	1,12,480	బంగారం (24 క్యారెట్లు)	1,10,510	బంగారం (24 క్యారెట్లు)	1,10,510	బంగారం (24 క్యారెట్లు)	1,13,500	బంగారం (24 క్యారెట్లు)	1,10,730
బంగారం (22 క్యారెట్లు)	1,07,300	బంగారం (22 క్యారెట్లు)	1,01,300	బంగారం (22 క్యారెట్లు)	1,01,300	బంగారం (22 క్యారెట్లు)	1,01,300	బంగారం (22 క్యారెట్లు)	1,04,420	బంగారం (22 క్యారెట్లు)	1,01,500
వెండి	1,30,600	వెండి	1,28,800	వెండి	1,40,000	వెండి	1,40,000	వెండి	1,29,000	వెండి	1,40,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

శుక్రవారం 12-9-2025

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 172



'పేద ప్రజల ఆరోగ్యమే నాకు మహాభాగ్యం.
రాజీవ్ ఆరోగ్యశ్రీ సంజీవనిలా పనిచేస్తోంది.
ఈ తృప్తి చాలు'

జోయాలుక్కాస్
వరల్డ్స్ ఫేవరేట్ జ్యువెలర్

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



● టెక్... టాక్

గూగుల్ పిక్సెల్ 10



డిస్‌ప్లే: 6.30 అంగుళాలు
బరువు: 204 గ్రా.
మెమొరీ: 128 జీబి 12జీబి ర్యామ్/256 జీబి 12జీబి ర్యామ్
రిజల్యూషన్: 1080X2424 పిక్సెల్స్
ఫ్రంట్ కెమెరా: 10.5 ఎంపీ
బ్యాటరీ: 4970 ఎంఏహెచ్

వన్‌ప్లస్ ప్యాడ్ 3



సైజ్: 13.2 అంగుళాలు
రిజల్యూషన్: 2400X3392 పిక్సెల్స్
రిఫ్రెష్ రేట్: 144 హెచ్‌జడ్
బ్యాటరీ: 12,140 ఎంఏహెచ్

పోలార్ లూప్



పోలార్ లూప్ అనేది స్క్రీన్‌లెస్, సబ్‌స్క్రిప్షన్-ఫ్రీ రిస్ట్ వేరబుల్. ఈ టెక్స్‌టైల్ బ్యాండ్‌ను బ్రౌన్ కాపర్, నైట్ బ్లాక్... మొదలైన కలర్స్‌తో లాంచ్ చేశారు. దీని బరువు 29 గ్రాములు. హార్ట్ రేట్, యాక్టివిటీ, స్లీప్, రికవరీ, ట్రెనింగ్ మెట్రిక్స్‌ను ఈ ట్రాకర్ రికార్డ్ చేస్తుంది. సింగిల్ చార్జ్‌పై 8 రోజుల వరకు బ్యాటరీని అందిస్తుంది. ప్రతీది పోలార్ ఫ్లో యాప్‌కు సింక్‌ై ఉంటుంది. అదనంగా సబ్‌స్క్రిప్షన్ అక్కర్లేదు.

స్కిల్ డెవలప్‌మెంట్ | గూగుల్ ట్రాన్స్‌లేట్ ప్రాక్టీస్ మోడ్

కొత్త భాషలు నేర్చుకుందామా!



కొత్త భాషలు నేర్చుకునేవారిలో జ్ఞాన విస్తృతి ఒక కోణం అయితే, ఉల్లాసం, ఉత్సాహం అనేది మరో కోణం. మరి మీరు కొత్త భాష నేర్చుకోవడానికి రెడీగా ఉన్నారా! గతంతో పోల్చితే కొత్త భాష నేర్చుకోవడం అట్టే కష్టం కాదు. ఇప్పుడు ఎన్నో లాంగ్వేజ్ లెర్నింగ్ యాప్స్ ఉన్నాయి. అయితే అన్ని యాప్స్ ఉచితం కాదు. ఈ నేపథ్యలో గూగుల్ ట్రాన్స్‌లేట్ యాప్‌కు ప్రాధాన్యత పెరిగింది. ఈ యాప్ కేవలం అనువాదానికి మాత్రమే పరిమితం కావడం లేదు. కొత్త భాషలు నేర్చుకునే సాధనంగా కూడా ఉపయోగపడనుంది. 'గూగుల్ ట్రాన్స్‌లేట్' యాప్‌ను ఏఐ-పవర్డ్ లైవ్ ట్రాన్స్‌లేషన్, లాంగ్వేజ్ లెర్నింగ్ టూల్స్‌తో అప్‌డేట్ చేసింది గూగుల్.

జెమిని ఏఐ ద్వారా కొత్త గూగుల్ ట్రాన్స్‌లేట్ ప్రాక్టీస్ మోడ్‌తో కొత్త భాషలు నేర్చుకోవచ్చు. సబ్‌స్క్రిప్షన్ అవసరం లేకుండానే ఈ ఫీచర్‌ని ఉపయోగించుకోవచ్చు. కొత్త భాషను వినే, మాట్లాడే అనుభవాన్ని సొంతం చేసుకోవచ్చు. రకరకాల సంభాషణలతో భాషా నైపుణ్యాలకు పదును పెట్టవచ్చు. ఉదాహరణకు మీరు స్పానిష్ మాట్లాడే ప్రాంతానికి వెళ్లబోతున్నారనుకుందాం. అక్కడికి వెళ్లిన తరువాత స్థానికులను ఎలా పలకరించాలి? సహాయం ఎలా అడగాలి....మొదలైన వాటిని నేర్చుకోవచ్చు. మీరు భాషను ఎంత మేరకు నేర్చుకున్నారు అనేదానికి సంబంధించి పద పరీక్షలు కూడా ఉంటాయి.

ఇలా... ● లేటెస్ట్ గూగుల్ ట్రాన్స్‌లేట్ యాప్ లాంచ్ చేయాలి ● ప్రాక్టీస్ బటన్ నొక్కాలి ● 'గెట్ స్టార్టెడ్' ఎంపిక చేసుకోవాలి ● డిస్‌ప్లే లాంగ్వేజ్ (మీరు మాట్లాడే భాష), ప్రాక్టీస్ లాంగ్వేజ్(మీరు నేర్చుకోవాలనుకుంటున్న భాష) సెలెక్ట్ చేసుకోవాలి ● నెక్స్ట్-బటన్ నొక్కాలి ● కొత్త భాషకు సంబంధించి మీ అవగాహనను ఏఐ అర్థం చేసుకోవడానికి కొన్ని ప్రశ్నలు అడుగుతుంది ● కొత్త భాష నేర్చుకోవడానికి సంబంధించి 'బేసిక్' 'ఇంటర్‌మీడియెట్' 'అడ్వాన్స్‌డ్' ఆప్షన్‌లు ఉంటాయి ● 'గోల్స్' లిస్ట్ కనిపిస్తుంది. నచ్చింది ఎంపిక చేసుకోవచ్చు. నచ్చకపోతే టాప్ రైటర్ కార్నర్‌లోని స్కిప్ బటన్ నొక్కవచ్చు ● ఫైనల్‌గా 'స్టార్ట్ ప్రాక్టీసింగ్'ను సెలెక్ట్ చేసుకోవాలి ● లిజన్, స్పీక్ ఆప్షన్‌లు ఉంటాయి. వినడం అనేది పదాల పరిచయానికి, మాట్లాడడం అనేది ఉచ్చారణను మెరుపరచడానికి ఉపయోగపడతాయి.

కొత్త భాషలు నేర్చుకునే విషయంలో ఒక్కొక్కరికీ ఒక్కో లక్ష్యం ఉండొచ్చు. మీ లక్ష్యం సిద్ధించిందా? కొత్త లక్ష్యం ఏర్పాటు చేసుకున్నారా? ఇందుకోసం స్క్రీన్ టాప్‌లో ఉన్న 'గోల్ బాక్స్'ను నొక్కాలి. సొంతంగా ప్రాక్టీస్ సినారియో క్రియేట్ చేసుకోవచ్చు. ఉదాహరణకు ఒక కొత్త ఫ్రెండ్‌ను కలుసుకోబోతున్నారనుకుందాం. దృశ్య సంబంధిత సంభాషణల ఆధారంగా లెర్నింగ్ సెషన్‌ను క్రియేట్ చేయవచ్చు.

యువర్స్

● జెన్ Z ట్రెండ్

'ఉద్యోగంలో నిలదొక్కుకోవాలి... ఆ తర్వాతే పెళ్లి గురించి ఆలోచించాలి... 'సొంత ఇల్లు, బ్యాంకు బ్యాలెన్స్.. జీవితంలో స్థిరపడాలి ఆ తర్వాతే పిల్లల గురించి ఆలోచించాలి..' ఇలా అనుకునేవారి శాతం ఈ రోజుల్లో బాగా పెరిగిపోయింది. వయసు మూడు పదులు దాటుతున్నా, పెళ్లి, పిల్లలు అనే దశలను వాయిదా వేస్తూ ఉన్నారు. ఫలితంగా భవిష్యత్తులో పిల్లలు కలగరేమో అనే ఆందోళన కూడా ఉంటోంది. అందుకే, ముంబైలోని నవతరం అమ్మాయిల జీవనశైలి, వారి ఆలోచనా విధానంలో వినూత్న మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఎక్కువ మంది యువతులు తమ అండాలను నిల్వ చేసుకోవడానికి ఆసక్తి చూపుతున్నట్టు ఒక సర్వే వెల్లడించింది. ఇది మారుతున్న సామాజిక ఎంపికలకు అద్దంలాంటిది. భవిష్యత్తులో మాతృత్వాన్ని పొందాలనుకునే మహిళలకు ఇది ఒక ఇన్సూరెన్స్ పాలసీ లాంటిది.

యూత్‌లో ఎగ్‌రికల్చర్



ఇటీవల జరిగిన సర్వేలో పాతికేళ్ల వయసున్న (జెన్‌జెడ్) దాదాపు 18 శాతం మంది యువతులు మారుతున్న జీవనశైలి వైపుగా కదులుతున్నారని, రెండింతల ఆదాయంవైపు మొగ్గుచూపుతూ పిల్లలు వద్దు అనే ఆలోచనలో ఉంటున్నారని తెలియజేసింది. మెరుగైన కెరీర్, వ్యక్తిగత ఉద్దేశాల కోసం వారు పిల్లలను కనకూడదని లేదా మాతృత్వాన్ని వాయిదా వేయాలని ఎంచుకుంటున్నారు. ఎక్కువ మంది యువతులు విద్య, వృత్తిపరమైన అభివృద్ధిపై దృష్టి పెట్టడానికి పిల్లలను కనడాన్ని వాయిదా వేస్తున్నారు. అయితే వారిని ఎప్పుడూ హెచ్చరించే బయోలాజికల్ క్లాక్ ఒత్తిడి లేకుండా భవిష్యత్తు కోసం సంతానోత్పత్తిని కాపాడుకోవడానికి అండాలను నిల్వ చేసుకోవడం ఒక మార్గంగా కనిపిస్తోంది.

అయితే, సంతానోత్పత్తి ఇండికేటర్స్ గురించి అవగాహన లేకపోవడాన్ని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎక్కువగా AMH (యాంటీ-ముల్లెరియన్ హార్మోన్), ఇది స్త్రీ అండాశయ నిల్వలను అంచనా వేయడానికి సహాయపడుతుంది. సర్వే చేసిన 50 శాతం కంటే ఎక్కువ మంది మహిళలు, 35 సంవత్సరాల వయస్సు తర్వాత సంతానోత్పత్తి తగ్గుతుందని గ్రహించినప్పటికీ, వారిలో చాలామందికి వారి అండాలను నిల్వ చేసుకునే సమయం, కుటుంబ జీవనాన్ని మొదలపెట్టడానికి సరైన వయస్సు గురించి ఏ మాత్రం అవగాహన ఉండటం లేదని చెబుతున్నారు. వైద్యులు కూడా అలా కోరుకునేవారికి భవిష్యత్తులో సంతానోత్పత్తి ప్రయోజనాలను అందుకోవచ్చని సలహా ఇస్తున్నారు. వంధ్యత్వం సమస్య పురుషులు, మహిళలు ఇద్దరినీ బాధపెడుతుంది కాబట్టి, అండాలు నిల్వ చేసుకోవడానికి, సంబంధిత చికిత్సలకు సపోర్ట్ ఇవ్వడానికి కంపెనీలు కూడా ఆసక్తిచూపుతున్నాయి. దీనికి కారణం తమ ఉద్యోగుల ప్రతిభను ఆకర్షించడానికి, వారిని నిలుపుకోవడానికి మద్దతునివ్వడం ఒక కారణంగా ఉంటోంది.

ఈ మార్పు చాలా మెరుగైన పునరుత్పత్తి ఆరోగ్య విద్య అవసరాన్ని వివరిస్తుంది. బహిరంగంగా చర్చలు జరపడం ద్వారా, అందుబాటులో ఉన్న సమాచారాన్ని తెలియపరచడం ద్వారా, మహిళలు తమ సంతానోత్పత్తి, కెరీర్, భవిష్యత్తు కుటుంబ నియంత్రణ గురించి మరిన్ని విషయాల్లో అవగాహనతో పాటు నిర్ణయాలు తీసుకోవచ్చు. భారతదేశంలో ఎక్కువ మంది మహిళలు పిల్లలు కనడాన్ని వాయిదా వేసుకోవడాన్ని బట్టి చూస్తుంటే సంతానోత్పత్తి, వ్యక్తిగత ఎంపిక గురించి చర్చ ఇంకా పెరగాల్సి ఉందని స్పష్టం అవుతుంది.

***

మహిళల వయసు పెరుగుతున్న కొద్దీ అండాల సంఖ్య, నాణ్యత తగ్గిపోతుంది. 35 ఏళ్ల తర్వాత గర్భధారణ అవకాశాలు తగ్గుతాయి, జెనెటిక్ రిస్కులు పెరుగుతాయి. కెరీర్, ఎడ్యుకేషన్, వ్యక్తిగత పరిస్థితుల వల్ల తల్లి కావడం ఆలస్యమవుతుంటే, ఎగ్ ఫ్రీజింగ్ ఒక మంచి ఎంపిక. అయితే, 30 – 35 ఏళ్ల లోపు అండాల నాణ్యత బాగుంటుంది కాబట్టి ఈ వయసు అనుకూలం. హార్మోన్ ఇంజెక్షన్లతో అండాశయాల్లో ఒకేసారి ఎక్కువ అండాలు ఉత్పత్తి అయ్యేలా చేస్తారు. అండాలను శస్త్రచికిత్స లేకుండా సులభమైన ప్రక్రియ (egg retrieval) ద్వారా బయటకు తీస్తారు. వాటిని ప్రత్యేకమైన సాంకేతికతతో ఫ్రీజ్ చేస్తారు. భవిష్యత్తులో అవసరం ఉన్నప్పుడు ఐవీఎఫ్ పద్ధతి ద్వారా అండాలను ఉపయోగిస్తారు. లేటు వయసులో కూడా తల్లి కావాలనుకుంటే ఈ పద్ధతి సురక్షితమైనది. క్యాన్సర్ వంటి సమస్యలు వచ్చి వైద్య చికిత్స జరిగినప్పుడు ఫెర్టిలిటీ సమస్య ఉత్పన్నం కావచ్చు. అందుకని ముందే నిల్వ చేసుకున్న అండాశయాల ద్వారా బిడ్డలను పొందవచ్చు. అయితే వీటి విషయంలో వంద శాతం గ్యారంటీ అని చెప్పలేం. ఎందుకంటే నిల్వ చేసిన అండాలు విజయవంతంగా ఫలదీకరించలేకపోవచ్చు. ఖరీదైన ప్రక్రియ (లక్షల రూపాయలు ఖర్చు అవుతుంది) కూడా. హార్మోన్ ట్రీట్‌మెంట్ వల్ల ఉబ్బరం, తలనొప్పి, మూడ్ స్వింగ్స్ వంటి సమస్యలను ఎదుర్కోవాల్సి రావచ్చు. ఎన్ని సంవత్సరాలు నిల్వ చేసినా, అండం నిల్వ సమయంలో ఉన్న వయసు ఆధారంగానే ఫలితం వస్తుంది. హైదరాబాద్, బెంగళూరు, ముంబై, చెన్నై, పూణే, న్యూఢిల్లీ నగరాలలోని హాస్పిటళ్లు ఎగ్ ఫ్రీజింగ్ అవకాశాన్ని అందిస్తున్నాయి.



– డా.శిరీష, గైనకాలజిస్ట్

● యంగ్ టాలెంట్

గురి తప్పని బాణం



ప్రపంచయూత్ ఛాంపియన్‌షిప్ కాంపౌండ్ విభాగంలో బంగారు పతకం సాధించిన తొలి భారతీయ మహిళ క్రీడాకారిణిగా సత్తా చాటింది తెలంగాణ రాష్ట్రం పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన తానిపర్తి చికిత....

చికిత హైస్కూల్‌లో చదువుతున్న రోజుల్లో బ్యాడ్మింటన్ స్టార్ సైనా నెహ్వాల్ ఒలింపిక్స్‌లో పతకం సాధించింది. ఆమె స్ఫూర్తితో కూతురిని క్రీడాకారిణిగా తీర్చిదిద్దాలని సంకల్పించిన తండ్రి శ్రీనివాసరావు చికితకు మొదట కరాటే నేర్పించాడు. అందులో బ్లాక్‌బెల్ట్ సాధించింది. ఒకసారి కరీంనగర్ స్టేడియంలో ఆర్చరీ పోటీలు జరుగుతుండగా చూసిన చికితకు ఆసక్తి కలిగింది. 'ఆర్చరీ నేర్చుకుంటాను' అని తండ్రికి చెప్పింది. తమ పొలంలోని గడ్డివాములనే లక్ష్యంగా ఆర్చరీ సాధనకు శ్రీకారం చుట్టింది. సీనియర్ ప్లేయర్ శ్రీనివాస్ దగ్గర ఆర్చరీలో మెలకువలు నేర్చుకుంది. 2019లో గోవాలో నిర్వహించిన జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలో, 2022లో గణతంత్ర దినోత్సవం సందర్భంగా బెంగళూరులో జరిగిన జాతీయ స్థాయి పోటీలో బంగారు పతకం సాధించి నేషనల్ ఆర్చరీ అసోసియేషన్‌ఇండియా (ఎన్ఏఏఐ) దృష్టిలో పడింది. ఆర్చరీ అకాడమీలో చోటు లభించడంతో వరుస విజయాలు నమోదు చేస్తూ పోయింది. ఈ ఏడాదిలో చైనాలోని షాంఘైలో జరిగిన టోర్నిలో టీమ్ విభాగంలో రజత పతకం, ఆసియా గ్రాండ్‌ప్రి టీమ్ విభాగంలో కాంస్యం సాధించింది. తాజాగా కెనడాలో జరిగిన ప్రపంచ యూత్ చాంపియన్‌షిప్ కాంపౌండ్ ఆర్చరీ విభాగంలో స్వర్ణ పతకం సాధించిన తొలి భారతీయ మహిళగా సత్తా చాటింది.



– శ్రీనివాస్ గుడ్ల, సాక్షి, పెద్దపల్లి

సాక్షి సినిమా

నా చిన్నప్పడే పాన్ ఇండియా స్టార్స్ ఉన్నారు

– హీరో తేజ సజ్జా



''మనం ఎంత ఖర్చుపెట్టినా ప్రేక్షకుల నమ్మకాన్ని కొనలేం. సినిమాలు స్పీడ్‌గా చేయాలని, రెండు మూడు సినిమాలు వరుసగా చేసేసి, ప్రేక్షకులను ఒక్కసారి నిరుత్సాహపరిచినా నాకు బాధగా ఉంటుంది. నేను దక్కించుకున్న క్రెడిబిలిటీ, నా కష్టం తాలూకు విలువ పోతుంది. నా సినిమా వస్తోంది... థియేటర్స్‌కు రండి అని ఆడియన్స్‌ని నేను కాన్ఫిడెంట్‌గా, ధైర్యంగా పిలిచేలా నా సినిమాలు ఉండాలనుకుంటాను. 'మిరాయ్' ఇలాంటి చిత్రమే'' అని తేజ సజ్జా అన్నారు. తేజ సజ్జా హీరోగా నటించిన చిత్రం 'మిరాయ్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, కృతీ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం తేజ సజ్జా చెప్పిన సంగతులు.

● ఫుల్ ఫ్యామిలీ అండ్ క్లీన్ ఫిల్మ్ 'మిరాయ్'. యాక్షన్, అడ్వెంచర్, ఎమోషన్, డివోషన్, ఎలివేషన్... ఇలా అన్ని అంశాలు ఉన్న చిత్రం ఇది. చార్మినార్‌లోని కుర్రాడు వాడి ధర్మం ఏంటో వాడు గ్రహించి, తనకి, యోధ ప్రపంచానికి ఉన్న సంబంధం ఏంటో తెలుసుకుని, ఓ పెద్ద ఆపదను ఆపడానికి ఎంత దూరం వెళ్లాడు? తల్లి ఆశయం కోసం ఏం చేశాడు? ప్రపంచం అంతరించబోతున్నటువంటి ఓ పెద్ద ఆపద రాబోతున్నప్పుడు మన ఇతిహాసాల్లో వేల సంవత్సరాల క్రితం పెట్టి ఉంచిన సమాధానాన్ని ఈ కుర్రాడు ఎలా కనుక్కుంటాడు? అన్నది ఈ సినిమా కథాంశం.

● ఈ చిత్రంలో తొమ్మిది యాక్షన్ సీక్వెన్స్‌లు వరకు ఉన్నాయి. వయసులో ఉన్నాను కాబట్టి ఫిజికల్ చాలెంజ్‌లు ఏం అనిపించలేదు. ఈ సీక్వెన్స్‌లు చూసి, ఆడియన్స్ ఎంత థ్రిల్ అవుతారో చూడాలనుకుంటున్నాను. టీజీ విశ్వప్రసాద్ గారు ప్యాషనేట్ ప్రొడ్యూసర్. ఆడియన్స్‌కు నచ్చే మంచి సినిమా తీద్దామనుకునే నిర్మాత. ఆయనలాంటి నిర్మాతలు అరుదు. అందుకే ఆయనతో మరో సినిమా చేస్తున్నాను.

● నా చిత్రాలతో ఆడియన్స్‌ని సర్‌ప్రైజ్ చేయాలని తపన పడుతుంటాను. కొత్తదనంతో కూడిన సినిమాలు చేయాలనుకుంటాను. ఆ ప్రెజర్ ఉంది. కానీ 'హను–మాన్' సినిమా సక్సెస్‌తో నాపై కొత్తగా పెరిగిన ఒత్తిడి ఏం లేదు. చెప్పాలంటే ఒక రకంగా 'హను–మాన్' సినిమా విషయంలోనే ఒత్తిడి ఫీలయ్యాను. కొన్ని ఇబ్బందికర పరిస్థితుల మధ్య ఆ సినిమా విడుదలైంది. ఈ సినిమా విజయం సాధించింది కదా అని 'మిరాయ్' సినిమాలో మార్పులు చేర్పులు చేయలేదు.

● మా నాన్నగారు హార్డ్‌వర్కింగ్ పర్సన్. ఆయన వయసు 65. ఈ రోజుకీ ఆయన ఉదయం 6.30కి ఉద్యోగానికి వెళ్తారు. సాయంత్రం 8 గంటలకు వస్తారు. పనిని ఫస్ట్ ప్లేస్‌లో పెట్టేవారిలో మా ఫాదర్ ఒకరు. అలాంటి ఇంటి నుంచి వస్తున్నాను కాబట్టే పనికి నేను ఇంత ప్రాధాన్యత ఇస్తున్నానేమో అనిపిస్తోంది. పనే దైవం అని భావిస్తాను.

● కథ కుదరితే పాన్ ఇండియా స్థాయిలో నా సినిమా రిలీజ్ చేస్తాం. నిజానికి పాన్ ఇండియా సూపర్ స్టార్లు నా చిన్నప్పట్నుంచి ఉన్నారు. రామారావు, నాగేశ్వరరావు గార్ల సినిమాలు చెన్నైలో చూసేశారు. చిరంజీవి గారు స్ట్రయిట్‌గా హిందీలో సినిమాలు చేశారు. రజనీకాంత్, కమల్‌హాసన్‌గార్ల సినిమాలు నేను నా చిన్నప్పట్నుంచి చూస్తున్నాను. అలాంటి వారికి జోడించాల్సిన పాన్ ఇండియా స్టార్ ట్యాగ్‌ని నాలాంటి యంగ్ హీరోస్‌కి పెట్టడం ఏ మాత్రం కరెక్ట్ కాదని నమ్మేవారిలో నేనొకడిని. తెలుగు ప్రేక్షకుల అభిరుచి మేరకు మేం సినిమాలు చేస్తున్నాం. ఒకవేళ మేం చేసే చిత్రం ఇతర భాషల ఆడియన్స్‌కు కూడా నచ్చితే, అది మాకు బోనస్. దీని కోసం రిలీజ్ చేయడమే. అంతేకానీ... అక్కడ ఎస్టాబ్లిష్ అవ్వాలన్న ప్రయత్నం ఏమీ లేదు.

● 'జై హనుమాన్' చిత్రంలో నటిస్తున్నానా? లేదా అనేది ప్రశాంత్ వర్మగారు చెబుతారు. 'జాంబిరెడ్డి 2' సినిమాకు ఇంకా దర్శకుడు ఫిక్స్ కాలేదు. ప్రశాంత్‌గారు కథ అందిస్తున్నారు. విశ్వప్రసాద్‌గారు నిర్మిస్తారు. 'మిరాయ్' సినిమా విజయం సాధిస్తే, రెండో భాగం కూడా ఉంటుంది.



● సాహు, కౌశిక్, అనుపమ, సాయి శ్రీనివాస్, అనిల్, బుచ్చిబాబు, సుస్మిత

ఆయన కోసం కిష్కింధపురి చూస్తాను

– అనిల్ రావిపూడి

''నాకు హారర్ సినిమాలంటే భయం. కానీ, మా నిర్మాత సాహుగారి కోసం 'కిష్కింధపురి' చూస్తా'' అని డైరెక్టర్ అనిల్ రావిపూడి తెలిపారు. బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమా పరమేశ్వరన్ జంటగా నటించిన చిత్రం 'కిష్కింధపురి'. కౌశిక్ పెగల్లపాటి దర్శకత్వంలో సాహు గారపాటి నిర్మించిన ఈ సినిమా నేడు రిలీజ్ అవుతోంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి డైరెక్టర్స్ అనిల్ రావిపూడి, బుచ్చిబాబు సానా, నిర్మాత సుస్మిత కొణిదెల ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అనిల్ రావిపూడి మాట్లాడుతూ– ''సాయి శ్రీనివాస్ చాలా కష్టపడతాడు. తను ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్న బిగ్ సక్సెస్ ఈ సినిమాతో రావాలని కోరుకుంటున్నాను. డైరెక్టర్‌కి ఆల్ ది వెరీ బెస్ట్. నిర్మాత సాహుగారితో 'భగవంత్ కేసరి' చేశాను. ఇప్పుడు 'మన శంకరవరప్రసాద్ గారు' చిత్రం చేస్తున్నాను'' అన్నారు. ''రాక్షసుడు'లానే 'కిష్కింధపురి' కూడా పెద్ద హిట్ కావాలని కోరుకుంటున్నాను'' అన్నారు బుచ్చిబాబు. ''కిష్కింధపురి' ట్రైలర్ అదిరిపోయింది. ఈ చిత్రం సూపర్ డూపర్ హిట్ కావాలని కోరుకుంటున్నాను'' అని సుస్మిత కొణిదల. చెప్పారు.

లిటిల్ హార్ట్స్ ఆ ధైర్యాన్నిచ్చింది

– బన్నీ వాసు



● బన్నీ వాసు, వంశీ, మౌళి, శివానీ, సాయి మార్తాండ్, నితిన్, సాయికృష్ణ

''కంటెంట్ బాగున్న సినిమాను ప్రేక్షకులు ఆదరిస్తారనే నమ్మకంతో 'లిటిల్ హార్ట్స్' చేశాం. మా అంచనాని నిజం చేసి, ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరిస్తున్నందుకు హ్యాపీ. మరిన్ని మంచి సినిమాలు చేసే ధైర్యాన్ని, నమ్మకాన్ని 'లిటిల్ హార్ట్స్' ఇచ్చింది'' అన్నారు నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ బన్నీ వాసు. మౌళి తనూజ్, శివానీ నాగారం జంటగా సాయి మార్తాండ్ దర్శకత్వం వహించిన చిత్రం 'లిటిల్ హార్ట్స్'. ఆదిత్య హాసన్ నిర్మించిన ఈ చిత్రాన్ని బన్నీ వాసు, వంశీ నందిపాటి ఈ నెల 5న విడుదల చేశారు. గురువారం నిర్వహించిన థ్యాంక్స్ మీట్‌లో బన్నీ వాసు మాట్లాడుతూ– ''ఈ చిత్రంతో వచ్చే ప్రతి రూపాయి నాకు కోటి రూపాయలతో సమానం. ఎందుకంటే నా బీవీ వర్క్స్ బ్యానర్ మీద రిలీజ్ చేసిన తొలి సినిమా ఇది. బ్యాక్‌గ్రౌండ్ ఉన్నా లేకున్నా ఎవరైనా ఇండస్ట్రీలో పేరు తెచ్చుకోవచ్చనేందుకు మౌళి ఓ ఉదాహరణ'' అన్నారు. ''బన్నీ వాసుతో కలిసి ఈ సినిమాని డిస్ట్రిబ్యూట్ చేయడం హ్యాపీ'' అన్నారు వంశీ నందిపాటి. ''మా సినిమాను ఒక్కొక్కరు రెండు మూడు సార్లు చూశామని చెబుతుండటం హ్యాపీగా ఉంది'' అన్నారు శివానీ. ''ఈ సినిమా ప్రీమియర్స్ నుంచే ప్రేక్షకుల్ని రప్పించింది మౌళినే'' అని సాయి మార్తాండ్ చెప్పారు. ''బండ్ల గణేశ్, రవితేజగార్లు ఫోన్ చేసి, నన్ను అభినందించడం, నా అభిమాన హీరో నానీ గారు ట్వీట్ చేయడంతో ప్రస్తుతం గాల్లో ఎగురుతున్నంత సంతోషంగా ఉంది'' అని మౌళి తనూజ్ అన్నారు.

ఎంతమంది వద్దన్నా లక్ష్మణ రేఖ నాకే వచ్చింది

– నటి జయసుధ

సహజ నటి జయసుధ హీరోయిన్‌గా నటించిన తొలి చిత్రం 'లక్ష్మణ రేఖ'కు 50 ఏళ్లు. ఈ సినిమాకి ముందు ఓ నాలుగైదు సినిమాల్లో ఆమె కీలక పాత్రలు చేశారు. ఎన్. గోపాలకృష్ణ దర్శకత్వంలో షణ్ముగం చెట్టియార్, ఏవీ కృష్ణారావు నిర్మించిన 'లక్ష్మణ రేఖ'లో చేసిన సీరియస్ క్యారెక్టర్ జయసుధకు మంచి పేరు తెచ్చిపెడితే, దర్శకుడు ఎన్. గోపాలకృష్ణకి 'లక్ష్మణ రేఖ' ఇంటి పేరుగా మారిపోయింది. ఈ చిత్రంలో మురళీమోహన్ – జయసుధ జంటగా నటించగా, చంద్రమోహన్ నెగటివ్ షేడ్స్ ఉన్న క్యారెక్టర్, గుమ్మడి, అల్లు రామలింగయ్య తదితరులు కీలక పాత్రల్లో నటించారు. 1975 సెప్టెంబర్ 12న ఈ చిత్రం విడుదలైంది. ఈ సినిమా విడుదలై 50 ఏళ్లయిన సందర్భంగా 'సాక్షి'తో జయసుధ ప్రత్యేకంగా పంచుకున్న విషయాలు.

'లక్ష్మణ రేఖ' ఓ మరాఠీ చిత్రానికి మూలం. తండ్రి చెప్పిన మాట వినకుండా ప్రేమికుడి కోసం ఇంటి నుంచి వెళ్లిన ఒక అమ్మాయి మోసపోతుంది. ఆ ప్రేమికుడిపై పగ తీర్చుకోవాలనుకుంటుంది. ఆ మోసగాడు ఆమె చెల్లెలి భర్తతో పరిచయం పెంచుకుని, వారి కాపురంలో చిచ్చుపెడతాడు. భర్త వదిలేస్తాడు. నేను చెల్లెలి పాత్ర చేశాను. ఇది బరువైన పాత్ర కాబట్టి నా వయసు సరిపోదని, నన్ను వద్దని డైరెక్టర్, ప్రొడ్యూసర్స్‌తో పెద్దలు చెప్పారు. అయితే ఆ సినిమా నాకే వచ్చింది.

'లక్ష్మణ రేఖ' తర్వాత 'జ్యోతి, ఆమె కథ, ప్రేమలేఖలు' వంటి హీరోయిన్ ఓరియంటెడ్ సినిమాల్లోనూ నావి టఫ్ రోల్స్. అన్నిటికంటే కష్టమైనది 'ఆమె కథ'. ఆ సినిమా ఇప్పుడు తీసినా ట్రెండ్‌కి తగ్గట్టుగా ఉంటుంది. ఏ భాషలో అయినా పనికొస్తుంది. ఇంగ్లిష్‌లో కూడా తీయొచ్చు. అప్పటి ఆ టైమ్, ఆ సీజన్‌లో అన్నీ హీరోయిన్ ఓరియంటెడ్ సినిమాలే. ఆ సినిమాలకు ఒక అమ్మాయి దొరికింది... ఆమె జయసుధ (నవ్వుతూ).

ఆ రోజుల్లో హీరోయిన్లను బాలీవుడ్ నుంచో వేరే వుడ్ నుంచో తీసుకురావడం తక్కువ. తెలుగు లేదంటే తమిళ పరిశ్రమ నుంచే ఆర్టిస్టులు ఉండేవారు. దాంతో మాకు ఎక్కువ పాత్రలు వచ్చేవి. సీరియస్‌గా, మేకప్ లేకుండా, టైట్‌గా జెడ వేసుకుని, కాటన్ చీరలు కట్టుకుని... ఇలా పాత్రలకు తగ్గట్టుగా మౌల్డ్ అయ్యాను.

ఫిజిక్‌కి తగ్గ డ్రెస్ వేసుకునేవాళ్లం

అప్పట్లో మా ఫిజిక్‌కి తగ్గట్టు డ్రెస్ వేసుకునేవాళ్లం. ఆ రోజుల్లో 90 శాతం మంది డైరెక్టర్స్ మా డ్రెస్‌లు అభ్యంతరకరంగా ఉండకుండా జాగ్రత్త పడేవారు. నేను ట్రెడిషనల్ క్యారెక్టర్స్‌తో పాటు మోడ్రన్ క్యారెక్టర్స్ చేశాను. 'నోము' సినిమాలో అంత వెస్టర్న్ డ్రెస్సులు వేసుకున్నా అసభ్యంగా అనిపించలేదు. 'యుగంధర్' సినిమాలో అయితే స్విమ్ డ్రెస్ వేసుకున్నాను. అయితే అది ఎంతవరకు ఉండాలో అంతవరకే ఉంటుంది.



అయినా ఇండస్ట్రీ నన్ను దూరం పెట్టలేదు

కథ చెప్పేటప్పుడు నా పాత్ర ఒకలా చెప్పి, షూటింగ్‌కి వచ్చాక మారిస్తే ఒప్పుకునేదాన్ని కాదు. అప్పటికి నేను అప్‌కమింగ్ ఆర్టిస్ట్ అయినప్పటికీ 'ఎందుకు ఇలా చేశారు?' అని ప్రశ్నించేదాన్ని. నేను అడిగిన దాంట్లో న్యాయం ఉండేది కాబట్టి ఇండస్ట్రీ నన్ను దూరం పెట్టలేదు. మా నాన్న చాలా స్ట్రిక్ట్‌గా, అమ్మ కామ్‌గా ఉండేవారు. అయితే నచ్చకపోతే వీళ్లు సినిమా వదులుకుంటారని అందరికీ తెలుసు. ఆ రోజుల్లో ఒక పద్ధతి ఉండేది... విలువలు ఉండేవి.

మహా నటి ఆమె ఒక్కరే...

'సహజ నటి' అనే టైటిల్ సూపర్ స్టార్ అని ఒక కార్యక్రమంలో నాకు మీడియా ఇచ్చింది. ఇప్పుడు పది లేడీ ఓరియంటెడ్ మూవీస్ కూడా చేసి ఉండరు, అప్పుడే 'మహా నటి' అనేస్తారు. మహా నటి అనే బిరుదుకి అర్హత ఉన్న ఏకైక నటి సావిత్రిగారే. ఎన్నో గొప్ప పాత్రల్లో అద్భుతమైన నటన కనబరిస్తే, ఆమెకు దక్కిన బిరుదు అది. ఇప్పుడున్నవారిని తక్కువ చేయడం లేదు. కానీ, కనీసం ఓ పాతిక లేడీ ఓరియంటెడ్ సినిమాలు చేశాక అలాంటి బిరుదులిస్తే బాగుంటుంది.

నా బయోపిక్‌కి ఓకే

నా బయోపిక్ ఎవరైనా తీస్తానంటే అభ్యంతరం లేదు. డైరెక్టర్ వంశీ పైడిపల్లి ఈ విషయం గురించి నాతో చెప్పారు. అయితే ముందుగా ఒక బుక్‌గా వస్తే బాగుంటుంది. నేనో 350 సినిమాలు చేశానంటే... వదులుకున్నవి ఓ 200 వరకూ ఉంటాయి. ఆ 350 సినిమాల్లో నా పాత్రల్లో నేను ఒదిగిపోవడానికి చేసిన కృషి గురించి తెలియాలి. అప్పటి స్టార్స్ గురించి ఈ జనరేషన్‌కి తెలియాలి. అది వారికి స్ఫూర్తిగా ఉంటుంది. ఒక చిన్న అమ్మాయిగా సినిమాల్లో మొదలైన నా ప్రయాణం ఇప్పటికీ కొనసాగుతోంది. ఆ జర్నీ తెలియాలి. వెబ్ సిరీస్‌గా అయితే బాగుంటుందనుకుంటున్నాను.

నా పరిచయ చిత్రం ఓ సంచలనం



హీరోయిన్ ఓరియంటెడ్ సినిమా... అందులోనూ కొత్త డైరెక్టర్‌తో... లేనిపోని రిస్క్ చేస్తున్నారని నిర్మాతల్ని భయపెట్టారు. జయసుధను ఎంపిక చేయడాన్ని పలు వురు పెద్దలు విమర్శించారు. కానీ నా మీద, నా సబ్జెక్ట్ మీద నమ్మకంతో నిర్మాతలు వెనకడుగు వేయలేదు. వాళ్లు చేసిన రిస్క్ ఫలించి, టేబుల్ ప్రాఫిట్‌గా 'లక్ష్మణ రేఖ' నిలిచి... నా ఇంటిపేరుగా మారింది. ఏరియాల వారిగా బిజినెస్ జరుపుకున్న తొలి చిత్రంగానూ దర్శకుడిగా నా పరిచయ చిత్రం చరిత్ర సృష్టించడం పట్ల ఇప్పటికీ గర్వపడుతుంటాను.

– ఎన్. గోపాలకృష్ణ


'ప్రతిపల్లెలోనూ అందరికీ గ్యాస్ సరఫరా, ప్రతి మహిళకూ ఆర్థిక భరోసా నా ధ్యేయం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 172

శుక్రవారం 12-9-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



అందరూ మహిళలే...

మహిళల వన్డే వరల్డ్ కప్‌లో తొలిసారి అంఫైర్లు, రిఫరీలంతా మహిళలే -15లో



'గేమింగ్' నిషేధం సెగ

యూనికార్న్‌ల లిస్టు నుంచి నాలుగు స్టార్టప్‌లు అవుట్ -15లో



న్యూస్‌రీల్

నేడు ఉపరాష్ట్రపతిగా రాధాకృష్ణన్ ప్రమాణం



దేశ 15వ ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన సీపీ రాధాకృష్ణన్ శుక్రవారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించనున్నారు.

- వివరాలు 6లో▶

స్లాబ్ ఎక్కడిదాకా అయింది.. బిల్లులు వస్తున్నాయా?



'మీకు ఇందిరమ్మ ఇల్లు వచ్చిందా.. దాని బిల్లులు వస్తున్నాయా? స్లాబ్ ఎక్కడి వరకు వచ్చింది?' అంటూ మంత్రి పొంగులేటి టోల్‌ఫ్రీ కాల్ సెంటర్‌ను ప్రారంభించి ఇళ్ల లబ్ధిదారులతో ఫోన్‌లో మాట్లాడారు.

- వివరాలు 14లో▶

'గొర్రెల' కేసులో ఈడీ దూకుడు

గొర్రెల పంపిణీ పథకానికి సంబంధించిన కేసులో మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేస్తున్న ఈడీ వేగం పెంచింది. 15న విచారణకు రావాలంటూ ఏపీకి చెందిన 18 మంది గొర్రెల విక్రేతలకు నోటీసులు జారీ చేసింది.

- వివరాలు 2లో▶

వార్తాపత్రికల సర్క్యులేషన్‌లో వృద్ధి

- గత పీరియడ్‌తో పోలిస్తే 2.77 శాతం పెరుగుదల
- ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్స్ సెక్రటరీ జనరల్ అదిల్ కసద్

- వివరాలు 2లో

NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE
Vencobb CHICKEN
Suggested Today's Eggs & Broiler Chicken Hyderabad Zone Rates

12 Eggs Retail Rate				
₹ 74	Ex Farm Live Bird	121 kg	Dressed with Skin	207 kg
	Retail Live Bird	143 kg	Skin Less	236 kg

Issued in the interest of consumers

ఇదండీ సంగతి



సవరణలేమోగానీ వివరాలు ఇమ్మంటోంటే వస్తున్నాం సార్!

ఎంతకీ ఎదగదు!

వానాకాలం పంటలపై యూరియా కొరత ప్రభావం

- ఏపుగా ఎదగాల్సిన సమయంలో గిడసబారుతున్న మొక్కజొన్న
- రంగు మారుతున్న పత్తి, వరి.. వేసిన పంటలు వేసినట్టే..
- దిగుబడి దెబ్బతింటుందనే ఆందోళనలో రైతాంగం
- వరి ఉత్పత్తి సాధారణంతో పోలిస్తే 35-45 శాతం తగ్గే అవకాశం!
- పెట్టుబడి కూడా దక్కేలా లేదంటూ వాపోతున్న రైతులు
- పొంచి ఉన్న తెగుళ్ల ముప్పు.. రాష్ట్రవ్యాప్తంగా ఇదే పరిస్థితి

'సాక్షి నెట్‌వర్క్' క్షేత్రస్థాయి పరిశీలన



ఈ ఫొటోలో మొక్క మోడు బారి ఎదగని కంకిని చూపిస్తున్న రైతు మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం గందంపల్లి గ్రామానికి చెందిన బాదం శెట్టి రామయ్య. ఇంతనికి రెండు ఎకరాల పొలం ఉండగా..ఎకరానికి రూ.20 వేల చొప్పున నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకున్నాడు. ఎకరానికి రూ.30 వేలు ఖర్చు చేసి మొక్కజొన్న వేశాడు. మొదటి దశలో యూరియా వేసినా.. పంట ఏపుగా పెరిగి కంకి పోసే సమయంలో దొరకలేదు. దీంతో చేను ఎదగకుండా గిడసబారింది. పొడవాటి కంకులు రావాల్సి ఉండగా.. ఐదు అంగుళాలకే పరిమితమయ్యాయి. పంట మంచిగా పండితే పెట్టుబడి, కౌలు డబ్బులు పోను రూ.లక్ష మిగులుతాయని సంతోషపడ్డాడు. కానీ ఇప్పుడు కౌలు డబ్బులు కూడా వచ్చే పరిస్థితి లేదని, పెట్టుబడి కూడా రాక అప్పుల పాలవడం ఖాయమని రామయ్య ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట మండల కేంద్రానికి చెందిన చెక్కలి సత్యందీ ఇదే పరిస్థితి. ఎన్నిసార్లు ప్రయత్నించినా యూరియా దొరకలేదు. వేసిన మొక్కజొన్న పంట చేతికొచ్చే పరిస్థితి కన్పించకపోవడంతో వదిలేశాడు.

- వివరాలు 8లో

ఏ రోజు యూరియా ఆ రోజుకే!

పీఏసీఎస్‌లు తెరిచిన కాసేపటికే ఖాళీ అవుతున్న స్టాక్

- వివరాలు 8లో

పెండింగ్ రైల్వే ప్రాజెక్టుల పూర్తికి

సంపూర్ణ సహకారం

- రైలు-రోడ్డు-పర్యాటక ప్రాంతాలను అనుసంధానం చేసేలా ప్రాజెక్టులకు రూపకల్పన చేయాలి
- ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందరు వరకు అలైన్‌మెంట్ తయారు చేశాం
- ట్రిపుల్ ఆర్ చుట్టూరా 362 కిలోమీటర్ల మేర రింగ్‌రైల్ నిర్మాణం చేపట్టాలి
- రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టులపై దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులతో సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి



సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న దక్షిణమధ్య రైల్వే జీఎం సంజయ్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: ప్రయాణికులకు వేగవంతమైన, రైలు-రోడ్డు-పర్యాటక ప్రాంతాలను అనుసంధానం చేసేలా రైల్వే ప్రాజెక్టులకు రూపకల్పన చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులను కోరారు. రాష్ట్రంలోని పెండింగ్ రైల్వే ప్రాజెక్టులు, కొత్త ప్రతిపాదనలకు సంబంధించి దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవతోపాటు రాష్ట్ర ఉన్నతాధికారులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి గురువారం పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమీక్షించారు. వివరాలు సీఎం మాటల్లోనే....

- పెండింగ్‌లో ఉన్న రైలు ప్రాజెక్టులు, లైన్లను వేగవంతంగా పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి మిగతా 7వ పేజీలో ▶

ఈ మెట్రో నడపలేం!

- రూ. 5 వేల కోట్లకు పైగా నష్టాల్లో ఉన్న మెట్రో రైలు నిర్వహణను వదిలించుకొనేందుకు సిద్ధమైన ఎల్‌అండ్‌టీ
- కేంద్రం లేదా రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించేందుకు సిద్ధం... ఈ మేరకు కేంద్రానికి లేఖ

7లో

ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్



బాలకృష్ణ (ఫైల్)

రాష్ట్రానికి చెందిన మావోయిస్టు అగ్రనేత బాలకృష్ణ సహా 10 మంది మృతి

- గరియాబండ్ అటవీ ప్రాంతంలో ఎదురుకాల్పులు... మృతుల్లో బాలకృష్ణ ఉన్నట్లు ప్రకటించిన పోలీసులు
- ఆయనపై మొత్తం రూ.2 కోట్ల రివార్డు

రాయ్‌పూర్ (ఛత్తీస్‌గఢ్)/ సాక్షి ప్రతినిధి, వరంగల్: ఛత్తీస్‌గఢ్‌లోని గరియాబండ్ జిల్లాలో భారీ ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. ఈ ఎదురుకాల్పుల్లో మొత్తం 10 మంది మావోయిస్టులు మృతి చెందినట్టు గురువారం పోలీసులు ప్రకటించారు. మృతుల్లో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, ఒడిశా రాష్ట్ర కమిటీ కార్యదర్శి మోడెం బాలకృష్ణ (60) ఉన్నట్లు ఓ అధికారి చెప్పారు. హనుమకొండ జిల్లా కాజీపేట మండలం మడికొండకు చెందిన బాలకృష్ణ అలియాస్ మనోజ్ అలియాస్ బాలన్న, అలియాస్ రామచందర్, అలియాస్ భాస్కర్‌పై మొత్తం రూ.2 కోట్ల రివార్డు ఉన్నట్లు తెలిపారు. ఎన్‌కౌంటర్‌పై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా హర్షం వ్యక్తం చేశారు. వచ్చే మార్చి 31లోగా నక్సలైట్ల ఏరివేత పూర్తి కావడం ఖాయమని పేర్కొన్నారు.

మెయిన్‌పూర్ అటవీ ప్రాంతంలో..

మెయిన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో గురువారం ఉదయం ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. యాంటీ నక్సలైట్ ఆపరేషన్‌లో భాగంగా భద్రతా దళాలు కూంబింగ్ చేపడుతుండగా ఎన్‌కౌంటర్ జరిగినట్లు రాయిపూర్ రేంజ్ ఐజీపీ అమ్రేశ్ మిశ్రా తెలిపారు. ఛత్తీస్‌గఢ్ పోలీస్‌కు చెందిన స్పెషల్ టాస్క్‌ఫోర్స్, జిల్లా పోలీసు విభాగానికి చెందిన 'ఈ-30', సీఆర్‌పీఎఫ్‌కు చెందిన కోబ్రా దళాలు ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్నాయని ఆయన చెప్పారు. సీనియర్ నేతలతోపాటు మొత్తం 10 మంది నక్సలైట్లు మృతి చెందారని, పూర్తి వివరాలు అందాల్సి ఉందని అన్నారు. బాలకృష్ణ మృతితో మిగతా 7వ పేజీలో ▶

దంచికొట్టిన వాన

రాష్ట్రంలో పలుప్రాంతాల్లో భారీ వర్షం

మెదక్‌లో అత్యధికంగా 17.6 సెం.మీ వర్షపాతం

హైదరాబాద్-విజయవాడ రహదారిపై స్తంభించిన ట్రాఫిక్



గురువారం భారీ వర్షానికి జలమయమైన మెదక్ పట్టణంలోని ఓ ప్రాంతం

సాక్షి, హైదరాబాద్/మెదక్ మున్సిపాలిటీ/తాండూరు రూరల్: రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వానలు దంచికొట్టాయి. హైదరాబాద్‌తోపాటు మెదక్, రంగారెడ్డి, వికారాబాద్, నల్లగొండ జిల్లాల్లో భారీగా వర్షం కురిసింది. మెదక్‌లో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఏకధాటిగా 3 గంటలపాటు కుండపోత వాన కురిసింది. దీంతో మెదక్ పట్టణం అతలాకుతలమైంది. జిల్లా కేంద్రంలో అత్యధికంగా 17.6 సెం.మీ. వర్షపాతం నమోదైంది. రోడ్లన్నీ చెరువులను తలపించగా, పట్టణంలోని పలువురి ఇళ్లలోకి నీరు చేరింది. పట్టణంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రాంగణం వర్షపు నీటితో నిండిపోవడంతో విద్యార్థులు అవస్థలు పడ్డారు. మెదక్ మండలంలోని పలు గ్రామాల్లో 13 సెం.మీ. వర్షపాతం నమోదైనట్లు వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

రాజధానిలో...

హైదరాబాద్‌లో ఉదయం ఎంతో ప్రశాంతంగా, ఆహ్లాదంగా కన్పించిన వాతావరణం మధ్యాహ్నం మూడు తర్వాత ఆకాశంలో ఒక్కసారిగా దట్టంగా మిగతా 14వ పేజీలో ▶

'సాక్షి'పై కొనసాగుతున్న

కక్ష సాధింపు..

తాడేపల్లి పోలీసుల ఎదుట విచారణకు హాజరైన ఎడిటర్, పాత్రికేయులు

- పాత్రికేయ ప్రమాణాలకు విరుద్ధంగా పోలీసుల ప్రశ్నావళి
- బాధితుల వివరాలు వెల్లడించాలని పట్టుబట్టిన పోలీసులు
- సంస్థ అంతర్గత వ్యవహారాలూ వెల్లడించాలన్న వైనం
- 35 ప్రశ్నలకు లిఖితపూర్వకంగా, మౌఖికంగా సమాధానం
- రాజ్యాంగ నిబంధనలు, పాత్రికేయ ప్రమాణాలు కచ్చితంగా పాటిస్తున్నామని స్పష్టం చేసిన సాక్షి ప్రతినిధులు

- వివరాలు 2లో

పత్రికల స్వేచ్ఛను హరించడం ప్రజాస్వామ్య రక్షణకు

పెను విఘాతం

- సాక్షి ఎడిటర్, జర్నలిస్టులపై కేసులు సరికాదన్న రాజకీయ, ప్రజాసంఘాల నేతలు
- ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం మీడియా, ప్రతిపక్షాల గొంతు నొక్కొద్దు



- వివరాలు 2లో

కొండలను చీలుస్తూ.. లోయలను దాటుతూ..

ఇంజనీరింగ్ అద్భుతంగా రైల్వే లైను నిర్మాణం

- మిజోరం రాజధాని ఐజోల్‌ను అనుసంధానిస్తూ 52 కిలోమీటర్ల కారిడార్
- 153 వంతెనలు, 45 సొరంగాలతో నిర్మాణం
- కి.మీ.కు రూ.157 కోట్ల భారీ వ్యయంతో సాహసోపేత ప్రాజెక్టు
- ప్రపంచంలోనే అతికష్టమైన రైల్వే ప్రాజెక్టుల్లో ఒకటిగా గుర్తింపు
- రేపు జాతికి అంకితమివ్వనున్న ప్రధాని మోదీ



సాయిరంగ్ స్టేషన్ సమీపంలో నిర్మించిన వంతెన

ఐజోల్ నుంచి సాక్షి ప్రతినిధి
గౌరీభట్ల నరసింహమూర్తి

ఎత్తయిన కొండలు, ఒకటి కాదు రెండు కాదు వందలు.. ఆ వెంటనే అగాధాలను తలపించే లోయలు... కొండలను చీలుస్తూ పరుగులెత్తే నదులు.. ఇలాంటి ప్రాంతాల్లో నడకదారి నిర్మాణం కూడా కష్టమే. ఇది ఈశాన్య రాష్ట్రాల్లో ఒకటైన మిజోరం భౌగోళిక పరిస్థితి. ఆ రాష్ట్ర రాజధాని నగరమైన ఐజోల్‌లో భారీ భవనాలు కూడా చాలినంత స్థలం లేక కొండ అంచుల్లో కొంతమేర అగాధంలోకి వేలాడుతున్నట్టు పిల్లర్లపై నిర్మించి ఉంటాయి. నడకదారి నిర్మాణం కూడా కనాకష్టంగా ఉన్న ఆ ప్రాంతంలో ఇప్పుడు దాదాపు 52 కి.మీ. మేర రైల్వే లైన్ నిర్మితమైంది.

ఆ రైల్వే ప్రాజెక్టును ప్రతిపాదించటమే ఓ సాహసం. అలాంటిది 11 ఏళ్ల కఠోర శ్రమతో ఇంజినీర్లు అద్భుతాన్ని చేసి చూపారు. ప్రపంచంలోనే అతి కష్టమైన రైల్వే ప్రాజెక్టుల్లో ఒకటిగా ఇప్పుడది రికార్డుల్లోకెక్కింది. దాన్ని మిగతా 7వ పేజీలో ▶

రాష్ట్రానికి పాలనా పక్షవాతం

- దాదాపు 22 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలం
- హైడ్రా కూల్చివేతలు.. సాధించిన ఫలితాలపై శ్వేతపత్రం ప్రకటించాలి
- మీట్ ది ప్రెస్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రాన్ని పరిపాలనా పక్షవాతం (అడ్మినిస్ట్రేటివ్ పెరాలిసిస్) పట్టి పీడిస్తోందని బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు వ్యాఖ్యానించారు. దాదాపు 22 నెలల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో వైఫల్యం చెందిందని మండిపడ్డారు. రూరల్..అర్బన్ సెక్టార్లలోనే కాదు.. అన్ని సెక్టార్లలో కాంగ్రెస్ అట్టర్ ఫ్లాప్ అయ్యిందని ధ్వజమెత్తారు. గురువారం తెలంగాణ జర్నలిస్ట్స్ యూనియన్ అధ్యక్షుడు కప్పర ప్రసాదరావు సమన్వయకర్తగా నిర్వహించిన 'మీట్ ది ప్రెస్'లో రాంచందర్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటివరకు ఏ ఒక్క ప్రాజెక్టును కూడా సక్రమంగా ప్రారంభించలేదని, జీహెచ్ఎంసీ పరిధిలో రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ వ్యవస్థ, భద్రతా మిగతా 14వ పేజీలో ▶

బాల్యమూ.. భారమే!

పిల్లల్లో 10 శాతం మంది ఊబకాయులే! | అల్ట్రా-ప్రాసెస్డ్ ఆహారమే ప్రధాన కారణం | 2035 నాటికి ఆర్థిక వ్యవస్థలో సంక్షోభం | యునిసెఫ్ ప్రపంచవ్యాప్త సర్వే - 2025

పిల్లల్లో ఊబకాయ సమస్య ప్రపంచానికి పెద్ద ఆరోగ్య సంక్షోభంలా పరిణమించబోతోందని యునిసెఫ్ తాజా నివేదిక హెచ్చరించింది. ప్రపంచవ్యాప్తంగా బాలల్లో 10 శాతం మంది ఊబకాయంతో ఉన్నట్లు నివేదిక తెలిపింది. ప్రతి పది మంది పిల్లల్లో ఒకరికి ఊబకాయం ఉంటోందని పేర్కొంది. సాంప్రదాయ ఆహారాలు, ఇతర పోషక పదార్థాలకు బదులుగా పిల్లలు అధిక కేలరీలున్న, ప్రాసెస్డ్ ఫుడ్‌కు అలవాటు పడటమే ఇందుకు కారణం అని చెబుతూ, ఈ అలవాట్లు పిల్లలకు దీర్ఘకాలిక అనారోగ్యాలను తెచ్చిపెట్టే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది.

'తగినంత ఆహారం లేక గతంలో పిల్లలు తరచూ బరువు తక్కువగా ఉండేవారు. అది వారి శారీరక పెరుగుదలను కుంగదీయడమే కాదు, అనేక ఆరోగ్య సమస్యలకూ దారితీసింది. అయితే, తాజా పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా ఉంది. జంక్‌ఫుడ్‌ను తినకుండా ఉండలేక పిల్లలు బరువెక్కుతున్నారు' అని యునిసెఫ్ తన నివేదికలో వ్యాఖ్యానించింది.



ఇదీ పోషకాహార లోపమే!

నేటి పిల్లల్లో ఊబకాయం అన్నది, మునుపటి దశాబ్దాల నాటి పోషకాహార లోపం కంటే వేగంగా పెరుగుతోందని, ఊబకాయం ఉన్న పిల్లల సంఖ్య.. బరువు తక్కువగా ఉన్నవారిని మించిపోయిందని నివేదిక తెలిపింది. బాల్యంలోని ఈ ఊబకాయం ఇప్పుడు పోషకాహార 'లోపానికి' వేరొక రూపంగా భావించవచ్చని పేర్కొంది.

యునిసెఫ్, 'ప్రపంచ ఆరోగ్య సంస్థ' గణాంకాల ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా 5 నుంచి 19 సంవత్సరాల వయసు గల పిల్లల్లో 18 కోట్ల 80 లక్షల మంది పిల్లలు ఊబకాయుల కేటగిరీలో ఉన్నారు! ఈ వయసులో బరువు తక్కువగా ఉన్న పిల్లల శాతం 2000లో 13 నుంచి నేడు 9.2 శాతానికి తగ్గింది. అదే సమయంలో ఊబకాయం 3 శాతం నుంచి 9.4 శాతానికి పెరిగింది.

ఎక్కడ ఎక్కువగా ఉన్నారు?

యునిసెఫ్ నివేదిక ప్రకారం పసిఫిక్ దీవుల లోని పిల్లల్లో ఊబకాయం ఎక్కువగా ఉంది. దీవి దేశాలైన నియులో 38 శాతం, కుక్ దీవులలో 37 శాతం, నౌరు దీవులలో 33 శాతం బాల ఊబకాయులు ఉన్నారు. ప్రపంచంలో మొత్తం బాల్య, కౌమార దశల్లో ఉన్న వారిలో 42.7 కోట్ల మంది అధిక బరువు సమస్యతో ఉంటే వారిలో.. దాదాపు సగం మంది తూర్పు ఆసియా, పసిఫిక్, లాటిన్ అమెరికా, కరీబియన్, దక్షిణాసియాలలోనే ఉన్నారు.

అలవాటుగా అధిక ఆహారం

ప్రపంచవ్యాప్తంగా పిల్లల్లో కనిపిస్తున్న ఈ ఊబకాయానికి ప్రధాన కారణం.. చవకైన, మితిమీరి ప్రాసెస్ చేసిన, దిగుమతి చేసుకుంటున్న అధిక కేలరీల ఆహార పదార్థాల వినియోగం పెరగడమేనని నివేదిక గుర్తించింది. సాంప్రదాయ ఆహారాలు, ఇతర పోషక పదార్థాలకు బదులుగా పిల్లలు అధిక కేలరీలున్న, ప్రాసెస్డ్ ఫుడ్‌కు అలవాటు పడుతున్నారని తెలిపింది. అల్ట్రా-ప్రాసెస్డ్ ఆహారంలో ఉండే చక్కెర, ఉప్పు, కొవ్వు వంటివి చిన్నారుల ఆరోగ్యాన్ని పాడుచేస్తున్నాయని పేర్కొంది.

పేద దేశాల్లోనూ ఊబకాయం

సాధారణంగా అధిక ఆదాయ దేశాలలో పిల్లలు ఊబకాయంతో ఉంటారని ఒకప్పుడు భావించేవారు. అయితే, యునిసెఫ్ తాజా నివేదిక ఈ భావనను పటాపంచలు చేసింది. పాఠశాలకు వెళ్లే పిల్లల్లో చిలీలో 27 శాతం మంది, యూఎస్ఏ, యూఏఈలలో 21 శాతం మంది ఊబకాయంతో ఉండటాన్ని బట్టి పిల్లల్లోని ఈ ఊబకాయం దిగువ, మధ్య ఆదాయ దేశాలకే పరిమితం కాలేదని నివేదిక గుర్తించింది.

ప్రకటనలు ప్రేరేపిస్తున్నాయి

పిల్లల్లో ఊబకాయం పెరగడంలో వ్యాపార ప్రకటనలు కీలక పాత్ర పోషిస్తున్నాయని నివేదిక తెలిపింది. తాజా సర్వేలో, గతవారం 13 నుంచి 24 సంవత్సరాల వయసు గల 75 శాతం మంది పిల్లలు, యువకులు జంక్ ఫుడ్ ప్రకటనలను చూసినట్లు వెల్లడైంది. వారిలో 60 శాతం మంది ఈ ప్రకటనలు చూశాక తమలో వాటిని తినాలన్న కోరిక కలిగిందని తెలిపారు. ఘర్షణలు, యుద్ధ వాతావరణం ఉండే ప్రాంతాల్లోనూ 68 శాతం యువత ఇప్పటికీ అలాంటి మార్కెటింగ్ వ్యూహాలకు ప్రభావితం అవుతున్నట్లు నివేదిక పేర్కొంది.



ఆర్థిక ముప్పు!

ఈ ఊబకాయం ముప్పును తప్పించటానికి తక్షణ చర్యలు తీసుకోకపోతే, ప్రభుత్వాలు దీర్ఘకాలిక పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని యునిసెఫ్ హెచ్చరించింది. 2035 నాటికి, ఊబకాయం వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై పడే భారం రూ.353 లక్షల కోట్లకు చేరుతుందని యునిసెఫ్ అంచనా వేసింది. పర్యవసానంగా ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలు, ఉత్పాదక రంగం అన్నీ దెబ్బతింటాయని హెచ్చరించింది.



- సాక్షి, స్పెషల్ డెస్క్

క్లుప్తంగా...

లోగో, పోస్టర్, ట్యాగ్‌లైన్ విజేతలు వీరే..

ప్రకటించిన రాజ్‌భవన్

సాక్షి, హైదరాబాద్: 'తెలంగాణ- ఈశాన్య భారత దేశం మధ్య అనుసంధానం: ఓ సాంకేతిక- సాంస్కృతిక సంబురం'.. అంశంపై వచ్చే నెల 20 నుంచి 22 వరకు, 25 నుంచి 27 వరకు హైదరాబాద్‌లో నిర్వహించనున్న కార్యక్రమ లోగో, పోస్టర్, ట్యాగ్‌లైన్‌ను రూపకల్పన కోసం నిర్వహించిన పోటీల్లో విజేతలను గురువారం రాజ్‌భవన్ ప్రకటించింది. షేక్ బాజీసైదావలి (గోకినేనిపల్లి, ఖమ్మం జిల్లా), మూడ్ ఫకీరా(హైదరాబాద్)లు తయారు చేసిన లోగోల్లోని కాన్సెప్ట్‌లను స్వీకరించింది. రెండింటి ఆధారంగా ఒకే లోగో రూపొందించిన నేపథ్యంలో ఇద్దరినీ విజేతలుగా పరిగణిస్తూ చెరో రూ.7,500 నగదు బహుమతిని అందజేస్తామని తెలిపింది. ఉత్తమ పోస్టర్ రూపొందించిన మహబూబ్‌నగర్‌కు చెందిన విష్ణువర్ధన్‌కు రూ.20 వేలు, ఉత్తమ ట్యాగ్‌లైన్‌ను నిర్దేశించిన షేక్ బాజీసైదావలికి మరో రూ.5,000 నగదు పురస్కారాన్ని అందజేస్తామని వెల్లడించింది.

15, 16 తేదీల్లో డిగ్రీ స్పాట్ అడ్మిషన్లు

సాక్షి, హైదరాబాద్: డిగ్రీలో తొలిసారిగా స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. 12వ తేదీన ప్రతీ కళాశాలలో మిగిలిపోయిన సీట్ల వివరాలను అందుబాటులో ఉంచుతారన్నారు. ఈనెల 15, 16 తేదీల్లో ప్రభుత్వ కళాశాలల్లో స్పాట్ అడ్మిషన్లు ఉంటాయని తెలిపారు. 17వ తేదీన ప్రైవేటు కళాశాలల్లో స్పాట్ అడ్మిషన్లు ఉంటాయని వివరించారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు. స్పాట్ అడ్మిషన్ల ద్వారా సీటు పొందిన విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అవకాశం ఉండదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో డిగ్రీ కోర్సుల్లో 438387 సీట్లు అందుబాటులో ఉంటే, దోస్త్ ద్వారా భర్తీ అయిన సీట్లు 196451 మాత్రమేనని వెల్లడించారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో ఉచిత శిక్షణ

భూదాన్‌పోచంపల్లి: యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం జలాల్‌పురంలోని స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో దీన్‌దయాళ్ కౌశల్ యోజన పథకం కింద.. నిరుద్యోగ యువతకు మూడున్నర నెలల వ్యవధి గల డేటా ఎంట్రీ ఆపరేటర్ (డిజిటల్ మిత్ర) కోర్సులో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ చైర్మన్ ఎన్.కిశోర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు విద్యార్హతల ఒరిజినల్, జిరాక్స్ సర్టిఫికెట్లు, ఆధార్, రేషన్‌కార్డులు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో ఈ నెల 15న సంస్థలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు నేరు గా హాజరు కావాలని కోరారు. వివరాలకు 9133908000, 9133908111 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

సాక్షి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్నా.. మా టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగిన చర్యలు తీసుకుంటాం.
టోల్ ఫ్రీ నెం
1800 425 9899

'సాక్షి'పై కొనసాగుతున్న
కక్ష సాధింపు

తాడేపల్లి పోలీసుల ఎదుట విచారణకు హాజరైన ఎడిటర్, పాత్రికేయులు
పాత్రికేయ ప్రమాణాలకు విరుద్ధంగా పోలీసుల ప్రశ్నావళి



విచారణ అనంతరం తాడేపల్లి పోలీస్ స్టేషన్ నుంచి బయటకు వస్తున్న 'సాక్షి' ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి



సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డికి సంఘీభావంగా తాడేపల్లి పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకున్న జర్నలిస్టులు

సాక్షి, అమరావతి: చంద్రబాబు ప్రభుత్వ అవినీతి, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తున్న సాక్షి పత్రికపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు కొనసాగిస్తోంది. అక్రమ కేసులు, విచారణ పేరుతో వేధింపులకు పాల్పడుతోంది. ఈ క్రమంలో పోలీసు అధికారులకు పదోన్నతులు కల్పించలేదని ప్రచురించిన కథనంపై నమోదు చేసిన అక్రమ కేసులో సాక్షి పత్రిక ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి, మరో ఇద్దరు పాత్రికేయులు తాడేపల్లి పోలీసుల ఎదుట గురువారం విచారణకు హాజరయ్యారు. పోలీసులు విచారణ పేరుతో మూడు గంటలపాటు వేచి ఉండేలా చేశారు. పాత్రికేయ ప్రమాణాలు, విలువలకు విరుద్ధంగా ప్రశ్నలు సంధించడం విస్మయ పరిచింది. బాధితుల వివరాలు వెల్లడించాలని, సంస్థ నిర్వహణకు సంబంధించిన అంతర్గత అంశాలు బహిర్గతం చేయాలని పట్టుబట్టడం గమనార్హం. రాజ్యాంగ నిబంధనలు, పాత్రికేయ ప్రమాణాలు, విలువలను కచ్చితంగా పాటిస్తున్నామని సాక్షి పత్రిక ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి, పాత్రికేయులు స్పష్టం చేశారు. విచారణకు పూర్తిగా సహకరిస్తామన్నారు. ఈ వ్యవహారానికి సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.

విచారణ సందర్భంగా పలు ప్రశ్నలు!

- సాక్షి పత్రిక ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి, పాత్రికేయులపై గుంటూరు జిల్లా తాడేపల్లి పోలీసులు అక్రమ కేసు నమోదు చేశారు. విజయవాడలోని సాక్షి కార్యాలయంలో అర్ధరాత్రి తనిఖీల పేరుతో వేధింపులకు తెగబడ్డారు. రాజ్యాంగం కల్పించిన పత్రికా స్వేచ్ఛ, భావ ప్రకటన హక్కును కాలరాస్తూ నమోదు చేసిన అక్రమ కేసుపై సాక్షి పత్రిక ప్రతినిధులు హైకోర్టును ఆశ్రయించారు. సాక్షి ఎడిటర్, పాత్రికేయులపై కఠిన చర్యలు చేపట్టవద్దని హైకోర్టు పోలీసులను ఆదేశించింది. విచారణకు సహకరించాలని సూచించింది.
- న్యాయస్థానం ఆదేశాల మేరకు సాక్షి పత్రిక ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి, ఇద్దరు పాత్రికేయులు తాడేపల్లి పోలీసు స్టేషన్‌లో సీఐ పి.వీరేంద్ర బాబు ఎదుట గురువారం విచారణకు హాజరయ్యారు. విచారణ సందర్భంగా పోలీసులు దాదాపు 3గంటలపాటు నిరీక్షించేలా చేశారు. అసలు పత్రికా నిబంధనలను, నియమావళికి విరుద్ధంగా ప్రశ్నలు సంధించడం గమనార్హం.
- బాధితుల వివరాలు చెప్పకూడదన్నది సహజ న్యాయ సూత్రం. కానీ పదోన్నతులు కల్పించక పోవడంతో తాము నష్టపోయామని సాక్షి పత్రిక దృష్టికి తీసుకువచ్చిన పోలీసు అధికారుల పేర్లు, వివరాలు చెప్పాలని పోలీసులు పదే పదే ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో పదోన్నతులు కోల్పోయిన డీఎస్పీలు బాధితులు అవుతారు. కానీ వారి పేర్లను చెప్పాలని తాడేపల్లి పోలీసులు పట్టుబట్టారు.
- సాక్షి పత్రిక నిర్వహణ, రోజువారీ పనితీరు అన్నది ఆ సంస్థ అంతర్గత వ్యవహారం. ఈ కేసుతో ఏమాత్రం సంబంధం లేని పత్రికకు సంబంధించిన అంతర్గత అంశాలను కూడా వెల్లడించాలని పోలీసులు ప్రశ్నించడం విస్తుగొలుపుతోంది. పోలీసులు సంధించిన 35 ప్రశ్నలకు సాక్షి ప్రతినిధులు లిఖిత పూర్వకంగా, మౌఖికంగా సమాధానాలు ఇచ్చారు.
- రాజ్యాంగ నిబంధనలు, పాత్రికేయ ప్రమాణాలు, విలువలను సాక్షి పత్రిక కచ్చితంగా పాటిస్తోందని స్పష్టం చేశారు. పోలీసు శాఖ ప్రతిష్టను దెబ్బ తీయడం తమ అభిమతం ఏమాత్రం కాదని, ప్రజల ప్రయోజనాల పరిరక్షణే తమ లక్ష్యమని తేల్చి చెప్పారు. ఎటువంటి బాహ్య ఒత్తిడికి తలొగ్గకుండా పాత్రికేయ ప్రమాణాలు, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాలను తు.చ. తప్పక పాటిస్తున్నామని సాక్షి ప్రతినిధులు విస్పష్టంగా చెప్పారు. న్యాయవాదుల సమక్షంలో నిర్వహించిన విచారణ ప్రక్రియను పోలీసులు వీడియో తీశారు.

పత్రికల స్వేచ్ఛను హరించడం
ప్రజాస్వామ్య రక్షణకు పెను విఘాతం

సాక్షి ఎడిటర్, జర్నలిస్టులపై కేసులు సరికాదన్న రాజకీయ, ప్రజాసంఘాల నేతలు
ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం మీడియా, ప్రతిపక్షాల గొంతు నొక్కొద్దు



సాక్షి, హైదరాబాద్: ప్రతిపక్ష పార్టీల గళాన్ని వినిపిస్తున్న పత్రికలపై ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం చేస్తున్న కక్ష సాధింపు ధోరణిపై ప్రజా సంఘాల నేతలు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వానికి వినిపించడమే ప్రతిపక్ష పార్టీల కర్తవ్యమని, పత్రికలు, మీడియా బాధ్యత కూడా ఇదేనన్నారు. కానీ ప్రజా సమస్యలను వినిపించుకోకుండా ఏకపక్షంగా గొంతు నొక్కే ప్రయత్నం ప్రజా క్షేత్రంలో చెల్లుబాటు కాదని హెచ్చరించారు. సాక్షి మీడియాపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేస్తున్న కక్ష సాధింపు చర్యలను తీవ్రంగా తప్పుబట్టారు.

పత్రికా స్వేచ్ఛ రాజ్యాంగం కల్పించిన హక్కు



ప్రజాస్వామ్యంలో పత్రికా స్వేచ్ఛ రాజ్యాంగం కల్పించిన హక్కు. ప్రజాస్వామ్య విలువలకు ప్రతిబింబమే పత్రికా స్వేచ్ఛ. సామాజిక మాధ్యమాల యుగంలో ప్రెస్‌మీట్‌ను వక్రీకరించకుండా యథాతథంగా ప్రచురించడం సంపాదకుడి బాధ్యత. సాక్షి ఎడిటర్‌గా తన విద్యుక్త ధర్మాన్ని పాటించిన ఆర్.ధనంజయరెడ్డిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేయడం సరైన చర్య కాదు. ఫిర్యాదులోని అంశాల్లో ఆధారాలు పరిశీలించకుండా కేసులు నమోదు చేయడం సరికాదు. పత్రికా సంప్రదాయాలు, విలువలు కాపాడేలా ప్రభుత్వం, అధికారులు వ్యవహరించాలి. నేతలు తమ పార్టీ విధానాలను వెల్లడిస్తే, వాటి ఆధారంగా ఎడిటర్‌పై కేసులు నమోదు చేయడం సరికాదు.

- కేటీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

ఎడిటర్‌పై కేసులు పెట్టే సంస్కృతి ఏమిటి?



విలేకరుల సమావేశంలో ఒక నాయకుడు మాట్లాడిన అంశాలను పత్రికలో ప్రచురిస్తే.. పత్రిక సంపాదకునిపై ఏకంగా కేసు నమోదు చేయడం ఏమిటి? ఇదెక్కడ న్యాయం? ఏపీ ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛను హరించే విధంగా, అందులో పనిచేసే వారిని, ఎడిటర్ ధనంజయరెడ్డిని వేధించేలా కేసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడిన వ్యక్తిపై కేసు పెట్టొచ్చు కానీ... అది ప్రచురించిన సంపాదకునిపై కేసు పెట్టడం అధికార దుర్వినియోగమే. పత్రికా స్వేచ్ఛ, ప్రజాస్వామ్యాన్ని పరిహసించడమే అవుతుంది. ధనంజయరెడ్డిపై పెట్టిన కేసును వెంటనే ఉపసంహరించుకోవాలి. తన విధిని నిర్వర్తిస్తున్న సంపాదకునిపై కేసులు పెట్టే సంస్కృతికి కూటమి ప్రభుత్వం స్వస్తి పలకాలి.

- టి.హరీశ్‌రావు, బీఆర్ఎస్ ఎమ్మెల్యే


కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తున్నాం



పత్రికా స్వేచ్ఛ మన ప్రజాస్వామ్యానికి నాలుగో మూల స్తంభం. కానీ తరచుగా పత్రికలు, జర్నలిస్టులపై, చివరకు ఎడిటర్లపైనా దూషణలతోపాటు భౌతిక దాడులు జరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఒక మీడియా సమావేశాన్ని ప్రచురించినందుకు సాక్షి పత్రిక ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డిపై ఏపీ రాష్ట్ర ప్రభుత్వం కేసు నమోదు చేయడం కూడా ఇలాంటి కోవలోనికి వస్తుంది. విమర్శ హేతుబద్ధం కానప్పుడు, విమర్శ చేసిన వారిపై చట్టబద్ధ చర్య తీసుకోవడాన్ని ఎవరూ తప్పు పట్టరు. కానీ ఈ విషయంపై పత్రిక సంపాదకునిపై కేసు పెట్టడం కక్ష సాధింపు చర్యనే. దీనిని ఖండిస్తూ ఎడిటర్, ఇతర జర్నలిస్టులపైన నమోదు చేసిన కేసులను ఎత్తేయాలని డిమాండ్ చేస్తున్నాం. దీనిపై ఎడిటర్ గిల్డ్ స్పందించాలని కోరుతున్నా.

- విమలక్క, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు


ఇది కక్షసాధింపు ధోరణే



తెలుగు రాష్ట్రాల్లో పాలక పక్షాలు.. ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్న ఘటనలు క్రమంగా పెరుగుతున్నాయి. ప్రతిపక్షాల గొంతును వినిపిస్తున్న మీడియాపైనా కక్షసాధింపు ధోరణి కనిపిస్తోంది. కొంతకాలంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ సంస్కృతి పెరగడం ప్రజాస్వామ్యానికి ఏమాత్రం మంచిది కాదు. ఈ ఆలోచన విధానం నుంచి ప్రభుత్వాలు బయటకు రావాలి. ప్రతిపక్షాల పాత్రను అణచివేయడం వారి స్వేచ్ఛను హరించడం ప్రజాస్వామ్య రక్షణకు పెను ప్రమాదం.

- సంధ్య, పీఓడబ్ల్యూ నేత

మీడియాపై కేసులు సరికాదు



ఉద్దేశ పూర్వకంగా మీడియాపై కేసులు పెట్టడం సరికాదు. మీడియాలో కేవలం పాలక పక్షం వార్తలే కాదు. ప్రతిపక్షం వార్తలు కూడా వస్తాయి. ప్రతిపక్ష పార్టీల వార్తలు రాసినందుకు మీడియాపై కేసులు నమోదు చేయడమంటే జర్నలిజంపైన దాడి చేయడమే. ఇది పూర్తిగా అక్రమం. ప్రతిపక్ష పార్టీ చేస్తున్న విమర్శలు సరికాకపోతే వాస్తవాలను వెల్లడించి రాజకీయ పోరాటం చేయాలి కానీ కేసులు పెట్టకూడదు.

- ఎస్ఎల్ పద్మ, ప్రజాపంథ

వార్తాపత్రికల సర్క్యులేషన్‌లో వృద్ధి

గత పీరియడ్‌తో పోలిస్తే 2.77 శాతం పెంపు

హైదరాబాద్: వార్తాపత్రికల సర్క్యులేషన్‌లో ఆరోగ్యకర వృద్ధి నమోదైంది. జనవరి-జూన్ 2025 పీరియడ్‌కు సంబంధించిన గణాంకాలను ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్స్ (ఏబీసీ) సెక్రెటరీ జనరల్ అదిల్ కసద్ గురువారం విడుదల చేశారు. ఈ పీరియడ్ (జనవరి-జూన్ 2025)లో దినపత్రికల సగటు విక్రయాలు 2,97,44,148 కాపీలు ఉన్నాయని, దీనికి ముందున్న పీరియడ్ (జూలై-డిసెంబర్ 2024)లో 2,89,41,876 కాపీలు ఉన్నట్లు తెలిపారు. మునుపటితో పోలిస్తే 2.77 శాతం (8,02,272 కాపీలు) వృద్ధి నమోదైందన్నారు. ఇది ప్రింట్ మీడియా పరిశ్రమ ఆరోగ్యకర పెరుగుదలను ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. విశ్వసనీయమైన, ధ్రువీకరించబడిన, లోతైన సమాచారం కోసం పాఠకులు వార్తాపత్రికలను విశ్వసించడం కొనసాగిస్తున్నట్లు తాజా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయని తెలిపారు.

'సిమ్‌బాక్స్' కేసులో ముగ్గురి అరెస్టు

హాంకాంగ్ మహిళ స్కాం వెనుక ఉన్నట్టు గుర్తింపు

సాక్షి, హైదరాబాద్: సిమ్ బాక్స్ కేసులో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ)అధికారులు గురువారం ముగ్గురిని అరెస్టు చేశారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ (డీఓటీ) సహకారంతో హైదరాబాద్‌లోని చాంద్రాయణగుట్ట వద్ద చేపట్టిన ఆపరేషన్‌లో ఒక సిమ్‌బాక్స్ వ్యవస్థతోపాటు 200 సిమ్‌కార్డులు స్వాధీనం చేసుకున్నారు. టీజీ సీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్ తెలిపిన వివరాల ప్రకారం.. సిమ్‌బాక్స్ సాయంతో ఈ మోసగాళ్లు వీఓఐపీ (వాయిస్ ఓవర్ ఇంటర్నెట్ ప్రొటోకాల్)కాల్స్‌ను సాధారణ టెలిఫోన్ కాల్స్‌గా మారుస్తూ.. వాటి సాయంతో సైబర్ మోసాలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్‌కు చెందిన చక్షు పోర్టల్‌కు అందిన ఫిర్యాదు ఆధారంగా టీజీసీఎస్‌బీ బృందం చాంద్రాయణగుట్టలో సిమ్‌బాక్స్ ఉన్నట్టు గుర్తించింది. టీజీసీఎస్‌బీ, డీఓటీ సంయుక్తంగా దాడిచేసి హఫీజ్‌బాబానగర్‌కు చెందిన హిదాయతుల్లా, అహద్‌ఖాన్, చంద్రాయణగుట్టకు చెందిన షేక్ షోయబ్‌ను అరెస్టు చేశారు.

బ్యాంకాక్ నుంచి నెట్‌వర్క్: వ్యాపారంలో నష్టపోయిన హిదాయతుల్లాకు హాంకాంగ్‌కు చెందిన వెనిస్సా పరిచయమైంది. ఆమె సాయంతో గత ఫిబ్రవరిలో ఒక ప్రైవేట్ సర్వీస్ ప్రొవైడర్ ద్వారా బ్రాడ్‌బ్యాండ్ తీసుకుని సిమ్‌బాక్స్‌ను తనింట్లో ఇన్‌స్టాల్ చేశాడు. పలువురి పేర్లతో 500పైగా సిమ్‌కార్డులను సిమ్‌బాక్స్‌లో పెట్టేవాడు. ఆ సిమ్‌బాక్స్ ద్వారా వెనిస్సా వీఓఐపీ కాల్స్‌ను స్థానిక కాల్స్‌గా మార్చి సైబర్‌మోసాలకు పాల్పడుతోందన్నారు.

'గొర్రెల' కేసులో ఈడీ దూకుడు

గొర్రెపిల్లలను విక్రయించిన ఏపీకి చెందిన 18 మందికి నోటీసులు


15న విచారణకు హాజరు కావాలని ఈడీ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: గొర్రెల పంపిణీ పథకానికి సంబంధించిన కేసులో మళ్లీ కదలిక మొదలైంది. ఈ కేసులో మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేస్తున్న ఈడీ అధికారులు వేగం పెంచారు. ఇందులో భాగంగా ఏపీకి చెందిన 18 మంది గొర్రెల విక్రేతలకు గురువారం నోటీసులు జారీ చేశారు. ఈ నెల 15న ఉదయం 10.30 గంటలకు బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయంలో హాజరుకావాలని అందులో సూచించారు. ఈ మేరకు స్కామ్‌లో బాధితులుగా, సాక్షులుగా ఈడీ అధికారులు వారి స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేయనున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన ఈ పథకంలో దాదాపు రూ.700 కోట్ల ప్రభుత్వ నిధులు పక్కదారి పట్టినట్టు ఇప్పటికే ఏసీబీ ప్రాథమికంగా నిర్ధారించింది. ఏసీబీ నమోదు చేసిన కేసు ఆధారంగా మనీ లాండరింగ్ కోణంలో ఈడీ దర్యాప్తు చేస్తోంది. పలు మ్యూల్ ఖాతాల ద్వారా నిధులు మళ్లించినట్టు ఈడీ అధికారులు ఇప్పటికే ఆధారాలు సేకరించారు. కేసు దర్యాప్తులో భాగంగా ఈడీ అధికారులు ఈ ఏడాది జూలై 29 నుంచి మూడు రోజులపాటు హైదరాబాద్‌లోని సికింద్రాబాద్, బోయిన్‌పల్లి, జూబ్లీహిల్స్, అత్తాపూర్ సహా పది చోట్ల సోదాలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఇందులో డబ్బు లావాదేవీలపై కీలక ఆధారాలు లభించాయని సమాచారం.

'వ్యవస్థీకృత లోపాలతోనే డ్రాపవుట్లు'

సాక్షి, హైదరాబాద్: స్కూల్ అడ్మిషన్ డ్రాపౌట్ కారణంతో.. తెలంగాణ మైనారిటీ గురుకుల ప్రిన్సిపాళ్లు, సంబంధిత అధికారులకు నోటీసులు ఇవ్వడాన్ని గురుకుల ప్రిన్సిపాల్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ప్రవేశాలు తగ్గడానికి కారణాలను క్షేత్రస్థాయిలో శాస్త్రీయంగా అన్వేషించకుండా.. కేవలం ప్రిన్సిపాళ్లను బాధ్యులను చేయడం అన్యాయమని టీజీపీఏ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు అజయ్‌కుమార్ పేర్కొన్నారు. మొత్తం 205 స్కూళ్లలో 170 స్కూళ్లలో డ్రాపౌట్లు పెరగడానికి ప్రిన్సిపాళ్లు పనిచేయకపోవడం కారణం కాదని స్పష్టం చేశారు.

టీచర్ డిప్యుటేషన్‌పై నిరసన



అనంతసాగర్ పాఠశాల ఎదుట విద్యార్థుల ఆందోళన

చిన్నకోడూరు (సిద్దిపేట): తమ ఉపాధ్యాయిని డిప్యుటేషన్‌ను వెంటనే రద్దు చేయాలని కోరుతూ విద్యార్థులు గురువారం పాఠశాల ఎదుట ఆందోళనకు దిగారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలంలో జరిగిన ఈ సంఘటన వివరాలివి. మండల పరిధిలోని అనంతసాగర్ ప్రాథమిక పాఠశాలలో 98 మంది విద్యార్థులు, 4 ఎస్‌జీటీలు, ఒక హెచ్‌ఎం ఉన్నారు. పాఠశాలలోని విజయ అనే ఉపాధ్యాయినిని వేరే పాఠశాలకు డిప్యుటేషన్‌పై వెళ్లాలని గురువారం ఉత్తర్వులు వచ్చాయి. దీంతో విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఆమె డిప్యుటేషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విద్యార్థుల ఆందోళనకు మద్దతుగా వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సంస్కరణలకు వేదిక జైలు వ్యవస్థ

7వ ఆల్ ఇండియా ప్రిజన్ డ్యూటీ మీట్ ముగింపులో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్



తెలంగాణ జైళ్ల శాఖ టీమ్‌తో బండి సంజయ్, పొంగులేటి, జితేందర్

సాక్షి, హైదరాబాద్: 'జైలు వ్యవస్థ కేవలం భద్రతకే పరిమితం కాకుండా..సంస్కరణలు, పునరావాసానికి వేదికగా మారుతోంది'అని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ అన్నారు. ఖైదీల్లో సత్ప్రవర్తన తెచ్చి వారిని మళ్లీ సమాజంలో పంపడమే జైళ్లశాఖ అసలు విజయమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ నెల 9 నుంచి తెలంగాణ పోలీస్ అకాడమీలో తెలంగాణ జైళ్లశాఖ, బీపీఆర్అండ్‌డీ సంయుక్తంగా నిర్వహిస్తున్న 7వ ఆల్ ఇండియా ప్రిజన్స్ డ్యూటీ మీట్–2025 గురువారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథి బండి సంజయ్, విశిష్ట అతిథి రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితోపాటు తెలంగాణ హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా, డీజీపీ జితేందర్, జైళ్లశాఖ డీజీ సౌమ్యామిశ్రా, బీపీఆర్అండ్‌డీ అడిషనల్ డీజీ రవిజోసెఫ్ లోకూర్, నేషనల్ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అమిత్‌గార్గ్, తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాషబిస్త్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ..ఆల్ ఇండియా ప్రిజన్ డ్యూటీ మీట్‌లో అత్యధిక ట్రోఫీలతో తెలంగాణ జైళ్లశాఖ జాతీయస్థాయిలో కీర్తి చాటిందన్నారు. జాతీయస్థాయి పోటీలను ఎంతో ఘనంగా నిర్వహించారని సౌమ్యామిశ్రాను బండి సంజయ్ ప్రత్యేకంగా అభినందించారు.

తెలంగాణ జైళ్లశాఖను రోల్‌మోడల్‌గా తీసుకోవాలి : పొంగులేటి

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ..ఎన్నో అంశాల్లో సంస్కరణలతో ముందుకు వెళుతున్న తెలంగాణ జైళ్ల శాఖను దేశవ్యాప్తంగా రోల్‌మోడల్‌గా తీసుకోవాలన్నారు. జాతీయస్థాయిలో డ్యూటీ మీట్‌ను విజయవంతంగా నిర్వహించినందుకు తెలంగాణ జైళ్ల శాఖను రాష్ట్ర ప్రభుత్వం తరపున అభినందిస్తున్నట్టు తెలిపారు.

– తెలంగాణ జైళ్లశాఖ డీజీ సౌమ్యామిశ్రా మాట్లాడుతూ మూడు రోజుల డ్యూటీమీట్‌లో 21 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 1,300 మంది అధికారులు, సిబ్బంది పాల్గొన్నట్టు తెలిపారు.

జాతీయ స్థాయిలో సత్తా చాటిన తెలంగాణ జైళ్లశాఖ

మూడు రోజులుగా తెలంగాణ పోలీస్ అకాడమీలో నిర్వహించిన డ్యూటీ మీట్‌లో ఓవరాల్ చాంపియన్‌గా తెలంగాణ జైళ్ల శాఖ సత్తా చాటింది. అన్ని అంశాల్లో కలిపి మొత్తం 28 పతకాలు సాధించగా..అందులో 21 బంగారు పతకాలు, 4 వెండి పతకాలు, 3 కాంస్య పతకాలు ఉన్నాయి. తమిళనాడు 17 పతకాలతో రెండో స్థానం, 16 పతకాలతో మహారాష్ట్ర మూడో స్థానంలో నిలిచాయి.

సామాజిక పించన్లలో వాటా పెంచాలి

కేంద్రానికి మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ వినతి

సాక్షి, హైదరాబాద్: సామాజిక పింఛన్ల కింద కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న వాటాను పెంచాలని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కోరారు. వికసిత్ భారత్–2047లో భాగంగా అణగారిన వర్గాల అభివృద్ధి కోసం రోడ్‌మ్యాప్ రూపకల్పనకు గురువారం కేంద్ర సామాజిక, న్యాయ శాఖ మంత్రి వీరేంద్ర కుమార్ వివిధ రాష్ట్రాల సంక్షేమ శాఖల మంత్రులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలతో పాటు కేంద్రం నుంచి అందాల్సిన సహకారంపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రస్తావించారు.

హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్
(మహారత్న కంపెనీ)
హెచ్ పి లూబ్రికెంట్స్ డిస్ట్రిబ్యూటర్ ల నియామకం
బహుళ ప్రదేశాలలో ఛానల్ భాగస్వాములుగా ఎంపిక కోసం అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానించబడ్డాయి.
1. ఇండస్ట్రియల్ ల్యూబ్ డిస్ట్రిబ్యూటర్స్ (ఐఎల్‌డీలు)
2. బజార్ ల్యూబ్ డిస్ట్రిబ్యూటర్లు (బీఎల్‌డీలు / గ్రామీణ బీఎల్‌డీలు)
ప్రకటన మరియు దరఖాస్తు ప్రక్రియపై సవివరమైన సమాచారాన్ని, దయచేసి మా వెబ్‌సైట్ **https://www.hplubricants.in** ను సందర్శించి ఈ క్రింది మార్గం: Lube Distributor >> Become a Distributor
ప్రకటనకు సంబంధించిన వివరాల కోసం వెబ్‌సైట్ లో అప్‌లోడ్ చేయబడిన ఫారాలు/ ఎంపిక మార్గదర్శకాలను చూడండి. దరఖాస్తు ఫీజు లేదు. దరఖాస్తులు మరియు అన్ని విధాలుగా పూర్తి చేసిన అన్ని జతపరిచిన కాగితాలు / జోడింపులను 3 అక్టోబర్ 2025 తేదీ 23:59 గంటలలోపు ఆన్‌లైన్ లో సమర్పించాలి: (దరఖాస్తు సమర్పణ చివరి తేదీ).
అనుబంధం/దిద్దుబాటు ఏదైనా ఉంటే, అది వెబ్ సైట్ లో జారీ చేయబడుతుంది.



అంగట్లో గ్రూప్ –1 పోస్టులు

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- హైకోర్టు ఆదేశాల మేరకు గ్రూప్–1 పరీక్ష మళ్లీ నిర్వహించాలి
- మంత్రుల వసూళ్లపై వస్తున్న ఆరోపణలపై విచారణ చేపట్టాలి



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ మంత్రులు గ్రూప్–1 పోస్టులను అంగట్లో పెట్టి అమ్ముకుంటున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఈ విషయంలో మంత్రులు, సీఎం కార్యాలయంపై వస్తున్న ఆరోపణలను నిగ్గు తేల్చాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి కష్టపడి, తమ విలువైన సమయాన్ని, తల్లిదండ్రుల కష్టార్జితాన్ని వెచ్చించి పోటీ పరీక్షలు రాసే తెలంగాణ యువత నమ్మకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం వమ్ము చేసిందని గురువారం ఆయన ఒక ప్రకటనలో తీవ్రంగా విమర్శించారు. హైకోర్టు ఆదేశాల మేరకు గ్రూప్–1 పరీక్షను అక్రమాలకు తావులేకుండా తాజా నోటిఫికేషన్ వేసి మళ్లీ నిర్వహించాలన్నారు. పరీక్షల్లో జరిగిన అవకతవకలపై జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు చేసి ఉద్యోగాలు అమ్ముకున్న దొంగలెవరో తేల్చాలని ఆయన డిమాండ్ చేశారు. గ్రూప్–1 పరీక్షల నిర్వహణలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థతతో పాటు ఆ పార్టీ నేతల కాసుల కక్కుర్తి వల్లే గ్రూప్–1 పరీక్షల్లో అవకతవకలు చోటు చేసుకున్నాయని అన్నారు. తమ ప్రభుత్వ హయాంలో ఉద్యోగాల భర్తీ ప్రక్రియ పారదర్శకంగా జరిగిందన్నారు. ఏడాది లోపే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ చేసిన మోసపూరిత వాగ్దానాలపై ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేసి చర్చించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ సమస్య తీవ్రతను ప్రభుత్వం గుర్తించాలని, కేవలం మాటలతో కాకుండా చేతల్లో చూపించి యువత ఆశలను నెరవేర్చాలని కేటీఆర్ సూచించారు.

కేటీఆర్‌కు 'గ్రీన్ లీడర్‌షిప్'అవార్డు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు అరుదైన అంతర్జాతీయ గౌరవం లభించింది. సుస్థిర పాలన, పర్యావరణ పరిరక్షణలో చేసిన కృషికిగాను ప్రతిష్టాత్మకమైన 'గ్రీన్ లీడర్‌షిప్ అవార్డు 2025'కు ఆయన ఎంపికయ్యారు. ఈ నెల చివరిలో అమెరికాలోని న్యూయార్క్‌లో ఈ అవార్డును ప్రదానం చేయనున్నారు. సెప్టెంబర్ 24న న్యూయార్క్‌లో జరగనున్న 9వ ఎన్‌వైసీ గ్రీన్ స్కూల్ కాన్ఫరెన్స్‌లో ఈ అవార్డు ప్రదానోత్సవం జరగనుంది.

నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం

- మాజీ మంత్రి హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: గ్రూప్–1 పరీక్షను తిరిగి నిర్వహించాలని డిమాండ్ చేస్తూ అశోక్ నగర్ సెంట్రల్ లైబ్రరీతో పాటు ఇతర ప్రాంతాల్లో ఆందోళన చేపట్టిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేయడాన్ని మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని ఆయన గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గ్రూప్–1 పరీక్షను మళ్లీ నిర్వహించాలని అన్నారు. 'కాంగ్రెస్ ప్రభుత్వం పరీక్షలను సక్రమంగా నిర్వహించలేక విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతోంది. డైవర్షన్ రాజకీయాలతో గ్రూప్–1 పరీక్షలో అవినీతి, అవకతవకలను కప్పిపుచ్చాలనే ప్రభుత్వ ఆటలు సాగవు. గ్రూప్–1 పరీక్షలో జరిగిన అక్రమాలపై వెంటనే సమగ్ర దర్యాప్తు చేపట్టాలి. ఎన్నికల సమయంలో విద్యార్థులు, నిరుద్యోగులను రెచ్చగొట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన అసమర్థతను ఒప్పుకొని క్షమాపణ చెప్పాలి'అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగుల ఆకాంక్షలను నీరుగార్చి, వారి భవిష్యత్తుతో ఆటలాడుతోందని ఆయన విమర్శించారు.

గ్రూప్–1 పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలి

- బీఆర్ఎస్‌వీ నేతల డిమాండ్


గెల్లు శ్రీనివాస్ యాదవ్‌ను తీసుకెళుతున్న పోలీసులు

చిక్కడపల్లి (హైదరాబాద్): గ్రూప్–1 పరీక్షను రద్దుచేసి మళ్లీ నిర్వహించాలని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, ఉపాధ్యక్షుడు తుంగబాలు డిమాండ్ చేశారు. గురువారం చిక్కడపల్లి నగర కేంద్ర గ్రంథాలయం ముందు గ్రూప్–1 పరీక్ష మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగ అభ్యర్థులతో కలసి ఆందోళన కార్యక్రమం చేపట్టారు. దీంతో నిరసనలో పాల్గొన్న వారిని చిక్కడపల్లి పోలీసులు అరెస్టుచేసి అబిడ్స్, ముషీరాబాద్ పోలీసుస్టేషన్లకు తరలించారు. గెల్లు శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ గ్రూప్–1 పరీక్షల్లో జరిగిన అవకతవకలకు ప్రభుత్వం బాధ్యత వహించాలని, దీనిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. తెలుగు మీడియం విద్యార్థులకు పేపర్ వాల్యుయేషన్లో తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ప్రస్తుత నోటిఫికేషన్ రద్దు చేయాలని, తప్పుచేసిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తుంగబాలు మాట్లాడుతూ గ్రూప్–1 పరీక్షను నిర్వహించడంలో విఫలమైనందున, నైతిక బాధ్యత వహిస్తూ చైర్మన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు

MALLA REDDY (MR)
(DEEMED TO BE UNIVERSITY)
Recognized Under Section 3 of the UGC Act-1956
Maisammaguda, Medchal -Malkajgiri-500100

WALK-IN INTERVIEWS

Applications are invited from Eligible, Experienced and Competent Faculty members for the following posts.

Post	Desired Qualification
Professors Associate Professors Assistant Professors Lecturers	M.Tech/M.E & Ph.D in EEE / CIVIL / MEC / ECE / CSE / IT/ MIN Bio Technology / Bio Medical with relevant experience in Research & Development (Preferably candidates with Ph.D)

Salary: As per UGC norms. Highly deserving candidates may be offered above the norms.
E - Mail: Resumes for all the above positions should be mailed to mrdeemeduniversity@gmail.com.
Venue: MALLA REDDY (MR) (Deemed to be University) (MREC Campus)
Date& Time: 13th & 14th Sept-2025 from 9:00am to 6:00pm.
Contact: 9348161125, 9348161205.
Sd/- Registrar



సచివాలయంలో ఇంటర్నెట్‌కు అంతరాయం

- వివిధ శాఖల్లో స్తంభించిన సేవలు..
- ఇబ్బంది పడిన ఉద్యోగులు



సాక్షి, హైదరాబాద్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ సచివాలయంలో గురువారం రెండు మూడు గంటల సేపు ఇంటర్నెట్ నిలిచిపోవడంతో కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడింది. దీంతో పలు శాఖల్లో పనులు స్తంభించి ఉద్యోగులు ఇబ్బంది పడ్డారు. ఇటీవల స్తంభాలకు ఉన్న వైర్లు కట్ చేయడంతో.. అనేక ప్రాంతాల్లో ఇంటర్నెట్ సమస్యలు వస్తుండటం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ ప్రభావం సచివాలయంపై పడింది. ఈ సమస్య వైర్లను కట్ చేయడంతో వచ్చిందని కొందరు అంటుంటే.. సచివాలయంలోని కొన్ని శాఖల్లో మాత్రమే కాసేపు ఈ సమస్య ఏర్పడిందని ఆయా శాఖల ఉద్యోగులు చెబుతుండటం గమనార్హం.

mahindra Rise

DON'T JUST THINK ABOUT IT



WHY WAIT TILL 22ND SEPT?
AVAIL FULL GST BENEFITS OF UPTO ₹1.56 Lakh* NOW


SPORT UTILITY VEHICLES
mahindra

SCAN FOR PRICE DETAILS

Rush to your nearest Mahindra dealership now

*The offer mentioned is of a particular model and variant.
The amount will vary depending on the model and variant selected.

AUTOMOTIVE MANUFACTURERS PVT. LTD.: R.P. ROAD, THIRUMALGIRI, PUNJAGUTTA, MANJIRA MALL, NAGOLE, JUBILEE HILLS, TOLI CHOWKI, MEDAK, SANGAREDDY, ZAHEERABAD, HYDERNAGAR, RC PURAM, SIDDIPET: 9121167087 / 9100441468, **NEON MOTORS:** CHANDANAGAR, SURARAM, UPPAL, ARAMGARH, NARSINGI, Y JUNCTION, SAINIKPURI. PURI: 800 800 1553, **VVC MOTORS PVT. LTD.:** KOTHAGUDA X ROADS, MALAKPET, HIMAYATNAGAR, ECIL, BOWENPALLY, SANATHNAGAR, GACHIBOWLI, GOPANPALLY, ATTAPUR, BACHUPALLI, GHATKESAR, SHAMSHABAD: 7702319511 / 7567456456, **LANDMARK** TELLAPUR, CHAMPAPET, VANASTHALIPURAM: 9281443810/9281434035



> అల్లాహ్ కారుణ్య చిహ్నాలను చూడు: ఆయన నిర్జీవంగా ఉన్న భూమిలో ఏ విధంగా ప్రాణం పోస్తాడో! నిశ్చయంగా, ఇదే విధంగా ఆయన (మరణానంతరం) మృతులకు కూడా ప్రాణం పోస్తాడు!
>
> – ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 12 సెప్టెంబర్ 2025

ఇజ్రాయెల్ ఘాతుకం

గాజాలో రెండేళ్లుగా తాను సాగిస్తున్న దుశ్చర్యలను చేష్టలుడిగి చూస్తూ ఉండిపోయిన ప్రపంచానికి ఇజ్రాయెల్ ఊహించని షాక్ ఇచ్చింది. కాల్పుల విరమణ ఒప్పందంపై ఖతార్ రాజధాని దోహాలో సమావేశమైన హమాస్ రాజకీయ బృందాన్ని లక్ష్యంగా చేసుకుని మంగళవారం వైమానిక దాడులకు తెగబడి ఆరుగురిని హతమార్చింది. రాయబార కార్యాలయాలు, సూపర్ మార్కెట్లు, పాఠశాలలు ఉన్న కట్టుదిట్టమైన భద్రత గల ప్రాంతంలో దాడి జరపటాన్ని గమనిస్తే ఇజ్రాయెల్ దేన్నీ ఖాతరు చేయదల్చుకోలేదని స్పష్టమవుతోంది. కాల్పుల విరమణ సాకారమై, హమాస్ చెరలోని బందీలు విడుదల కావాలని ఇజ్రాయెల్ కూడా కోరుకుంటోంది. కనీసం పైకి అలా చెబుతోంది. ఒప్పందానికి హమాస్‌కు ఇదే చిట్టచివరి అవకాశమని అమెరికా హెచ్చరించిన నేపథ్యంలోనే ఆ సంస్థ సమావేశమైంది. రెండేళ్లుగా ఇజ్రాయెల్, హమాస్‌ల మధ్య రాజీ కుదిర్చేందుకు ఖతార్ ప్రయత్నిస్తోంది. అందుకు అమెరికా, ఇజ్రాయెల్ మద్దతుంది. హమాస్‌ను ఒప్పించాల్సిన అవసరం ఏర్పడినప్పుడల్లా ఆ రెండూ ఖతార్‌నే ఆశ్రయించేవి. పైగా అమెరికాకు అది అత్యంత సన్నిహిత దేశం. పశ్చిమాసియాలోని అతి పెద్ద అమెరికా సైనిక స్థావరం ఆ దేశంలోనే ఉంది. ఇటీవల ట్రంప్ ఖతార్ వచ్చినప్పుడు ఆయనకు అత్యంత విలాసవంతమైన బోయింగ్–747 జెట్ విమానాన్ని కానుకగా సమర్పించుకుంది. అమెరికాతో లక్ష కోట్ల డాలర్ల రక్షణ ఒప్పందాలు కుదుర్చుకుంది. ఇన్ని 'మంచి లక్షణాలు' గల దేశంపై ఇజ్రాయెల్ ఎట్లా దాడి చేయగలిగిందన్నదే గల్ఫ్ దేశాల రాజధానుల్లో ఇప్పుడు ప్రధాన చర్చనీయాంశం.

గాజాలో శాంతి నెలకొనకుండా చూడటమే ఇజ్రాయెల్ ఉద్దేశంగా కనబడుతోందని ఖతార్ ప్రధాని షేక్ మహమ్మద్ చేసిన వ్యాఖ్య నిజమే కావొచ్చుగానీ... అందుకు ఖతార్ సహా గల్ఫ్ దేశాల బాధ్యత కూడా ఉంది. 2023 అక్టోబర్‌లో ఇజ్రాయెల్‌లో హమాస్ ఉగ్రవాద చర్యకు పాల్పడి 1,195 మందిని అమానుషంగా కాల్చిచంపి 250 మంది పౌరులను అపహరించింది. ప్రపంచ దేశాలన్నీ ఆ ఘాతుకాన్ని ఖండించాయి. ప్రతీకారం పేరుతో ఈ రెండేళ్లలో ఇజ్రాయెల్ 64,656 మంది పాలస్తీనా పౌరులను పొట్టనబెట్టుకుంది. రేపో మాపో పూర్తిగా గాజాను అధీనంలోకి తెచ్చుకోబోతోంది. ఈ కాలమంతా గల్ఫ్ దేశాలు చోద్యం చూశాయి. సిరియా, లెబనాన్, ఇరాన్, ఇరాక్, యెమెన్‌లలో అది వైమానిక దాడులు సాగించినా మౌనంగా ఉండిపోయాయి. దాని పర్యవసానంగానే 'మిత్రదేశం'గా ఉన్న ఖతార్‌పై ఇజ్రాయెల్ దాడికి దిగింది. మరో దేశం సార్వభౌమత్వాన్ని దెబ్బతీసేందుకు ఏ దేశమూ పూనుకోరాదని ఐక్యరాజ్యసమితి చార్టర్ నిర్దేశిస్తోంది. అలాచేస్తే అది దురాక్రమణే అవుతుందంటున్నది. కానీ తాను అన్నిటికీ అతీతమని ఇజ్రాయెల్ భావన.

గల్ఫ్ దేశాలన్నీ కలిసి ఏదో ఒకటి చేయాలని ఖతార్ ఇచ్చిన పిలుపుతో గురువారం సమావేశం జరిగింది. త్వరలో అరబ్–ఇస్లామిక్ శిఖరాగ్ర సదస్సు కూడా ఉంటుందంటున్నారు. అయితే ఆ 'ఏదో ఒకటి' సైనిక చర్య అయితే కాదు. కనీసం ఆ ఆలోచన చేసినా అమెరికా నొచ్చుకుంటుందని వాటికి తెలుసు. అమెరికా–గల్ఫ్ దేశాల బంధం ఉభయ తారకం. అమెరికా సైనిక సాయంపై గల్ఫ్ ఆధారపడి ఉండగా... పశ్చిమాసియాలో తన పలుకుబడి చెక్కుచెదరకుండా ఉండటానికి గల్ఫ్ దేశాల అవసరం అమెరికాకుంది. ఈ అమరికను మార్చటమే ఇజ్రాయెల్ ఆంతర్యం కావొచ్చు. ఎటూ గాజా హస్తగతం కాబోతున్నది కనుక, ఇదే అదునుగా ఈ ప్రాంతంలో తానే ప్రధాన కేంద్రంగా ఉండాలని ఇజ్రాయెల్ భావిస్తున్నట్టు కనబడుతోంది. కానీ అదంత సులభం కాదు. సౌదీ, యూఏఈ, ఖతార్, ఒమన్, కువైట్, బహ్రెయిన్‌ల సమష్టి మదుపు నిధి 4 లక్షల కోట్ల డాలర్ల పైమాటే. ఈ సంపద ఆసరాతో గల్ఫ్ దేశాలు ప్రపంచ ఇంధన మార్కెట్లను శాసించగలవు. గణనీయంగా పలుకుబడి పెంచుకోగలవు. అందుకే 'ఏదో ఒకటి' చేయాలన్న ఖతార్ పిలుపుపై ఇజ్రాయెల్ అప్రమత్తమైంది. తమ చాప కిందకు నీళ్లొస్తుంటే చూస్తూ ఊరుకోవటం ఆత్మహత్యా సదృశమని గల్ఫ్ దేశాలు ఇప్పటికైనా గుర్తించాలి. ఈ సంక్షోభ సమయంలో అమెరికాకు వంతపాడటం కాక, సొంత గొంతుక వినిపిస్తేనే మనుగడ ఉంటుందని తెలుసుకోవాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, **తిథి:** బ.పంచమి ప.1.46 వరకు, తదుపరి షష్ఠి, **నక్షత్రం:** భరణి సా.4.35 వరకు, తదుపరి కృత్తిక, **వర్జ్యం:** తె.3.45 నుండి 5.14 వరకు (తెల్లవారితే శనివారం), **దుర్ముహూర్తం:** ఉ.8.17 నుండి 9.05 వరకు, తదుపరి ప.12.19 నుండి 1.07 వరకు, **అమృత ఘడియలు:** ప.12.05 నుండి 1.35 వరకు.

సూర్యోదయం : 5.50
సూర్యాస్తమయం: 6.03
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

సోషల్ టాక్

యువత



మీరు మన యువతకు ఆరోగ్యాన్ని, విద్యను, ఉపాధిని అందిస్తే వారి ద్వారానే మెరుగైన భారత దేశ నిర్మాణం జరుగుతుంది. మనందరం ఇక్కడ కూర్చొని ఏ భవిష్యత్ విధానాల గురించీ చర్చించాల్సిన అవసరం లేదు. మన యువతపై నాకు ఆ నమ్మకం ఉంది.

– సీతారాం ఏచూరి కమ్యూనిస్టు నాయకుడు (నేడు ప్రథమ వర్ధంతి)

స్పందన



గడ్డు సమయాలలో మన స్పందన వ్యూహాత్మకంగా ఉండాలి. ఉద్వేగాలతో నిండి కాదు. మన బలాబలాలను సమీక్షించుకోవటానికి, మన శక్తి సామర్థ్యాలను నిరూపించటానికి మనకొచ్చిన మంచి అవకాశంగా ప్రతికూల పరిస్థితుల్ని భావించాలి.

– దువ్వూరి సుబ్బారావు, ఆర్బీఐ మాజీ గవర్నర్

మెరిటోక్రసీ



నేను కఠినమైన మెరిటోక్రసీని నమ్ముతాను. ఎవరు గొప్ప పని చేస్తారో, వారికి ఎక్కువ బాధ్యత లభిస్తుంది. సవాళ్ల అంతు చూడటమే మన ఎంపిక అయినప్పుడు ఉన్మాదంగా పని చేసుకుంటూ పోతాం. అప్పుడు విజయం కోసం ఎదురుచూసే తీరిక మనకు ఉండదు.

– ఎలాన్ మస్క్, బిజినెస్‌మాన్

నమ్మకం



నేను లౌకిక హేతువాదిని, జాతీయవాదిని, భారతీయుడిని. అందుకే – నా ఈవెంట్లకు ఏ వర్గం నుండి నిరసన ప్రదర్శనలు వచ్చినా, నేను చెబుతున్నది, నేను చేస్తున్నది మంచి విషయమేనన్న నమ్మకం నాలో ఇంకా ఇంకా పెరుగుతుంది.

– జావేద్ అఖ్తర్, కవి, సినీ రచయిత

వెళ్లే దారి



మీరు మీ అధ్యక్షుడిని ఇష్టపడినా ఇష్టపడకపోయినా, అందరూ కలిసి అధ్యక్షుడికి సహాయం చేయాలి. ఎందుకంటే, అధ్యక్షుడు వెళ్లే వైపే దేశం వెళుతుంది. దేశం వెళ్లే వైపే మీ ఉద్యోగం, మీ కుటుంబం వెళ్లవలసి ఉంటుంది.

– మైఖేల్ బ్లూమ్‌బెర్గ్, బిజినెస్‌మాన్

త్వరలోనే!



కలలు కనడంలో, కలల్ని నమ్మడంలో చాలా శక్తి ఉందని నేను భావిస్తాను. స్టాండ్‌లలో ఉండి నా కూతురు నా ఆటను చూస్తున్నట్లు ఊహించటం నిజంగా ఒక కలలా ఉంటుంది నాకు. ఆ రోజు త్వరలోనే రాబోతుందన్న ఉత్సాహంలో ఉన్నాను.

– నవోమి ఒసాకా, జపాన్ టెన్నిస్ ప్లేయర్

అతి క్లిష్ట స్థితిలో నేపాల్

విశ్లేషణ



టంకశాల అశోక్

నేపాల్‌ను ఈ నెల 8, 9వ తేదీలలో తీవ్రంగా కుదిపివేసిన నిరసనలు, హింసాకాండ శాంతించి ఉండవచ్చు. నిరసనలకు నాయకత్వం వహించిన 'జెన్–జడ్' ఉద్యమకారులకూ, సైన్యానికీ మధ్య చర్చలు ఫలించి తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడవచ్చు. కానీ, ఒక దేశంగా నేపాల్ ప్రస్తుతం ఒక అతి క్లిష్టమైన స్థితికి చేరింది.

వందల సంవత్సరాల రాచరిక పాలనను కూలదోసి ప్రజాస్వామికంగా మారిన ఒక దేశం, సుస్థిరంగా అదే వ్యవస్థలో కొనసాగాలంటే ముఖ్యంగా కావలసిందేమిటి? లోపాలు ఉన్నప్పటికీ రాజకీయ పార్టీలు ప్రజల విశ్వాసం పొంది, స్థిరపడి కొనసాగటం! అది జరగనప్పుడు అనివార్యంగా వ్యక్తి నియంతృత్వాలు, వర్గ నియంతృత్వాలు, సైనిక నియంతృత్వాలు ఏర్పడతాయి.

రాచరికం 2008లో పోయిన తర్వాత ఈ 17 ఏళ్లలో అక్కడి మూడు పార్టీలు కూడా స్వయంగానో, పరస్పరం చేతులు కలిపో పరిపాలించాయి. ప్రజల విశ్వాసాన్ని పొందటంలో మాత్రం అన్నీ విఫలమయ్యాయి. నిరసనకారులు మూడు పార్టీల నాయకుల ఇళ్లపైనా దాడులు జరిపారు. దీనంతటి మధ్య ఆశాకిరణం–ఉద్యమకారులు మౌలికంగా ప్రజాస్వామ్యంపై విశ్వాసాన్ని కోల్పోకపోవటం, స్వయంగా సైన్యం ప్రజాస్వామ్యాన్ని కూలదోయక పోవటం!

బద్ధలైన నిరసనలు

నిరసనలు అనూహ్యంగా, అకస్మాత్తుగా సోషల్ మీడియాపై నిషేధం అనే చర్య నుంచి మొదలయ్యాయి. సాధారణంగా నిరసనలు, ముఖ్యంగా యువతరం నుంచి, నిరుద్యోగం, అవినీతి, బంధుప్రీతి వంటి అంశాలపై జరగటం మనకు తెలుసు. కానీ నేపాల్‌లో సోషల్ మీడియాపై నిషేధంతో మొదలై, ఆ తర్వాత తక్కిన అంశాలు వచ్చి చేరాయి. ఆ విధంగా, అక్కడి సమాజంలో సోషల్ మీడియాకు, ఇతర అంశాలకు అటువంటి అవినాభావ సంబంధం ఉంది. అది భారతదేశంలో కనిపించే స్థితికి భిన్నమైనది. ఇపుడు వెలుగులోకి వస్తున్న దానిని బట్టి, అక్కడి యువతరానికి నిరసనలకు సోషల్ మీడియా నిరంతర వేదికగా మారింది. దానితోపాటు, ఇతర దేశాలకు వలసపోయిన దాదాపు 25 లక్షలమంది నేపాలీలు అక్కడి నుంచి తమ వారికి చేస్తున్న ఆన్‌లైన్ నగదు బదిలీలకు కూడా! ఆ విధంగా ఆ నిషేధం పట్ల నిరసనలు, ఇతరత్రా పేరుకుపోతూ వస్తున్న నిరసనలు కలిసి అగ్ని పర్వతం వలె పేలేందుకు దోహదమయ్యాయి.

ఇది ఒకటి కాగా, గత 17 ఏళ్లుగా పాలించిన అన్ని ప్రధాన పార్టీలలో ఏవీ ప్రజల విశ్వాసాన్ని పొందలేక పోయాయి. ఈ



◆ నేపాల్‌లోని అన్ని ప్రధాన పార్టీలలో ఏవీ ప్రజల విశ్వాసాన్ని పొందలేక పోయాయి. 17 సంవత్సరాలలో మొత్తం 14 మంది ప్రధానులు వచ్చారు. కొందరు మళ్లీ మళ్లీ అయ్యారు. ఈ దోషం, వైఫల్యం ముఖ్యంగా వామపక్షాలవి కావటం గమనించదగ్గది.

దోషం, వైఫల్యం ముఖ్యంగా వామపక్షాలవి కావటం గమనించదగ్గది. అట్లా భావించటం ఎందువల్ల? రాచరికం నుంచి పరిమిత ప్రజాస్వామ్యం వైపు సంస్కరణల మార్గంలో ఇతర పార్టీలు ప్రయత్నించగా, మావోయిస్టు పార్టీ పదేళ్ల పాటు రాజీలేని సాయుధ పోరాటం నడిపి రాచరిక వ్యవస్థనే అంతం చేసింది. అటువంటపుడు ఆ పార్టీగానీ, అంతకు ముందునుంచీ ప్రధాన స్రవంతిలో గల ఇతర కమ్యూనిస్టులు, సోషలిస్టులు గానీ ఏమి చేయాల్సింది? ప్రపంచంలోనే అతి పేద దేశాలలో ఒకటైన నేపాల్ అభివృద్ధికి ఒక ప్రణాళిక ప్రకారం, అంకితభావంతో కృషి చేయాలి. నైతిక విలువలను పాటిస్తూ ఆదర్శంగా నిలవాలి. తమ ఐక్యతను కొనసాగించి సుస్థిర పాలన సాగించటం మూడవ అవసరం. ఈ మూడూ జరిగి ఉంటే అసంతృప్తికి ఆస్కారమే ఉండేది కాదు.

విశ్వాసం కోల్పోయిన పార్టీలు

నేపాల్‌లో అనేక పార్టీలు ఉన్నా, ప్రధానమైనవి మూడు: మధ్యే మార్గపు నేపాలీ కాంగ్రెస్, గతం నుంచి ఉన్న సాంప్రదాయిక కమ్యూనిస్టు పార్టీ, రాచరికంపై పోరాడిన మావోయిస్టు పార్టీ. తక్కిన పార్టీలలోనూ ఎక్కువ వామపక్ష మార్గం లోనివే. 2008లో రాచరికం పోయిన తర్వాత జరిగిన ఎన్నికలలో గెలిచి, మావోయిస్టు నాయకుడు పుష్పకమల్ దహాల్ లేదా ప్రచండ ప్రధాని అయ్యారు. పరిపాలనలో విఫలమయ్యారు. ఏడాదికే పదవి నుంచి వైదొలగవలసి వచ్చింది. తన పార్టీ కూడా చీలిపోయింది. పరిపాలన ద్వారా సామాజిక మార్పులు, సమానత్వాలు కూడా తీసుకు రావాలని పట్టుబట్టిన ప్రచండ ప్రధాన సహచరుడు, జేఎన్‌యూ (ఢిల్లీ) పూర్వ విద్యార్థి బాబూరాం భట్టరాయ్ వేరే పార్టీ ప్రారంభించాడు. అప్పటి నుంచి నేపాల్‌లో ఇక రాజకీయ సుస్థిరత లేకపోయింది. 17 ఏళ్ళలో మొత్తం 14 మంది ప్రధానులు వచ్చారు. కొందరు మళ్లీ మళ్లీ అయ్యారు. వారిలో ఎక్కువసార్లు వామపక్షాల వారే. ప్రస్తుతం తాత్కాలిక ప్రధానిగా సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి సుశీల కర్కీ పేరు వినవస్తున్నది. గతంలోనూ ఒకసారి ఇదే విధంగా జస్టిస్ ఖిల్‌రాజ్ రెగ్మీ (2013–14) నియమితులయ్యారు. ఇటువంటి నియామకాలు రాజకీయ అస్థిరతకు మరొక గుర్తు అవుతున్నాయి. అస్థిరతవల్ల పెట్టుబడులు రావటం లేదు.

ఆశ్చర్యకరంగా అవినీతి, బంధుప్రీతి, విలాసవంతమైన జీవితం లాంటి ఆరోపణలను మావోయిస్టు ప్రచండ తన మొదటి పాలనా కాలంలోనే ఎదుర్కొన్నారు. అప్పటి నుంచి అన్ని ప్రభుత్వాలూ ఈ విమర్శలకు గురవుతూనే ఉన్నాయి. అయినా సరైన విచారణలు, శిక్షలు లేకుండా పోయాయి. నిరుద్యోగం, పేదరికం విషయానికి వస్తే ఒక విచిత్ర స్థితి కనిపిస్తుంది. మూడు కోట్ల జనాభాలో సుమారు పావు కోటి మంది వలసలు పోయి పనులు చేసుకుంటున్నందున ఆ వర్గాల్లో స్థానికుల నిరుద్యోగం సుమారు 10 శాతం. కానీ యువతరంలో 20 శాతంగా ఉంది. అందుకు కారణం నైపుణ్యాలు నేర్పే చదువులు గానీ, స్థానిక పరిశ్రమలు గానీ లేకపోవటం. యువత తిరుగుబాటుకు ఇదీ ఒక ముఖ్య కారణం. పోతే, ప్రపంచబ్యాంకు లెక్కల ప్రకారం పేదరికం 2022లో 7.5 శాతం కాగా, 2025లో 5.6కు తగ్గుతుందని అంచనా. అయితే, విపరీతమైన వలసలు, వారు పంపే డబ్బు ఈ విధంగా తక్కువ పేదరికానికి కారణమైంది. నిజంగా పేదరికం 25 శాతమని అంచనా.

అక్కడ భూకంపాలు ప్రాకృతికమైన సహజ విపత్తు కాగా, ఇంకా 20 ఏళ్లయినా నిండని ఆ ప్రజాస్వామ్యానికి రాజకీయ అస్థిరతలు నాయకులు సృష్టించే విపత్తులుగా మారాయి. అన్ని పార్టీలూ ప్రజావిశ్వాసాన్ని కోల్పోయినందున రాజకీయ శూన్యత ఏర్పడింది. ఆ స్థానాన్ని ఆక్రమించగల కొత్త పార్టీలు కనీసం ఉనికిలోకైనా రాలేదు. ఉద్యమకారులకు ఆగ్రహం, ఆకాంక్షలు మినహా విధానపరంగా, ఆచరణపరంగా ఎటువంటి ఆలోచనలూ లేవు. ప్రస్తుత రాజకీయ శూన్యాన్ని పూరించగలవారెవరూ కన్పించటం లేదు. రాజ వంశీకులకు పునరాగమనపు ఆశలున్నా ప్రజలు ఆమోదించే అవకాశం లేదు. ఇవన్నీ ఒక విధమైన క్లిష్ట స్థితి కాగా, స్థానికంగా ఆర్థికాభివృద్ధి ప్రశ్నకు తోడు ఇవన్నీ ఎన్నటికి జరిగేనన్నది మరొక క్లిష్ట స్థితి.

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

మొఘల్ చక్రవర్తి బ్రిటిష్ పెన్షనర్ అయిన రోజు!

టైమ్ మిషన్



విజయ స్తూపం

బ్రిటిష్‌వాళ్లు భారతదేశ ఆక్రమణ పూర్తయ్యి అధికారం స్థిరపరచుకునే వరకూ కలకత్తానే రాజధానిగా పాలించారు. అంతకు ముందు కొన్ని వందల ఏళ్లుగా మొఘల్ సామ్రాజ్య రాజధానిగా వెలుగొందిన ఢిల్లీని... తిరిగి 1916లో ఇండియా రాజధానిగా చేసుకున్నారు. అయితే అసలు ఢిల్లీని బ్రిటిష్‌వాళ్లు జయించిన కథ చాలా తక్కువమందికి మాత్రమే తెలుసు. దాన్ని ఆక్రమించడానికి మొఘల్ చక్రవర్తితో కాకుండా మరాఠాలతో యుద్ధం చేసిన విషయం ఎందరికి తెలుసు? ద గ్రేట్ మొఘల్ చక్రవర్తి మొట్టమొదటిసారిగా బ్రిటిష్‌వాళ్లకు పెన్షనర్‌గా మారిన దయనీయ ఘట్టం అప్పుడే చోటుచేసుకుందని తెలుసా?



రెండవ షా ఆలం

సరిగ్గా 222 సంవత్సరాల క్రితం ఇదే సెప్టెంబర్ రెండవ వారంలో ఢిల్లీని బ్రిటిష్ వాళ్లు ఆక్రమించారు. ఇందుకు అప్పటి వరకూ ఒకే మరాఠా గొడుగు కింద ఉన్న భూభాగం, ఒకనాటి మొఘల్ సామ్రాజ్య భూభాగం అయిదు ముక్కలై బలహీన పడటమే కారణం. మరాఠాల్లో వచ్చిన చీలికలను బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీ తన అధికార వ్యాప్తికి ఉపయోగించుకోవాలని రంగంలోకి దిగింది. లార్డ్ వెల్లస్లీ 'సైన్య సహకార పద్ధతి' (1798)ని రూపొందించి... స్థానిక భారత రాజులకు శత్రువుల నుంచి రక్షణ కల్పిస్తామనీ, అందుకు తమతో ఒప్పందం చేసుకోమనీ ప్రతిపాదించాడు. మొదట్లో బ్రిటిష్ వాళ్లతో ఎవరూ ఒప్పందం చేసుకోలేదు. అయితే కొద్ది రోజులకే ఈ అయిదు అధికార కేంద్రాల మధ్య తలెత్తిన తీవ్ర విభేదాల కారణంగా కొందరు ఫ్రెంచ్‌వాళ్ల సైనిక సాయం తీసుకోగా, వారి వ్యతిరేక వర్గం బ్రిటిష్‌వాళ్ల సాయం అర్థించారు.

మొత్తం మీద బ్రిటిష్‌వాళ్లకూ, మరాఠాలకూ మధ్య 3 ప్రధానమైన యుద్ధాలు జరిగాయి. ఇందులో రెండో ఆంగ్ల–మరాఠా యుద్ధంలో భాగంగా అనేక చోట్ల జరిగిన పోరాటాల్లో ఢిల్లీ దగ్గరా ఒకటి జరిగింది. ఈస్టిండియా కంపెనీ సైన్యాలకు 'జనరల్ గెరార్డ్ లేక్' నాయకత్వం వహించాడు. దౌలత్‌రావ్ సింధియా సైన్యాలను ఫ్రెంచ్ జనరల్ 'లూయిస్ బార్క్విన్' నడిపించాడు. సెప్టెంబర్ 11న యమునా నది ఒడ్డున బ్రిటిష్, మరాఠా సైన్యాలు తలపడ్డాయి. బ్రిటిష్ వాళ్ల తాకిడికి చాలామంది మరాఠా వీరులు నదిలో దూకి పారిపోతూ ప్రాణాలు వదిలారు.

బ్రిటిష్‌వాళ్లు ఢిల్లీని ఆక్రమించారు. అప్పటి వరకూ మరాఠాల అధికారానికి లోబడి ఉన్న మొఘల్ చక్రవర్తి రెండవ షా ఆలం ఇప్పుడు ఈస్టిండియా కంపెనీ అధికారం కింద ఒదిగిపోవాల్సి వచ్చింది. ఎర్రకోటలోనే ఆయన ఉండటానికి బ్రిటిష్ వాళ్లు అనుమతించారు. ఢిల్లీ చుట్టుపక్కల ఉన్న కొన్ని భూభాగాలకే చక్రవర్తి అధికారాన్ని పరిమితం చేసి, ఆయనకు 90 వేల రూపాయలు భరణాన్ని ఇవ్వడానికి నిర్ణయించారు.


అంతకు ముందెప్పుడో 1615లో బ్రిటిష్ రాజైన మొదటి జేమ్స్ రాయబారిగా వచ్చిన థామస్ రో ఆగ్రాలో నాటి మొఘల్ చక్రవర్తి జహంగీర్ దర్శనం చేసుకున్నాడు. ఆయనకు విలువైన కానుకలు సమర్పించుకుని మొఘల్ సామ్రాజ్యం అంతటా వ్యాపారం చేసుకోవడానికీ, ఫ్యాక్టరీలు నిర్మించుకోవడానికీ అనుమతించే ఫర్మానా పొందాడు. అలాంటిది... ఆ తర్వాత సుమారు 188 ఏళ్లకు మొగల్ చక్రవర్తికే భరణం ఇచ్చే స్థాయికి బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీ చేరింది. మరాఠాలను జయించిన స్థలంలో సుమారు 113 ఏళ్ల తరువాత (1916) ఒక విజయ స్తూపాన్ని బ్రిటిష్‌వాళ్లు నిర్మించారు. నేటి తూర్పు ఢిల్లీలోని నోయిడా గోల్ఫ్ కోర్సులో ఆ స్తూపం ఆనాటి చరిత్రకు సాక్షీభూతం.

ఆక్వా రైతులను ఆదుకోవాలి!

ఇన్ బాక్స్

ఇటీవల అమెరికా విధించిన కొత్త సుంకాల వల్ల భారత రొయ్యల ఎగుమతులపై భారీ భారం పడింది. దీనివల్ల ఎగుమతి ధరలు తగ్గిపోతాయి. రైతులకు చెరువుల వద్ద కొనుగోలు ధరలు పడిపోతాయి. భారతదేశపు రొయ్యలకు అతిపెద్ద కొనుగోలు దేశం అమెరికా కాబట్టి ఈ ప్రభావం గణనీయంగా ఉంటుంది. రైతుల ఆదాయం తగ్గే ప్రమాదం, అప్పుల భారం పెరిగే అవకాశాలు ఉన్నాయి. ఈ పరిస్థితి నుంచి బయట పడటానికి చర్యలు తీసుకోవాలి.

ముందుగా కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి 'రొయ్యల ధరల స్థిరీకరణ నిధి' ఏర్పాటు చేసి, రైతులకు కనీస ధర లభించేలా చేయాలి. వడ్డీ రాయితీ, అప్పులపై తాత్కాలిక మారటోరియం, గడువు పొడిగింపు ఇవ్వాలి. మార్కెట్ పరిస్థితులు, ఎగుమతి డిమాండ్ గురించి సమయానుకూల సమాచారం రైతులకు ఇవ్వాలి. మెరైన్ ప్రోడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎమ్‌పీఈడీఏ), రాష్ట్ర సహకార సంఘాల వంటివి మిగిలిన



రొయ్యలను కొనుగోలు చేసి నిల్వ చేయాలి. రైతులకు మంచి ధర వచ్చేవరకు నిల్వ ఉంచడానికి వీలుగా కోల్డ్ స్టోరేజ్‌ల సదుపాయాలు పెంచాలి. భారత ప్రభుత్వం అమెరికాతో మాట్లాడి తాత్కాలిక మినహాయింపులు తీసుకు రావాలి. 'ఫ్లోర్‌ప్రైస్ కాంట్రాక్ట్ పద్ధతి' రైతులకు హామీ ధర లభించి, మార్కెట్‌లో ధరలు పడిపోవడాన్ని నివారించి భద్రత కల్పిస్తుంది. అందువల్ల ఈ విధానంపై దృష్టిపెట్టాలి. రైతులు పంట విరామం ప్రకటించకుండా వెంటనే ఇన్‌పుట్ సబ్సిడీ, సీడ్ ధరలను తగ్గించడం వంటి చర్యలను వేగవంతం చేయాలి.

యూరప్, జపాన్, కొరియా వంటి దేశాల్లో మార్కెట్లు విస్తరించాలి. కేవలం అమెరికా, చైనా మార్కెట్ల మీదనే ఆధారపడకూడదు. ఎగుమతిదారులకు రొయ్యల ఎగుమతులపై ఇతర పన్నులను తగ్గించాలి. దేశీయ మార్కెట్‌లో రొయ్యల వినియోగం, ప్రాసెసింగ్, రెడీ–టు–కుక్ ఉత్పత్తులు అభివృద్ధి చేయాలి. పోర్టు ఛార్జీలపై రాయితీలు ఇవ్వాలి. రొయ్యల ధరలు పడిపోతే లేదా వ్యాధులు వస్తే నష్టాన్ని తగ్గించేలా 'ష్రింప్ ఇన్సూరెన్స్' పథకంపై ప్రచారం ముమ్మరం చేయాలి. పర్యావరణ హితమైన, తక్కువ ఖర్చుతో కూడిన రోగ నిరోధక పద్ధతులు అభివృద్ధి చేయాలి. ప్రభుత్వం వారానికి ఒకసారి ధరల డాష్ బోర్డ్ విడుదల చేయాలి. చిన్న సైజులో రొయ్యలు అమ్మకుండా సాధ్యమైతే 2–4 వారాలు సాగుకాలం పెంచి కొత్త మార్కెట్లకు సరిపోయే సైజ్‌లో రైతులు అమ్ముకోవాలి. ఈ విషయంలో ప్రభుత్వం రైతులకు అవగాహన కల్పించాలి. తగిన సమాచారం అందేలా చూడాలి.

– పొన్నపల్లి రామమోహన్ రావు
డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్(రిటైర్డ్), కాకినాడ

వృద్ధ సం'పన్నులు'

డేటా పాయింట్

2024–25 మదింపు సంవత్సరంలో... 70 ఏళ్లకు పైబడిన వృద్ధులు చెల్లించిన మొత్తం ఆదాయపు పన్ను రూ.61,624 కోట్లు. 2021–22తో పోలిస్తే ఇది రెండు రెట్లకు పైగా ఎక్కువ. మొత్తం ఆదాయపు పన్ను వసూళ్లలో వృద్ధుల ద్వారా వచ్చింది 5.9 శాతం.



మదింపు సంవత్సరం	వసూలైన పన్ను (రూ.కోట్లలో)	మొత్తంలో శాతం
2020-21	25,970	5.3
2021-22	28,091	5.8
2022-23	39,537	5.7
2023-24	48,153	5.8
2024-25	61,624	5.9

ఆధారం: లోక్‌సభలో కేంద్ర ఆర్థిక శాఖ

ఇదే అంతిమ క్షణం!

జ్యోతిర్మయం

సరిగ్గా వంద సంవత్సరాల క్రితం అంటే 1925లో ఒక మతాచార్యుడు త్వరలోనే మహాప్రళయం రాబోతున్నదని చెప్పాడు. ఉన్న ఆస్తిపాస్తులన్నిటినీ అమ్ముకొని, అనుభవించి, అమెరికాలోని న్యూయార్క్ నగర సమీపాన ఉన్న పర్వతాన్ని ఎక్కి, ప్రార్థిస్తూ నిరీక్షించమనీ, అలా చేసిన వారు స్వర్గానికి పోతారనీ, ఇతరులు రాబోయే ఉధృతమైన ప్రవాహంలో నశిస్తారనీ తన శిష్యులకు బోధించాడు. వారు గురువుగారు చెప్పినట్లే తట్టా, బుట్టా అమ్ముకుని ఖుషీ చేసుకుని ఆయన ప్రళయం వస్తుందని చెప్పిన రోజున ఉదయాన్నే కొండ ఎక్కి దినమంతా ఆ అలల ప్రవాహం కొరకు ఎదురు చూస్తూ, ప్రార్థిస్తూ గడిపారు. దినమంతా గడిచింది, ప్రవాహం రాలేదు. వారు ఎందుకైనా మంచిదని ఆ రాత్రి కూడా అక్కడే గడిపారు. ఏమీ కాలేదు.

మామూలుగానే తెల్లారింది. ప్రకృతి అంతటా సాధారణ పరిస్థితులే నెలకొన్నాయి. వారంతా నిరాశా నిస్పృహలతో తిరిగివచ్చారు. స్వర్గం రాకపోతే పోయె, ఇక్కడున్న ఆస్తి పాస్తులన్నీ పోయెకదా! వాటిని మళ్ళీ చేజిక్కించుకునే దానికి నానా అవస్థలు పడ్డారట.

అలాంటి జోస్యాలు పలు దేశాల్లో చెప్పిన ఉదాహరణలున్నాయి. మన దేశంలో కూడా '1999 – కలియుగాంతం' లాంటి గ్రంథాలను చూసి ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. అలాంటి మాటల్ని నమ్మి మోసపోయే బదులు 'ప్రతి క్షణం ఇదే నా జీవిత ఆఖరి క్షణం కావచ్చు, ఎందుకు ఇతరులను బాధించాలి' అని, ఇతరులతో వైరం పెంచుకోకుండా, ఇతరులకు తోడ్పడుతూ ఆనందంగా మరణాన్ని ఆహ్వానిస్తే మంచే జరుగుతుంది. పరీక్షిన్మహారాజు భాగవతం వింటూ వింటూ మరణాన్ని ఆహ్వానించాడు. ఆఖరి క్షణంలో దైవస్మరణ ఉండాలి. అదే సుఖాంతం, మరో జన్మకు శుభారంభం కూడా! **అంతకాలే చ మామేవ స్మరన్ ముక్త్వా కలేవరమ్ / యః ప్రయాతి స మద్భావం యాతి నాస్త్యత్ర సంశయః** అని శ్రీకృష్ణ భగవానుడు భగవద్గీత 8వ అధ్యాయం 5వ శ్లోకంలో చెబుతాడు. దాని అర్థం **'మరణ సమయంలో నన్నే స్మరిస్తూ శరీరం విడిచి వెళ్ళేవాడు నన్ను చేరుకుంటాడు'** అని!

– రాచమడుగు శ్రీనివాసులు


NPCI
भारतीय राष्ट्रीय भुगतान निगम
NATIONAL PAYMENTS CORPORATION OF INDIA
ALWAYS FORWARD
RuPay
ఒక కార్డు, అంతులేని డీల్స్.
పండగల లెక్కలు సరిపోతున్నాయి.
RuPay కార్డ్‌హోల్డర్స్ కోసం మాత్రమే ప్రత్యేకించబడిన ఆఫర్స్ పొందండి.
RuPay FESTIVE CARNIVAL
ఎందుకు వేచిఉన్నారు?
ఇప్పుడే స్కాన్ చెయ్యండి
మీ దగ్గర RuPay క్రెడిట్ కార్డ్ లేదా?
#AskForRuPay
ఈ క్రింద ఆఫర్స్ RuPay కార్డ్ హోల్డర్స్‌కు మాత్రమే
croma
₹2,000
తగ్గింపు
DELL Technologies
₹16,500
వరకు తగ్గింపు
district BY ZOMATO
15%
వరకు
KALYAN JEWELLERS
25%
తగ్గింపు
LIFESTYLE
15%
తగ్గింపు
make my trip
15%
వరకు
max
₹250
తగ్గింపు
mokobara
10%
వరకు తగ్గింపు
Paytm Flights
12%
వరకు
Swiggy
10%
తగ్గింపు
*షరతులు & నిబంధనలు వర్తిస్తాయి

రాజ్యాంగానికి కాపలాదారులం

గవర్నర్లు విధులు నిర్వర్తించడంలో విఫలమైతే మేము చూస్తూ కూర్చోవాలా?

ప్రశ్నించిన సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం • రాష్ట్రపతి రిఫరెన్స్‌పై తీర్పు రిజర్వ్



న్యూఢిల్లీ: రాజ్యాంగానికి తాము కాపలాదారులమని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. గవర్నర్లు విధులు నిర్వర్తించడంలో విఫలమైతే తాము నిశ్శబ్దంగా చూస్తూ కూర్చోవాలా? అని ప్రశ్నించింది. పార్లమెంట్, రాష్ట్రాల శాసనసభల్లో ఆమోదించిన బిల్లులకు సమ్మతి తెలియజేసే విషయంలో రాష్ట్రపతి/గవర్నర్లకు గడువు నిర్దేశించే అధికారం న్యాయస్థానాలకు ఉందా? అనే అంశంపై సుప్రీంకోర్టు ధర్మాసనం తమ తీర్పును రిజర్వ్ చేసింది. ఈ వ్యవహారంపై 10 రోజులపాటు కొనసాగిన విచారణ గురువారం ముగిసింది. తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి, డీఎంకే ప్రభుత్వం మధ్య తలెత్తిన వివాదంపై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు పార్లమెంట్ లేదా శాసనసభల నుంచి వచ్చిన బిల్లులపై రాష్ట్రపతి/గవర్నర్లు మూడు నెలల్లోగా ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు ఈ ఏడాది ఏప్రిల్ 8న తీర్పు వెలువరించింది. దీనిపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సందేహాలు లేవనెత్తారు. రాజ్యాంగబద్ధమైన అత్యున్నత పదవుల్లో ఉన్న రాష్ట్రపతి/గవర్నర్లకు గడువు విధించే అధికారం కోర్టులకు ఉందా? అని ప్రశ్నించారు. దీనిపై స్పష్టత ఇవ్వాలని సూచించారు. కోర్టును ప్రశ్నించడానికి ఆర్టికల్ 143(1) కింద తనకున్న అధికారాలను వాడుకున్నారు. సుప్రీంకోర్టుకు మొత్తం 14 ప్రశ్నలు సంధించారు. బిల్లులకు సమ్మతి తెలిపే విషయంలో రాజ్యాంగంలోని ఆర్టికల్ 200, 201 కింద రాష్ట్రపతి/గవర్నర్లకు ఉన్న అధికారాలపై అభిప్రాయాలు తెలియజేయాలని కోరారు. ఈ నేపథ్యంలో రాష్ట్రపతి రిఫరెన్స్‌పై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఆగస్టు 19వ తేదీన ప్రత్యేక విచారణ ప్రారంభించింది. కేంద్ర ప్రభుత్వం తరఫున అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. వివిధ రాష్ట్ర ప్రభుత్వాల తరఫున సీనియర్ లాయర్లు వాదించారు.

వ్యతిరేకించిన విపక్ష పాలిత రాష్ట్రాలు

రాష్ట్రపతి రిఫరెన్స్‌ను విపక్ష పాలిత తమిళనాడు, పశ్చిమ బెంగాల్, కేరళ, కర్ణాటక, తెలంగాణ, పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్ ప్రభుత్వాలు వ్యతిరేకించాయి. అసెంబ్లీలో ఆమోదించి పంపించిన బిల్లులపై రాష్ట్రపతి/గవర్నర్లు నిర్ణీత గడువులోగా సమ్మతి తెలియజేయడమో లేక వెనక్కి పంపించడమో జరగాల్సిందేనని పేర్కొన్నాయి. బిల్లులపై ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా ఉద్దేశపూర్వకంగా దీర్ఘకాలం పెండింగ్‌లో పెట్టడం సరైంది కాదని స్పష్టంచేశాయి. రాష్ట్రపతి రిఫరెన్స్‌ను తిరస్కరించాలని ధర్మాసనాన్ని కోరాయి. కానీ, రాష్ట్రపతి అభ్యంతరాలను బీజేపీ పాలిత మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఒడిశా, గోవా, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాలు సమర్థించాయి. కేరళ, తమిళనాడు ప్రభుత్వాల తరఫున కె.కె.వేణుగోపాల్, కపిల్ సిబల్ సుప్రీంకోర్టు ధర్మాసనం ఎదుట వాదనలు వినిపించారు. రాష్ట్రపతి అభ్యంతరాలను వ్యతిరేకించారు. ఏప్రిల్ 8న ఇచ్చిన తీర్పుతోపాటు గతంలో ఇచ్చిన తీర్పులను ప్రస్తావించారు. గడువు నిర్దేశించే అధికారం కోర్టులకు ఉందని తేల్చిచెప్పారు.

ఆ అధికారం కోర్టులకు లేదు: తుషార్ మెహతా

రాజ్యాంగం ప్రకారం.. వేర్వేరు వ్యవస్థలకు వేర్వేరు ప్రత్యేక అధికారాలు ఉంటాయని తుషార్ మెహతా గురువారం ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. రాష్ట్రపతి/గవర్నర్లకు రాజ్యాంగం ప్రత్యేక అధికారాలు ఇచ్చిందని, రాజ్యాంగం ప్రాథమిక నిర్మాణంలో అదొక భాగమని స్పష్టంచేశారు. గవర్నర్ల విచక్షణాధికారాల్లో కోర్టులు జోక్యం చేసుకోలేవని పేర్కొన్నారు. వారికి టైమ్‌లైన్ విధించే అధికారం కోర్టులకు లేదని స్పష్టంచేశారు. దీనిపై సీజేఐ జస్టిస్ గవాయ్ స్పందించారు. ''రాజ్యాంగానికి మేము కాపలాదారులం. రాజ్యాంగం ప్రకారం వేర్వేరు వ్యవస్థలకు వేర్వేరు అధికారాలు ఉంటాయన్న విషయం నిజమే. న్యాయ వ్యవస్థ కూడా తనకున్న అధికారాలతో చురుగ్గా వ్యవహరిస్తోంది. అదేసమయంలో జ్యుడీషియల్ టెర్రరిజం, అడ్వెంచరిజం ఉండాలని మేము చెప్పడం లేదు. కానీ, ప్రజాస్వామ్యంలో ఒక వ్యవస్థ సక్రమంగా విధులు నిర్వర్తించడంలో విఫలమైతే రాజ్యాంగ కాపలాదార్లు నిష్క్రియాత్మకంగా ఉండిపోవాలా? అధికారాలు ఉపయోగించుకోకుండా చూస్తూ కూర్చోవాలా?''అని ప్రశ్నించారు. దీనిపై తుషార్ మెహతా బదులిచ్చారు. కేవలం కోర్టులే కాకుండా శాసన(లెజిస్లేచర్), కార్యనిర్వాహక వర్గం(ఎగ్జిక్యూటివ్) కూడా ప్రజల ప్రాథమిక హక్కులకు కాపలాదారులేనని స్పష్టంచేశారు. ఒక వ్యవస్థ అధికారాల్లో మరో వ్యవస్థ జోక్యం చేసుకోవడం సరైంది కాదని అభిప్రాయపడ్డారు. రాజ్యాంగ నిర్మాణాన్ని ఉల్లంఘించేలా ఎవరూ వ్యవహరించకూడదని చెప్పారు. మంత్రిమండలి సలహా ప్రకారమే గవర్నర్ నడుచుకోవాలన్న వాదనను తుషార్ మెహతా ఖండించారు. భారతదేశంలో తాము అంతర్భాగం కాదంటూ ఏదైనా ఒక రాష్ట్ర అసెంబ్లీలో బిల్లును ఆమోదిస్తే దానికి కూడా గవర్నర్ సమ్మతి తెలియజేయాలా? అని ప్రశ్నించారు. అలాంటి సందర్భాల్లో బిల్లును పెండింగ్‌లో పెట్టడం తప్ప గవర్నర్‌కు మరో మార్గం ఉండదన్నారు.



ప్రధాని మోదీతో రామ్‌గూలామ్

మారిషస్‌కు రూ.6,004 కోట్ల ప్రత్యేక ప్యాకేజీ

భారత ప్రభుత్వం ప్రకటన
- ఇరుదేశాల ప్రధానులు మోదీ, నవీన్ చంద్ర భేటీ
- ద్వైపాక్షిక సంబంధాలపై చర్చ
- ఏడు ఒప్పందాలపై సంతకాలు

వారణాసి: మారిషస్‌కు 680 మిలియన్ డాలర్ల(రూ.6,004 కోట్లు) ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ఇవ్వనున్నట్లు భారత ప్రభుత్వం ప్రకటించింది. కీలక రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని ఇరుదేశాలు నిర్ణయించుకున్నాయి. భారత ప్రధాని నరేంద్ర మోదీ, మారిషస్ ప్రధానమంత్రి నవీన్‌చంద్ర రామ్‌గూలామ్ గురువారం ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో సమావేశమయ్యారు. భారత్–మారిషస్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా విద్య, ఇంధనం, హైడ్రోగ్రఫీ, అంతరిక్ష పరిశోధన వంటి రంగాల్లో సహకారాన్ని పెంపొందించుకోవడమే లక్ష్యంగా రెండు దేశాల మధ్య ఏడు ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. భారత్, మారిషస్‌లు కేవలం భాగస్వామ్య పక్షాలు మాత్రమే కాదని.. అవి ఒకే కుటుంబమని నరేంద్ర మోదీ తేల్చిచెప్పారు. స్వేచ్ఛాయుతమైన, సురక్షితమైన, స్థిరమైన, సౌభాగ్యవంతమైన హిందూ మహాసముద్రం ఇరుదేశాలకు ఉమ్మడి ప్రాధాన్యం కలిగిన అంశమని వివరించారు. నవీన్‌చంద్రతో భేటీ అనంతరం మోదీ ఒక ప్రకటన విడుదల చేశారు. మారిషస్ ప్రత్యేక ఆర్థిక మండలి భద్రతను బలోపేతం చేయడానికి భారత్ కట్టుబడి ఉందన్నారు. మారిషస్‌లో యూపీఐ చెల్లింపులు, రూపేకార్డులు అందుబాటులోకి వచ్చాయని, ఈ నేపథ్యంలో రెండు దేశాల మధ్య వాణిజ్యం స్థానిక కరెన్సీల్లోనే జరిగేలా చర్యలు తీసుకుంటామని ప్రకటించారు.

మారిషస్‌లో 'మిషన్ కర్మయోగి'

ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ కింద మారిషస్‌లో 10 ప్రాజెక్టులకు భారత్ సాయం అందించబోతోంది. ఇందులో ఓడరేవు, ఎయిర్‌పోర్టు, రోడ్లు, పాఠశాలలు, ఆసుపత్రులు ఉన్నాయి. ఇది ఆర్థిక సాయం కాదని.. రెండు దేశాల ఉమ్మడి భవిష్యత్తుకు పెట్టే పెట్టుబడి అని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. భారత్, మారిషస్‌లు రెండు వేర్వేరు దేశాలు అయినప్పటికీ వాటి స్వప్నాలు, భవిష్యత్తు ఒక్కటేనని స్పష్టంచేశారు. చాగోస్ ఒప్పందం కుదిరినందుకు నవీన్ చంద్రతోపాటు మారిషస్ ప్రజలకు మోదీ అభినందనలు తెలిపారు. మారిషస్ సార్వభౌమత్వానికి ఇదొక చరిత్రాత్మక విజయమని ఉద్ఘాటించారు. మారిషస్‌కు ఎల్లప్పుడూ అండగా ఉంటామన్నారు. మారిషస్ సార్వభౌమత్వాన్ని పూర్తిస్థాయిలో గుర్తించడానికి తమ మద్దతు కచ్చితంగా ఉంటుందని తెలిపారు. మారిషస్‌లో నూతన డైరెక్టరేట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు ప్రధాని మోదీ చెప్పారు. మారిషస్‌లో సైన్స్ అండ్ టెక్నాలజీలో శిక్షణ ఇవ్వడానికి త్వరలో 'మిషన్ కర్మయోగి'ప్రారంభిస్తామన్నారు. పరిశోధన, విద్య, నవీన ఆవిష్కరణల్లో భారత్, మారిషస్‌ల భాగస్వామ్యం ఉన్నత శిఖరాలకు చేరడం ఖాయమని స్పష్టంచేశారు. చాగోస్ దీవులను మారిషస్‌కు అప్పగించేందుకు ఈ ఏడాది మే నెలలో యునైటెడ్ కింగ్‌డమ్ అంగీకరించిన సంగతి తెలిసిందే. ఈ దీవులపై హక్కులను యూకే వదులుకుంది. ఇదిలా ఉండగా, మారిషస్ ప్రధానమంత్రి నవీన్‌చంద్ర ఈ నెల 16 దాకా భారత్‌లో పర్యటించనున్నారు.

ఖైదీలపై కాల్పులు

ముగ్గురి మృతి
- నేపాల్‌లో కొనసాగుతున్న ఖైదీల పరారీపర్వం
- మొత్తంగా 25 జైళ్ల నుంచి బయటపడ్డ 15,000 మంది ఖైదీలు
- కర్ఫ్యూ సమయంలో కాస్త సడలింపు
- ఇంకా భయం గుప్పిట్లో నేపాలీలు

కాఠ్మండు: నేపాల్‌లో ఓవైపు ఉద్యమం, మరోవైపు ప్రభుత్వం కుప్పకూలడంతో శాంతిభద్రతలు కట్టుతప్పి ఖైదీలు చెలరేగిపోయారు. దేశవ్యాప్తంగా దాదాపు 25 కారాగారాల నుంచి 15 వేల మంది ఖైదీలు జైలు గదులు బద్దలుకొట్టిమరీ బయటపడ్డారు. పరారై బయటికొచ్చి స్వేచ్ఛావాయువులు పీల్చారు. నేరస్తుల పరారీతో అప్రమత్తమైన సైన్యం పలుచోట్ల ఖైదీలను వెంటబడిమరీ పట్టుకుంది. కొన్ని చోట్ల జైలు సిబ్బందిపై ఖైదీలు ఎదురుతిరిగారు. మాధేశ్ ప్రావిన్సులోని రామెఛాప్ జిల్లా కారాగార కేంద్రంలో గురువారం ఉదయం ఒక్కసారిగా ఖైదీలు జైలుసిబ్బందితో ఘర్షణకు దిగారు. జైలు గోడను బద్దలుకొట్టేందుకు ఖైదీలు గ్యాస్ సిలిండర్‌ను పేల్చేశారు. దీంతో ఘర్షణ మొదలైంది. పారిపోయేందుకు ప్రయత్నించిన వారిని నిలువరించేందుకు సిబ్బంది కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ముగ్గురు ఖైదీలు మరణించారు. పలువురు గాయపడ్డారు. దీంతో సోమవారం మొదలైన హింసాత్మక ఘటనల్లో ఇప్పటిదాకా సంభవించిన మరణాల సంఖ్య గురువారానికి 34కు పెరిగింది. 1,338 మందికి పైగా గాయాలపాలయ్యారు.

భారత్‌లోకి ఖైదీల చొరబాటు యత్నం

కల్లోల నేపాల్ నుంచి బయటపడే దురుద్దేశంతో ఇప్పటికే జైళ్ల నుంచి పారిపోయిన ఖైదీలు కొందరు ఏకంగా దేశందాటి పారిపోయేందుకు విఫలయత్నం చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని బయిర్‌గనియా చెక్‌పోస్ట్ సమీప ప్రాంతం గుండా భారత్‌లోకి చొరబడేందుకు యత్నించిన 13 మంది నేపాల్ ఖైదీలను భారత బలగాలైన సశస్త్ర సీమా బల్(ఎస్ఎస్‌బీ) విజయవంతంగా అడ్డుకుంది. సరిహద్దు సమీపంలోని రౌతహాత్ జిల్లా కారాగార కేంద్రం నుంచి ఈ ఖైదీలు పారిపోయారని ఎస్ఎస్‌బీ గుర్తించింది. నిబంధనల ప్రకారం వారందరినీ నేపాల్ పోలీసులకు ఎస్ఎస్‌బీ సైనికులు అప్పగించారు. ఇప్పటిదాకా జైళ్ల నుంచి పారిపోయి సరిహద్దుదాకా చేరుకున్న దాదాపు 60 మంది నేపాలీ ఖైదీలు, ఒక బంగ్లాదేశ్ జాతీయుడిని అదుపులోకి తీసుకుని నేపాల్ పోలీసులకు అప్పగించామని ఎస్ఎస్‌బీ అధికారి వెల్లడించారు. భారత్‌కు తూర్పున నేపాల్ వెంట 1,751 కిలోమీటర్ల పొడవునా సరిహద్దు కాపలా, పర్యవేక్షణా బాధ్యతలను ఎస్ఎస్‌బీ చూసుకుంటోంది.

పెట్రోల్ బంకుల వద్ద చాంతాడంత క్యూలైన్లు

కర్ఫ్యూ కారణంగా జనజీవనం స్తంభించిపోయింది. సైన్యం రంగంలోకి దిగడంతో హింసాత్మక ఘటనలు సద్దుమణిగాయి. శనివారం ఉదయం ఆరు గంటలదాకా దేశవ్యాప్త కర్ఫ్యూ కొనసాగుతుందని సైన్యం ప్రకటించింది. గురువారం సాయంత్రం ఐదు గంటల నుంచి ఏడింటిదాకా కర్ఫ్యూను సడలించారు. ఇప్పటికే కర్ఫ్యూ కారణంగా వాహనాల రాకపోకలు ఆగిపోయాయి. దీంతో బంకుల్లో పెట్రో నిల్వలు నిండుకున్నాయి. అయితే కాస్తంత పెట్రో నిల్వలు ఉన్న బంకుల వద్ద చాంతాడంత క్యూలైన్లు కనిపించాయి. కానీ జనం ముఖాల్లో భయంఛాయలు పోలేదు. పౌర ప్రభుత్వాన్ని త్వరగా కొలువు తీర్చాలని రచయితలు, విద్యావేత్తలు అధ్యక్షుడిని కోరుతూ లేఖలు రాశారు. అయితే సనాతన ధర్మాన్ని కాపాడాలంటే మళ్లీ రాచరిక వ్యవస్థను పునరుద్ధరించాలని జ్యోతిష్ పీఠం శంకరాచార్య స్వామి అవిముక్తేశ్వరానంద్ సరస్వతి డిమాండ్‌చేశారు.

పూర్తిగా దగ్ధమైన సుప్రీంకోర్టు

అవినీతి, వారసత్వ రాజకీయాలు, అసమర్థ పాలన, సోషల్‌మీడియాపై నిషేధం కారణాలతో కట్టలు తెంచుకున్న ప్రజాగ్రహజ్వాలల్లో అధికార కేంద్రాలు కాలిపోయాయి. న్యాయవితరణ చేసే ధర్మాసనాలూ దగ్ధమయ్యాయి. సుప్రీంకోర్టు మసిబారింది. అయినాసరే ఆదివారం నుంచి కేసుల విచారణను మొదలెడతామని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు తమ నిబద్ధతను చాటారు. ''నేపాల్ న్యాయవ్యవస్థకు సంబంధించిన పత్రాలెన్నో బుగ్గిపాలయ్యాయి''అని ప్రస్తుత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రకాశ్ మాన్ రౌత్ ఆవేదన వ్యక్తంచేశారు. బనేపా మున్సిపాలిటీలోని నయాబస్తీలో ఎనిమిది బాంబులను సైన్యం గుర్తించి జాగ్రత్తగా నిర్వీర్యం చేసింది. జైళ్ల నుంచి పారిపోతూ ఖైదీలు ఎత్తుకెళ్లిన డజన్లకొద్దీ ఆయుధాలను సైన్యం తిరిగి స్వాధీనంచేసుకుంది. మరోవైపు నేపాల్‌లో చిక్కుకుపోయిన భారతీయుల తిరుగుప్రయాణపర్వం మొదలైంది. పలు మార్గాల్లో పలు రాష్ట్రాల ప్రజలు వెనుతిరిగి వస్తున్నారు.

నేడు ఉపరాష్ట్రపతిగా రాధాకృష్ణన్ ప్రమాణం

సాక్షి, న్యూఢిల్లీ: ఉపరాష్ట్రపతిగా నూతనంగా ఎన్నికైన చంద్రాపురం పొన్నుస్వామి రాధాకృష్ణన్(67) శుక్రవారం 15వ ఉపరాష్ట్రపతిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉదయం 9.30 గంటలకు రాష్ట్రపతి భవన్‌లో జరుగనుంది. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. కార్యక్రమానికి ప్రధాని మోదీతో పాటు కేంద్ర మంత్రులు, పలువురు ఎంపీలు, ఎన్డీఏ పక్షాల అధినేతలు, ముఖ్యమంత్రులు సైతం హాజరు కానున్నారు. ఇండియా కూటమి నేతలకు ప్రమాణ స్వీకార కార్యక్రమ ఆహ్వాన లేఖలు పంపినట్లుగా తెలిసింది. ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన కారణంగా సీపీ రాధాకృష్ణన్ మహారాష్ట్ర గవర్నర్ పదవికి రాజీనామా చేయగా, దానిని రాష్ట్రపతి ఆమోదించారు.

ఓటు చోరీపై త్వరలో మరో సంచలనం: రాహుల్

రాయ్‌బరేలీ: కేంద్రంలోని బీజేపీ ఓటు చోరీకి పాల్పడుతోందన్న ఆరోపణలను కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ మళ్లీ పునరుద్ఘాటించారు. ఇప్పటికే పలుమార్లు ఇందుకు సంబంధించిన ఆధారాలను బయటపెట్టినట్లు చెప్పుకున్న ఆయన..భవిష్యత్తులో ఓట్ చోరీకి సంబంధించిన సంచలన రుజువులను వెల్లడిస్తానని గురువారం ఆయన మీడియాతో అన్నారు. మహారాష్ట్ర, హరియాణా, కర్ణాటక ఎన్నికల సమయంలో బీజేపీ అవకతవకలకు పాల్పడింది. దీనిపై పక్కా ఆధారాలను బహిర్గతం చేశా. రానున్న రోజుల్లో మరిన్ని సంచలన నిజాలను వెల్లడిస్తా'అని రాహుల్ చెప్పారు. 'ఓట్ల దొంగలు, గద్దె దిగాలి'అనే నినాదం నేడు దేశవ్యాప్తంగా ప్రతిధ్వనిస్తోందన్నారు.

జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో లింకులు.. అమెరికాలో రాయబారిపై యూకే వేటు

లండన్: బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ గురువారం అమెరికాలో తమ రాయబారి లార్డ్ పీటర్ మాండెల్సన్‌ను బాధ్యతల నుంచి తొలగించారు. సెక్స్ కుంభకోణంలో ప్రధాన సూత్రధారి ఆరోపణలు ఎదుర్కొంటున్న అమెరికాకు చెందిన జెఫ్రీ ఎప్‌స్టీన్‌కు సంబంధించిన ఈ మెయిల్స్‌లో ఈయన పేరు బయటకు రావడంతో ఈ మేరకు చర్య తీసుకున్నారు. మాండెల్సన్ పంపిన ఈమెయిల్స్ చూస్తే ఎప్‌స్టీన్‌తో ఆయనకు చాలా సన్నిహిత సంబంధాలున్నట్లు రుజువవుతోందని తెలిపారు. న్యూయార్క్ జైల్లో ఉన్న ఎప్‌స్టీన్ ఆరేళ్ల క్రితం అనుమానాస్పద స్థితిలో చనిపోయిన సంగతి తెలిసిందే.



ఈ భవనం పైనుంచే దుండగుడు(వలయంలో) కాల్పులు జరిపాడు

ట్రంప్ మిత్రుడు చార్లీ కిర్క్ దారుణ హత్య

యూటా వ్యాలీ యూనివర్సిటీలో కాల్చి చంపిన దుండగుడు

- విద్యార్థుల ప్రశ్నలకు సమాధానం ఇస్తుండగా దూసుకొచ్చిన తూటా
- మెడ నుంచి దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతి
- తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్
- కిర్క్ హత్యకు రాడికల్ వామపక్షవాదులే కారణమని ఆగ్రహం
- కిర్క్‌కు 'ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్'ను ప్రకటించిన ట్రంప్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు సన్నిహితుడిగా, సంప్రదాయవాదిగా పేరుగాంచిన చార్లీ కిర్క్(31) దారుణ హత్యకు గురయ్యాడు. అమెరికాలో యూటా రాష్ట్రంలోని ఉటా వ్యాలీ స్టేట్ యూనివర్సిటీలో బుధవారం ఓ కార్యక్రమంలో ప్రసంగిస్తుండగా 150 మీటర్ల దూరంలో ఓ భవనం పైభాగంలో మాటువేసిన గుర్తుతెలియని వ్యక్తి తుపాకీ గురిపెట్టాడు. ఒకే ఒక్క తూటాకు చార్లీ కిర్క్ అక్కడికక్కడే నేలకొరిగాడు. గత ఏడాది పెన్సిల్వేనియాలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న డొనాల్డ్ ట్రంప్‌పై జరిగిన కాల్పుల తరహాలోనే ఈ కాల్పులు జరగడం గమనార్హం. యూనివర్సిటీ ప్రాంగణంలో తెల్లరంగు టెంట్ మధ్యలో కూర్చొని విద్యార్థుల ప్రశ్నలకు మైక్రోఫోన్‌లో సమాధానం చెబుతుండగా హఠాత్తుగా బుల్లెట్ దూసుకొచ్చింది. రాజకీయ యువజన సంఘం 'టర్నింగ్ పాయింట్ యూఎస్ఏ' ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ చర్చా కార్యక్రమంలో గత పదేళ్లలో అమెరికాలో తుపాకీ హింసాకాండలో ట్రాన్స్‌జెండర్ల పాత్ర ఎంతవరకు ఉందన్న ప్రశ్నకు సమాధానం ఇచ్చిన వెంటనే బుల్లెట్ ఆయన మెడను చీలుస్తూ దూసుకెళ్లింది. మెడ ఎడమభాగం నుంచి రక్తం బయటకు చిమ్మింది. తీవ్రంగా గాయపడిన కిర్క్ అక్కడే ప్రాణాలు వదిలాడు. ఈ ఘటన దేశవ్యాప్తంగా సంచలనాత్మకంగా మారింది. ఇది ముమ్మాటికీ రాజకీయ హత్యేనని యూటా రాష్ట్ర గవర్నర్ స్పెన్సర్ కాక్స్ తేల్చిచెప్పారు. కిర్క్ హత్యను తీవ్రంగా ఖండిస్తున్నానని పేర్కొన్నారు. తమ రాష్ట్రానికి ఇదొక చీకటి రోజు, దేశానికి విషాద భరిత దినమని అని చెప్పారు. హంతకుడిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు. అతడికి మరణశిక్ష తప్పదని పేర్కొన్నారు.

తొక్కిసలాట.. విషాద ఛాయలు

కిర్క్ హత్య తర్వాత యూనివర్సిటీలో తీవ్ర గందరగోళం చోటుచేసుకుంది. బుల్లెట్ పేలిన శబ్దం వినిపించడం, వెంటనే కిర్క్ కింద పడిపోవడం చూసి విద్యార్థులు ప్రాణభయంతో పరుగులు తీశారు. స్వల్పంగా తొక్కిసలాట చోటుచేసుకుంది. ఒకరిపై ఒకరు పడిపోయారు. ఆ సమయంలో అక్కడ దాదాపు 3,000 మంది ఉన్నారు. అరుపులు, రోదనలతో విషాదం అలుముకుంది. ఈ గందరగోళం మధ్యే నల్లరంగు దుస్తుల్లో ఉన్న హంతకుడు అందరి కళ్లుగప్పి సులభంగా తప్పించుకున్నాడు. అతడి కోసం పోలీసులు గాలింపు చర్యలు ప్రారంభించారు. ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా, ఈ ఘటనతో వారికి సంబంధం లేదని తేలింది. అనంతరం వారిని వదిలేశారు. హత్యకు సంబంధించి పోలీసులు సోషల్ మీడియాలో షేర్ చేసిన వీడియోలు ప్రపంచవ్యాప్తంగా వైరల్‌గా మారాయి. యూనివర్సిటీ పోలీసు డిపార్టుమెంట్‌కు చెందిన ఆరుగురు అధికారులతోపాటు కిర్క్ సొంత భద్రతా సిబ్బంది ఘటనా స్థలంలోనే విధుల్లో ఉన్నా వేలాది మంది సమక్షంలో హత్య జరగడం గమనార్హం.

మహోన్నత వ్యక్తి: ట్రంప్

తన మద్దతుదారుడైన చార్లీ కిర్క్ మృతిపట్ల డొనాల్డ్ ట్రంప్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. అతడొక మహోన్నత వ్యక్తి అని శ్లాఘించారు. ఈ మేరకు బుధవారం సోషల్ మీడియాలో ఒక పోస్టుచేశారు. వైట్‌హౌస్ నుంచి ఒక వీడియోను విడుదల చేశారు. సత్యం, స్వేచ్ఛ కోసం కిర్క్ అమరుడయ్యాడని కొనియాడారు. కిర్క్ హత్యకు విప్లవ వామపక్షవాదులే కారణమని ఆరోపించారు. కిర్క్‌కు అమెరికా అత్యున్నత పౌర పురస్కారమైన 'ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్'ను ట్రంప్ గురువారం ప్రకటించారు.



కాల్పులకు కొద్ది క్షణాల ముందు వర్సిటీలో మాట్లాడుతున్న కిర్క్

ఎవరీ కిర్క్?

చార్లీ కిర్క్ అలియాస్ చార్లెస్ జేమ్స్ కిర్క్ 1993 అక్టోబర్ 14న ఇల్లినాయిస్‌లో జన్మించాడు. రాజకీయాల్లో చురుగ్గా పని చేస్తున్నాడు. 2012లో 18 ఏళ్ల వయసులో షికాగోలో టర్నింగ్ పాయింట్ యూఎస్ఏ అనే సంస్థను మరో వ్యక్తితో కలిసి స్థాపించాడు. ఆయనకు భార్య ఎరికా లేన్, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ట్రంప్ పెద్ద కుమారుడైన డొనాల్డ్ ట్రంప్ జూనియర్‌కు కిర్క్ వ్యక్తిగత సహాయకుడిగా పనిచేశాడు. అంతేకాదు రచయితగా, రేడియో వ్యాఖ్యాతగా కూడా గుర్తింపు పొందాడు. మీడియా రంగంలోనూ అడుగుపెట్టాడు. టర్నింగ్ పాయింట్ యూఎస్ఏ సంస్థకు డొనాల్డ్ ట్రంప్ అండగా నిలుస్తున్నారు. భారతీయులకు అమెరికా వీసాలు ఇవ్వడాన్ని కిర్క్ పలు సందర్భాల్లో వ్యతిరేకించాడు. అమెరికన్ కార్మికుల స్థానాన్ని భారతీయులు ఆక్రమించుకున్నారని, వారికి ఇక వీసాలు ఇవ్వాల్సిన అవసరం లేదని వాదించాడు.

తుపాకీ స్వాధీనం

కిర్క్‌కు చంపడానికి దుండగుడు ఉపయోగించిన బోల్ట్-యాక్షన్ రైఫిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎఫ్‌బీఐ గురువారం ప్రకటించింది. దానిపై వేలిముద్రలు, ఇతర ఆధారాల కోసం ల్యాబ్‌లో పరీక్షిస్తున్నట్లు పేర్కొంది. దుండగుడి ఆచూకీ ఇంకా లభించలేదని, గాలింపు కొనసాగుతోందని వెల్లడించింది. అతడు కాలేజీ విద్యార్థి కావొచ్చని అంచనా వేస్తున్నట్లు తెలియజేసింది.

సారథిపై జెన్ జెడ్‌లో విభేదాలు

- విద్యుత్ బోర్డ్ మాజీ సీఈఓ కుల్మాన్ ఘీసింగ్ వైపు ఒక వర్గం మొగ్గు
- నేపాల్ మాజీ చీఫ్ జస్టిస్ సుశీలకు మరో వర్గం మద్దతు
- దేశాధ్యక్షుడు పౌడెల్, ఆర్మీ చీఫ్‌తో కొనసాగుతున్న చర్చలు

కాఠ్మండు: ఉవ్వెత్తున ఎగసిన విద్యార్థుల ఆగ్రహం ధాటికి నేపాల్ ప్రభుత్వం కుప్పకూలగా సుస్థిర పాలన అందించే సారథి ఎంపికలో జెన్‌జెడ్ విద్యార్థి సంఘం తర్జనభర్జనలు పడుతోంది. ఈలోపు జెన్ జెడ్ విద్యార్థుల్లో భేదాభిప్రాయాలు పొడచూపాయి. కొందరు విద్యుత్ బోర్డ్ మాజీ సీఈఓ కుల్మాన్ ఘీసింగ్ వైపు మొగ్గుచూపారు. మరికొందరు మాత్రం నేపాల్ మాజీ సుప్రీంకోర్టు మాజీ ప్రధాన మహిళా న్యాయమూర్తి జస్టిస్ సుశీల కర్కీ మాత్రమే సమర్థపాలన అందించగలరని వాదించారు. ఈ వాదనల నడుమే ఉమ్మడిగా జన్‌జెడ్ విద్యార్థి బృందం దేశాధ్యక్షుడు రామచంద్ర పౌడెల్, ఆర్మీ చీఫ్ అశోక్‌రాజ్ సిగ్డెల్‌తో భద్రకాళీ ప్రాంతంలోని సైనిక ప్రధాన కార్యాలయంలో గురువారం సుదీర్ఘ మంతనాలు జరిపారు. అయితే ఎవరిని తాత్కాలిక ప్రధానమంత్రిగా చేయాలనే అంశంలో ఏకాభిప్రాయం కుదరలేదు. దీంతో జెన్‌జెడ్, ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉమ్మడి ప్రకటన వెలువడలేదు. మరోదఫా చర్చలు జరిపే అవకాశం ఉంది. ''ప్రస్తుత అనిశ్చితికి చరమగీతం పాడే అంశాలపైనే ప్రధానంగా చర్చించారు. శాంతిభద్రతల పరిరక్షణ అంశం సైతం చర్చకొచ్చింది''అని నేపాల్ సైన్యం అధికార ప్రతినిధి తెలిపారు. ప్రధానిగా పగ్గాలు చేపట్టాలని తనను ఎవరూ ఇంతవరకు కోరలేదని జస్టిస్ సుశీల తెలిపారని ఆమె సంబంధిత వర్గాలు గురువారం వెల్లడించాయి. అంతకుముందు ఆమెనే ప్రధాని పదవి చేపట్టాలని ఆన్‌లైన్‌లో వేలాది మంది పోల్‌లో ఓటేశారు. అయితే నేపాల్ రాజ్యాంగ నియమాల ప్రకారం మాజీ న్యాయమూర్తులు ప్రధానమంత్రి వంటి కీలక పదవులు చేపట్టేందుకు అనర్హులు. మరోవైపు కాఠ్మండు నగర మేయర్, జనాల్లో అమితమైన ఆదరణ చూరగొన్న బాలేంద్ర షా రేసు నుంచి తప్పుకున్నట్లు తెలుస్తోంది. అసలు ఆయనకు ప్రధాని వంటి అత్యున్నత పదవులు చేపట్టే ఆలోచన లేదని తెలుస్తోంది. జస్టిస్ సుశీలకు బాలేంద్ర మద్దతు పలకడం విశేషం. ''తొలుత మేం బాలేంద్ర షా వైపు మొగ్గుచూపాం. ఆయన అందుకు సంసిద్ధంగా లేరని సమాచారం వచ్చింది. దాంతో మేం జస్టిస్ సుశీలను ఎంపికచేయాలని భావించాం. అయితే జడ్జీల ఎంపిక కుదరదని, అందుకే రాజ్యాంగం ఒప్పుకోదని తేలింది. ఇక ధారన్ మున్సిపాలిటీ మేయర్ హర్క్ సంపంగ్‌ను ప్రధాన అభ్యర్థిగా ఆశించాం. కానీ ఆయనకు పెద్దగా ఎవరూ మద్దతు ప్రకటించలేదు. దీంతో విద్యుత్ అథారిటీ సంస్థ మాజీ సీఈఓ కుల్మాన్ ఘీసింగ్ ఇందుకు తగిన వ్యక్తి అని నిర్ణయించుకున్నాం''అని జెన్‌జెడ్ ఒక ప్రకటన విడుదలచేసింది. అయితే సుశీల నాయకత్వం మాకు సమ్మతమే అని 'వీ నేపాలీ గ్రూప్'సారథి, ఉద్యమకారుడు సుదన్ గురుంగ్ ప్రకటించారు.

ఆర్మీ కార్యాలయం ఎదుట బాహాబాహీ

ఓవైపు జెన్‌జెడ్ కీలక నేతలు ఆర్మీ ప్రధాన కార్యాలయంలో దేశాధ్యక్షుడు, ఆర్మీ చీఫ్‌లతో మంతనాలు జరుపుతుంటే బయట జెన్ జెడ్ విద్యార్థులు ఘర్షణలకు దిగారు. సుశీల సమర్థురాలు అని కొందరు, ఘీసింగ్ గొప్ప వ్యక్తి అంటూ మరికొందరు వాదనలకు దిగారు. తర్వాత వాగ్వాదం ఘర్షణకు దారితీసింది. దీంతో జెన్ జెడ్ వర్గంలో విబేధాలు బట్టబయలయ్యాయి. ''సుశీల కేసులనైతే గొప్పగా తీర్పు చెప్పగలిగారేమోగానీ పరిపాలన అనేది అంత ఆషామాషీ వ్యవహారం కాదు. అయినా ఆమె 70 ఏళ్ల వృద్ధురాలు. ఈ వయసులో ఆమె క్రియాశీలక పాత్ర పోషించడం చాలా కష్టం''అనికొందరు వాదించారు. మరికొందరు ఘీసింగ్‌కు మద్దతు పలికారు. ''రోజుకు 18 గంటలపాటు విద్యుత్‌కోతలుండేవి. ఎలక్ట్రిసిటీ అథారిటీ బోర్డ్ సీఈఓగా ఘీసింగ్ సమర్థవంతంగా పనిచేశారు. దశాబ్దాలుగా పట్టిపీడించిన విద్యుత్ సంక్షోభం నుంచి దేశాన్ని గట్టెక్కించారు'' అని మరికొందరు వాదించారు. దీంతో ఇరువర్గాల మధ్య నడిరోడ్డు మీద గొడవ మొదలైంది.

అధికారంపై ఆర్మీ ఆసక్తి!

అధికారంపై ఆర్మీ ఆసక్తి కనబరుస్తున్నట్లు తాజా పరిణామాలు తెలియజేస్తున్నాయి. జెన్‌జెడ్ ప్రతినిధి బృందంతో అధ్యక్షుడు, ఆర్మీ చీఫ్ చర్చలు జరుపుతున్నప్పుడే వివాదాస్పద వ్యాపారవేత్త దుర్గా ప్రసాయ్ వచ్చారు. దేశంలోని రాజరిక పాలన మళ్లీ తేవాలని ఆయన గట్టిగా విశ్వసిస్తారు. ఈయనతోపాటో రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ(ఆర్ఎస్పీ)ని సైతం ఈ చర్చల్లో భాగస్వాములుగా చేర్చుకుంటే సమస్యను త్వరగా పరిష్కరించవచ్చని ఆర్మీ చీఫ్ అశోక్ వ్యాఖ్యానించినట్లు విశ్వసనీయ సమాచారం. తమ కనుసన్నల్లో ఆపద్ధర్మ ప్రభుత్వ ఏర్పాటు జరగాలనే ఉద్దేశ్యంతోనే వ్యాపారి, రాజకీయ పార్టీలను ఇందులోని ఆర్మీ లాగిందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మధ్యలో దుర్గా ప్రసాయ్ జోక్యాన్ని సహించని జెన్ జెడ్ విద్యార్థులు వెను వెంటనే చర్చలను అర్ధంతరంగా ఆపేసి బయటకు వచ్చేశారని తెలుస్తోంది. ''మాతో చర్చలకు పిలిచి మధ్యలో దుర్గా ప్రసాయ్, ఆర్ఎస్పీలను కలుపుకుని పొండి అని ఆర్మీ చీఫ్ చెప్పడం ఏమాత్రం సబబుగా లేదు. విద్యార్థి ఉద్యమాన్ని తక్కువచేసి చూపిస్తున్నారు'' అని విద్యార్థి నేత రక్షా బామ్ తర్వాత మీడియాతో అన్నారు. చర్చలు ఎటూ తేలకపోవడంతో ఆర్మీ చీఫ్ చైనాలో తన వారంరోజుల పర్యటనను తప్పనిపరిస్థితుల్లో రద్దుచేసుకున్నారు.



మెట్రో రైలు నిర్వహణను వదిలించుకునే యోచనలో ఎల్అండ్‌టీ

కేంద్రం లేదా రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించేందుకు సిద్ధం

ఈ మేరకు కేంద్రానికి లేఖ

రూ.5 వేల కోట్లకు పైగా నష్టాల్లో హైదరాబాద్ మెట్రో

ఈ మెట్రో నడపలేం!

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ మెట్రోరైల్‌ను వదిలించుకోవడానికి సిద్ధంగా ఉన్నట్లు నిర్మాణ సంస్థ ఎల్అండ్‌టీ తేల్చిచెప్పింది. నగరంలోని మూడు కారిడార్‌లలో పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) పద్ధతిలో నిర్మించిన ఈ ప్రాజెక్టును కేంద్రం లేదా రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేసింది. ఒకవేళ మెట్రో నిర్వహణ కోసం స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్పీవీ)ను ఏర్పాటు చేసి అప్పగించాలని సూచించినా సిద్ధంగా ఉన్నట్లు చెప్పింది. ఆర్థికంగా భారంగా పరిణమించిన మెట్రోరైల్ నిర్వహణ తమ వల్ల కాదంటూ చేతులెత్తేసింది. వరుస నష్టాలు, పెండింగ్ బకాయిల దృష్ట్యా రైళ్లను నడపడం కష్టంగా ఉన్నట్లు ఇటీవల కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు లేఖ రాసింది. మెట్రో రెండో దశ డీపీఆర్‌పై రాష్ట్ర ప్రభుత్వం నుంచి కేంద్రం వివరణ కోరిన సంగతి తెలిసిందే. టికెట్ చార్జీల పంపకాలు, విద్యుత్ చార్జీల చెల్లింపులు, అసంపూర్తిగా ఉన్న మెట్రో మొదటి దశ ప్రాజెక్టు తదితర అంశాలపై ఎల్అండ్‌టీతో ఏ రకమైన అవగాహన ఏర్పాటు చేసుకున్నారో తెలియజేయాలని చెప్పింది. ఈ సంప్రదింపుల క్రమంలోనే ఎల్అండ్‌టీ సంస్థ కేంద్ర గృహనిర్మాణశాఖ సంయుక్త కార్యదర్శి జైదీప్‌కు లేఖ రాసింది. దేశంలోనే పీపీపీ పద్ధతిలో నిర్మించిన మొదటి మెట్రో ఇదే కావడం గమనార్హం.

బకాయిలు రూ.5,000 కోట్లకు పైనే..

హైదరాబాద్ మెట్రో మొదటి దశ 2017లో ప్రారంభమైంది. సుమారు రూ.22 వేల కోట్లతో 69 కి.మీ.పొడవున నిర్మించారు. ఈ మొదటి దశకు సంబంధించిన ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు 5.5 కి.మీ. కారిడార్ మాత్రం పెండింగ్‌లో ఉండగా, ప్రస్తుతం దీన్ని చాంద్రాయణగుట్ట వరకు పొడిగించి రెండో దశలో కలిపేశారు. మొదటి కారిడార్ పూర్తయిన 2017 నాటికి, ఎల్ అండ్ టీకి ప్రభుత్వం రూ. 3,756 కోట్ల రాయితీ బకాయిలను చెల్లించాల్సి ఉంది. అవి 2020 ఫిబ్రవరి నాటికి రూ.5 వేల కోట్లకు పెరిగాయి. మరోవైపు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) కింద ఇవ్వాల్సిన రూ.254 కోట్లను కేంద్రం ఇవ్వడం లేదని ఎల్అండ్‌టీ పేర్కొంది. ప్రస్తుతం మెట్రోలో రోజూ వారు 4.5 లక్షల మంది ప్రయాణిస్తున్నారు.

చాలని టికెట్ ఆదాయం

ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు రాకపోవడంతో టికెట్‌లపై వచ్చే ఆదాయం రైళ్ల నిర్వహణకు చాలకపోవడం వంటి కారణాల దృష్ట్యా మెట్రో రైళ్ల నడపడం తమకు కష్టంగా ఉన్నట్లు ఎల్అండ్‌టీ వెల్లడించింది. నిర్వహణ ఖర్చులు, విద్యుత్‌చార్జీలు, ఉద్యోగుల జీతభత్యాలు, తదితర ఖర్చులు పెనుభారంగా మారినట్లు పేర్కొంది. మెట్రో మొదటిదశలోని తమ ఈక్విటీ వాటాను కేంద్రం లేదా రాష్ట్ర ప్రభుత్వానికి విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నట్లు కేంద్రానికి రాసిన లేఖలో పేర్కొంది.

మెట్రో రెండో దశ ప్రతిపాదనలివీ..

- ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట, నాగోల్-ఎల్బీనగర్-శంషాబాద్ ఎయిర్‌పోర్ట్, ఎల్బీనగర్-హయత్‌నగర్, రాయదుర్గం-అమెరికన్ కాన్సులేట్-హైకోర్టు భవనం, మియాపూర్-బీహెచ్ఈఎల్ తదితర మార్గాల్లో 'ఏ'విభాగం కింద మొత్తం 5 కారిడార్‌లలో 76.5 కి.మీ. మేర నిర్మించనున్నారు.
- సికింద్రాబాద్ ప్యారడైజ్ నుంచి మేడ్చల్ వరకు (23 కి.మీ.) ప్యారడైజ్ నుంచి శామీర్‌పేట్ వరకు (22 కి.మీ.), ఎయిర్‌పోర్టు నుంచి ఫ్యూచర్‌సిటీ వరకు 39.6 కి.మీ నిర్మించాలని ప్రతిపాదించారు.
- ఏ, బీ విభాగాల్లోని మొత్తం 8 కారిడార్‌ల నిర్మాణానికి రూ.40 వేల కోట్లకు పైగా ఖర్చుకానున్నట్లు అంచనా.

'టీసీఎస్‌జేఎస్‌సీ ఏర్పాటు ఉద్యోగ జేఏసీ విజయమే'

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారమవుతాయని తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు తర్వాత తొలిసారిగా తెలంగాణ సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ ఏర్పాటు చేసినందుకు టీఈజేఏసీ తరపున రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. టీసీఎస్‌జేఎస్‌సీ ఏర్పాటు చేయడంతో పన్నెండు సంవత్సరాల ఉద్యోగుల పోరాటానికి ఒక ముందడుగు పడిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇదేవేగంతో ఉద్యోగుల సమస్యలన్నీ పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఈజేఏసీ నేతలు దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సదాశివపేట్ మున్సిపాలిటీ కార్యాలయం, సంగారెడ్డి జిల్లా-తెలంగాణ రాష్ట్రం
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
టెండరు ప్రకటన నం. E1/1103/SSPT/e-proc/2025-26 తేది: 11.09.2025
వివిధ గ్రాంట్స్ క్రింద పట్టణంలో కొన్ని అభివృద్ధి & నిర్వహణ పనుల కొరకు టెండర్లు పిలువబడుతున్నవి. వివరాలు దిగువ చూపబడిన విధముగా ఉన్నది.
ఆన్‌లైన్ బిడ్ల దాఖలుకు ప్రారంభ తేదీ/సమయం: 12.09.2025న ఉ. 11.00 గం॥ నుండి. ఆన్‌లైన్ బిడ్ల దాఖలుకు ముగింపు తేదీ/సమయం: 15.09.2025న సా. 5.00 గం॥ వరకు. బిడ్లు తెరుచు తేదీ: 15.09.2025న సా. 5.30 గం॥కు, వివరాలకు సంప్రదించండి: మున్సిపల్ కమిషనర్, సదాశివపేట్ మున్సిపాలిటీ, సెల్ నం. 9849905918 (Comm.), ఇంజినీర్: 7331123024, ఇ-మెయిల్: mcsadasivpet@yahoo.com, తదుపరి వివరాలను "ఇ" ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ @ www.tender.telangana.gov.inలో చూడవచ్చును. పనుల డౌన్‌లోడింగ్ ప్రారంభం 12.09.2025న ఉ. 11.00 గం॥ నుండి.
సం/- కమిషనర్, సదాశివపేట్ మున్సిపాలిటీ
DIPR RO No.7878-PP/CL/Advt/1/2025-26, Dt: 11.09.2025

గుమ్మడిదల మున్సిపాలిటీ కార్యాలయం, సంగారెడ్డి జిల్లా
Lr.No.MCA/E1/Q/03/2025-26, **కొటేషన్** తేది : 11.09.2025
మున్సిపల్ కౌన్సిల్ గుమ్మడిదల వారు గుమ్మడిదల మున్సిపాలిటీలో గణేష్/బతుకమ్మ పండుగల సదుపాయాల యొక్క ఏర్పాట్ల కొరకు అవసరమైన కనీస సదుపాయాలు అనగా టెంట్ హౌస్ ఐటమ్స్/ లైట్స్/JCB's/ హిటాచీ ఇతర ఐటమ్స్ అద్దెపై ఏర్పాటుచేయుట కొరకు కొటేషన్ మరియు గుమ్మడిదల మున్సిపాలిటీలో వాల్ పెయింటింగ్స్ కొరకు అనుభవం గల వ్యక్తులు / పేరొందిన సంస్థల నుండి కొటేషన్ మరియు Sft రేట్ ప్రకారం ఆర్టిస్టిక్ మరియు మ్యూరల్ పెయింటింగ్ కొరకు పెయింటింగ్‌లో ఆసక్తి కొరకు కూడా కొటేషన్ కోరుతున్నారు. వ్యక్తులు/ఏజెన్సీలు/పేరొందిన సంస్థలు కొటేషన్ పర్ ఫీట్‌తోపాటు వారియొక్క డాక్యుమెంట్స్‌ను 17.09.2025న లేదా ఆలోగా మ॥3.00 గం॥కు అన్ని డాక్యుమెంట్స్‌తో దాఖలు చేయాలి. నిబంధనలు : 1. ఇదేతరహా పెయింటింగ్‌లో గత అనుభవం కలిగి ఉండాలి మరియు కొన్ని ఫోటోలు దాఖలు చేయాలి. 2. GST రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ దాఖలు చేయాల్సి ఉంటుంది. తదుపరి వివరాల కోసం మున్సిపల్ కమిషనర్ (+91 9908753665) / మున్సిపల్ A.E. ఇంజినీరింగ్ శాఖ (+91 7331189478) గారిని కార్యాలయ వేళలలో సంప్రదించాలి.
సం/- కమిషనర్, గుమ్మడిదల మున్సిపాలిటీ
DIPR RO No.7872-PP/CL/Advt/1/2025-26, Dt: 11.09.2025

తలసరి ఆదాయంలో తెలంగాణ రికార్డు

దేశంలోనే నంబర్ 1 స్థానంలో రాష్ట్రం
'ఎక్స్'లో ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ

సాక్షి, న్యూఢిల్లీ: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో తెలంగాణ రాష్ట్రం తలసరి ఆదాయంలో సరికొత్త రికార్డును సృష్టించిందని పార్టీ ప్రకటించింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి దేశంలోనే అత్యధిక తలసరి ఆదాయం నమోదు చేసిన రాష్ట్రంగా తెలంగాణ అగ్రస్థానంలో నిలిచిందని తెలిపింది. రాష్ట్రంలో తలసరి ఆదాయం రూ.3.87 లక్షలకు చేరినట్లు కాంగ్రెస్ పార్టీ తన అధికారిక ఎక్స్ ఖాతాలో ప్రకటించింది.

పదేళ్లలో మూడింతల వృద్ధి..

'దశాబ్దం క్రితం లక్ష రూపాయల లోపుగా ఉన్న రాష్ట్ర తలసరి ఆదాయం, నేడు రూ. 3.8 లక్షల మార్కును దాటింది. ఇది మూడింతల వృద్ధి కావడం విశేషం. దేశ వృద్ధి రేటు మందగించినప్పటికీ, తెలంగాణ సుమారు 12 శాతం వార్షిక వృద్ధి రేటుతో దూసుకుపోవడం రాష్ట్ర ఆర్థిక పటిష్టతకు నిదర్శనం'అని కాంగ్రెస్ పార్టీ తెలిపింది. ఈ ప్రగతి కేవలం అంకెలకే పరిమితం కాలేదని, క్షేత్రస్థాయిలో ప్రజల జీవన ప్రమాణాలలో వచ్చిన మార్పునకు అద్దం పడుతోందని పేర్కొంది.

ఆహారధాన్యాలతో స్వయం సమృద్ధి సాధించిన భారత్

ఇండో-ఆఫ్రికన్ సీడ్ సమ్మిట్-2025లో మంత్రి తుమ్మల



సాక్షి, హైదరాబాద్: భారత్‌తోపాటు ఆఫ్రికా దేశాలకు వ్యవసాయ రంగమే ప్రధాన ఆదాయవనరుఅని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రెండు దేశాలు కలిసి పనిచేస్తూ అధిక దిగుబడినిచ్చే విత్తనాలను అభివృద్ధి చేయాలన్నారు. హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో గురువారం 'ఇండియా-ఆఫ్రికా సీడ్ సమ్మిట్-2025 'ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఈ సమ్మిట్ భారత్, ఆఫ్రికా దేశాల మధ్య వ్యవసాయరంగంలో సంబంధాలను బలోపేతం చేసే వేదికగా నిలుస్తోందని పేర్కొన్నారు. కేవలం వాణిజ్యంపై కాకుండా, సీడ్ డిప్లొమసీ ద్వారా విశ్వాసాన్ని పెంపొందించడం, శాస్త్ర పరిజ్ఞానం పంచుకోవడం, సుస్థిరమైన వ్యవసాయానికి భవిష్యత్‌లో వారధిగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. తెలంగాణ భారతదేశపు సీడ్ హబ్‌గా మారిందని, దేశ అవసరాల్లో 60% విత్తనాన్ని తెలంగాణ నుంచే సరఫరా చేయడమే కాకుండా, 20కి పైగా దేశాలకు ఎగుమతి చేస్తున్నామని తెలిపారు. 1,000కు పైగా విత్తన కంపెనీలు, ఆధునిక పరిశోధన, నిల్వ సదుపాయాలతోపాటు కఠినమైన నాణ్యత ప్రమాణాలు పాటించడం వల్ల తెలంగాణ విత్తనాలకు గ్లోబల్ గుర్తింపు లభించిందన్నారు.

మందుపాతర పేలి ఇద్దరు జవాన్లకు గాయాలు

ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లాలో ఘటన

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దంతెవాడ జిల్లాలో మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి ఇద్దరు జవాన్లకు తీవ్ర గాయాలయ్యాయి. దంతెవాడ జిల్లాలోని బార్సూర్ ప్రాంతంలోని సత్ధార్-మల్లెవాహీ మార్గంలో సీఆర్‌పీఎఫ్ బలగాలు కూంబింగ్‌తో పాటు మందుపాతరల వెలికితీత కోసం గాలింపు చేపట్టాయి. ఈ క్రమంలో మావోయిస్టులు అమర్చిన ప్రెజర్ బాంబును గమనించని జవాను తొక్కడంతో అతడితోపాటు మరో జవానుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను సహచర జవాన్లు బార్సూర్‌కు, అక్కడి నుంచి జిల్లా ఆస్పత్రికి తరలించారు. గాయపడిన జవాన్ల పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.

16 మంది మావోయిస్టుల లొంగుబాటు

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లాలో గురువారం 16 మంది మావోయిస్టులు జిల్లా పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఈ మేరకు ఎస్పీ ప్రభాత్ కుమార్ స్థానిక క్యాంప్ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. లొంగిపోయిన వారికి తక్షణ సాయం కింద రూ.50 వేల ఆర్థిక సాయం అందజేశామని తెలిపారు.

సాయిరంగ్ స్టేషన్ సమీపంలో నిర్మించిన ఈ వంతెన స్తంభాల ఎత్తు 114 మీటర్లు



మిజోరం రాజధాని ఐజోల్ కు 20 కిలోమీటర్ల దూరంలో నిర్మించిన సాయిరంగ్ రైల్వే స్టేషన్



కొండలను చీలుస్తూ.. లోయలను దాటుతూ..

▶ మొదటి పేజీ తరువాయి

శనివారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ జాతికి అంకితం చేస్తున్నారు. కొత్తగా నిర్మించిన రైలు కారిడార్ నిడివి 51.38 కి.మీ. కానీ, దీని నిర్మాణానికి అయిన వ్యయం రూ.8,071కోట్లు. అంటే కి.మీ.కు రూ.157 కోట్లు అన్నమాట. సాధారణంగా రైల్వే లైన్ల నిర్మాణంలో కి.మీ.కు అయ్యే ఖర్చు రూ.13 కోట్ల నుంచి రూ.15 కోట్ల వరకు ఉంటుంది. కానీ, ఇక్కడ వ్యయం అంతకంటే పది రెట్లు ఎక్కువగా ఉండటం ఓ రికార్డు.

వంతెనలు, సొరంగాలు...

ఈ కారిడార్ నిర్మాణంలో 153 వంతెనలు, 45 సొరంగాలను నిర్మించాల్సి రావటమే భారీ వ్యయానికి కారణం. ఒకదానిని అనుకుని ఒకటిగా ఈ ప్రాంతంలో భారీ కొండలుంటాయి. ఆ కొండలను తొలిస్తే తప్ప రైలు కారిడార్ నిర్మాణం సాధ్యం కాదు. దీంతో 45 కొండలను తొలుస్తూ సొరంగాలు నిర్మించారు. రెండు కొండల మధ్య అగాధంలా లోయలున్నందున, సొరంగాలకు సమాంతరంగా వంతెనలు నిర్మించి దాని మీదుగా ట్రాక్ ఏర్పాటు చేశారు. సొరంగాలలో మూడో దాని నిడివి 1.9 కి.మీ. కావటం విశేషం. అలా మొత్తం సొరంగాల నిడివి 15.88 కి.మీ.గా ఉంది. అంటే మొత్తం రైలు కారిడార్‌లో 31 శాతం నిడివి సొరంగాలతోనే ఉందన్నమాట.

ఇక 153 వంతెనల్లో 55 వంతెనలు అతి భారీవి. వాటిల్లో 97వ నంబర్ వంతెన పొడవు 742 మీటర్లు కాగా, దానికి నిర్మించిన స్తంభాల ఎత్తు 114 మీటర్లు. మరో 88 వంతెనలు కాస్త చిన్నవి. 10 ఆర్‌యూబీలు, ఆర్‌ఓబీలు కూడా ఉన్నాయి. ఇలా మొత్తం వంతెనల నిడివి కలిపితే 11.76 కి.మీ. మొత్తం కారిడార్ నిడివిలో వీటి వాటా 23 శాతం. అంటే 54 శాతం రైల్వే లైను వంతెనలు, సొరంగాలతోనే ఉంటుందన్నమాట.

ఐజోల్‌కు భాగ్యం

- దేశంలోని 7 ఈశాన్య రాష్ట్రాలకు గాను సిక్కింలో రైల్వే లైనే లేదు. ఆరు రాష్ట్రాల్లో పాక్షికంగా ఉన్నప్పటికీ, మిజోరం, మేఘాలయ, మణిపూర్, నాగాలాండ్ రాజధానులకు రైల్వే కనెక్టివిటీ లేదు. ఇంతకాలం తర్వాత మిజోరం రాజధాని ఐజోల్‌కు ఆ భాగ్యం దక్కబోతోంది. మిగతా మూడు రాష్ట్రాల రాజధానులపైనా కసరత్తు జరుగుతోంది.
- ఐజోల్‌కు 20 కి.మీ. దూరంలో ఉన్న సాయిరంగ్ స్టేషన్ నుంచి ఇక నాలుగు రైళ్లు నడవనున్నాయి. ఇందులో రాజధాని ఎక్స్‌ప్రెస్ వారానికి ఒక రోజు ఢిల్లీకి, కోల్‌కతాకు వారంలో మూడు రోజులు నడిచే మరో ఎక్స్‌ప్రెస్, అస్సాం రాజధాని గువాహటికి నిత్యం ఓ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభం కానున్నాయి. సాయిరంగ్ స్టేషన్ నుంచి మయన్మార్ దేశ సరిహద్దు 223 కి.మీ. దూరంలో ఉంటుంది.
- ప్రకృతి రమణీయతకు నెలవైన ఆ ప్రాంతానికి రైలు కనెక్టివిటీతో పర్యాటకుల సంఖ్య భారీగా పెరగనుంది. పరిశ్రమలు కూడా రానున్నాయి. ప్రస్తుతం రోడ్డు మార్గాన సరుకుల రవాణా కూడా అతి కష్టంగా ఉన్నందున, ఆ రాష్ట్రంలో నిత్యావసరాల ధరలు అధికం. ఇప్పుడు రైలు మార్గాన సరుకు రవాణా సులభతరం కానున్నందున ధరలు దిగివచ్చి సామాన్యులకు ఊరట కలిగే అవకాశం ఉంది.

హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ
చీఫ్ ఇంజనీర్ కార్యాలయం
hmda
ఈస్ట్ వింగ్, 7వ అంతస్తు, స్వర్ణజయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట్, హైదరాబాద్ -500038
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
NIT No. HMDA/DEV/CE/25/2025-26, తేది: 08.09.2025
దిగువ పనుల కొరకు చెల్లుబాటుగల నమోదిత కాంట్రాక్టర్ల నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్‌పై టెండర్లు కోరబడుతున్నవి. పనిపేరు: 1) NTR మార్గ్ వద్ద గణేష్ విగ్రహాల నిమజ్జనం కొరకు గేబియన్ స్ట్రక్చర్స్ ఉపయోగిస్తూ రెండు అదనపు ప్లాట్‌ఫారాల నిర్మాణం మరియు ప్రస్తుతమున్న ప్లాట్‌ఫారంను పటిష్టపరుచుట. 2) విద్యుత్ పనులతోపాటు ఇందిరాగాంధీ రోటరీ, PVNR మార్గ్, హైదరాబాద్ దగ్గర శ్రీ మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహ స్థాపన కొరకు పార్క్ అభివృద్ధి మరియు పెడస్టల్ నిర్మాణం. 3) చౌటుప్పల్ మున్సిపాలిటీ, చౌటుప్పల్ (మం), యాదాద్రి-భువనగిరి జిల్లా వద్ద పార్క్ అభివృద్ధి. 4) NTR మార్గ్ దగ్గర FOB కొరకు రోడ్డుకు ఇరువైపులా 2నం.ల ఎలివేటర్ల సరఫరా, స్థాపన మరియు పనిచేయించుట. 5) ఉప్పల్ భగత్ (గ్రా), ఉప్పల్ (మం), మేడ్చల్-మల్కాజ్‌గిరి (జి) వద్ద వివిధ వెనుకబడిన కులాల కమ్యూనిటీల ప్రతిపాదిత లేఔట్‌కు మౌలిక సదుపాయాల వసతులు ఏర్పాటు. 6) హైదరాబాద్ జిల్లా, షేక్‌పేట్ మండలంలో బల్కాపూర్ నాలా వరకు హకీంపేట్ గ్రామం యొక్క W.No.12 లో వరద నీటి కాలువ నిర్మాణం. 7) స్టేట్ సెంట్రల్ లైబ్రరీ, అఫ్జల్‌గంజ్, హైదరాబాద్ వద్ద విద్యుత్ పని ఏర్పాటు. టెండరు కోరుతున్న అథారిటీ: చీఫ్ ఇంజినీర్, HMDA, దాఖలుకు చివరి తేది: 06-10-2025న మ॥ 3.00 గం॥కు, తదుపరి వివరాల కోసం దర్శించండి: https://tender.telangana.gov.in
సం/-చీఫ్ ఇంజినీర్, HMDA
DIPR RO No.7915-PP/CL/Advt/1/2025-26, Dt. 11.09.2025

ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

▶ మొదటి పేజీ తరువాయి

ఆయన కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు విషాదంలో మునిగిపోయారు.

హైదరాబాద్‌లో చదువుతూ ఉద్యమ బాట

మోడెం వెంకటయ్య, మల్లమ్మ దంపతులకు బాలకృష్ణ జన్మించారు. వెంకటయ్యకు పోస్టుమ్యాన్ ఉద్యోగం రావడంతో హైదరాబాద్‌లోని చాదర్‌ఘాట్ ఏరియాకు సుమారు 50 ఏళ్ల కిందటే మకాం మార్చారు. బాలకృష్ణకు ముగ్గురు సోదరులు, ఒక సోదరి ఉన్నారు. 1983లో మావోయిస్టు (పీపుల్స్‌వార్) పార్టీ పట్ల ఆకర్షితుడైన బాలకృష్ణ.. హైదరాబాద్‌లో ఇంజనీరింగ్ విద్యను మధ్యలోనే వదిలేసి పోరుబాట పట్టారు. కొంతకాలం రాడికల్ విద్యార్థి సంఘం (ఆర్ఎస్‌యూ) జంట నగరాల బాధ్యతలు నిర్వర్తించిన తర్వాత అజ్ఞాతంలోకి వెళ్లారు. దళ సభ్యుడి నుంచి కేంద్ర కమిటీ సభ్యుడి వరకు ఎదిగారు.

1993లో అరెస్టు.. 1999 వరకు జైల్లో..

పీపుల్స్‌వార్ పార్టీ పనిలో భాగంగా అడవినుంచి బయటకు వచ్చిన బాలకృష్ణను అప్పటి యాంటీ నక్సల్స్ స్క్వాడ్ (ఏఎన్ఎస్) పోలీసులు 1993లో అరెస్టు చేశారు. పోలీసు డీఐజీ కేఎస్ వ్యాస్ హత్య, ఎమ్మెల్యే కిడ్నాప్‌లతో పాటు బెంగళూరు ఆయుధాల స్వాధీనం, కుట్ర కేసులలో ఆయన సుమారు ఆరేళ్లపాటు ముషీరాబాద్ జైల్లోనే ఉన్నారు. 1999లో బెయిల్‌పై విడుదలైన ఐదు రోజులకే కుటుంబసభ్యులు ఎంత బతిమిలాడినా వినకుండా తిరిగి అడవిబాట పట్టారు. సుమారు 26 సంవత్సరాలు ఏవోబీలో వివిధ కేడర్‌లలో పని చేశారు.ఈ క్రమంలో ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల పోలీసులకు మోస్ట్‌వాంటెడ్‌గా మారారు. ఆయనపై మూడు రాష్ట్రాలతో పాటు ఎన్ఐఏ ప్రకటించిన దానితో కలిపి రూ.2 కోట్ల రివార్డు ఉన్నట్లు సమాచారం. ఆపరేషన్ కగార్ పేరిట గత కొంతకాలంగా ప్రత్యేక పోలీసు బలగాలు అడవులను జల్లెడ పడుతున్న సంగతి తెలిసిందే. ఉద్యమ నిర్మాణంలో భాగంగా ఇతర నాయకులు, దళాలతో కలిసి బాలకృష్ణ ఛత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దులో సంచరిస్తున్నట్లు కేంద్ర బలగాల నుంచి సమాచారం అందింది. ఈ మేరకు కూంబింగ్ చేపట్టగా ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది.



ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన అల్వాల్ చంద్రహాస్ అలియాస్ పాండు

3 ప్రాజెక్టులకు రూ.550 కోట్లు!

కేంద్ర సహాయం కోసం రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు..

ఇన్వెస్ట్‌మెంట్ క్లియరెన్స్ కోసం కసరత్తు

సాక్షి, హైదరాబాద్: ప్రధానమంత్రి క్రిషి సించాయి యోజన (పీఎంకేఎస్‌వై) కింద రాష్ట్రంలోని మరో మూడు సాగునీటి ప్రాజెక్టులకు రూ.550 కోట్ల కేంద్ర సహాయం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించింది. సత్వర సాగునీటి ప్రయోజనాల పథకం(ఏఐబీపీ) కింద చిన్న కాళేశ్వరం (ముక్తేశ్వర), మోడికుంటవాగు, చనాకా-కొరాటా ప్రాజెక్టులను ప్రతిపాదించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఇందులో భాగంగా ఈ ప్రాజెక్టులకు ఇన్వెస్ట్‌మెంట్ క్లియరెన్స్ కోసం సీడబ్ల్యూసీకి ఇటీవల దరఖాస్తు చేసింది. ఈ ప్రాజెక్టుల డీపీఆర్‌లను పరిశీలించాక ఇన్వెస్ట్‌మెంట్ క్లియరెన్స్‌పై కేంద్ర జలవనరుల శాఖకి సీడబ్ల్యూసీ సిఫారసు చేయనుంది. కేంద్ర సహాయం పొందాలంటే సీడబ్ల్యూసీ నుంచి క్లియరెన్స్ తప్పనిసరి.

- చిన్న కాళేశ్వరం ప్రాజెక్టును రూ.632 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టగా, ఏఐబీపీ కింద రూ.171.22 కోట్లు ఇవ్వాలని రాష్ట్రం కోరింది. ఈ ప్రాజెక్టుతో కరీంనగర్ జిల్లాలోని కరువు, వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లోని 18,211 హెక్టార్ల ఆయకట్టు సాగులోకి రానుందని తెలిపింది.
- మోడికుంట వాగు ప్రాజెక్టును రూ.527.66 కోట్ల అంచనాలతో చేపట్టగా, రూ.276 కోట్ల ఆర్థిక సహాయాన్ని రాష్ట్రం కోరింది. ప్రాజెక్టు కింద ఆదివాసీ గిరిజన ప్రాంతాల్లో 5500 హెక్టార్ల ఆయకట్టు సాగులోకి రానుంది.
- చనాకా-కొరాటా ప్రాజెక్టును రూ.796 కోట్ల అంచనాతో చేపట్టగా, రూ.103 కోట్ల సహాయాన్ని అందించాలని రాష్ట్రం కోరింది. ఈ ప్రాజెక్టుతో ఆదివాసీ గిరిజన ప్రాంతాల్లో 5466 హెక్టార్ల ఆయకట్టుకు సాగునీరు అందనుంది.
- సాగునీటి సదుపాయాల అభివృద్ధి కోసం పీఎంకేఎస్‌వై-ఏఐబీపీ పథకాన్ని కేంద్రం 2015-16లో ప్రారంభించగా, ఇప్పటి వరకు రాష్ట్రంలోని 11 ప్రాజెక్టులకు కేంద్రం సహాయం అందించింది. ఇందులో 4 భారీ, 7 మధ్య తరహా ప్రాజెక్టులున్నాయి.

NMDC Limited
(A Govt. of India Enterprise)
'Khanji Bhavan', 10-3-311/A, Castle Hills, Masab Tank, Hyderabad-500028. CIN : L13100TG1958GOI001674
WORKS DIVISION CONTRACTS DEPARTMENT
E-Tender Notice (Open Tender Enquiry for Domestic Bidding)
Tender Enquiry No: HO(Contracts)/NMDC/ICCC/2025/276 Dated 11/09/2025
NMDC Limited, A "NAVARATNA" Public Sector Company under Ministry of Steel, Govt. of India, invites online bids through **MSTC Portal** from experienced domestic bidders for the work of Establishment of Integrated Control and Command Centre (ICCC) and Implementation of CCTV Surveillance System along with PA System at HO, Bacheli, Kirandul & Donimalai Complexes on Design, Build, Finance, Operate and Transfer (DBFOT) basis for the period of 5 years.
The detailed NIT and Bid documents can be viewed and / or downloaded **from 11/09/2025 to 10/10/2025 from following website links;**
1.NMDC website **https://nmdcportals.nmdc.co.in/nmdctender**
2.Central Public Procurement portal **https://www.eprocure.gov.in/epublish/app** and search tender through tender enquiry number
3.MSTC Portal **https://www.mstcecommerce.com/eprocn/**
For accessing the bid document from MSTC portal, bidders to visit MSTC website (use Microsoft Edge browser for compatibility) and search Tender Event No. **NMDC/Head Office/Contract/1/25-26/ET/346.**
The bidders are requested to submit their bids online through MSTC Portal. The details of submission of bid through online are given in NIT. The Bidders on regular basis are required to visit the NMDC's website/ CPP Portal/ MSTC Portal for corrigendum, if any, at a future date.
For further clarification, the following can be contacted – Executive Director (Works), NMDC Limited, Hyderabad, Fax No. 040 – 2353 4746, Telephone No.040 – 23532800, email: contracts@nmdc.co.in.
Executive Director (Works)

NMDC Limited
(A Government of India Enterprise)
'Khanji Bhavan', 10-3-311/A, Castle Hills, Masab Tank, Hyderabad-500028
Corporate Identity Number (CIN) – L13100TG1958GOI001674
CONTRACTS DEPARTMENT
E-Tender Notice (Open Tender Enquiry for Domestic Bidding)
Tender Enquiry No: HO(Contracts)/NMDC/UMLMSS/2025/275, Dated: 11.09.2025
NMDC Limited, A "NAVARATNA" Public Sector Company under Ministry of Steel, Govt. of India, invites **online bids** through **MSTC Portal** from experienced domestic bidders for the work of Selection of System Integrator (SI) for Implementation of Unified Mine Logistics Management and Surveillance System (UMLMSS) at Donimalai Complex (DIOM, KIOM & Pellet Plant) for 5 years on Design, Build, Finance, Operate and Transfer (DBFOT) Basis.
The detailed NIT and Bid documents can be viewed and / or downloaded **from 11.09.2025 to 10.10.2025 from following website links;**
1. NMDC website – **https://nmdcportals.nmdc.co.in/nmdctender**
2. Central Public Procurement portal – **https://www.eprocure.gov.in/epublish/app** and search tender through tender enquiry number
3. MSTC Portal - portal **https://www.mstcecommerce.com/eprocn/**
For accessing the bid document from MSTC portal, bidders to visit MSTC website (use Microsoft Edge browser for compatibility) and search Tender Event No. **NMDC/Head Office/Contract/22/25-26/ET/345.**
The bidders are requested to submit their bids online through MSTC Portal. The details of submission of bid through online are given in NIT. The Bidders on regular basis are required to visit the NMDC's website/CPP Portal/ MSTC Portal for corrigendum, if any, at a future date.
For further clarification, the following can be contacted –
Executive Director (Works), NMDC Limited, Hyderabad, Fax No. 040 – 2353 4746, Telephone No. 040 – 23532800, email: **contracts@nmdc.co.in.**
For and on behalf of NMDC Ltd
Executive Director (Works)

పెండింగ్ రైల్వే ప్రాజెక్టుల పూర్తికి సంపూర్ణ సహకారం

▶ మొదటి పేజీ తరువాయి

సహాయ సహకారాలు అందిస్తుంది. అవసరమైన నిధులను సమకూర్చటంతోపాటు భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రాజెక్టుల అలైన్‌మెంట్లు ఉండాలి. దూరాభారం తగ్గించి, అంచనా ఖర్చును కూడా తగ్గించుకోవాలి.

- రాష్ట్ర పునర్విభజన చట్టంలోని హామీ ప్రకారం హైదరాబాద్ నుంచి అమరావతికి ర్యాపిడ్ రైల్ అండ్ రోడ్డు కనెక్టివిటీ ప్రాజెక్టును కేంద్రం అమలు చేయాల్సి ఉంది.
- రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్న ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందర్ వరకు 12 లేన్ల గ్రీన్‌ఫీల్డ్ హైవే ఏర్పాటు చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశాం. అందుకు సంబంధించి 300 కిలోమీటర్ల అలైన్‌మెంట్ ప్రతిపాదనలను కూడా రాష్ట్ర ప్రభుత్వం తయారు చేసింది. దానికి అనుగుణంగా రైల్వేలైన్ ఏర్పాటు చేయాలి. రైల్వే విభాగ పరిశీలనలో ఉన్న అన్‌లైన్‌మెంట్‌తోపాటు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేసిన అలైన్‌మెంట్‌ను పరిశీలించి భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ముందుకు వెళ్లాలి. హైవే వెంట రైలుమార్గం ఉండాలి, హైవేకు ఇరువైపులా కిలోమీటరన్నర దూరం వరకు ఇండస్ట్రియల్ కారిడార్‌ను విస్తరించాలనే ప్రతిపాదనలున్నాయి.
- కొత్తగా అభివృద్ధి చేస్తున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్రతిపాదనలకు అనుగుణంగా హైదరాబాద్-చెన్నై, హైదరాబాద్-బెంగుళూరు హైస్పీడ్ రైలు ప్రాజెక్టుల సర్వే, అలైన్‌మెంట్ ప్రతిపాదనలను మరోసారి పరిశీలించాలి. ప్రయాణికులకు వేగవంతమైన రవాణా సదుపాయాలు అందించటంతోపాటు కొత్తగా వేసే రైలు మార్గాలన్నీ ఆయా ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధికి ఉపయోగపడేలా ఉండాలి. విదేశాల తరహాలో రైలు, రోడ్డు, పోర్ట్ కనెక్టివిటీని అధునాతనంగా అభివృద్ధి చేయాలి.
- వికారాబాద్- కృష్ణా కొత్త రైల్వే లైన్ పనులను వీలైనంత త్వరగా చేపట్టాలి. గద్వాల-డోర్నకల్ రైల్వే లైన్ పనుల డీపీఆర్ పూర్తి చేసి వేగంగా పనులు చేపట్టాలి. వరంగల్ లోనూ రైల్వే లైన్లను అభివృద్ధి చేయాలి. భూపాలపల్లి నుంచి వరంగల్ కొత్త మార్గాన్ని పరిశీలించాలి. కాజీపేట జంక్షన్‌లో ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాలి. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా హైదరాబాద్‌తోపాటు వరంగల్‌ను అభివృద్ధి చేయాలి. అందుకు అనుగుణంగా రైల్వే ప్రాజెక్టులను చేపట్టాలి'అని ముఖ్యమంత్రి రైల్వే అధికారులకు సూచించారు.

ఆర్ఆర్ఆర్ చుట్టూరా రీజనల్ రింగ్ రైల్

- హైదరాబాద్ చుట్టూ రీజనల్ రింగ్ రైల్ ఆవశ్యకతను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైల్వే అధికారులకు వివరించారు. దాదాపు 362 కిలోమీటర్ల మేరకు రీజనల్ రింగ్ రోడ్డు వెంట రింగ్ రైలు ఏర్పాటు చేస్తే.. హైదరాబాద్ మహానగర భవిష్యత్ స్వరూపం మారిపోతుందన్నారు. వీలైనంత తొందరగా ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని రైల్వే అధికారులకు సీఎం సూచించారు. తెలంగాణ ఇండస్ట్రియల్ సెక్టార్ కోసం ప్రత్యేక రైల్వేలైన్ ఉండేలా ఈ కనెక్టివిటీ ఉండాలని సీఎం అభిప్రాయపడ్డారు. ఈ సమావేశానికి వరంగల్ ఎంపీ కడియం కావ్య, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఆర్అండ్‌బీ స్పెషల్ సెక్రెటరీ వికాస్‌రాజ్, సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీనివాసరాజు, ఆర్థికశాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా తదితరులు పాల్గొన్నారు.

राष्ट्रीय त्वचा रोग यूनानी चिकित्सा अनुसंधान संस्थान
NATIONAL RESEARCH INSTITUTE OF UNANI MEDICINE FOR SKIN DISORDERS
(Formerly Central Research Institute of Unani Medicine)
Under Central Council for Research in Unani Medicine, Ministry of AYUSH, Government of India
AG Colony Road, Opposite E.S.I. Hospital, Erragadda, Hyderabad-500 038.
निविदा सूचना / TENDER NOTICE-01/2025
वस्तु एवं सेवा कर (जी.एस.टी) द्वारा पंजीकृत प्रतिष्ठित आपूर्तिकर्ताओं और वितरकों से यूनानी कच्ची दवाएं (औषधीय जड़ी बूटियाँ, खनिज पदार्थ, खाद्य तेल इत्यादि) की खरीदारी के लिए दो बोली प्रणाली में खरीदने हेतु मुहर बंद निविदाओं को आमंत्रित किया जाता है। निविदा दस्तावेज में यूनानी क्रूड/कच्ची दवाएं की विस्तृत आवश्यकता का उल्लेख किया गया है। "Central Research Institute of Unani Medicine" के पक्ष में ₹500/- (पांच सौ रुपये मात्र) निविदा दस्तावेज का मूल्य (अप्रतिदेय) डिमांड ड्राफ्ट के रूप में जमा करके अधोहस्ताक्षरी के कार्यालय से निर्धारित तिथि तक निविदा दस्तावेज प्राप्त किया जा सकता है। https://eprocure.gov.in/epublish/app एवं www.nriumsd.in / https://ccrum.res.in/ वेबसाईट से भी निविदा दस्तावेज डाउनलोड किया जा सकता है। निविदा दस्तावेज निविदा शुल्क और बयाना राशी (ई.एम.डी) के साथ जमा करना होगा। ई.एम.डी के बिना निविदा को सरसरी तौर पर खारिज कर दिया जाएगा।
Sealed tenders are invited for purchase of Unani Raw/Crude drugs (medicinal herbs, minerals, edible oils etc) in two bid system from reputed suppliers duly registered with Goods and Services Tax(GST). Detailed requirement are mentioned in the tender document. Tender document can be obtained upto the scheduled date from the office of the undersigned by submitting non-refundable Demand Draft of Rs.500/- (Rupees Five Hundred only) in favour of "Central Research Institute of Unani Medicine" as cost of the tender document. The Tender document can also be downloaded from https://eprocure.gov.in/epublish/app/ www.nriumsd.in/ https://ccrum.res.in website and tender fee and EMD should be submitted along with the tender. Tender bids without EMD will be summarily rejected.

निविदा के विवरण Details of Tender	निविदा दस्तावेज का मूल्य Cost of Tender Document	(ई एम डी) बयाना जमा (₹) Earnest Money (EMD) (Rs.)	निविदा दस्तावेज की खरीद के लिए अंतिम तिथि Last Date for Purchase of Tender Document	निविदा प्रस्तुतीकरण की अंतिम तिथि Last date of Submission of Tender	निविदा खोलने की तारीख (भाग-1) Date of Opening of Tender (Part-1 Technical Bid)
Purchase of Crude/raw Drugs as per quantity mentioned in the tender document	Rs. 500	3% (Three percent)	01.10.2025 upto 16:00 hrs	03.10.2025 before 11:00 hrs	03.10.2025 11:30 hrs

स्थान / Place : हैदराबाद / Hyderabad
तिथि / Date : 11.09.2025
Director Incharge
NRIUMSD, Hyderabad



వరి.. ఎదిగితే ఒట్టు!

సిద్దిపేట జిల్లా దుబ్బాకలో రైతు ఇస్తారిగల్ల ఆశోక్ 12 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వరి సాగు చేస్తున్నాడు. ఆగస్టు 8న వరి నాట్లు వేయగా అప్పటి నుంచి యూరియా లభించక పోవడంతో చల్లలేదు. దీంతో ఈ సమయానికి ఏపుగా పెరగాల్సిన వరి.. నాట్లు వేసినప్పుడు 8 అంగుళాల ఎత్తు ఉండగా.. నెల రోజుల తర్వాత కూడా అదే విధంగా ఉంది. ఎదుగు లేదు.. బొదుగు లేదు. యూరియా కోసం 10 సార్లు క్యూలో నిల్చున్నా దొరకలేదు. దీంతో రూ. 950 చొప్పున 13 అమ్మోనియా బస్తాలు కొని చల్లినట్టు చెప్పాడు. ఇప్పటికే రూ.2 లక్షలకు పైగా పెట్టుబడి పెట్టానని.. మొత్తం నష్టపోయే పరిస్థితి ఉందని వాపోతున్నాడు.

పత్తి చేను దున్నేస్తా..

వరంగల్ జిల్లా నెక్కొండ మండలం అలంకానిపేటకు చెందిన రైతు ఇడంపాక స్వామికి మూడెకరాల వ్యవసాయ భూమి ఉంది. రెండు ఎకరాల్లో పత్తి, ఒక ఎకరంలో పసుపు పంట సాగు చేస్తున్నాడు. పంట ఎదుగుదల సమయంలో సరిపడా యూరియా దొరకడం లేదు. యూరియా కోసం నెక్కొండ.. రెడ్లవాడ పీఏసీఎస్‌ల వద్ద వెళ్లినా దొరకలేదు. మరో వారం రోజులు చూసి పత్తి చేను దున్ని మొక్కజొన్న సాగు చేస్తానని అంటున్నాడు. ఇప్పటివరకు ఎకరా పత్తికి రూ.20 వేల చొప్పున చేసిన రూ.40 వేలు ఖర్చు వృథా అయినట్టేనని వాపోతున్నాడు.



ఎంతకీ ఎదగదు!

వానాకాలం పంటలపై యూరియా కొరత ప్రభావం

సాక్షి ప్రతినిధి, వరంగల్/నెట్‌వర్క్

రాష్ట్రంలో నెలకొన్న యూరియా కొరత పర్యవసానాలు తీవ్రరూపం దాలుస్తున్నాయి. వానాకాలంలో పంటలు వేసిన మెజారిటీ రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సకాలంలో యూరియా అందకపోవడంతో మొక్కజొన్న కంకులు ఎదగడం లేదు. పత్తి చేలల్లో పూత కన్పించడం లేదు. వరి ఎర్రబారిపోతోంది. ఇదే పరిస్థితి కొనసాగితే పంటలకు తీవ్ర నష్టం తప్పదని, పెట్టుబడి సైతం దక్కకుండా పోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటల ఎదుగుదల సమయంలో యూరియా కొరత దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుందంటూ వాపోతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు కూడా పంటల ఎదుగుదల నుంచి దిగుబడి వరకు అన్నింటిపై యూరియా కొరత ప్రభావం ఉంటుందని చెబుతుండటం గమనార్హం.



సిద్దిపేట జిల్లా మిరుదొడ్డిలో మల్లేశం అనే రైతు మూడు ఎకరాల్లో వరి పంటను సాగు చేస్తున్నారు. ఎన్ని మార్లు లైన్‌లో నిలబడినా యూరియా దొరకలేదు. దీనితో అర ఎకరం వరకు వరి పంటను వదిలేశాడు. ▲

అన్ని జిల్లాల్లో ఇదే పరిస్థితి

వానాకాలం ఆరంభం నుంచే మొదలైన యూరియా కొరత.. ఇప్పుడు ప్రధాన పంటలైన పత్తి, వరి, మొక్కజొన్నలకు తీవ్ర నష్టం కలిగిస్తోంది. మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా 'సాక్షి నెట్‌వర్క్' జరిపిన క్షేత్రస్థాయి పరిశీలనలో ఈ అంశాలు వెలుగుచూశాయి. వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, కరీంనగర్, పెద్దపల్లి, ఖమ్మం, కామారెడ్డి, నల్లగొండ, సూర్యాపేట, సిద్దిపేట, మెదక్, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ తదితర జిల్లాల్లో రైతులు ఎదుగూ బొదుగు లేని పంటలను చూసి గుండెలు బాదుకుంటున్నారు. ఆకుపచ్చగా ఉండాల్సిన పంటలు ఎర్రబారి, పసుపుపచ్చగా కన్పిస్తున్నాయి. యూరియా సరైన సమయంలో అంది ఉంటే.. పంటలు పచ్చగా ఉండి ఏపుగా పెరిగేవని రైతులు అంటున్నారు. కానీ సకాలంలో వేయక పోవడంతో వరి, పత్తి పంటలు దెబ్బతింటున్నాయని, వరి పైరులో ఆశించిన స్థాయిలో ఎదుగుదల లేదని, పచ్చదనం కూడా కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల మున్ముందు చీడపీడలు సైతం ఎక్కువగా సోకే ప్రమాదం ఉందని రైతులతో పాటు అధికారులు చెబుతున్నారు.



యూరియా సకాలంలో అందక నల్లగొండ జిల్లా గిరకాబాయిగూడెంలో ఎదుగుదల లేని రైతు ముక్తేశ్‌కు చెందిన వరిపంట

సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ నల్లగొండ

దిగుబడిపై తీవ్ర ప్రభావం

తొలి దశలో యూరియా కొరత వల్ల వరి సాధారణ దిగుబడితో పోల్చితే 25–35 శాతం తగ్గే అవకాశం ఉంటుందని అంచనా. కాగా ఈ కొరత ఇలాగే కొనసాగితే మరో 10 శాతం వరకు దిగుబడి తగ్గే అవకాశం ఉంటుందనే ఆందోళన రైతుల్లో వ్యక్తం అవుతోంది. 'వానాకాలంలో సీజన్‌లో వరికి సాధారణంగా మూడు దఫాల్లో యూరియా చల్లుతాం.. ఇప్పటికి ఒక్కసారే వేశాం. కొద్ది మంది ఇప్పుడిప్పుడే రెండుసార్లు వేస్తున్నారు. కానీ మెజార్టీగా రైతులకు యూరియా పాట్లు తప్పడం లేదు..' అని వరంగల్ జిల్లా ఎల్కతుర్తి మండలం పెంచికల పేటకు చెందిన రైతు యాళ్ల సుధాకర్‌రెడ్డి చెప్పారు. వరినాట్లు వేసిన 20–25 రోజుల్లో ఒకసారి, 45 రోజుల్లో రెండోసారి, 65–70 రోజుల్లో మూడోసారి యూరియా చల్లాల్సి ఉండగా.. గత రెండు మాసాలుగా యూరియాకు తీవ్ర కొరత నెలకొందని రైతులు చెబుతున్నారు.

మూడు పంటలకు ఒక్క బస్తా దొరికింది

నాకు నాలుగు ఎకరాల పొలం ఉంది. ఒక ఎకరంలో వరి, ఒక ఎకరంలో పత్తి, మరో ఎకరంలో మిరప వేశా. వీటికి అవసరమైన యూరియా కోసం 15 రోజుల పాటు కాళ్లరిగేలా తిరిగా. కేవలం ఒకే ఒక బస్తా యూరియా దొరికింది. దీంతో వరి పంట ఎదుగుదల లేక గిడస బారింది. మిరప పంట వేసి 40 రోజులైంది. ఇప్పటికి కనీసం రెండు అడుగుల ఎత్తు ఎదగాలి. కానీ ఒక్క అడుగు కూడా ఎదగలేదు.

- పులిచింత మల్లేష్, రైతు, దేవబండ గ్రామం, అయిజ, జోగులాంబ గద్వాల



పంటలకు అన్ని విధాలా మేలు చేస్తుంది



యూరియా అనేది పంటలకు నత్రజనిని అందించే ఎరువు. అన్ని రకాల నేలలకు, వివిధ పంటలకు ఇది అనుకూలంగా ఉంటుంది. త్వరగా నీటిలో కరిగిపోతుంది కాబట్టి మొక్కలకు నత్రజని వేగంగా అందుతుంది. దీనివల్ల ఎక్కువ సంఖ్యలో పిలకలు ఏర్పడతాయి. మొక్కలు, కాండాలు బలంగా, వేగంగా పెరుగుతాయి. తద్వారా పంటలు దృఢంగా ఉంటాయి. అలాగే మొక్కలు ఆకుపచ్చగా మారేందుకు, వాటి ఎదుగుదలకు యూరియా ఉపకరిస్తుంది. వెన్నులు బాగా రావడానికి సహాయ పడుతుంది. వీటన్నిటి వల్ల అధిక దిగుబడి వస్తుంది. అందుకే రైతులు ఎక్కువగా యూరియా వినియోగానికి మొగ్గు చూపుతారు.

- డాక్టర్ అనిల్‌కుమార్, భువనగిరి ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త

ఏ రోజు యూరియా ఆ రోజుకే!

పొద్దు పొడవక ముందే సొసైటీలు, షాపుల ముందు రైతుల బారులు

- తెరిచిన కొద్దిసేపట్లోనే ఖాళీ..మరుసటి రోజు మళ్లీ క్యూలు
- కేంద్రం నుంచి రోజూ 10 వేల మెట్రిక్ టన్నుల లోపే సరఫరా
- ఈ సీజన్‌లో ఇప్పటివరకు 6.87 ఎల్‌ఎంటీల యూరియా సరఫరా
- ఇంకా 3 ఎల్‌ఎంటీలు అవసరమంటున్న వ్యవసాయ శాఖ

సాక్షి, హైదరాబాద్: పొద్దు పొడవక ముందే లేవడం..ఆధార్ కార్డు పట్టుకొని సొసైటీ (పీఏసీఎస్) కార్యాలయానికి వెళ్లడం..క్యూలో చెప్పులో మరొకటో పెట్టి కార్యాలయం ఆవరణలోనే ఎదురు చూడడం...పొద్దెక్కిన తర్వాత యూరియా బస్తాల లారీ వస్తే చచ్చీచెడి ఒక బస్తా దక్కించుకుని పోవడం. గత కొద్ది రోజులుగా తెలంగాణ పల్లెల్లోని అన్ని స్థాయిల రైతులు ఎదుర్కొంటున్న పరిస్థితి ఇది. యూరియా లభ్యతను బట్టి ఆయా రాష్ట్రాలకు కేంద్రం కోటా లెక్కన యూరియా పంపిస్తోంది. రోజు లేదా రోజు విడిచి రోజు 10 వేల మెట్రిక్ టన్నుల లోపు యూరియాను రైల్వే వ్యాగన్ల ద్వారా చేరస్తోంది. ఇలా ఈ నెలలో గురువారం నాటికి 82 వేల మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి వచ్చింది. ఎప్పటికప్పుడు వస్తున్న యూరియాలో సగం మార్క్‌ఫెడ్ ద్వారా సొసైటీలకు చేరుతుండగా, మిగతా సగం 12 వేల ప్రైవేటు ఏజెన్సీలకు చేరుతోంది. వచ్చిన యూరియా వచ్చినట్టే అయిపోతోంది. సొసైటీలు, దుకాణాల వద్ద బారులు తీరుతున్న రైతులు అందినకాడికి పట్టుకుపోతున్నారు. తెల్లవారగానే మళ్లీ చెప్పుల లైన్లు, రైతుల ఆందోళనలు అన్నట్టుగా పరిస్థితి ఉంది.

10 ఎల్‌ఎంటీలకు ప్రతిపాదనలు

రాష్ట్రంలో ఈ సీజన్‌లో 10 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్‌ఎంటీ) యూరియా అవసరం ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసి ప్రతిపాదనలు పంపింది. అయితే గత సంవత్సరం వినియోగించగా మిగిలిన 1.92 ఎల్‌ఎంటీకి అదనంగా మరో 7.99 ఎల్‌ఎంటీని కలిపి 9.91 ఎల్‌ఎంటీ కేటాయిస్తూ కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అయితే ఈ నెలాఖరుతో వానాకాలం సీజన్ పూర్తవుతుండగా, ఇప్పటివరకు కేవలం 6.87 ఎల్‌ఎంటీ యూరియా మాత్రమే పంపించింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి పెరిగిన ఒత్తిడి నేపథ్యంలో గత నెల నుంచి యూరియా సరఫరాలో వేగం కొంత పెరిగింది. అయితే ఇంకా 3 ఎల్‌ఎంటీ యూరియా అవసరం కాగా, రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఒకేసారి 2 ఎల్‌ఎంటీలు అయినా పంపించాలని రాష్ట్రం చేస్తున్న విజ్ఞప్తులను కేంద్రం పట్టించుకోవడం లేదు.

స్వల్పంగానే నిల్వ

గురువారం ఉదయం రాష్ట్రంలోని మార్క్‌ఫెడ్ గోడౌన్‌లు, సొసైటీలు, డీలర్ల వద్ద గల మొత్తం యూరియా ఓపెనింగ్ బ్యాలెన్స్ కేవలం 33 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే. ఇందులో డీలర్ల వద్ద 7 వేల మెట్రిక్ టన్నులు ఉంటే, సొసైటీల వద్ద 9 వేల మెట్రిక్ టన్నులు ఉంది. ఉదయం 9 గంటల నుంచి దుకాణాలు, సొసైటీలు తెరిచిన వెంటనే చాలా జిల్లాల్లోని సొసైటీలు, డీలర్ల వద్ద నో స్టాక్ బోర్డులు వెలిశాయి. ఇక మార్క్‌ఫెడ్ వద్ద ఉన్న 17 వేల మెట్రిక్ టన్నుల యూరియాను కూడా అత్యవసర పరిస్థితులను బట్టి సరఫరా చేసినట్లు తెలిసింది. కాగా గురువారం సాయంత్రానికి మార్క్‌ఫెడ్ వద్ద మరో 10 వేల టన్నులు మాత్రమే నిల్వ ఉన్నట్లు సమాచారం. శుక్రవారం రైల్వే వ్యాగన్ల ద్వారా మళ్లీ యూరియా వస్తేనే రైతులకు అందించే పరిస్థితి ఉంది.

ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో యూరియా మరింత ఆలస్యం

కొనసాగుతున్న మరమ్మతులు..ఇంకా ప్లాంట్‌కు చేరని యంత్ర సామగ్రి

ఫెర్టిలైజర్‌సిటీ (రామగుండం): పెద్దపల్లి జిల్లాలోని రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్ లిమిటెడ్ కర్మాగారం (ఆర్‌ఎఫ్‌సీఎల్)లో మరమ్మతు పనులు ఇంకా కొనసాగుతున్నాయి. ప్లాంట్‌లో రోజుకు 3,850 మెట్రిక్ టన్నుల యూరియా, 2,200 మెట్రిక్ టన్నుల అమ్మోనియా ఉత్పత్తి చేస్తారు. ఈ ఏడాది మే 4న ప్లాంట్ వార్షిక మరమ్మతుల దృష్ట్యా కర్మాగారాన్ని షట్‌డౌన్ చేశారు. అనంతరం జూన్ 16న ఉత్పత్తి ప్రారంభించారు. హెచ్‌టీఆర్ మార్చడంతో ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యంలో 70 శాతం మేర యూరియా ఉత్పత్తి జరిగింది. యూరియా డిమాండ్ అధికంగా ఉండడంతో ఉన్నతాధికారుల ఒత్తిడి మేరకు ఉత్పత్తి పెంచేందుకు అధికారులు ప్రయత్నం చేశారు. దీంతో కర్మాగారంలోని అమ్మోనియా పైప్‌లైన్ లీక్ కావడంతో జూలై 16న రెండోసారి ప్లాంట్ షట్‌డౌన్ చేశారు. మరమ్మతు అనంతరం ఆగస్టు 4న ఉత్పత్తి ప్రారంభం కాగా, ఆగస్టు 14న సెకండ్ షిఫ్ట్‌లో అమ్మోనియా కన్వర్టర్ లీకేజీతో మూడోసారి షట్‌డౌన్ చేశారు. మరమ్మతుల నిమిత్తం ప్లాంట్ సామగ్రిని ముంబైకి తరలించారు.అది ఇంకా కర్మాగారానికి చేరుకోకపోవడంతో యూరియా ఉత్పత్తి ప్రారంభానికి మరింత సమయం పట్టే అవకాశముంది.



కొనసాగుతున్న ఆర్‌ఎఫ్‌సీఎల్ హెచ్‌టీఆర్ మరమ్మతు పనులు



సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లిలో పీఏసీఎస్ ఎదుట హైవేపై యూరియా కోసం రాస్తారోకో చేస్తున్న రైతులు



సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సీతారాంపురం పీఏసీఎస్ వద్ద క్యూ లైన్లో నిల్చున్న రైతులు



కేసముద్రంలో యూరియా లోడ్ లారీని నడుపుతున్న కానిస్టేబుల్ ఎండీ అలీమ్

బస్తా కోసం భారంగా..

కామారెడ్డి టౌన్ /కామేపల్లి/అర్వపల్లి/దేవరకద్ర /మఠంపల్లి/కేసముద్రం/ఖానాపురం:యూరియా కోసం రైతుల ఆందోళనలు రోజురోజుకూ తీవ్రతరం అవుతున్నాయి. టోకెన్ల కోసం, యూరియా లారీల కోసం ఎదురుచూపులు నిత్యకృత్యం అయ్యాయి.

యూరియా కోసం గంటల తరబడి ఎదురుచూస్తున్న రైతులు

- టోకెన్ల కోసం మహిళా రైతుల తోపులాట..ఒకరికి గాయాలు
- మఠంపల్లిలో పీఏసీఎస్ డైరెక్టర్‌ల రాజీనామా..
- రైతుల కోసం యూరియా లారీ నడిపిన కానిస్టేబుల్
- ఎక్కువ మాట్లాడితే కేసులు పెడతామంటూ ఏఈఓలు బెదిరించారన్న రైతులు

➤ కామారెడ్డి జిల్లా కేంద్రంలోని గాంధీ గంజ్‌లోని పంపిణీ కేంద్రం వద్ద యూరియా కోసం క్యూ లైన్‌లో నిలుచున్న రైతులు ఒక్కసారిగా సిరిసిల్ల రోడ్‌లో రోడ్డుపై ధర్నాకు దిగారు. ప్రభుత్వానికి, సీఎంకు, అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

➤ ఖమ్మం జిల్లా కామేపల్లి రైతు వేదికలో కూపన్లు ఇస్తున్నారని తెలిసి రైతులు వెళ్లారు. వారం రోజులుగా తిరుగుతుంటే ఎందుకు ఇవ్వడం లేదని రైతులు ప్రశ్నించగా జాస్తిపల్లి ఏఈఓ రవికుమార్, కామేపల్లి ఏఈఓ శ్రీకన్య తమపై ఆగ్రహం వ్యక్తం చేశారని రైతులు వాపోయారు. అంతేకాక ఇది తమ ఆఫీస్ అని ఎక్కువ మాట్లాడితే కేసు పెడతామని బెదిరించారన్నారు.

➤ సూర్యాపేట జిల్లా అర్వపల్లి పీఏసీఎస్ వద్ద రైతులు యూరియా కోసం తెల్లవారుజాము నుంచే బారులు తీరారు. చెప్పులు క్యూలైన్‌లో పెట్టి మధ్యాహ్నం వరకు పడిగాపులు కాశారు. యూరియా రాకపోవడంతో ఆగ్రహించిన రైతులు పీఏసీఎస్ ఎదుట హైవేపై రాస్తారోకో నిర్వహించారు.

➤ మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర పీఏసీఎస్ కేంద్రం వద్ద టోకెన్లు ఉన్న రైతులకు యూరియా పంపిణీ చేస్తుండగా, టోకెన్లు లేని రైతులు పెద్ద ఎత్తున అక్కడకు చేరడంతో పరిస్థితి గందరగోళంగా తయారైంది. ఒక్కసారిగా రైతులు ఎగబడ్డారు. మహిళా రైతుల అరుపులు, కేకలతో తోసుకున్నారు. ఈ తరుణంలో నార్లోనికుంట్ల సత్యమ్మ, డోకూర్ బాలకిష్టమ్మ ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. సత్యమ్మ చెవికి తీవ్ర గాయమైంది.

➤ సూర్యాపేట జిల్లా మఠంపల్లి పీఏసీఎస్‌కు చెందిన నలుగురు డైరెక్టర్లు యూరియా కొరతకు నిరసనగా రాజీనామా చేశారు. తమ గ్రామాల్లోని రైతులకు యూరియా అందజేయలేకపోతున్నామన్న మనస్తాపంతో రాజీనామా చేస్తున్నట్లు డైరెక్టర్లు గోలి చంద్రం, పట్టేటి ఆంథోని, వల్లపుదాస్ చినలింగయ్యగౌడ్, పశ్యా రామనరసమ్మ చెప్పారు.

➤ మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలోని ఉప్పరపల్లి, కల్వల గ్రామాల్లో సొసైటీ పాయింట్ వద్ద రైతులు గురువారం తెల్లవారుజామునే క్యూలో నిల్చున్నారు. ఉదయం 7 గంటలకే యూరియా లోడ్ లారీ రావాల్సి ఉండగా 11 గంటలైనా రాలేదు. కేసముద్రం విలేజ్ దర్గా వద్ద ఆ డ్రైవర్ యూరియా లోడ్ లారీ తీసుకొచ్చి నిలిపాడని పోలీసులు తెలుసుకున్నారు. దర్గా నుంచి ఉప్పరపల్లి వరకు లారీని తీసుకెళ్లి 220 బస్తాలను సెంటర్‌లో దింపించారు. ఆ తర్వాత కల్వల సెంటర్‌కు లారీని తీసుకెళ్లాల్సి ఉండగా, అప్పటికే లారీడ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. దీంతో బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ ఎండీ అలీమ్ ఆ లారీని తానే డ్రైవింగ్ చేసి కల్వలకు తీసుకొచ్చాడు. ఆ తర్వాత 220 బస్తాలను రైతులకు పంపిణీ చేశారు.



మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్రలో పరస్పర దాడిలో చెవి కమ్మ ఊడి గాయపడిన నార్లోనికుంట్ల సత్యమ్మ

➤ వరంగల్ జిల్లా ఖానాపురం మండలంలోని గొల్లగూడెంతండాకు చెందిన తేజావత్ శ్రీను ఆరు ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశాడు. సరిపోను యూరియా లభించకపోవడంతో ఐదు ఎకరాల్లో మొక్కజొన్న పంటను వదిలేశాడు. దీంతో పంటను గురువారం గొర్రెల కాపరులకు అప్పగించడంతో అవి మేశాయి.



కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సిరిసిల్ల రోడ్‌లో ధర్నా చేస్తున్న రైతులు



సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని రైతు వేదిక వద్ద టోకెన్ల కోసం బారులుతీరిన రైతులు



వరంగల్ జిల్లా ఖానాపురంలో గొర్రెలు మేసిన మొక్కజొన్న పంటను చూపిస్తున్న రైతు శ్రీను



సిద్దిపేట మండలం చిన్నగుండవెళ్లిలో రైతులు యూరియా కోసం వరుసలో పెట్టిన చెప్పులు

ఆదిలాబాద్ కలెక్టరేట్‌లో
కుప్పకూలిన పైకప్పు

- ఉద్యోగులకు తప్పిన పెను ప్రమాదం
- మంత్రి జూపల్లి సమీక్ష సమయంలోనే ఘటన

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ కలెక్టరేట్‌లో ఉద్యోగులకు పెను ప్రమాదం తప్పింది. ఏ–సెక్షన్ బాల్కనీ పైకప్పు ఒక్కసారిగా కుప్పకూలింది. గురువారం సాయంత్రం 6:30 గంటల సమయంలో ఉద్యోగులంతా ఇంటికి వెళ్లిన తర్వాత ఈ ఘటన చోటు చేసుకుంది. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహిస్తుండగా ఇది చోటు చేసుకుంది. కలెక్టరేట్ భవనం నిజాం కాలంలో నిర్మించినది కావడంతో శిథిలావస్థకు చేరింది. ఇటీవల జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు తడిచిపోయింది. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ చాంబర్ నుంచి హెచ్ సెక్షన్ వరకు గల బాల్కనీ పైకప్పు, దానిని ఆనుకొని ఉండే పారాఫిట్ వాల్ ఒక్కసారిగా కూలిపోయింది. భారీ శబ్దం రావడంతో కార్యాలయంలోని ఇతర విభాగాల్లో ఉన్న ఉద్యోగులు భయంతో బయటకు పరుగులు తీశారు. పైకప్పు కూలిన ప్రాంతంలో ట్రెజరీ శాఖ స్ట్రాంగ్ రూం ఉంటుంది. ఇక్కడ 24 గంటలపాటు పోలీసు సిబ్బంది ఉంటారు. ఆ సమయంలో భద్రత సిబ్బంది లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కూలిన పైకప్పును ఆనుకునే కలెక్టర్ చాంబర్, వీడియో కాన్ఫరెన్స్ చాంబర్లు ఉంటాయి. ఇక్కడ నిత్యం సమీక్ష సమావేశాలు జరుగుతుంటాయి. ఏళ్ల క్రితం నాటి భవనం కావడం పైకప్పు కూలిపోవడంతో ప్రస్తుతం కార్యాలయంలో విధులు నిర్వర్తించేందుకు ఉద్యోగులు, సిబ్బంది భయాందోళనకు గురవుతున్నారు.




ఏ–సెక్షన్ ముందు పైకప్పు కూలిన దృశ్యం

విద్యార్థి అనుమానాస్పద మృతి

స్కూల్ యాజమాన్యమే కారణమని తల్లిదండ్రుల ఆరోపణ

నయీంనగర్/విద్యారణ్యపురి: హనుమకొండ నయీంనగర్‌లోని తేజస్వి ప్రైవేట్ స్కూల్‌లో ఒక విద్యార్థి అనుమానాస్పద మృతి ఉద్రిక్తతకు దారి తీసింది. పి.రవి, రజిత దంపతుల చిన్న కుమారుడైన పదో తరగతి విద్యార్థి పి.జయంత్‌వర్ధన్ (15) గురువారం పాఠశాలలోనే అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. జయంత్ మైదానంలో ఆడుకుంటూ కుప్పకూలాడని, ముక్కు, చెవి నుంచి రక్తం రావడంతో ఉపాధ్యాయులు ఆస్పత్రికి తరలించగా మార్గమధ్యలోనే చనిపోయినట్లు స్కూల్ యాజమాన్యం తెలిపింది. విద్యార్థి బాబాయి భిక్షపతి, పిన్ని, అన్న రాజశేఖర్ మాట్లాడుతూ రూ.లక్షల ఫీజు చెల్లించి చదువుతున్న స్కూల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్ లేదని, సీపీఆర్ చేస్తే జయంత్ బతికేవాడన్నారు. అధిక సమయం వ్యాయామం చేయమని వేధించడంతో జయంత్ కిందపడ్డాడని ఆరోపించారు. వెంటనే వైద్యం అందితే బతికేవాడని, రెండు మూడు ఆస్పత్రులు తిప్పి ప్రాణం తీశారని రోదించారు. ప్రభుత్వ ఉపాధ్యాయులైన జయంత్ తల్లిదండ్రులది దేవన్నపేట కాగా.. పిల్లల చదువు కోసం కేయూ ఫస్ట్ గేట్ వద్ద ఉంటున్నారు. విద్యార్థి సంఘాల నాయకులు పాఠశాల ఎదుట ఆందోళన చేయడంతో ఉద్రిక్తత నెలకొంది. అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసినట్లు సీఐ మచ్చ శివకుమార్ చెప్పారు.



జయంత్ మృతదేహం

సాక్షి హైదరాబాద్

శుక్రవారం । 12 । సెప్టెంబర్ । 2025

గరిష్టం/కనిష్టం
30.0/22.0

వాతావరణం

నగరంలో శుక్రవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురవొచ్చు. గరిష్టంగా 30, కనిష్టంగా 22 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.



ఎల్‌బీనగర్ - విజయవాడ జాతీయ రహదారిపై వరదనీరు

మ్యాన్‌హోల్‌లో పడిన చిన్నారి..

తప్పిన ప్రాణాపాయం



మ్యాన్‌హోల్‌లో పడిపోతున్న చిన్నారి ఫాతిమా

యాకుత్‌పురా: పాఠశాలకు వెళ్తున్న ఓ చిన్నారి ప్రమాదశాత్తు డ్రైనేజీ మ్యాన్‌హోల్‌లో పడి స్వల్ప గాయాల పాలైన ఘటన గురువారం యాకుత్‌పురాలో జరిగింది. యాకుత్‌పురా గంగానగర్ నాలా మౌలా కా చీల్లా ప్రాంతానికి చెందిన సల్మాన్ కుతూరు జైనాబ్ ఫాతిమా (5) స్థానిక పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతోంది. గురువారం ఉదయం నానమ్మతో కలిసి పాఠశాలకు బయలుదేరింది. రోడ్డుపై ఉన్న మ్యాన్‌హోల్ పైకప్పు తెరిచి ఉండటంతో ప్రమాదవశాత్తు అందులో పడిపోయింది. దీంతో ఆమె నానమ్మ, స్థానికులు వెంటనే చిన్నారి ఫాతిమాను పైకి లాగి కాపాడారు. స్వల్ప గాయాల పాలైన చిన్నారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. జలమండలి, హైడ్రా విభాగాల అధికారులు సిబ్బందితో మౌలాకా చీల్లా ప్రాంతాంలో డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల పూడికతీత పనులు చేపట్టి పైకప్పు వేయకుండా వదిలేసిన వారిని గుర్తించి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పత్తర్‌గట్టీ డివిజన్ కార్పొరేటర్ సయ్యద్ సోహెల్ ఖాద్రీ డిమాండ్ చేశారు.

మ్యాన్‌హోల్ తెరిచి ఉందా?

90001 13667కు ఫోన్ చేయండి

పాతబస్తీ ఘటనను తీవ్రంగా పరిగణించిన హైడ్రా

సాక్షి, సిటీబ్యూరో: పాతబస్తీలోని మౌలాకా చిల్లాలోని మ్యాన్‌హోల్‌లో పడిపోయిన చిన్నారి ఉదంతాన్ని హైడ్రా తీవ్రంగా పరిగణించింది. ఆ మ్యాన్‌హోల్ అలా ఉండటానికి బాధ్యుల్ని గుర్తించడానికి విచారణకు ఆదేశించింది. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. అక్కడ ఉన్న సీసీ కెమెరాల్లో బుధవారం నుంచి రికార్డు అయిన ఫీడ్‌ను సేకరించి అధ్యయనం చేస్తోంది. స్థానికంగా పని చేస్తున్న హైడ్రా, జలమండలి, జీహెచ్‌ఎంసీ విభాగాలతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. స్థానిక కార్పొరేటర్ ఆదేశాల మేరకు అక్కడ మ్యాన్‌హోల్ తెరిచి మట్టి తీసే పనిని హైడ్రా చేపట్టింది. కొన్నేళ్లుగా మట్టి పేరుకుపోవడంతో అది గట్టిగా మారింది. దీంతో జలమండలి జెట్టింగ్ మెషిన్లతో పని ప్రారంభించింది. బుధవారం ఉదయం జలమండలి సిబ్బంది తమ పని అయిన తర్వాత మ్యాన్‌హోల్ మూత వేయకుండా వెళ్లిపోయినట్లు భావిస్తున్నారు. బుధవారం సాయంత్రం రెండో షిఫ్టులో వచ్చిన మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్స్ (ఎంఈటీ) సిబ్బంది ఆ విషయం గమనించి మూత వేయడానికి ప్రయత్నించారు. ఆ సమయంలో స్థానికులు పని పూర్తి కాలేదని, అలాగే ఉంచాలని సూచించడంతో ఆగిపోయారు. గురువారం ఉదయం పాఠశాలకు వెళ్లే సమయంలో ఓ చిన్నారి అందులో పడిపోవడంతో విచారణకు ఆదేశించింది. వర్షాకాలం వరద పోయేందుకు వీలుగా మ్యాన్‌హోల్స్ మూత తెరిచి.. నీరు వెళ్లిపోయిన వెంటనే మూసేస్తున్నట్లు హైడ్రా పేర్కొంది. మ్యాన్‌హోల్ మూత తెరిచి కనిపిస్తే 90001 13667 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించింది.



బండ్లగూడ రహదారిపై వాహనదారుల ఇబ్బందులు

ఉరిమిన వరుణుడు

వరుణుడు నగరంపై విరుచుకుపడ్డాడు. కుండపోత వర్షంతో విజృంభించాడు. గురువారం సాయంత్రం నుంచి రాత్రి వరకు వర్షం దంచికొట్టింది. అత్యధికంగా హయత్‌నగర్‌లో 11.2 సెం.మీ వర్షపాతం నమోదైంది. వరద నీటితో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపై ట్రాఫిక్ నిలిచిపోయి వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు.

– సాక్షి, సిటీబ్యూరో



మన్సూరాబాద్‌లో..



భాగ్యలత వద్ద భారీగా ట్రాఫిక్‌జాం

ఎన్నాళ్లీ నిర్లక్ష్యం?



వర్షాలు కురుస్తున్నా తెరిచి ఉంచుతున్న మ్యాన్‌హోళ్ల మూతలు

- ప్రభుత్వ విభాగాల మధ్య సమన్వయ లోపం.. ప్రజలకు శాపం
- నాలా ప్రాంతాల్లోనూ అశ్రద్ధే.. ప్రాణాలు పోతున్నా అంతేనా

సాక్షి, సిటీబ్యూరో: వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆయా ప్రభుత్వ విభాగాలు చెబుతున్నా, ఆచరణలో మాత్రం కనిపించడం లేదు. గురువారం ఐదేళ్ల బాలిక మ్యాన్‌హోల్ గుంతలో పడటమే ఇందుకు నిదర్శనం. సకాలంలో స్థానికులు అప్రమత్తంగా వ్యవహరించడంతో ప్రాణాపాయం తప్పింది. ప్రతియేటా వర్షాకాలానికి ముందే వానలతో ప్రమాదాలు సంభవించకుండా నాలా ప్రాంతాల్లో భద్రత చర్యలు పరిశీలించి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా కప్పులు వేయడం, మెష్‌లు ఏర్పాటు చేయడం వంటి చర్యలు తీసుకోవాల్సి ఉండగా ఆపనులు సవ్యంగా జరగడం లేదు. దాంతో పిల్లలు, పాదచారులు, కార్మికులు నాలాల్లో పడి మరణిస్తున్నారు.

భద్రత కరువు

తగిన రక్షణ ఏర్పాట్లు, భద్రత చర్యలు లేకపోవడంతోనే ఏడాది క్రితం కవాడిగూడ నాలాలో పడి ఓ మహిళ ప్రాణాలు కోల్పోయింది. అంతకుముందు సంవత్సరాల్లో ఓల్డ్‌బోయిన్‌పల్లిలో ఆనంద్‌సాయి, నేరేడ్‌మెట్‌లో సుమేధ, యాకుత్‌పురాలో జకీర్ అబ్బాస్ తదితర బాలలు నాలాల్లో పడి ప్రాణాలు కోల్పోయారు.

హైడ్రా నిర్వాకం

గురువారం ఉదయం రెయిన్‌బజార్ డివిజన్ మౌలా కాచిల్లా ప్రాంతానికి చెందిన ఐదేళ్ల బాలిక స్కూల్‌కు వెళ్తూ మూత లేకుండా ఉన్న మ్యాన్‌హోల్‌లో పడిపోయింది. బాలిక నానమ్మ, స్థానికులు గుర్తించి వెంటనే.. పైకి లాగడంతో ప్రాణాపాయం తప్పింది. జీహెచ్‌ఎంసీ నిర్వాకం వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఆ మ్యాన్‌హోల్ పనులు తాము చేయడం లేదని జీహెచ్‌ఎంసీ అధికారులు స్పష్టం చేశారు. హైడ్రా సిబ్బంది మ్యాన్‌హోల్‌ను శుభ్రం చేసేందుకు బుధవారం మూత తెరిచారు. తిరిగి దాన్ని మూసివేయకుండా అలాగే వదిలేసి వెళ్లారు.

సమన్వయ లేమి..

వరుస వర్షాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో మ్యాన్‌హోళ్లు, నాలాల్లో పూడికతీత తదితర పనుల్ని జీహెచ్‌ఎంసీ చేసేది. రోడ్లపై నిల్వ నీటిని తోడిపోసేది. చెరువుల పరిరక్షణ, విపత్తు నిర్వహణలో హైడ్రాకు మంచి పేరు రావడంతో వర్షాకాల సమస్యల పరిష్కార బాధ్యతల్ని కూడా జీహెచ్‌ఎంసీ నుంచి హైడ్రాకు బదలాయించారు. దీంతో జీహెచ్‌ఎంసీ కేవలం రోడ్లపై గుంతల్ని మాత్రమే పూడుస్తోంది. మిగతా పనులు చేయడం లేదు. నాలాలు, మ్యాన్‌హోల్స్, లోతట్టు ప్రాంతాలకు సంబంధించి హైడ్రాకు సరైన అవగాహన లేదు. అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించినప్పటికీ, విభాగాల మధ్య అధికారుల మధ్య అది సాధ్యమవుతున్నట్లు లేదు. హైడ్రా సిబ్బంది మిగతా విభాగాల కంటే తామే గొప్ప అనేవిధంగా పెత్తనం చెలాయిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

పని మనుషులే ప్రాణాంతకులై..

కాళ్లు, చేతులు కట్టేసి.. కుక్కర్‌తో తలపై మోది

- కూకట్‌పల్లి పరిధిలో గృహిణి దారుణ హత్య
- మర్డర్ అనంతరం స్నానం చేసి బ్యాగ్‌తో పరారీ
- 5 టీంలతో కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు



రేణు అగర్వాల్ (ఫైల్)



స్కూటీపై పరారవుతున్న అనుమానితులు

మూసాపేట: కూకట్‌పల్లిలోని స్వాన్‌లేక్ అపార్టుమెంట్‌లో గృహిణి హత్య కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. సుమారు 5 టీంలతో నిందితుల కోసం గాలిస్తున్నారు. ఇంటి పని మనుషులే ఘాతుకానికి పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.. స్వాన్‌లేక్ అపార్టుమెంట్ 13వ అంతస్తులోని 1,311 బ్లాక్‌లో రాకేష్ అగర్వాల్, రేణు అగర్వాల్ దంపతులు నివాసముంటున్నారు. బాలానగర్, జీడిమెట్లలో స్టీల్ సామాను వ్యాపారాన్ని రాకేష్ అగర్వాల్, తన కుమారుడు శుభంతో నిర్వహిస్తున్నారు. రాకేష్ భార్య రేణు (50) ఇంట్లోనే ఒక్కరే ఉండేవారు. వీరి కూతురు తమన్నా అహ్మదాబాద్‌లో ఎంబీఏ చదువుతోంది. కొన్ని నెలల క్రితం రేణు అగర్వాల్‌కు అనారోగ్యంగా ఉండటంతో బరువు పనులు చేసుకోలేకపోతున్నారు. దీంతో పని మనిషిని నియమించుకోవాల్సి వచ్చింది. వీరు నివసించే పై అంతస్తులో ఉండే బంధువుల ఇంటిలో పని చేస్తున్న రోషన్‌కు తెలిసిన వ్యక్తి హర్ష్ (20)ని 11 రోజుల క్రితం రేణు ఇంటితో పాటు మరో ఇంట్లో పనిలో కుదిర్చాడు. వీరు రేణు అగర్వాల్ ఇంట్లోనే ఉండేవారు. రేణు ఇంట్లో ఒంటరిగా ఉండటాన్ని గమనించిన రోషన్, హర్ష్‌లు ఆమెను హత్య చేయాలని పథకం రచించారు.

ఒంటరిగా ఉండటాన్ని గమనించి..

ఇదే అపార్ట్‌మెంట్‌లోని 14వ అంతస్తులో బంధువుల ఇంటిలో రోషన్ 11 నెలలుగా పని మనిషిగా చేస్తున్నాడు. ఆ ఇంట్లో ఆరుగురు వ్యక్తులు ఉండటం, రేణు ఇంటిలో ముగ్గురు కుటుంబ సభ్యులే ఉండటాన్ని గమనించాడు. రేణు భర్త రాకేష్, కుమారుడు శుభం ఉదయమే బయటకు వెళ్లేవారు. దీంతో రేణు ఒక్కరే ఇంట్లో ఉండేవారు. ఈ విషయాన్ని గమనించిన రోషన్, హర్ష్‌లు ఇద్దరూ కలిసి రేణు హత్యకు పథకం పన్నారు. బుధవారం రేణు భర్త, కుమారుడు బయటికి వెళ్లిన అనంతరం అదను చూసుకున్న నిందితులు ఆమె కాళ్లు, చేతులు కట్టేసి.. కుక్కర్‌తో తలపై మోది.. లాకర్ కోడ్ చెప్పాలంటూ హింసించారు. రెండు చేతులపై కత్తి గాట్లు, కడుపులో పొడిచిన గాట్లు, మెడను అత్యంత కిరాతకంగా కోసిన ఆనవాళ్లు ఉన్నాయి. రేణు హత్య అనంతరం అనుమానితులిద్దరూ అక్కడే స్నానం చేసి దుస్తులు మార్చుకుని ఇంటికి తాళం వేసి లిఫ్ట్ నుంచి సెల్లార్‌లోకి వెళ్లారు. ఇంటి యజమాని స్కూటీపై బ్యాగ్‌తో పాటు ఇద్దరు పరారయ్యారు. లాకర్ ఓపెన్ చేసి డబ్బులు ఎంత మొత్తం దొంగిలించారో తెలియడంలేదు. కుటుంబ సభ్యులు కూడా ఈ విషయం వెల్లడించలేదు. సికింద్రాబాద్ నుంచి మాదాపూర్, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లో సుమారు 2 గంటల పాటు చక్కర్లు కొట్టి, స్కూటీని హఫీజ్‌పేటలో వదిలేసి పరారైనట్లు తెలుస్తోంది. స్నానం చేసి మరీ నింపాదిగా వెళ్లటంతో పథకం ప్రకారమే హత్య చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు.

గాలింపు చర్యలు ముమ్మరం..

సుమారు 5 టీంలతో నిందితుల కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. సీసీఎస్, ఎస్‌ఓటీ, కూకట్‌పల్లి పోలీసులు, బాచుపల్లి డీఐ, కూకట్‌పల్లి డీఐ, కేపీహెచ్‌బీ డీఐలు టీములుగా ఏర్పడి పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. మొబైల్ సిగ్నల్ ఆధారంగా, సీసీ ఫుటేజ్‌లను పరిశీలిస్తున్నారు.

వాట్సాప్‌లో ఎఫ్‌ఐఆర్

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో అమలు

సాక్షి, సిటీబ్యూరో: కేసుల నమోదుపై ఫస్ట్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ (ఎఫ్‌ఐఆర్) కోసం ఇక పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగాల్సిన పనిలేదు. మెసేజ్ చేసుకున్నంత సులువుగా వాట్సాప్‌కే ఎఫ్‌ఐఆర్ పంపించే సరికొత్త విధానానినికి సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాష్ మహంతి శ్రీకారం చుట్టారు. బాధితుడు ఠాణాకు వచ్చి ఫిర్యాదు చేయగానే సంబంధిత ఎఫ్‌ఐఆర్ చేసి దర్యాప్తు ప్రారంభిస్తారు. దానిని వాట్సాప్‌లో బాధితుడికి పంపించాలని సీపీ నిర్ణయం తీసుకున్నారు. దీంతో బాధితులు స్టేషన్ ఠాణాకు రావాల్సిన అవసరం లేదని, ఎఫ్‌ఆర్ వల్ల ఉండే పనులకు ఆటంకాలు లేకుండా సాఫీగా జరిగిపోతాయని సీపీ తెలిపారు. స్టేషన్‌కు వచ్చిన బాధితుడికి పోలీసు సేవలపై నమ్మకం, విశ్వాసం పెరగడంతో పాటు పోలీస్ సేవలు పారదర్శకంగా ఉంటాయని మహంతి అన్నారు. ఇప్పటికే 60 ఏళ్లు దాటిన సీనియర్ సిటిజెన్లకు వారి ఇంటి వద్దకే ఎఫ్‌ఐఆర్‌లను సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో అందిస్తున్న విషయం తెలిసిందే. ఇక అన్ని వయసుల వారికి వాట్సాప్‌లో ఎఫ్‌ఐఆర్‌లను అందిస్తుండటంతో ఇక ప్రజలకు పోలీస్ సేవలు వేగంగా అందనున్నాయి.

వీధిలో చెత్త వేశారో.. మీ ఇంటికి పోలీసులొస్తారు

- **2024 అక్టోబర్ 11:** మానబ్‌ట్యాంక్ ప్రాంతంలో అర్ధరాత్రి కలకలం రేగింది. ఓ ప్రార్థన స్థలం ఎదురుగా రోడ్డుపై ఓ ప్రాణి మాంసం పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. ఈ విషయం బయటకు రావడంతో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు దర్యాప్తు చేపట్టారు. ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లోని సీసీ కెమెరాల్లో రికార్డు అయిన దృశ్యాలను క్షుణ్ణంగా పరిశీలించారు. సమీపంలో ఉన్న చెత్తకుప్ప నుంచి ఓ వీధికుక్క మాంసం తీసుకువెళ్తుండగా... ఓ ముక్క ప్రార్థన స్థలం సమీపంలో పడిపోయిందని తేలింది.
- **2025 ఫిబ్రవరి 12:** టప్పాచబుత్ర పోలీసుస్టేషన్ పరిధిలోని ఓ దేవాలయంలోనూ మాంసం పడి ఉండటాన్ని స్థానికులు గమనించారు. ఈ విషయం కొద్దిసేపట్లోనే దావానలంలా వ్యాపించడంతో పెద్ద ఎత్తున భక్తులు అక్కడకు చేరుకున్నారు. ఈ విషయం తెలిసిన పోలీసులు అవాంఛనీయ ఘటలకు తావు లేకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆ మాంసం అక్కడికి ఎలా వచ్చిందో తెలుసుకోవడానికి చుట్టు పక్కల సీసీ కెమెరాల్లో నమోదైన ఫీడ్‌ను పరిశీలించారు. ఈ నేపథ్యంలో చెత్త కుప్పలో పడేసిన వ్యర్థాల నుంచి ఓ పిల్లి తీసుకువచ్చి అక్కడ పడేసినట్లు వెలుగులోకి వచ్చింది.

సాక్షి, సిటీబ్యూరో

నగరంలో తరచూ చోటుచేసుకుంటున్న ఇలాంటి ఉదంతాల నేపథ్యంలో పోలీసు విభాగం అప్రమత్తమైంది. ఎవరి ప్రమేయం, ఎలాంటి దురుద్దేశం, కుట్ర లేకపోయినా కొన్ని సందర్భాల్లో ఈ తరహా ఘటనలు శాంతిభద్రతల సమస్యల్ని తెచ్చిపెడుతున్నాయి.

గణేష్, దుర్గా నవరాత్రుల సమయంలో బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన మండపాల వద్ద ఇలా జరిగితే పరిస్థితులు చేతులు దాటిపోయే ప్రమాదం ఉంటుంది. ఇవన్నీ దృష్టిలో పెట్టుకున్న నగర పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త, మాంసం ఆహార వ్యర్థాలు వేయడమే వీటికి మూలమనే ఉద్దేశంతో ప్రత్యేక దృష్టి పెట్టారు.

నిషేధం ఉన్నా పట్టించుకోని ప్రజలు...

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయడంపై ఏళ్లుగా నిషేధం ఉంది. ఇలా చేసిన వారికి జీహెచ్‌ఎంసీ అధికారులు నిర్ణీత మొత్తం జరిమానా విధించే అవకాశమూ ఉంది. గతంలో బల్దియా అధికారులు ఇంటింటికీ చెత్త డబ్బాలు కూడా పంచి పెట్టారు. ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరించే విధానమూ అమలులో ఉంది. అయినప్పటికీ ఇప్పటికీ అనేక మంది బహిరంగ ప్రదేశాల్లో చెత్త పడేస్తున్నారు. గార్బేజ్‌ల వద్దే కాకుండా కాస్త ఖాళీ కనిపిస్తే చాలు అక్కడ డంప్ చేస్తున్నారు. ఇళ్ల నుంచి తీసుకువచ్చి పడేసే ఈ చెత్తలో ఆహార వ్యర్థాలు, మాంసం కూడా ఉంటున్నాయి. ఇలా బహిరంగ ప్రదేశాల్లో పారేసే చెత్తను క్లియర్ చేయడం, అలా వేయకుండా నియంత్రించడంలో జీహెచ్‌ఎంసీ అధికారులు అవసరమైన స్థాయిలో చర్యలు తీసుకోవట్లేదు. ఫలితంగానే ఎన్ని స్వచ్ఛ అవార్డులు గెల్చుకున్న నగరమైనా ఇప్పటికీ ఎక్కడ చూసినా వ్యర్థాలే కనిపిస్తుంటాయి.

రంగంలోకి దిగిన పోలీసు విభాగం..

ఈ చెత్త వల్ల ఉత్పన్నం అవుతున్న సమస్యలను పరిగణనలోకి తీసుకున్న నగర పోలీసు విభాగం నియంత్రించాలని నిర్ణయించింది. దీని కోసం నగర వ్యాప్తంగా ఉన్న సీసీ కెమెరాలను వినియోగించుకుంటోంది. ప్రతి ప్రాంతంలోనూ కాకపోయినా.. కొన్ని సున్నిత, కీలక ప్రాంతాలపై దృష్టి పెడుతోంది. ప్రధానంగా రెండు వర్గాలు, ప్రార్థన స్థలాలు ఉన్న చోట్ల ఈ చర్యలు తీసుకుంటోంది. అక్కడ ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా చెత్త వేస్తున్న వారిని స్థానిక పోలీసులు గుర్తించనున్నారు. ఆపై వారిపై చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీకి సిఫార్సు చేయడమో, సిటీ పోలీసు చట్టం కింద కేసులు నమోదు చేసి తదుపరి చర్యలు తీసుకోవమో చేయనున్నారు. ప్రధానంగా వెస్ట్, సౌత్, సౌత్ వెస్ట్ జోన్లలో ఈ విధానం అమలు చేస్తున్నారు. ఈ చర్య ల వల్ల అవాంఛిత ఘటనలు నిరోధించడంతో పా టు స్వచ్ఛ హైదరాబాద్‌ను సాధించడానికి ఆస్కారం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.





తీవ్ర ఇబ్బందులు తెస్తున్న ఆహార, మాంస వ్యర్థాలు

- కొన్నిసార్లు శాంతిభద్రతల సమస్యల వరకు..
- నిఘా వేసి ఉంచాలని నగర పోలీసుల నిర్ణయం
- సీసీ కెమెరాలను సైతం వినియోగిస్తున్న కాప్స్

రూ.1000 కోట్ల మోసం..



ఇద్దరు నిందితుల అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: వ్యవస్థీకృత ఆర్థిక నేరాల నెట్‌వర్క్‌ను సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు బ్రేక్ చేశారు. కృత్రిమ మేధ ఆధారిత పెట్టుబడుల పేరిట సుమారు రూ.1,000 కోట్లు మోసం చేసిన ఇద్దరు ఘరానా కేటుగాళ్లను అరెస్టు చేసి, జ్యూడీషియల్ రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని ప్రకాశం జిల్లాకు చెందిన గడ్డం వేణుగోపాల్, కర్ణాటకకు చెందిన శ్రేయాస్ పాల్ ఇరువురు కలిసి సైబరాబాద్ కేంద్రంగా నకిలీ కంపెనీలను ఏర్పాటు చేశారు. ఐఐటీ క్యాపిటల్ టెక్నాలజీస్, ఏవీ సొల్యూషన్స్, శ్రీనివాస్ అనలిటిక్స్, ట్రేడ్ బుల్స్ టెక్నాలజీస్ వంటి రకరకాల పేర్లతో ఆన్‌లైన్‌లో నకిలీ కంపెనీలను నిర్వహిస్తున్నారు. పెట్టుబడిదారులను ఆకర్షించేందుకు నకిలీ సెబీ, ఎన్‌ఎస్‌ఈ, బీఎస్‌ఈ రిజిస్ట్రేషన్లను సైతం సృష్టించారు. మధ్యతరగతి ఇన్వెస్టర్లను, ఐటీ నిపుణులు, రిటైర్డు ఉద్యోగులను నమ్మించేందుకు ప్రీమియం ఆఫీసులు, హోటళ్లలో సెమినార్లలో నిర్వహించేవారు. పెట్టుబడులపై ఏటా 84 శాతం రాబడిని అందిస్తామని మాయమాటలు చెప్పారు. స్టాక్ మార్కెట్ ప్రిడిక్షన్ సాఫ్ట్‌వేర్, కల్పిత ట్రేడింగ్ డాష్ బోర్డుల ముసుగులో 2022 నుంచి 2025 మధ్య కాలంలో సుమారు 3 వేలకు పైగా బాధితుల నుంచి రూ.వెయ్యి కోట్లకు పైగా పెట్టుబడులను వసూలు చేశారు. ఇన్వెస్టర్ల నుంచి వసూళ్లు చేసిన సొమ్మును 21 వేర్వేరు బ్యాంక్ ఖాతాలకు మళ్లించారు. ఆయా సొమ్ముతో ప్రాపర్టీలు, లగ్జరీ వాహనాలు, బంగారం కొనుగోలు చేశారు. ఈమేరకు పలువురు బాధితులు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సాంకేతిక ఆధారాలతో ఇద్దరు నిందితులు గడ్డం వేణుగోపాల్, శ్రేయాస్ పాల్‌లను అరెస్టు చేశారు. 20 మందికి పైగా ఏజెంట్లు, కన్సల్టెంట్లు, టెక్నికల్ డెవలపర్లు, వెబ్‌సైట్ నిర్వాహకులు ఈ నెట్‌వర్క్‌లో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

అధిష్టానం నిర్ణయమే శిరోధార్యం

జూబ్లీహిల్స్ టికెట్‌పై ఎమ్మెల్యే దానం వ్యాఖ్యలు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో పార్టీ అధిష్టానం నిర్ణయించిన వ్యక్తి గెలుపు కోసం కృషి చేస్తామని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. గురువారం ఆదర్శనగర్‌లో ఏర్పాటు చేసిన కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమం అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. 'జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో మీరు పోటీ చేస్తారని, మంత్రి పదవి దక్కే అవకాశం ఉందంటూ ఊహాగానాలు వస్తున్నాయి' అంటూ మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు.. స్పందిస్తూ.. అవన్నీ ఊహాగానాలు కావచ్చన్నారు. అయితే.. అధిష్టానం నిర్ణయం మేరకు కాంగ్రెస్ అభ్యర్థి ఎంపిక ఉంటుందని, టికెట్ ఎవరికి వచ్చినా అభ్యర్థి గెలుపు కోసం కష్టపడి పని చేస్తామన్నారు. ప్రసుత్త పరిస్థితిలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గెలవడం ఎంతో అవసరమన్నారు. కొంతకాలంగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల బరిలో దానం నాగేందర్ నిలిచే అవకాశం ఉందంటూ మీడియాలో ప్రచారం జరుగుతోంది.



బలమైన సామాజిక వర్గం అండదండ ఉండడంతో పాటు మైనార్టీ వర్గాల్లో సైతం ఆయనకు మంచి పరపతి ఉండడం, పార్లమెంట్ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో దానం నాగేందర్‌కు సుమారు 85,000 ఓట్లు వచ్చాయి. దీంతో ఆయన జూబ్లీహిల్స్‌లో సులభంగా గెలిచే అవకాశం ఉందంటూ పార్టీ పెద్దలు సైతం భావిస్తున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో దానం నాగేందర్ వ్యాఖ్యలు రాజకీయ ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి.

రెడ్‌కార్నర్ నోటీసుతో చెన్నైకి ఆర్థిక నేరాల నిందితుడు

శంషాబాద్: చెన్నైకి చెందిన బ్యాంక్ ఆఫ్ బరోడా కేసులో ఆర్థిక లావాదేవీల్లో మోసానికి పాల్పడిన మునావర్ ఖాన్ అనే వ్యక్తి కొంత కాలంగా కువైట్‌లో తలదాచుకున్నాడు. నకిలీ పత్రాలతో బ్యాంక్ ఆఫ్ బరోడాలో భారీ ఎత్తున రుణాలు తీసుకోవడంతో అతడిపై ఫోర్జరీ తదితర కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో అతడిపై సీబీఐ అధికారులు రెడ్‌కార్నర్ నోటీసులు జారీ చేశారు. కువైట్ అధికారుల ద్వారా గురువారం శంషాబాద్ విమానాశ్రయానికి తీసుకొచ్చిన మునావర్‌ఖాన్‌ను సీబీఐ అధికారులు అదుపులోకి తీసుకుని చెన్నైకి తీసుకెళ్లారు.

ఇళ్లు ఇప్పిస్తామంటూ మోసం: ఐదుగురిపై కేసు

సనత్‌నగర్: బలహీన వర్గాల కోసం ఉద్దేశించిన ఎల్‌ఐజీ గృహ నిర్మాణ పథకం కింద ఇళ్లు ఇప్పిస్తామంటూ మోసం చేసిన ఐదుగురిపై బేగంపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బలహీన వర్గాల కోసం గృహనిర్మాణ పథకం ద్వారా ఇళ్లు ఇప్పిస్తానంటూ బోయిన్‌పల్లి హస్మత్‌పేటకు చెందిన అబ్దుల్ నదీమ్ ప్రచారం చేసుకుంటూ వచ్చాడు. ఈ క్రమంలో సికింద్రాబాద్ సమీపంలోని రాంగోపాల్‌పేట నల్లగుట్టకు చెందిన కొత్వాల్ షేక్ అక్బర్‌తో పాటు అతని స్నేహితుడు సమీర్ కూడా ఇళ్లు తీసుకునేందుకు ముందుకువచ్చారు. దీంతో ఇరువురిని అబ్దుల్ నదీమ్ బేగంపేట పాటిగడ్డకు చెందిన మహ్మద్ షంషీద్దీన్, అతని ఇద్దరు కుమారులు మహ్మద్ అల్తమాస్, మహ్మద్ అల్మాస్‌లకు పరిచయం చేశాడు. వారు బేగంపేట పాటిగడ్డ ప్రాంతంలో ఇళ్లు ఇప్పిస్తామని చెప్పి వారి నుంచి ఒక్కొక్కరి వద్ద రూ.3 లక్షల చొప్పున వసూలు చేశారు. నాలుగేళ్లు గడిచినా ఇళ్లను మాత్రం ఇప్పించక పోవడంతో బాధితులు పలుమార్లు బేగంపేటలోని షంషీద్దీన్ ఇంటికి వెళ్లగా బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో బాధితుడు కొత్వాల్ షేక్ అక్బర్ బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు మహ్మద్ షంషీద్దీన్, మహ్మద్ అల్తామాస్, మహ్మద్ అల్మాస్, సయ్యద్ అబ్దుల్ నదీమ్, మహ్మద్ ఖదిర్లపై కేసు నమోదు చేశారు.

అటవీ అమరవీరుల త్యాగాలు మరువలేనివి..

● మంత్రి కొండా సురేఖ



అటవీ అమర వీరుల సంస్మరణ సభలో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

బహదూర్ పురా: అటవీ సంపద పరిరక్షణలో ప్రజలు కూడా భాగస్వామ్యం కావాలని రాష్ట్ర అటవీ శాఖ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. ఇకపై ప్రతిభావంతులైన ఫ్రంట్‌లైన్ అధికారులకు ఏటా రూ.10 వేలు నగదు పురస్కారం అందిస్తామన్నారు. అటవీ సంపదను దోచుకునే స్మగ్లర్లు, అరాచక మూకలకు ఎదురొడ్డి ప్రాణాలర్పించిన అమరుల త్యాగాలు వృథా కానివ్వమన్నారు. గురువారం నగరంలోని నెహ్రూ జూలాజికల్ పార్కు ఆవరణలోని అమరవీరుల విగ్రహం వద్ద నిర్వహించిన జాతీయ అటవీ అమరవీరుల సంస్మరణ దినం కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ డాక్టర్ జితేందర్, రాష్ట్ర అటవీ ప్రధాన అధికారిణి డాక్టర్ సువర్ణలతో కలసి పాల్గొన్నారు. స్మారక చిహ్నం వద్ద పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ విధి నిర్వహణలో అటవీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. 1984 సంవత్సరం నుండి ఇప్పటివరకు తెలంగాణ రాష్ట్రంలో విధి నిర్వహణలో 22 మంది ప్రాణాలు కోల్పోవడం చాలా బాధాకరమన్నారు. వీరి కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. పచ్చదనం పెంపులో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 'వన మహోత్సవం' ప్రపంచంలోనే మూడవ అతి పెద్ద మానవ ప్రయత్నమన్నారు. వనమహోత్సవం ద్వారా మన రాష్ట్రంలో 307.48 కోట్లకు పైగా మొక్కలను ఇప్పటికే నాటడం జరిగిందన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మాట్లాడుతూ అడవులను కాపాడుతున్న అటవీ అధికారుల కృషి అభినందనీయమన్నారు. ఎటువంటి సౌకర్యాలు లేనిచోట, దట్టమైన అడవుల్లో వారి ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి అడవులను కాపాడుతున్నారన్నారని, విధి నిర్వహణలో అమరులైన అటవీ అధికారులు, సిబ్బంది త్యాగాలను స్మరించుకోవాలన్నారు. డీజీపీ డాక్టర్ జితేందర్ మాట్లాడుతూ..అడవులను కాపాడేందుకు అధికారులు చేస్తున్న కృషి ఎంతో గొప్పదన్నారు. రాష్ట్ర అటవీ, పర్యావరణం, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్ మాట్లాడుతూ అడవులను రక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వాటిని కాపాడటమే అమరులకు మనం ఇచ్చే నిజమైన నివాళి అవుతుందని తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర ప్రధాన అటవీ సంరక్షణ అధికారిణి డాక్టర్ సువర్ణ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ ఎలుసింగ్ మేరు, పీసీసీఎఫ్ జౌహరి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన, సౌత్ జోన్ డీసీపీ స్నేహా మెహ్రా, అడిషనల్ పీసీసీఎఫ్‌లు సి.శరవనణ్, , ప్రియాంక వర్గీస్, జూపార్కుల డైరెక్టర్ డాక్టర్ సునీల్, క్యురేటర్ జె.వసంత, చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ క్షితిజ, డాక్టర్ జి. రామలింగం, జీహెచ్‌ఎంసీ అర్బన్ ఫారెస్ట్రీ డైరెక్టర్ సుభద్రాదేవి, జూపార్క్ డిప్యూటీ డైరెక్టర్ (వెటర్నరీ) డా.ఎం.ఎ. హకీమ్, డిప్యూటీ క్యురేటర్ బర్నోబా, అసిస్టెంట్ డైరెక్టర్ (వెట్) శ్రీనివాస్ , మాజీ క్యూరేటర్లు ఎ.శంకరన్, రాజశేఖర్, మాజీ డిప్యూటీ క్యూరేటర్ ఎ.నాగమణి, అసిస్టెంట్ క్యురేటర్లు నాజియా తబుసుమ్, ఎస్.లక్ష్మణ్, ఈపీఆర్‌ఓ హనీఫుల్లా, జూ సిబ్బంది పాల్గొన్నారు.

'జూబ్లీహిల్స్ లయన్స్' సేవలు భేష్

● మాదాపూర్ స్కూల్‌లో ఐరన్ షెడ్ ఏర్పాటు ● సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన



మాదాపూర్ స్కూల్‌లో ఐరన్ షెడ్‌ను ప్రారంభించిన జూబ్లీహిల్స్ లయన్స్ క్లబ్ సభ్యులు

మాదాపూర్: విద్యార్థుల సౌకర్యాలకు ప్రాధాన్యమిస్తూ హైదరాబాద్ జూబ్లీహిల్స్ లయన్స్ క్లబ్ సేవాతత్పరతను చాటుకుంది. ఈ మేరకు మాదాపూర్‌లోని మండల పరిషత్ ప్రైమరీ స్కూల్ విద్యార్థుల కోసం ఐరన్ షెడ్ నిర్మించారు. శనివారం ఈ షెడ్‌ను లయన్స్ జిల్లా గవర్నర్ 320డి లయన్ అమర్‌నాథ్‌రావు ప్రారంభించారు. ఈ నిర్మాణానికి లయన్ గిరిజారెడ్డి, డాక్టర్ పి.సీత, జయశ్రీ మూర్తి, జ్వాలా వైష్ణవి, మండవ శిల్ప విరాళాలు అందించారు. విద్యార్థుల సౌకర్యం కోసం నిర్మించిన ఈ షెడ్..విద్యాభివృద్ధికి లయన్స్‌క్లబ్ చూపుతున్న అంకితభావానికి నిదర్శనమని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు లయన్ కోనేరు రామసుందరి, కార్యదర్శి లయన్ రిందా దేవి, హెడ్మాస్టర్ మోహన్‌రావు, నరసింహరాజు, రామమోహన్, సౌభాగ్య, మర్రి ప్రవీణ్, ఈవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన...

మాదాపూర్‌లోని మండల ప్రాథమిక పరిషత్ స్కూల్‌లో లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320డి అధ్వర్యంలో శనివారం సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. లయన్ నాగరాజు, నరసింహరాజు, పద్మావతి త్రిపురనేనిలు మానసిక ఆరోగ్యంపై మార్గనిర్దేశం చేయగా, తెలంగాణ పోలీస్ ట్రైనింగ్ సెంటర్, అంబర్‌పేట్ నిపుణులు విద్యార్థులకు సైబర్ క్రైమ్స్, డ్రగ్స్ దుష్పలితాలపై అవగాహన కల్పించారు. ఫోరెన్సిక్, కెరీర్ ప్రోగ్రెస్‌పై సుస్మిత, సైబర్ ముప్పు, హ్యాకింగ్‌పై రాహుల్ వివరించారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ క్లబ్ అధ్యక్షుడు కోనేరు రామ సుందరి, హెడ్మాస్టర్ బసవలిగం తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై 'బైక్ స్టంట్లు'

ముగ్గుర్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు

రాజేంద్రనగర్: ద్విచక్ర వాహనాలతో రోడ్లపై స్టంట్లు చేస్తూ వాహనదారులను భయభ్రాంతులకు గురిచేస్తున్న ఇద్దరు యువకులతో పాటు మరో మైనర్‌ను రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు పట్టుకొని అత్తాపూర్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కాలాపత్తర్ ప్రాంతానికి చెందిన అహ్మద్ బిన్ ఫారూఖ్, అతని స్నేహితుడు మహ్మద్ ఆజంలు రెండు ద్విచక్ర వాహనాలపై మరో స్నేహితుడు మైనర్ బాలుడు (16)తో కలిసి గురువారం ఉదయం అత్తాపూర్ నుంచి ఆరాంఘర్ వైపు ప్రయాణిస్తున్నారు. రెండు బైక్‌లపై స్టంట్లు చేస్తూ వాహనాలను నిర్లక్ష్యంగా నడిపారు. దీంతో రోడ్డుపై వెళుతున్న ఇతర వాహనదారులు భయభ్రాంతులకు గురయ్యారు. కొందరు వాహనదారులు తమ సెల్‌ఫోన్‌లో ఈ విన్యాసాలను చిత్రీకరించి సోషల్ మీడియాతోపాటు రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులకు పంపిచారు. వాహనాల నంబర్ల ఆధారంగా ఇద్దరు యువకులతో పాటు మైనర్‌ను గుర్తించి పోలీసులు సాయంత్రం వారిని అదుపులోకి తీసుకున్నారు. రెండు ద్విచక్ర వాహనాలతో పాటు ముగ్గురిని తదుపరి విచారణ నిమిత్తం అత్తాపూర్ పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ డివిజన్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ, ఇన్‌స్పెక్టర్ రాజులు మాట్లాడుతూ..ద్విచక్ర వాహనాలపై స్టంట్లు చేస్తే వారికి శిక్ష తప్పదన్నారు. మైనర్లకు వాహనాలు అందించిన యజమానులపై కూడా కేసులు నమోదు చేస్తామన్నారు.

హెచ్‌సీఎస్సీ ఆధ్వర్యంలో ట్రాఫిక్ సమ్మిట్



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ (హెచ్‌సీఎస్సీ) ఆధ్వర్యంలో ట్రాఫిక్ సమ్మిట్-2025 నిర్వహించాలని నగర పోలీసు విభాగం నిర్ణయించింది. ఈ నెల 18, 19 తేదీల్లో జల విహార్ కేంద్రంగా జరుగనుంది. దీనికి సంబంధించిన లోగోను నగర ట్రాఫిక్ విభాగం చీఫ్ జోయల్ డెవిస్ గురువారం ఆవిష్కరించారు. ఈ సమ్మిట్‌లో వివిధ ప్రభుత్వ విభాగాలు, స్వచ్ఛంద సంస్థలు, నిపుణులతో పాటు సాధారణ ప్రజలు సైతం పాల్గొనున్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేని సురక్షిత నగరాన్ని సాకారం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై ఈ సదస్సులో చర్చించనున్నారు. దీని ద్వారా ప్రభుత్వానికి కీలక సలహాలు, సూచనలను ఇవ్వనున్నారు.

ప్రైవేటు బస్సులో కీచక డ్రైవర్

● ఒంటరి బాలికపై లైంగిక వేధింపులు
● చితకబాదిన కుటుంబీకులు
● హైదరాబాద్ టు బెంగళూరు బస్సులో ఘటన

శివాజీనగర (బెంగళూరు): బస్సులో ఒంటరిగా ప్రయాణించిన బాలిక మీద లైంగిక వేధింపులకు పాల్పడిన కీచక డ్రైవర్‌కు బాలిక కుటుంబీకులు దేహశుద్ధి చేశారు. ఈ సంఘటన గురువారం తెల్లవారుజామున బెంగళూరులో బసవేశ్వర సర్కిల్‌లో జరిగింది. వివరాలు.. హైదరాబాద్ నుంచి బెంగళూరుకు ప్రైవేటు స్లీపర్ బస్సు బయల్దేరింది. అందులో ఓ బాలిక (15) బెంగళూరుకు వస్తోంది. మొబైల్‌ఫోన్ చార్జింగ్ అయిపోవడంతో చార్జింగ్ చేయాలని డ్రైవర్‌ను కోరింది. కొంతసేపటి తరువాత బాలిక మొబైల్ ఇవ్వాలని అడిగితే, ముద్దివ్వాలని డ్రైవర్ ఆరిఫ్ (41) బాలికను ఒత్తిడి చేశాడు. తరువాత బాలిక తన సీటు వద్దకు వెళ్లి నిద్రపోయింది. డ్రైవర్ బాలిక వద్దకు వెళ్లి తరచూ లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఇది తట్టుకోలేక బాలిక తల్లికి ఫోన్ చేసి చెప్పింది. బస్సు సిటీకి రాగానే బాలిక తల్లి, సోదరుడు బస్సు నిలిపి డ్రైవర్ ఆరిఫ్‌ను ప్రశ్నించారు. డ్రైవర్ తప్పయిపోయిందంటూ చేతులెత్తి మొక్కి వేడుకున్నాడు. బాలిక కుటుంబీకులు అతన్ని చితకబాదారు. ఇంతలో పోలీసులు చేరుకొని డ్రైవర్‌ని అరెస్ట్ చేశారు.

ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో వృద్ధుడి మృతి



ఖాజా మోయినుద్దీన్ (ఫైల్)

నాగోలు: ద్విచక్ర వాహనం ఢీ కొట్టిన ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందిన సంఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చాంద్రాయణగుట్టకు చెందిన మహమ్మద్ ఖాజా మోయినుద్దీన్ (70) నాగోలు బండ్లగూడలో పండ్లు అమ్ముతూ జీవనం సాగించేవారు. బుధవారం రాత్రి 8 గంటల సమయంలో పని ముగించుకొని భారత్ పెట్రోల్ పంప్ ఎదుట రోడ్డు పక్కన టీ తాగి తన బైక్ వైపు వెళ్తుండగా నాగోలు నుండి బండ్లగూడ వైపు వేగంగా వచ్చిన గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఆయనను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఖాజా మోయినుద్దీన్‌ను చికిత్స కోసం ఉస్మానియా హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతని కుటుంబ సభ్యులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శాస్త్ర సాంకేతిక అభివృద్ధిలో అసాధారణ వృద్ధి

● గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



సదస్సులో ప్రసంగిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

లాలాపేట: శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంలో భారతదేశం అసాధారణ వృద్ధిని సాధిస్తోందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రశంసించారు. ఈ మేరకు సీఎస్ఐఆర్–ఐఐసీటీలో జరుగుతున్న ఈజ్ ఆఫ్ డూయింగ్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ 6వ ప్రాంతీయ సదస్సులో రెండో రోజు గురువారం గవర్నర్ పాల్గొని కీలక ఉపన్యాసం చేశారు. దేశంలో పరిశోధనలు, పేటెంట్లు విపరీతంగా పెరుగుతున్నాయన్నారు. స్థిరమైన, నైపుణ్యంతో కూడిన సమానమైన ఆర్థికాభివృద్ధి కోసం నూతన ఆవిష్కరణలు పెరగాలన్నారు. పరిశోధన, అభివృద్ధిని సులభతరం చేయడానికి విద్యా వ్యవస్థను సంస్థాగతంగా మెరుగుపరచాల్సి ఉందన్నారు. ఈ సమావేశంలో ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, పద్మ అవార్డు గ్రహీత అనిల్ కకోద్కర్, నీతి ఆయోగ్ గౌరవ సభ్యుడు డాక్టర్ వి.కె సారస్వత్, నీతి ఆయోగ్ సీనియర్ సలహాదారు ప్రొఫెసర్ వివేక్ కుమార్ సింగ్, పలువురు శాస్త్రవేత్తలు, వివిధ సంస్థల డైరెక్టర్లు పాల్గొన్నారు.

గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ వాణి

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని గాంధీ ఆస్పత్రి నూతన సూపరింటెండెంట్‌గా అడిషనల్ డీఎంఈ డాక్టర్ వాణిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆమె శుక్రవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇప్పటి వరకు సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించిన డాక్టర్ రాజకుమారి ఇకపై గాంధీ మెడికల్ కాలేజీ ఫిజియాలజీ ప్రొఫెసర్‌గా వ్యవహరిస్తారని అధికారులు పేర్కొన్నారు. కాగా గాంధీ ఆస్పత్రి పాలనా వ్యవహారాల్లో లొసుగులు, రోగులు, సిబ్బంది నుంచి వచ్చిన ఆరోపణలు, విమర్శల కారణంగా ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది.

'విజయ్ శంకర్‌లాల్ జ్యువెలరీ' నగలు దొరికాయి

● రూ.1.50 కోట్ల విలువైన ఆభరణాలు స్వాధీనం



లక్డీకాపూల్: బషీర్‌బాగ్‌లోని విజయ్ శంకర్‌లాల్ జ్యువెలరీలో ఈ నెల 5న చోరీకి గురైన రూ.1.50 కోట్ల విలువైన బంగారు, వజ్రాభరణాలు దొరికాయని, ఈ కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్టు సెంట్రల్ జోన్ డీసీపీ కె.శిల్పవల్లి తెలిపారు. గురువారం ఆమె ఇక్కడ వివరాలు వెల్లడించారు. ఐపీఎల్ బెట్టింగ్‌లో భారీగా నష్టపోయి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్న ముంబైకి చెందిన రోనక్ చద్వా గత ఏప్రిల్‌లో జ్యువెలరీ షాపులో పనికి చేరాడు. తనతో పాటు బెట్టింగ్‌లో నష్టపోయిన మహ్మద్ హస్నైన్ హబియాతో కలిసి కుట్రపన్ని ఈ నెల 5న జ్యువెలరీ షాపులో దొంగతనం చేశారు. దీనిపై 7న బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీసీఎస్‌తో కలిసి సైఫాబాద్ పోలీసులు చేపట్టిన దర్యాప్తులో ఆభరణాలను రోనక్, మహ్మద్ హస్నైన్ హబియా దొంగిలించినట్లు గుర్తించి అరెస్టు చేశామని, నేరస్తులను ఏసీజేఎం కోర్టులో హాజరుపరిచామన్నారు. ఆభరణాలన్నీ చెక్కుచెదరకుండా ఉన్నాయన్నారు. నగరంలో నగల దుకాణాల్లో పనిచేసే వారిని సమగ్రంగా విచారించిన తర్వాతే నియమించుకోవాలని డీసీపీ సూచించారు. సమావేశంలో అదనపు డీసీపీ బీ.ఆనంద్ ,సైఫాబాద్ ఏసీపీ ఆర్. సంజయ్ కుమార్, సైఫాబాద్ ఇన్‌స్పెక్టర్ కే. రాఘవేందర్, డీఐ ఎన్. రాజేందర్, డీఐ సైఫాబాద్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

14.9 కిలోల గంజాయి స్వాధీనం

ఇద్దరి అరెస్టు




గంజాయి రవాణా వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

సికింద్రాబాద్: విశాఖపట్నం నుంచి ఢిల్లీకి గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు నిందితులను సికింద్రాబాద్ రైల్వే పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి రూ.18.47 లక్షల విలువ చేసే 14.9 కిలోల గంజాయి ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. జీఆర్‌పీ డీఎస్‌పీ ఎస్ఎన్ జావెద్, జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్లు సాయిశ్వర్‌గౌడ్, సారస్వత్‌లు వెల్లడించిన వివరాల ప్రకారం..ఢిల్లీ చాందినీ చౌక్‌కు చెందిన చంద్రప్రకాశ్ అనే ఫుట్‌పాత్ వస్త్రవ్యాపారి, అదేప్రాంతానికి చెందిన జమీలాఖాతూన్‌లు స్నేహితులు. చంద్రప్రకాశ్ మాదకద్రవ్యాల వినియోగానికి బానిస అవగా, జమీలాఖాతూన్‌కు ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయి. వీరిరువురు గంజాయి రవాణా వ్యాపారం చేసి పెద్దమొత్తంలో డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. ఇదిలా ఉండగా చంద్రప్రకాశ్‌కు ఫేస్‌బుక్ ద్వారా ఫరాన్‌ఖాన్ అనే గంజాయి వ్యాపారి పరిచయం అయ్యాడు. అతని ద్వారా విజయనగరం వెళ్లిన వీరిద్దరు 14.9 కిలోల గంజాయి ప్యాకెట్లు సేకరించి విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలు ద్వారా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ చేరుకున్నారు. ఢిల్లీ రైలు ఎక్కేందుకు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ వెయిటింగ్ హాలులో వేచిచూస్తుండగా పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డారు. కేసులు నమోదు చేసిన పోలీసులు ఇరువుర్ని రిమాండ్‌కు తరలించి గంజాయి విక్రయించిన ఫరాన్‌ఖాన్‌ను పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టారు.

జింక కొమ్ముల విక్రయానికి యత్నం

నిందితుడిని అరెస్టు చేసిన టాస్క్‌ఫోర్స్



సాక్షి, సిటీబ్యూరో: అరుదైన యాంటిలోప్ సెర్వికాప్రా జాతికి చెందిన జింక కొమ్ములు విక్రయించేందుకు ప్రయత్నించిన వ్యక్తిని ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ఇతడి నుంచి రెండు కొమ్ములు స్వాధీనం చేసుకుని తదుపరి చర్యల నిమిత్తం అటవీ శాఖ అధికారులకు అప్పగించినట్లు అదనపు డీసీపీ అందె శ్రీనివాసరావు గురువారం వెల్లడించారు. సంగారెడ్డి జిల్లా సదాశివపేటకు చెందిన మహ్మద్ ఖలీముద్దీన్ అలియాస్ సలీం వృత్తిరీత్యా తాపీ మేస్త్రి. బతుకుతెరువు కోసం నగరానికి వలసవచ్చిన ఇతగాడు షహీన్‌నగర్‌లో ఓ పాన్‌షాపు ఏర్పాటు చేసుకున్నాడు. ఈ ఆదాయం కుటుంబ పోషణకు సరిపోకపోవడంతో సదాశివపేటకు రాకపోకలు సాగిస్తూ మేస్త్రీ పని కూడా చేస్తున్నాడు. కొన్నాళ్ల క్రితం అక్కడ ఓ ఇంటి కూల్చివేత పనులు చేస్తుండగా ఇతడికి జింక కొమ్ములు దొరికాయి. వీటిని సొంతం చేసుకుని సలీం నల్లరంగు కవర్‌లో చుట్టి నగరానికి తీసుకువచ్చాడు. తొలినాళ్లల్లో ఆ కొమ్ముల నుంచి చిన్న ముక్కలు వేరుచేసి పొడి చేసేవాడు. దీన్ని విని యోగిస్తే ఎముకలు పటిష్టం కావడంతో పాటు కొన్ని రోగాలు తగ్గుతామని నమ్మబలికి విక్రయించే వాడు. ఇటీవల రెండు కొమ్ములీ విక్రయించాలని భావించిన సలీం ఖరీదు చేసే వ్యక్తుల కోసం వెతుకుతున్నాడు. దీనిపై తూర్పు మండల టాస్క్‌ఫోర్స్‌కు సమాచారం అందింది. ఇన్‌స్పెక్టర్ ఎ.నాగార్జున నేతృత్వంలో ఎస్సైలు ఎం .అనంతాచారి, ఎస్.కరుణాకర్‌రెడ్డి తమ బృందాలతో వలపన్ని సలీంను పట్టుకున్నారు. అతడి నుంచి రెండు జింక కొమ్ములు స్వాధీనం చేసుకుని తదుపరి చర్యల నిమిత్తం అటవీ శాఖ అధికారులకు అప్పగించారు.

బైకును ఢీకొట్టిన కారు: యువకుడి దుర్మరణం



మృతిచెందిన సందీప్ (ఫైల్)



చికిత్స పొందుతున్న పవన్‌కుమార్

చైతన్యపురి: వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన కారు..ఓ బైక్‌ను ఢీకొట్టడంతో యువకుడు దుర్మరణం పాలు కాగా మరో యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపిన మేరకు..గడ్డిఅన్నారం డివిజన్ పీఅండ్‌టీ కాలనీకి చెందిన గుడాల సందీప్ (28) ఎల్‌బీనగర్‌లోని బర్గర్ కింగ్‌లో పనిచేస్తున్నాడు. గురువారం తెల్లవారు జామున సందీప్ తన స్నేహితుడు గంజ పవన్ కుమార్ (31)తో కలిసి పల్సర్ బైక్‌పై ఎల్‌బీనగర్ వెళ్తున్నాడు. వీఎంహోం మెట్రో స్టేషన్ సమీపంలోకి రాగానే దిల్‌సుఖ్‌నగర్ నుంచి వేగంగా వచ్చిన కారు వీరి బైకును వేగంగా ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న సందీప్, పవన్‌లు ఎగిరి రహదారిపై దూరంగా పడ్డారు. పవన్ కాలు శరీరం నుంచి వేరు పడి పోయింది. స్థానికుల సమాచారం మేరకు గాయపడ్డ ఇద్దరినీ చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సందీప్ సాయంత్రం మృతి చెందాడు. పవన్ చికిత్స పొందుతున్నాడని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. కారు డ్రైవర్ హయత్‌నగర్‌కు చెందిన నాగరాజును పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్వామి వివేకానంద బోధనలు స్ఫూర్తిదాయకం

ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్



అనిల్‌కుమార్ యాదవ్‌ను సన్మానిస్తున్న స్వామి బోధమయానంద

కవాడిగూడ: స్వామి వివేకానంద బోధనలు స్ఫూర్తిదాయకమని రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. గురువారం రామకృష్ణ మఠంలోని వివేకానంద ఆడిటోరియంలో స్వామి వివేకానంద హ్యూమన్ ఎక్సలెన్సీ సిల్వర్‌జూబ్లీ ఉత్సవాల్లో భాగంగా సంప్రీతి దివస్ పేరిట యూత్ కన్వెన్షన్ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడారు. స్వామి వివేకానంద 1893 సెప్టెంబర్ 11న చికాగోలో జరిగిన సర్వమత సమ్మేళనంలో చేసిన ప్రసంగం ప్రపంచాన్నే ఆకర్షించిందన్నారు. ఆయన స్ఫూర్తితో రామకృష్ణ మఠంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. భారతదేశంలోని ఆధ్యాత్మికత, సహనం, ఐక్యత వంటి అంశాలను తన ప్రసంగం ద్వారా వివేకానందుడు ప్రపంచానికి చాటారని తెలిపారు. యువత స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకొని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరుకావాల్సి ఉండగా..కొన్ని కారణాలతో హాజరుకాలేక పోయారని, భవిష్యత్తులో సీఎంను తీసుకొచ్చే బాధ్యత తనదే అని అనిల్‌కుమార్ యాదవ్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణమఠం అధ్యక్షులు స్వామి బోధమయానంద, కలకత్తా రామకృష్ణ మఠం అధ్యక్షులు నిత్య ముక్తానంద స్వామి తదితరులు ప్రసంగించారు. అనంతరం ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్‌ను ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

మీ ఆప్తుల అంత్యక్రియలు, శ్రద్ధాంజలి, నిర్యాణం, వర్ధంతి, జయంతిల ప్రకటనల కోసం సంప్రదించండి.
ఈ తరహా ప్రకటనలకు డిస్కౌంట్
Ph: 040-23256000 Ext: 6344, 9912220352

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate
PLOT FOR SALE
Services
BUSINESS SERVICE
BUSINESS OFFER
CHITS
DISTRIBUTORS
PERSONAL CARE
OLD AGE HOME
Wanted
Concord Drugs Ltd, Brahmanapally, Near Turkayamjal, Sagar Road : We have a job openings for Graduates- Male Candidates., Ph : 7032640251
గమనిక
ఈ సెంటర్లలో ప్రకటనలు బుక్ చేయండి
Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ రైతుబజార్‌లో.. కిలో టమాట రూ.17, నల్లవంకాయ. 23, పొడుగు వంకాయ.23, బెండకాయ.35, పచ్చిమిర్చి.35, బజ్జీమిర్చి.40, క్యాప్సికం.53, పచ్చికాకరకాయ.27, పందిరిబీర.40, క్యాబేజీ.18, క్యారెట్.40, దొండకాయ.35, గుండు బీన్నీస్.45, గింజచిక్కుడు.45, గోకరకాయ.35, కీర.18, దోసకాయ.18, బీట్‌రూట్.23, ఉల్లిగడ్డ.22, ఆలుగడ్డ.23, చామగడ్డ.23, మొరంగడ్డ.35, కందగడ్డ.40, క్యాలిప్లవర్.23, సొరకాయ.15, పొట్లకాయ.18, అరటికాయ.11, మునగకాయ.4, మామిడికాము.35, ముల్లంగి.4–5, ఉల్లిపొరక.28. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకూ అందుబాటులో ఉంటాయి.

నేడు సీతారాం ఏచూరి వర్ధంతి సభ

రహమత్‌నగర్: సీపీఎం మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి వర్ధంతి సభ శుక్రవారం ఎస్పీ ఆర్ హిల్స్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నట్లు జూబ్లీహిల్స్ సీపీఎం నాయకుడు స్వామి తెలిపారు. ఎస్పీఆర్‌హిల్స్‌లో ఆయన గురువారం మాట్లాడుతూ శుక్రవారం సాయంత్రం నిర్వహించే వర్ధంతి సభలో రాష్ట్ర సీపీఎం నాయకులు, ప్రజా సం ఘాల ప్రతినిధులు పాల్గొని ఏచూరికి నివాళులు అర్పిస్తానని తెలిపారు.

నవంబర్ 25 నుంచి హైటెక్స్‌లో పౌల్ట్రీ ఈవెంట్

బంజారాహిల్స్: దక్షిణాసియాలోనే అతిపెద్ద పౌల్ట్రీ ఈవెంట్‌ను నవంబర్ 25 నుంచి మూడు రోజుల పాటు హైటెక్స్‌లో నిర్వహిస్తున్నట్లు ఇండియన్ పౌల్ట్రీ ఎక్విప్‌మెంట్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ తెలిపింది. జూబ్లీహిల్స్‌లో గురువారం విలేకరుల సమావేశంలో పౌల్ట్రీ ఇండియా అధ్యక్షుడు ఉదయ్‌సింగ్‌బయాస్ మాట్లాడారు. 17వ పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పోను 'వన్ నేషనల్ వన్ ఎక్స్‌పో' అనే థీమ్ కింద నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నవంబర్ 25 నోవాటెల్‌లో ఈ ఈవెంట్ ప్రారంభమవుతుందన్నారు. ఎగ్జిబిషన్‌కు 50 దేశాల నుంచి 500కి పైగా ఎగ్జిబిటర్స్, 50,000కు పైగా సందర్శకులు పాల్గొంటారని తెలిపారు.

ఉపాధ్యాయులకు సత్కారం



శ్రీనగర్‌కాలనీ: తెలంగాణా దళితసేన ఆధ్వర్యంలో సుల్తాన్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులే విద్యార్థులకు దిశానిర్దేశం చేసి దేశఅభ్యున్నతికి పాటుపడుతున్నారని తెలంగాణా దళితసేన రాష్ట్ర అధ్యక్షుడు గంట మల్లేష్ అన్నారు. నేతలు గంట శ్రీనివాస్, రాజేష్, గంట దయానంద్, విజయ్‌నాయక్, అనిల్‌యాదవ్, నరసింహయాదవ్, హరి పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

ఖైరతాబాద్: ఖైరతాబాద్ డివిజన్‌లోని ఓల్డ్ సీఐబీ క్వార్టర్స్‌లో రూ.10లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను గురువారం కార్పొరేటర్ విజయారెడ్డి పరిశీలించారు. సీసీ రోడ్డు పనులను నాణ్యతతో సకాలంలో పూర్తిచేయాలని కార్పొరేటర్ సూచించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డీఈ చైతన్య, జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉదయ్‌నగర్‌లో వీధిలైట్ల ఏర్పాటు



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెంబర్–11లోని ఉదయ్‌నగర్ బస్తీలో కాలిపోయిన వీధిదీపాల స్థానంలో కొత్త లైట్లు బిగించారు. బస్తీలో పలుచోట్ల వీధిదీపాలు కాలిపోయి గత కొన్ని నెలలుగా చీకట్లు అలుముకున్నాయి. స్థానిక నేతలు ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన అధికారులు కొత్తగా 18 లైట్లను బిగించి అంధకారానికి చెక్ పెట్టారు. ఇంకా కొన్ని చోట్ల కాలిపోయిన లైట్ల స్థానంలో కొత్తవి ఏర్పాటుచేయాల్సి ఉందన్నారు.

పగిలిపోయిన ఫ్లై ఓవర్ పైపులు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నెం. 45లోని ఫ్లై ఓవర్ పైనుంచి వర్షపు నీరు కిందికి వెళ్లే మార్గాలు పగిలిపోవడంతో కింది నుంచి వెళ్తున్న వారు తడిసిముద్దవుతున్నారు. చాలా రోజులు నుంచి ఈ సమస్య ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. జూబ్లీహిల్స్ రోడ్ నెం. 45 పిల్లర్ నెం. పి 16 వద్ద వర్షం వచ్చిన ప్రతీసారి పై నుంచి పెద్ద ఎత్తున వరద పైపుల్లో నుంచి వెళ్లకుండా నేరుగా రోడ్డుపై పడుతోందని స్థానికులు కూడా పలుమార్లు జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. సంబంధిత అధికారులు స్పందించి పగిలిపోయిన చోట పైపులను బాగు చేసి వర్షం నీరు పడకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వాట్సాప్ మెసేజ్‌తో సమస్య పరిష్కారం

బంజారాహిల్స్ డీఈ పరిధిలో 195 గ్రూపులు

- పోస్ట్ చేయగానే క్షణాల్లో చేరుకుంటున్న విద్యుత్ సిబ్బంది
- పరిష్కారమైన తర్వాత వినియోగదారుడి నుంచి ఫీడ్‌బ్యాక్..
- బంజారాహిల్స్‌లో విజయవంతమైన సరికొత్త పథకం



సమస్య ఉన్న ప్రాంతాన్ని సందర్శించి పరిష్కరిస్తున్న విద్యుత్ అధికారులు

బంజారాహిల్స్: ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని టీజీఎస్‌పీడీసీఎల్ సంస్థ విద్యుత్ వినియోగదారులకు రోజురోజుకూ మెరుగైన సేవలు అందించడంలో సరికొత్త ఆలోచనలతో ముందుంటోంది. ఇప్పటికే యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చి దరఖాస్తులు, ఫిర్యాదుల స్వీకరణ తదితర ఇతర సేవలు అందిస్తున్నది. తాజాగా వినియోగదారులకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సేవలందించే క్రమంలో వాట్సాప్ చాట్ ద్వారా ఫిర్యాదులు స్వీకరించే సేవలను ప్రారంభించింది. టీజీఎస్‌పీడీసీఎల్ బంజారాహిల్స్ డివిజనల్ పరిధి కిందికి వచ్చే ఫిలింనగర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, మాదాపూర్, అమీర్‌పేట, యూసుఫ్‌గూడ, ఎస్‌కేనగర్ సెక్షన్ల పరిధిలో ఉన్న 24 సబ్‌స్టేషన్ల పరిధిలో 195 ఫీడర్లు ఉండగా, సంబంధిత ఫీడర్ల పరిధిలో వినియోగదారులతో కలిసి వాట్సాప్ గ్రూపు ఏర్పాటుచేసింది. ఇలా టీజీఎస్‌పీడీసీఎల్ బంజారాహిల్స్ డివిజనల్ ఇంజనీర్ పరిధిలో 195 ఫీడర్లు ఉండగా, 195 వాట్సాప్ గ్రూపులు ఏర్పాటుచేసి వినియోగదారుల సమస్యలను వాట్సాప్ ద్వారా తెలుసుకుంటూ వెనువెంటనే వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారు. ఒక్కో గ్రూపులో 200 మంది వరకు వినియోగదారులు, 30 మంది టీజీఎస్‌పీడీసీఎల్ అధికారులు, సంబంధిత సబ్‌స్టేషన్ల ఏఈలు, లైన్‌మెన్లు, ఇతర సిబ్బంది ఉంటారు. ఏదైనా సమస్యను గ్రూపులో పోస్ట్ చేయగానే అధికారులతో పాటు సిబ్బంది అక్కడికి వెళ్లి ఆ సమస్యను పరిష్కరించి మళ్లీ వాట్సాప్‌లో పోస్ట్ చేస్తున్నారు. వినియోగదారులు తమ మొబైల్‌లో వాట్సాప్ ద్వారా గ్రూపులో సందేశం పంపిస్తే వెంటనే విద్యుత్ సిబ్బంది స్పందించి ఆ ప్రాంతానికి వెళ్లి ఆ సమస్యను పరిష్కరించడమే కాకుండా సమస్య పరిష్కారమైందన్న విషయాన్ని కూడా మళ్లీ పోస్ట్‌చేస్తున్నారు. సమస్య పరిష్కరించిన తర్వాత ఫీడ్‌బ్యాక్ అడిగి తెలుసుకుంటున్నారు.

ప్రయోజనాలు ఎన్నో..

సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటూ వినియోగదారుల సమస్య త్వరితగతిన పరిష్కరించడం, సమయాన్ని ఆదా చేయడం, పారదర్శకతను కాపాడడం ఈ వాట్సాప్ గ్రూపుల ముఖ్య ఉద్దేశ్యం. ఈ వాట్సాప్ గ్రూపుల వల్ల వినియోగదారులు వేగవంతమైన నాణ్యమైన సేవలు పొందే అవకాశం ఉంటుంది. టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి సిబ్బంది వచ్చే దాకా వేచి చూడడం కంటే ఇలా వాట్సాప్ గ్రూపులో పోస్ట్ చేయగానే అలా సిబ్బంది సమస్య ఉన్న చోటికి వాలిపోతుండడంతో చాలామంది వినియోగదారులు ఈ గ్రూపులపై ఆధారపడుతున్నారు. ఇదిలా ఉండగా వినియోగదారులు ఎవరైనా ఈ గ్రూపులో జాయిన్ కావాల్సి ఉంటే సమీపంలోని సబ్‌స్టేషన్ల ఏఈలను గానీ, తమ పరిధిలో తిరిగే లైన్‌మెన్లను గానీ సంప్రదించి తమ నెంబర్ ఇవ్వవచ్చు.

వాట్సాప్ ఫిర్యాదులతో వినియోగదారుల సమస్యలను మరింత వేగంగా పరిష్కరించే అవకాశం ఉంటుందని భావించిన స్థానిక విద్యుత్ అధికారులు ఈ తరహా పద్ధతిని ప్రవేశపెట్టారు. ఇప్పటికే ఉన్న 1912 టోల్‌ఫ్రీ వంటి సేవలు కూడా వినియోగదారుల సమస్యలు పరిష్కరిస్తాయని వారంటున్నారు. వినియోగదారులకు మరింత నాణ్యమైన అత్యాధునిక సాంకేతిక సేవలను అందించే క్రమంలో వాట్సాప్ ఫిర్యాదు సేవలను మరింత విస్తృతం చేసినట్లు టీజీఎస్‌పీడీసీఎల్ బంజారాహిల్స్ డీఈ హనుమంతరెడ్డి తెలిపారు. ఫిర్యాదుదారులు తమ సమస్యను స్పష్టంగా వాట్సాప్‌లో పేర్కొనడం ద్వారా సిబ్బంది తేలిగ్గా వెళ్లి పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని ఆయన వెల్లడించారు.

పురోగతి కూడా తెలుసుకోవచ్చు...

ఫిర్యాదు సంబంధిత అధికారులతో పాటు ఏఈ, లైన్‌మెన్లు, ఫ్యూజ్ ఆఫ్ కాల్స్ (ఎఫ్‌ఓసీ) సిబ్బందికి వెళ్తుంది. వినియోగదారుడు ఎప్పుడైనా సరే తన సమస్య పురోగతిని అడిగి తెలుసుకోవడానికి అవకాశం ఉంటుంది. సమస్య పరిష్కారమైన తర్వాత వినియోగదారుడికి కాల్ కూడా చేస్తారు. సమస్యపై ఫీడ్‌బ్యాక్ ఇవ్వమని అడుగుతారు. వినియోగదారుడు సంతృప్తి చెందకుంటే అదే ఫిర్యాదును తీసుకుని మళ్లీ పరిష్కారం దిశలో కృషి చేస్తారు.

వయోధిక పాత్రియులకు పెన్షన్ ఇవ్వాలి



మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రంఇస్తున్న ప్రతినిధులు

బంజారాహిల్స్: వయోధిక పాత్రికేయులకు పెన్షన్ సౌకర్యం కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వయోధిక పాత్రికేయ సంఘం కార్యవర్గ సభ్యులు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కోరారు. గురువారం బంజారాహిల్స్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఇతర రాష్ట్రాల్లో వయోధిక పాత్రికేయులకు ఇస్తున్న పెన్షన్, ఆరోగ్య బీమా వంటి సౌకర్యాలను మన రాష్ట్రంలో కూడా కల్పించాలని వారు కోరారు. సభ్యులు లక్ష్మణరావు, రాజేశ్వర్‌రావు, వేణుగోపాల్, ఎన్.శ్రీనివాస్ రెడ్డి, ఫాజిల్, ఉదయవర్లు, మల్లన్న, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్

బంజారాహిల్స్: అర్హులైన వారంతా కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ పథకాలకు దరఖాస్తు చేసుకుని లబ్ధి పొందాలని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సూచించారు. గురువారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన షేక్‌పేట, ఖైరతాబాద్ మండలాల పరిధిలో లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. అర్హులైన వారు పథకాలను ఉపయోగించుకోవాలని కోరారు.

కలిసి కట్టుగా ఉన్నప్పుడే యూనియన్‌కు బలం

వెంగళరావునగర్ : విద్యుత్‌శాఖలో యూనియన్ సభ్యులకు ఎలాంటి సమస్య వచ్చినా కలిసి కట్టుగా తమ సహకారాన్ని అందించినపుడే సమస్యలు పరిష్కారం అవుతాయని తెలంగాణా ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిబాబా, అధ్యక్షులు వి.వెంకటేశ్వర్లు తెలియజేశారు. తెలంగాణా ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ 1104 బంజారాహిల్స్ నూతన కమిటీ గురువారం వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని జెన్‌కో కార్యాలయంలో జరిగింది. సర్కిల్ నూతన అధ్యక్షులుగా బి.సంతోష్‌కుమార్, కార్యదర్శిగా ఆర్.సర్వేశ్వర్, కార్యనిర్వాహక అధ్యక్షులుగా ప్రభాకర్‌రెడ్డి, అదనపు కార్యదర్శిగా మురళీమోహన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన నేతలు యూనియన్ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర అదనపు కార్యదర్శి వరప్రసాద్, టీజీఎస్‌పీడీసీఎల్ డిస్కం అధ్యక్షులు ఏ.వేణు, కార్యనిర్వాహక అధ్యక్షులు వెంకన్న పాల్గొన్నారు.

గుడిసెలు ఖాళీ చేస్తే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం మొదలుపెడతాం



బస్తీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దానం, తహశీల్దార్ అనితారెడ్డి తదితరులు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ నందగిరిహిల్స్‌లోని గురుబ్రహ్మనగర్ బస్తీలో గురువారం ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ షేక్‌పేట మండల తహశీల్దార్ అనితారెడ్డితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులతో మాట్లాడుతూ.. బస్తీవాసులు సహకరిస్తే త్వరితగతిన ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు. ముఖ్యంగా ఇక్కడ ఉన్న గుడిసెలు, ఇళ్లు ఖాళీ చేస్తే ఆ ప్రాంతంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపడతామన్నారు. పక్కనే ఉన్న మూడెకరాల జీహెచ్ఎంసీ పార్కు స్థలంలో కొద్ది రోజుల పాటు సౌకర్యాలు కల్పించాలని కమిషనర్‌ను కోరతామన్నారు. అలాగే జూబ్లీహిల్స్ రోడ నెంబర్–46 వైపు ఇక్కడి నుంచే రోడ్డును అనుసంధానం చేయాల్సి ఉందని, అడ్డుగా ఉన్న 12 గుడిసెలు తొలగించాలని షేక్‌పేట మండల తహశీల్దార్ అనితారెడ్డి సూచించారు.

బంజారాహిల్స్ సర్కిల్ నూతన కార్యవర్గం

బంజారాహిల్స్: బంజారాహిల్స్ సర్కిల్ సర్వసభ్య సమావేశం గురువారం యూనియన్ కార్యాలయంలో నిర్వహించగా, 1104 యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిబాబా, అధ్యక్షుడు వేమునూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఇందులో భాగంగా 1104 యూనియన్ బంజారాహిల్స్ సర్కిల్ నూతన కమిటీ అధ్యక్షుడిగా బి.సంతోష్‌కుమార్, కార్యదర్శిగా ఆర్.సర్వేశ్వర్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ప్రభాకర్‌రెడ్డి, మురళీమోహన్ తదితరులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో టీజీఎస్‌పీడీసీఎల్ డిస్కం అధ్యక్షులు వేణు, కార్యనిర్వాహక అధ్యక్షుడు వెంకన్న, అదనపు కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, సలహాదారులు ఆర్.జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

వర్షం ఎఫెక్ట్.. నిలిచిన ఓవర్ హెడ్ ట్యాంక్ కూల్చివేత పనులు

వెంగళరావునగర్ : వెంగళరావునగర్‌లోని ఓవర్‌హెడ్ ట్యాంకు కూల్చివేత పనులు గురువారం సాయంత్రం కురిసిన వర్షం కారణంగా నిలిచిపోయాయి. గత 60 ఏళ్ళ కిందట ఈ ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మించినప్పటికీ కాలక్రమంలో దాదాపు పాతికేళ్ళుగా నిరుపయోగంగా మారింది. ఎప్పుడు కూలుతుందోనని స్థానికులు భయాందోళనకు గురయ్యారు. గురువారం సాయంత్రం ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు తన సిబ్బందితో ఓవర్‌హెడ్ ట్యాంకు కూల్చివేతకు జేసీబీ ద్వారా సిద్ధమయ్యారు. పిల్లర్లకు రంధ్రాలు చేసి గృహ సముదాయాలకు నష్టం జరగకుండా కూల్చివేతకు తీవ్రంగా ప్రయత్నించారు. అయితే వర్షం కురవడంతో పనులు మధ్యలో ఆగిపోయాయి.

ఓటరు జాబితా నుంచి డబుల్ ఎంట్రీలను తొలగించాలి

రహమత్‌నగర్ : జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఓటర్ల జాబితాలో డబుల్ ఎంట్రీలు తొలగించాలని కాంగ్రెస్ నాయకులు అధికారులను కోరారు. ఈ మేరకు సికింద్రాబాద్ జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి యేసుదాస్ మాలాకీ, రహమత్‌నగర్ డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు దేవేందర్‌లు గురువారం సర్కిల్ 19 డీఎంసీకి వినతి పత్రం అందజేశారు. డబుల్ ఎంట్రీ ద్వారా దొంగ ఓటు పడే అవకాశం ఉన్నందున వాటిని సవరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి

హిమాయత్‌నగర్ : తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సంఘాలను క్షేత్రస్థాయిలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్న వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, నెలకు కనీస వేతనం రూ.20 వేలు ఇవ్వాలని తెలంగాణ విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్స్(వీఓఏ) జేఏసీ రాష్ట్ర ప్రభుత్వాన్ని, సెర్ప్ సీఈఓను డిమాండ్ చేసింది. గురువారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జేఏసీ నాయకులు కేదావత్ శరత్ కుమార్, ఇప్ప పవన్ కుమార్, మమత మాట్లాడారు.

వక్ఫ్ బోర్డును ప్రక్షాళన చేయాలి

పంజగుట్ట: వక్ఫ్ బోర్డులో నిజాయతీగల సీఈవో, ఈవోలు వస్తే బోర్డు సభ్యులు తట్టుకోలేకపోతున్నారని వారిని తప్పించేందుకు అవినీతి పరులు అంతా ఐక్యమౌతున్నారని సామాజికవేత్త డాక్టర్ లుబ్నా సర్వత్ ఆరోపించారు. ఇటీవల బోర్డును ఎంతో సక్రమంగా నడుపుతున్న సీఈవోను అన్యాయంగా తొలగించారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. వక్ఫ్ సమస్యలపై గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. వక్ఫ్ బోర్డు ఏ చట్టానికీ లోబడి లేదని అంతా అవినీతిపరులు జమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బోర్డులో నామినేటెడ్ వ్యక్తులు ఎక్కువగా ఉండరాదని, ఎలెక్టెడ్ సభ్యులే ఎక్కువగా ఉండాలని నిబంధన ఉన్నప్పటికీ బోర్డులో నామినేటెడ్ సభ్యులే ఎక్కువగా ఉండడం బాధాకరమన్నారు.

ఆయాలకు జీతాలు విడుదల చేయాలి



వెంగళరావునగర్ : కొంతకాలంగా పెండింగ్‌లో ఆయాల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీఐటీయు జిల్లా కార్యదర్శి ఎం.వెంకటేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాపర్తి అశోక్‌లు డిమాండ్ చేశారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని శిశువిహార్‌లో విధులు నిర్వహిస్తున్న ఆయాలకు గత ఆరు నెలలుగా జీతాలను చెల్లించడం లేదని, తక్షణమే విడుదల చేయాలని కోరుతూ సీఐటీయు ఆధ్వర్యంలో స్టేట్‌హోం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి బి.సుశీల తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు అలవాటు పడితే జీవితాలు నాశనం

రహమత్‌నగర్ : డ్రగ్స్‌కు విద్యార్థులు దూరంగా ఉండాలని ఎస్ఆర్‌నగర్ డివిజన్ ఏసీపీ రాఘవేంద్రరావు సూచించారు. బోరబండ రెసిడెన్షియల్ పాఠశాలలో గురువారం జరిగిన అవగాహన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఏసీపీ మాట్లాడుతూ.. డ్రగ్స్ వినియోగం నేడు విద్యాసంస్థలకు చేరడం ఆందోళన కలిగించే విషయమన్నారు. సరదాగా మొదలైన ఈ అలవాటు ప్రాణాలు తీస్తుందన్నారు. ఎస్‌హెచ్ఓ సురేందర్,అడ్మిన్ ఎస్సై నాగూల్ మీరా పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సిబ్బందికి సత్కారం



ఖైరతాబాద్ : ఖైరతాబాద్ గణేష్ నవరాత్రుల్లో పరిసరాల పరిశుభ్రతలో నిరంతరం కృషి చేసిన పారిశుద్ధ్య సిబ్బందిని గురువారం ఖైరతాబాద్ గణేష్ అడ్‌హక్ కమిటీ సభ్యులు సన్మానించారు. సభ్యులు బాక్సర్ అశోక్, మహేందర్ బాబు, నాగేష్, మహేష్‌యాదవ్, వంశీకృష్ణ, రాహుల్‌తో,రామ్మోహన్ పాల్గొన్నారు.

విశ్వనగరంగా మార్చేందుకు సీఎం అహర్నిశలు కృషి



సభలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

వెంగళరావునగర్ : హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరంగా మార్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలియజేశారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో గురువారం సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మధురానగర్‌కాలనీలో జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక గతంలో మిగిలిపోయిన ఎన్నో పెండింగ్ ప్రాజెక్టులను చేపట్టి పూర్తి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో చైర్మన్లు అన్వేష్‌రెడ్డి, కొత్వాల్, నాగేశ్వరరావు, సికింద్రాబాద్ మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, నవీన్‌యాదవ్, దేవిరెడ్డి నాగార్జునరెడ్డి, సర్కిల్–19 ఉప కమిషనర్ రజినీకాంత్‌రెడ్డి, మధురానగర్‌కాలనీ కార్యదర్శి కోడె సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంజీ సెలెక్ట్ ప్రారంభించిన కేంద్ర మంత్రి



ఎంజీ సెలక్ట్‌ను ప్రారంభించి లగ్జరీ కారును విడుదల చేస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

బంజారాహిల్స్: జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్స్ ఇండియా బంజారాహిల్స్‌లో ఏర్పాటుచేసిన నూతన ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఎంజీ సెలెక్ట్‌ను గురువారం కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రారంభించారు. అనంతరం ఆటోమోటివ్ లగ్జరీ కార్లను మార్కెట్లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంజీ సెలక్ట్ తత్కాలిక అధిపతి మిలింద్ షా మాట్లాడుతూ ఎంజీ సైబర్‌స్టర్, ఎంజీ ఎం9లు మార్కెట్లోకి విడుదలైనప్పటి నుంచి అద్భుతమైన స్పందన వచ్చిందన్నారు. ఈ ఐకానిక్ మోడళ్లను హైదరాబాద్‌కు తీసుకురావడానికి తాము సంతోషిస్తున్నామన్నారు. ఎంజీ సెలక్ట్ జయలక్ష్మీ మోటార్స్ ఇండియా డీలర్ గౌతమ్ సాయి తదితరులు పాల్గొన్నారు.

త్వరలో మహిళా భవన్ ప్రారంభోత్సవం

మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

బంజారాహిల్స్: ఎన్‌బీటీనగర్‌లోని మహిళా భవన్, మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌ను త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తామని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. గురువారం బంజారాహిల్స్ డివిజన్‌లోని ఎన్‌బీటీనగర్ మహిళా భవన్, మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌ను ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతితో కలిసి మేయర్ పెండింగ్ పనులు పరిశీలించారు. మహిళా భవన్, ఫంక్షన్ హాల్, రోడ్డు పెండింగ్ పనులను యుద్ధ ప్రాతిపదిక పూర్తి చేయాలని అధికారులకు మేయర్ సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసేందుకు ప్రభుత్వం కంకణం కట్టుకుందన్నారు. అంతకుముందు మేయర్ బంజారాహిల్స్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు.

ఉపఎన్నికల్లో పోటీ వార్తలు ఊహాగానాలే

హిమాయత్‌నగర్ : జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నికల్లో తాను పోటీ చేస్తున్నట్లు వస్తున్న వార్తలు వట్టి ఊహాగానాలే అని ఎమ్మెల్యే దానం నాగేందర్ కొట్టిపారేశారు. పార్టీ ఎవరికి టికెట్ కేటాయించినా గెలుపునకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. గురువారం ఆదర్శనగర్‌లోని న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో కల్యాణలక్ష్మీ, షాది ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలవడం చాలా ముఖ్యమని అన్నారు

ఎంఏ గార్డెన్ సీజ్

హిమాయత్‌నగర్ : హైదర్‌గూడలో నిర్వహిస్తున్న ఎంఏ గార్డెన్‌ను గురువారం హైదరాబాద్ ఆర్డీవో రామకృష్ణ ఆధ్వర్యంలో స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఆ భూమి ప్రభుత్వానిదే అని హైకోర్టు డివిజన్ బెంచ్ తీర్పు వెలువరించింది. కోర్టు ఆదేశాల మేరకు పోలీసుల సమక్షంలో ఫంక్షన్ హాల్‌ను రెవెన్యూ అధికారులు అధీనంలోకి తీసుకున్నారు.

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి

హిమాయత్‌నగర్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఆర్టీసీని ఈ దసరా పండుగ లోపు ప్రభుత్వంలో విలీనం చేసి, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు చెల్లించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమాన్ని విస్మరించిందని అన్నారు.

'జి–జిందగీ' ప్రారంభం

బంజారాహిల్స్: ఆత్మహత్యల నివారణకు జీవితం అంకితం చేసిన కార్గిల్ వార్ వెటరన్ గ్రూప్ కెప్టెన్ జీజేరావు 'జి–జిందగీ' పేరుతో కొత్త ఫౌండేషన్‌ను ప్రసాద్ సినీ ల్యాబ్స్‌లో ప్రారంభించారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన ఈ ఫౌండేషన్‌ను ప్రారంభించారు.



ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో నూతన ఎయిర్ ప్యాకేజీలు



ప్యాకేజీల కరపత్రం ఆవిష్కరిస్తున్న దృశ్యం ..

పంజగుట్ట: భారత ప్రభుత్వ రైల్వే మంత్రిత్వ శాఖకు చెందిన ఇండియన్ రైల్వే కేటరింగ్ టూరిజం కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఆర్‌సీటీసీ) ఆధ్వర్యంలో హైదరాబాద్ నుండి వివిధ పర్యాటక ప్రదేశాలకు ఎయిర్ ప్యాకేజీలను అందిస్తోందని టూరిజం అసిస్టెంట్ మేనేజర్ పి.వి.వెంకటేష్ తెలిపారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ప్యాకేజీల వివరాలతో కూడిన కరపత్రాన్ని ఆయన ఐఆర్‌సీటీసీ ఎగ్జిక్యూటీవ్స్ శిఖర్, పవన్‌శంకర్ లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .. తమ ప్యాకేజీలు సులభమైన, సౌకర్యవంతమైన అన్ని సదుపాయాలతో కూడిన ప్రయాణాలను రూపొందించామన్నారు. వివరాలకు 040–27702407, 9701360701 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

దేశీయ ఎయిర్ ప్యాకేజీలు

- గోవా: నాలుగు రోజుల ట్రిప్ ఒక్కొక్కరికి రూ.19,420,
- గుజరాత్: ఎనిమిది రోజులు రూ. 39,500,
- కశ్మీర్ : ఆరు రోజులు రూ.34,950,
- మేఘాలయ, అస్సాం: 7 రోజులు, రూ.45000,
- కర్ణాటక : 6 రోజులు, 35,500,
- అండమాన్ నికోబార్ 6 రోజులు రూ.58,625,
- రాజస్థాన్ 6 రోజులు రూ.38,000,
- ఒడిశా 6 రోజులు రూ.35,000, తమిళనాడు 7 రోజులు 36,000

అంతర్జాతీయ ఎయిర్ ప్యాకేజీలు

- థాయిలాండ్: ఐదు రోజులు రూ.64,000,
- శ్రీలంక: ఆరు రోజులు రూ.64,500

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220379
9640081203

సాక్షి
శుక్రవారం
12 సెప్టెంబర్ 2025

స్కిల్లింగ్ ఆఫ్ రూరల్ ఇండియాపై వర్క్‌షాప్

ఏజీ వర్సిటీ: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆన్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్ (ఎన్‌ఐఆర్‌డీపీఆర్)లో స్కిల్లింగ్ రూరల్ ఇండియా అనే అంశంపై రెండు రోజుల జాతీయ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా భారత ప్రభుత్వ కార్మిక ఉపాధి మంత్రిత్వ శాఖ మాజీ కార్యదర్శి సుమిత్‌దారా మాట్లాడారు. కార్మికులకు మౌలిక సదుపాయాల అభివృద్ధి ద్వారా నైపుణ్యాన్ని పెంచాలని ఆమె సూచించారు. మొదటి రోజు వర్క్‌షాప్‌లో పలు అంశాలపై చర్చించారు. గ్రామీణ భారతదేశానికి నిజంగా ఏ నైపుణ్యాలు అవసరం, వనరుల సమీకరణ, గ్రామీణ నైపుణ్యానికి నిధుల మార్గాలు, గ్రామీణ ప్రజల జీవనోపాధి అనే వాటిపై చర్చించారు.

జీఎంఆర్ విమానాశ్రయానికి మరో గుర్తింపు

శంషాబాద్: శంషాబాద్‌లోని జీఎంఆర్ హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం మరో గుర్తింపును సాధించింది. ఏసీఐ వరల్డ్ కస్టమర్ ఎక్స్‌పీరియన్స్ ప్రోగ్రామ్‌లో లెవెల్ ఫోర్ అక్రిడిటేషన్‌ను సాధించినట్లు ఎయిర్‌పోర్టు వర్గాలు వెల్లడించాయి. ఎయిర్‌పోర్టులో సేవల నాణ్యత, ఆపరేషనల్ సామర్థ్యం, ప్రయాణికుల సంతృప్తిని మూల్యాంకనం చేసి ఈ గుర్తింపును అందజేసినట్లు పేర్కొన్నారు. ప్రయాణికుల సేవల కోసం గ్లోబల్ స్థాయిలో గుర్తింపు పొందిన ఎయిర్‌పోర్టుల సరసన జీఎంఆర్ ఎయిర్‌పోర్టు చేరిందని సీఈఓ ప్రదీప్ ఫణీకర్ పేర్కొన్నారు.

మొకురాల స్వర్ణలతకు డాక్టరేట్



లక్డీకాపూల్: నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం చంద్రకల్ గ్రామానికి చెందిన మొకురాల రామేశ్వర శర్మ, సరోజ దంపతుల కుమార్తె స్వర్ణలత డాక్టరేట్ అందుకున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ డిగ్రీ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా స్వర్ణలత పనిచేస్తున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లా పెబ్బేరుకు చెందిన ప్రముఖ కథా రచయిత వల్లపురెడ్డి బుచ్చారెడ్డి సాహిత్యంపై చేసిన పరిశోధనకుగాను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఆమెకు డాక్టరేట్ ప్రదానం చేసింది. ప్రొఫెసర్ ఎస్.రజినీ పర్యవేక్షణలో స్వర్ణలత పరిశోధన చేశారు. త్వరలో జరగనున్న స్నాతకోత్సవంలో గవర్నర్ చేతుల మీదుగా స్వర్ణలత డాక్టరేట్ పట్టా అందుకోనున్నారు.

ఎస్పీ బాలు విగ్రహ స్థాపనకు స్థల పరిశీలన

గన్‌ఫౌండ్రీ: పద్మవిభూషణ్ డాక్టర్ ఎస్పీ బాలసుబ్రమణ్యం కాంస్య విగ్రహాన్ని రవీంద్రభారతి ప్రాంగణంలో ప్రతిష్ఠించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో గురువారం సీనియర్ సినీ నటుడు శుభలేఖ సుధాకర్, ఇతర సభ్యులు స్థలాన్ని పరిశీలించారు. రవీంద్రభారతిలో ఘంటసాల వెంకటేశ్వర్‌రావు విగ్రహానికి ఎడమ పక్కన ఉన్న ఖాళీ స్థలంలో బాలసుబ్రమణ్యం విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్లు సుధాకర్ తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ మల్లు ప్రసాద్, ఓరుగంటి ధర్మతేజ, సాంస్కృతిక శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఎన్ఎఫ్‌సీలో ఆక్యుపేషనల్ హెల్త్‌పై వర్క్‌షాప్

కుషాయిగూడ: కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్(ఎన్ఎఫ్‌సీ), అటామిక్ ఎనర్జీ రెగ్యులేటరీ బోర్డు(ఏఈఆర్‌బీ) సంయుక్తంగా గురువారం ఎన్ఎఫ్‌సీలో ఆక్యుపేషనల్ హెల్త్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. రెండ్రోజులపాటు జరిగే ఈ వర్క్‌షాప్‌ను ఏఈఆర్‌బీ శాస్త్రవేత్త, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌బీ చాఫ్లే ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. డీఏఈ యూనిట్లలోని ఆరోగ్యం, భద్రత అంశాలపై ఈ వర్క్‌షాప్‌లో ప్రధానంగా చర్చించారు. ఈ సంస్థలో పనిచేసే చోట ఆటోమేషన్ ప్రాసెస్ సవరణలు, ఆపరేటింగ్ విధానాలు, తయారీ పద్ధతుల్లో చోటు చేసుకుంటున్న మార్పులు కార్మికుల భద్రత, ఆరోగ్యానికి దోహదపడతాయన్నారు. వాతావరణ మార్పుల ప్రభావంతో ఎదురయ్యే పరిణామాలను ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయాలను అన్వేషించే దిశగా కార్యాచరణ జరుగుతుందన్నారు. ఎన్ఎఫ్‌సీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ డాక్టర్ కోమల్ కపూర్‌తోపాటు దేశవ్యాప్తంగా ఉన్న డీఏఈ యూనిట్ల సిబ్బంది పాల్గొన్నారు.

నగరంలో నేడు

- బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని తాజ్‌కృష్ణా హోటల్‌లో ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు ఆకృతి ఎలైట్ ఆధ్వర్యంలో లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన హస్తకళా మ్యూజియం ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఉదయం 10.30 నుంచి రాత్రి 7.30 గంటల వరకు పెన్సిల్ డ్రాయింగ్స్, స్కల్ప్చర్స్, స్టైకిడ్ స్టోరీస్ , దీప్ ఇంటీరియర్స్ చిత్ర ప్రదర్శనలు అందుబాటులో ఉంటాయి.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

నిజాం సిటీ టు ఫ్యూచర్ సిటీ!

బిగ్ స్టోరీ



నిజాం కాలంలో 1591లో పురుడు పోసుకున్న హైదరాబాద్ నగరం అభివృద్ధి ప్రస్థానం నేడు శరవేగంగా సాగుతోంది. తాజాగా ఫ్యూచర్ సిటీ దిశగా వడివడిగా అడుగులు వేస్తోంది. 1998లో ఐటీ రాకతో హైదరాబాద్ వేగం మరింత పుంజుకుంది. అప్పటివరకు హైదరాబాద్, సికింద్రాబాద్‌లకే పరిమితమైన అభివృద్ధి సైబరాబాద్‌కు విస్తరించింది. అంతర్జాతీయ విమానాశ్రయం, ఔటర్ రింగ్‌రోడ్డు, మెట్రోల ఏర్పాటుతో నగర రూపురేఖలే మారిపోయాయి. అంతర్జాతీయ మౌలిక వసతులు, నైపుణ్య కార్మికుల లభ్యత, తక్కువ జీవన వ్యయం, కాస్మోపాలిటన్ కల్చర్, ప్రోత్సాహకర ప్రభుత్వ విధానాలతో ప్రపంచ దిగ్గజసంస్థలు నగరంలో కొలువుదీరాయి. అయితే గ్రేటర్‌పై ఒత్తిడి పెరగడంతో దానికి అనుబంధంగా నాలుగో నగరం అనివార్యమైపోయింది. ప్రధాన నగరంలో రద్దీని తగ్గించడంతోపాటు భవిష్యత్తు అవసరాల కోసం ఫ్యూచర్ సిటీ ఏర్పాటు తప్పనిసరైంది.

–సాక్షి, సిటీబ్యూరో

వృద్ధి ఎక్కడ్నుంచి ఎక్కడికి..

1990 చివర్లో హైదరాబాద్‌లో ఫార్మాతో పాటు ఐటీ, ఐటీఈఎస్ రంగం జోరందుకుంది. దీంతో 2000 సంవత్సరాంతంలో పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలు, కనెక్టివిటీ అప్‌గ్రేడ్ అయ్యాయి. 2008లో అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి రావడంతో ప్రపంచ ప్రయాణికులు, కార్గో సేవలతో వృద్ధి రెండింతలైంది. అదే సమయంలో ఔటర్ రింగ్ రోడ్డు ప్రతిపాదనతో నగరం పశ్చిమ ప్రాంతంలో అభివృద్ధి చెందుతున్న ఐటీ కారిడార్‌ను విమానాశ్రయానికి అనుసంధానించింది. దీంతో హైదరాబాద్ ముఖచిత్రమే మారిపోయింది. జాతీయ, అంతర్జాతీయ సంస్థలు, నైపుణ్య కార్మికులకు నగరం వేదికైంది. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అమలు చేసిన వ్యాపార అనుకూల విధానాలతో ఆర్థిక, సాంకేతిక కేంద్రంగా హైదరాబాద్ స్థానం మరింత బలోపేతమైంది. ఔటర్, మెట్రోలు అందుబాటులోకి రావడంతో నగరంలో కనెక్టివిటీ మరింత పెరిగింది. దీంతో నగరాభివృద్ధి పశ్చిమం వైపు నుంచి దక్షిణం దిశగా విస్తరించింది.

గ్రేటరే..

7,257 చ.కి.మీ. మేర విస్తరించి ఉన్న గ్రేటర్ హైదరాబాద్‌లో పట్టణ ప్రాంతం 519 చ.కి.మీ. 1995లో 267 చ.కి.మీ.లుగా ఉన్న నగర అర్బన్ ఏరియా 2005లో 319 చ.కి.మీ. 2015లో 407 చ.కి.మీ.లకు విస్తరించింది. గత మూడు దశాబ్దాల్లో గ్రేటర్ పట్టణ ప్రాంతం 252 చ.కి.మీ. పెరిగింది. 95 శాతం మేర వృద్ధి చెందింది. 1995లో 49 లక్షలుగా ఉన్న గ్రేటర్ జనాభా 2015 నాటికి 87 లక్షలు, ఇప్పుడు 1.13 కోట్లకు చేరింది. గత 30 ఏళ్లలో జనాభా 131 శాతం పెరిగింది. ఐటీ, ఐటీఈఎస్, ఫార్మాస్యూటికల్స్, బయో టెక్నాలజీ, టూరిజం ఇదే నగరాభివృద్ధికి చోదకాలు.

దేశంలోని 8 నగరాల అర్బన్ బ్లూప్రింట్: (విస్తీర్ణం చ.కి.మీ.లలో)

నగరం	మొత్తం విస్తీర్ణం 1995లో	పట్టణ ప్రాంత విస్తీర్ణం	30 ఏళ్లలో వృద్ధి	2025లో (శాతంలో)
అహ్మదాబాద్	2,261	141	285	102
బెంగళూరు	2,196	174	498	186
చెన్నై	1,188	197	467	137
ఢిల్లీ–ఎన్‌సీఆర్	5,825	567	967	71
హైదరాబాద్	7,257	267	519	95
కోల్‌కతా	1,762	328	611	87
ముంబై ఎంఎంఆర్	4,251	412	588	43
పుణె	2,141	86	373	332

(నోట్: డేటా సేకరణ: ల్యాండ్‌శాట్, గ్లోబల్ హ్యూమన్ సెటిల్‌మెంట్ లేయర్ (జీహెచ్ఎస్ఎల్). రహదారులు, ఖాళీ భూములు, వ్యవసాయ క్షేత్రాలు, నదీ తీరాలు, సహజ ప్రకృతి ప్రాంతాలు, పరిపాలన సరిహద్దులను ఈ డేటాలో నుంచి మినహాయించారు.)





ప్రపంచంలో కోటి జనాభా ఉన్న 37 మెగా నగరాల్లో ఆరు ఇండియాలోనే ఉన్నాయి. ఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, కోల్‌కతా నగరాలు కేవలం జనాభా సెంటర్లు మాత్రమే కాదు. ప్రధాన ఆర్థిక, ఉద్యోగ కేంద్రాలు కూడా. 146 కోట్ల జనాభా ఉన్న మనదేశంలో దాదాపు 37 శాతం మంది పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. 2050 నాటికి ఇది 53 శాతానికి, 87.6 కోట్ల జనాభాకు చేరుతుందని అంచనా. మన మెట్రో నగరాలు ప్రపంచ నగరాలతో పోటీ పడుతున్నాయి. విధానపరమైన మార్పులు, స్థిరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రపంచీకరణ, శ్రామిక జనాభా పెరుగుదల వంటివి నగరాల అభివృద్ధి, విస్తరణకు ప్రధాన కారణాలు.

మహానగరం మనదే..

ప్రపంచవ్యాప్తంగా నగరాలు ఆర్థిక వృద్ధికి ఇంజిన్లు అని చెప్పవచ్చు. ప్రపంచ జీడీపీలో 80 శాతం కంటే ఎక్కువ వాటా నగరాలదే. ఉత్పాదకత, ఆవిష్కరణ, ఆర్థిక, సాంస్కృతిక, సామాజిక అభివృద్ధిని సాధించడంలో నగరాలు ముఖ్యపాత్ర పోషిస్తున్నాయి. దేశంలోని 8 ప్రధాన నగరాలు 4,308 చ.కి.మీ. మేర విస్తరించి ఉన్నాయి. 1995 నుంచి 2025 మధ్య కాలంలో ఈ నగరాలు ఏకంగా 2,136 చ.కి.మీ. విస్తరించాయి. గత మూడు దశాబ్దాల్లో విస్తీర్ణాలు 98 శాతం పెరిగాయి. ఇందులో అత్యధిక విస్తీర్ణం హైదరాబాద్‌దే. ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్ 7,257 చదరపు కిలోమీటర్లు మేర విస్తరించి ఉంది.







మాస్టర్ ప్లాన్ తప్పనిసరి



ఏ నగరానికైనా ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి అవసరం. మౌలిక వసతుల కల్పనతో పాటు పర్యావరణానికి ప్రాధాన్యం ఇచ్చే మాస్టర్‌ప్లాన్ ప్రకారమే అభివృద్ధి జరగాలి. సిటీకీ వలసలు పెరుగుతుండటంతో పట్టణ ప్రాంతం విస్తరిస్తుంది.

– కె.విద్యాధర్, డైరెక్టర్, హెచ్ఎండీఏ

మెట్రో నగరాల జనాభా: (కోట్లలో)

నగరం	జనాభా
ఢిల్లీ–ఎన్‌సీఆర్	3.47
ముంబై ఎంఎంఆర్	2.21
కోల్‌కతా	1.58
బెంగళూరు	1.44
చెన్నై	1.23
హైదరాబాద్	1.13
అహ్మదాబాద్	91 లక్షలు
పుణె	75 లక్షలు

హైదరాబాద్ 4.0 దిశగా శరవేగంగా అడుగులు

- దేశంలో విస్తీర్ణం పరంగా మహానగరం మనదే
- గ్రేటర్ విస్తీర్ణం 7,257 చదరపు కిలోమీటర్లు
- ఇందులో పట్టణ ప్రాంతం 519 చ.కి.మీ.
- మన తర్వాతే ఢిల్లీ 5,825, ముంబై 4,251 చ.కి.మీ. విస్తీర్ణం
- మూడు దశాబ్దాలలో 95 శాతం పెరిగిన పట్టణీకరణ
- ఐటీ, ఫార్మా, ఏరోస్పేస్ రంగాలే పట్టణీకరణకు కారణం

హెచ్ఎంఆర్ దిశగా..

దేశానికే తలమానికంగా నిలిచేలా తెలంగాణలో ఒక ప్రధాన పట్టణ అభివృద్ధికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా హైదరాబాద్, యాదాద్రి–భువనగిరి, మేడ్చల్–మల్కాజ్‌గిరి, రంగారెడ్డి, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాలను కలుపుతూ హైదరాబాద్ మెట్రోపాలిటన్ రీజియన్(హెచ్ఎంఆర్)ను ప్రతిపాదించింది. 10,472.723 చ.కి.మీ. మేర విస్తరించి ఉండే హెచ్ఎంఆర్.. రీజినల్ రింగ్ రోడ్డుతో అనుసంధానమై ఉంటుంది. దీంతో హైదరాబాద్‌తోపాటు పొరుగు జిల్లాల అభివృద్ధి శరవేగంగా జరుగుతోంది.



ఉద్యోగ అవకాశాల గని



ఉద్యోగ, ఉపాధి అవకాశాల పుష్కలంగా ఉండటమే హైదరాబాద్ అభివృద్ధికి కారణం. పటిష్టమైన లా అండ్ ఆర్డర్, నైపుణ్య కార్మికుల లభ్యత, కాస్మోపాలిటన్ కల్చర్ వంటి వాటితో నగరంలోకి జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులు వస్తున్నాయి.

–కె.ఇంద్రసేనారెడ్డి, ప్రెసిడెంట్, క్రెడాయ్ తెలంగాణ

ఎఫ్‌డీడీఐ–హైదరాబాద్‌లో కొత్త కోర్సులు

ఏడాది కాలపరిమితితో డిప్లొమా కోర్సులు



రాయదుర్గం: ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్–హైదరాబాద్ క్యాంపస్‌లో కొత్త కోర్సులకు శ్రీకారం చుట్టారు. ఫుట్‌వేర్ టెక్నాలజీ, ఫ్యాషన్ డిజైన్, రిటైల్ అండ్ డిజిటల్ ఫ్యాషన్ వ్యాపారం, లెదర్ యాక్సెసరీస్, బ్యాగ్‌ల అభివృద్ధి రంగాల్లో పరిశ్రమలు, సిద్ధంగా ఉన్న విద్యార్థుల నైపుణ్యాలను బలోపేతం చేయడానికి, ఉపాధిని పెంచడానికి దోహదం చేసేలా డిప్లొమా కోర్సుల ముఖ్య లక్షణంగా అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ కోర్సులను ఆరు నెలల వ్యవధి గల రెండు మాడ్యూల్‌లుగా విభజించారు. అభ్యాసకులు ఒక మాడ్యూల్‌ను అనుసరించి సర్టిఫికెట్ పొందవచ్చు. రెండు మాడ్యూల్‌లను పూర్తి చేసి పూర్తి సంవత్సరం డిప్లొమా పొందడానికి అవకాశం కల్పిస్తారు.

అందుబాటులోకి వచ్చే కోర్సులు ఇవే..

మొదటి విడతలో నూతనంగా డిప్లొమా ఇన్ ఫ్యాషన్ డిజైన్, డిప్లొమా ఇన్ ఫుట్‌వేర్ టెక్నాలజీ, డిప్లొమా ఇన్ లెదర్ యాక్సెసరీస్ అండ్ బ్యాగ్ డెవలప్‌మెంట్, డిప్లొమా ఇన్ రిటైల్ ఫ్యాషన్ మేనేజ్‌మెంట్ వంటి కోర్సులను అందుబాటులోకి తీసుకొచ్చారు. వీటిలో డిప్లొమా ఇన్ ఫ్యాషన్ డిజైన్, డిప్లొమా ఇన్ ఫుట్‌వేర్ టెక్నాలజీ, డిప్లొమా ఇన్ లెదర్ యాక్సెసరీస్ అండ్ బ్యాగ్ డెవలప్‌మెంట్ కోర్సులకు ఒక్కోదానికి ఒక్క మాడ్యూల్‌కు రూ.45 వేలు, డిప్లొమా ఇన్ రిటైల్ ఫ్యాషన్ మేనేజ్‌మెంట్ ఒక్క మాడ్యూల్‌కు రూ.40 వేలను చెల్లించాల్సి ఉంటుంది. ఈ కోర్సుల కోసం దరఖాస్తులను ఈ నెల 26వ తేదీ నుంచి ప్రారంభిస్తారు. కోర్సులను అక్టోబర్ 1వ తేదీ నుంచి ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దరఖాస్తులు వెబ్‌సైట్ www.fddiindia.comలో అందుబాటులో ఉంటాయి. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 94404 71336, 99667 55563, 99667 55536లలో సంప్రదించాలని అధికారులు సూచించారు. ఇతర వివరాలకు రాయదుర్గంలోని ఎఫ్‌డీడీఐ–హైదరాబాద్ క్యాంపస్‌లో సంప్రదించాలని సూచించారు.

పెరిగిన జలాశయాల నీటి విడుదల

మణికొండ: హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్(గండిపేట) పరీవాహకంలో గురువారం ఉదయం నుంచి కురిసిన వర్షంతో వాటిల్లోకి వరద పెరిగింది. దాంతో అప్రమత్తమైన జలమండలి, రెవెన్యూ అధికారులు మరిన్ని గేట్లు తెరిచి అధికంగా నీటిని మూసీనదికి వదిలారు. గండిపేట జలాశయానికి గురువారం మధ్యాహ్నానికి పైనుంచి 1,200 క్యూసెక్కుల వరద వస్తుండటంతో 4 గేట్లను 2 అడుగుల మేర ఎత్తి 920 క్యూసెక్కుల నీటిని కిందికి వదిలారు. సాయంత్రం 7 గంటలకు నీటి విడుదలను 1,400 క్యూసెక్కులకు పెంచారు. పూర్తి స్థాయి నీటి మట్టం 1790 అడుగులు. ప్రస్తుత నీటిమట్టం 1789.30 అడుగులు. హిమాయత్‌సాగర్‌కు ఎగువ నుంచి 3,400 క్యూసెక్కుల వరద వస్తుండటంతో మధ్యాహ్నం ఒక గేటు 4 అడుగుల మేర ఎత్తి 1,304 క్యూసెక్కుల నీటిని మూసీకి వదిలారు. సాయంత్రం 7 గంటలకు మరిన్ని గేట్లు తెరిచి 2,600 క్యూసెక్కుల నీటిని వదిలారు. పూర్తి స్థాయి నీటి మట్టం 1,763.50 అడుగులు. ప్రస్తుతనీటిమట్టం 1,762.90 అడుగులు. గురువారం రాత్రి మూసీకి 4 వేల క్యూసెక్కుల వరద నీటిని విడుదల చేశారు.

నగరంలో రోడ్డు భద్రతాచర్యలు భేష్

– రోడ్డు భద్రతా కమిటీ చైర్మన్ జస్టిస్ అభయ్ మనోహర్ సప్రే

లక్డీకాపూల్ : నగరంలో రోడ్డు భద్రత, నిర్వహణను మెరుగుపరచడంలో జీహెచ్ఎంసీ తీసుకున్న చర్యలు బాగున్నాయని సుప్రీంకోర్టు రోడ్ సేఫ్టీ కమిటీ చైర్మన్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అభయ్ మనోహర్ సప్రే ప్రశంసించారు. గురువారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్‌తో కలిసి ఆయన జూబ్లీహిల్స్‌ను మాదాపూర్‌కు అనుసంధానించే జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 45 ఫ్లైఓవర్‌ను, కొండాపూర్‌ను గచ్చిబౌలితో అనుసంధానించే పీజేఆర్ ఫ్లైఓవర్ పైన ప్రమాదాలు జరగకుండా జీహెచ్ఎంసీ తీసుకున్న భద్రతా చర్యలను పరిశీలించారు.హెచ్చరిక సైన్ బోర్డులు, రేడియం స్టిక్కర్లు, సీసీ కెమెరాలు, రంబుల్ స్ట్రిప్‌లు, చెవ్రాన్ బోర్డులు, కాంక్రీట్ అడ్డంకులు, రాత్రిపూట వీధిలైట్ల ఏర్పాట్లు సహా అనేక భద్రతా చర్యలను ఆయన సమీక్షించారు. ప్రయాణికులు రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా తీసుకున్న చర్యలను కమిషనర్ ఆయనకు వివరించారు. రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు జీహెచ్ఎంసీ తీసుకున్న భద్రత చర్యల పట్ల జస్టిస్ సప్రే సంతృప్తి వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ ప్రాజెక్ట్స్ చీఫ్ ఇంజనీర్ భాస్కర్ రెడ్డి , మెయింటెనెన్స్ చీఫ్ ఇంజనీర్ సహదేవ్ రత్నాకర్‌లు చైర్మన్ వెంట ఉన్నారు. అనంతరం ఆయన నానక్‌రామ్‌గూడలోని హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ కార్యాలయాన్ని సందర్శించారు. అక్కడ అధికారులు ఔటర్ రింగ్ రోడ్ పై ట్రాఫిక్ నిర్వహణ వ్యవస్థ గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఓఆర్ఆర్ మీదుగా ప్రతిరోజూ 2.5 లక్షలకు పైగా వాహనాలు రాకపోకలు సాగిస్తాయని పేర్కొన్నారు.

రైతు ఆదాయం పెంపుపై అంతర్జాతీయ శిక్షణ

– పాల్గొన్న వివిధ దేశాల ప్రతినిధులు



ఏజీ వర్సిటీ: రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్(మేనేజ్)లో రైతు ఆదాయం పెంచడానికి తీసుకోవాల్సిన చర్యలపై అంతర్జాతీయ శిక్షణ కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. రెండు వారాలపాటు జరిగే ఈ శిక్షణలో ఈక్వెడార్, ఇథియోపియా, ఫిజీ, ఉగాండా, ఇరాన్, కెన్యా, మలావి, మారిషస్, ఇరాన్, నైజీరియా, దక్షిణాఫ్రికా, శ్రీలంక, టాంజానియా, థాయ్‌లాండ్, జాంబియా, జింబాబ్వే దేశాల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు. మేనేజ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ హనుమాన్ సింగ్ మాట్లాడుతూ రైతుల ఆదాయం పెంచడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న కాంట్రాక్ట్ ఫార్మింగ్, డిజిటల్ అగ్రికల్చర్, ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ వంటి పథకాల గురించి వివరించారు. శిక్షణలో పొందిన జ్ఞానం, అనుభవాన్ని తమ దేశాల్లో అమలు చేసి చిన్న రైతులకు బలమైన మద్దతు ఇవ్వాలని సూచించారు. రైతుల ఆదాయం పెంచడానికి అధికారుల ప్రధాన బాధ్యత, కొత్త పథకాలు, సాంకేతికతలు, మార్కెటింగ్ తదితర అంశాలను వివరించారు. వ్యవసాయ సంస్కరణలు, ప్రత్యామ్నాయ మార్కెటింగ్ నమూనాలు, అగ్రి–గిడ్డంగులు, నేషనల్ అగ్రికల్చరల్ మార్కెట్, రైతు బజార్, గ్రేడింగ్, వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్‌కు మద్దతు ఇచ్చే సంస్థాగత ఏర్పాట్లు వంటి అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీకాంత్, సంగమేశ్, నిధి శర్మ, కావేరి, నాగదుర్గారావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్‌కు మరో బ్యాటరీ వాహనం

ఉమ్మడి ఏపీ ప్రభుత్వ మాజీ సీఎస్ కాకి మాధవరావు విరాళం

లక్డీకాపూల్ : రోగులకు మెరుగైన సేవలందించేందుకు పౌర సమాజం నుంచి మరింత చేయూతనందించాలని నిమ్స్ డైరెక్టర్ నగరి బీరప్ప అన్నారు. గురువారం నిమ్స్‌లో రోగుల సౌకర్యార్థం మరో బ్యాటరీ వాహనాన్ని ఉమ్మడి ఏపీ రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధానకార్యదర్శి కాకి మాధవరావు అందించారు. తన కుమారుడు కాకి సుధీర్ స్మారకార్థం ఈ వాహనాన్ని డైరెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా బీరప్ప మాట్లాడుతూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహాయం అందించిన కాకి మాధవరావుకు కృతజ్ఞతలు తెలిపారు. దాతల సహకారంతో 8 బ్యాటరీ వాహనాలు ఆస్పత్రికి సమకూరాయన్నారు. త్వరలో మరో రెండు బ్యాటరీ వాహనాలు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. కార్యక్రమంలో అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లక్ష్మీభాస్కర్, మీడియా రిలేషన్ ఆఫీసర్ సత్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



నిమ్స్‌కు బ్యాటరీ కారును అందజేస్తున్న ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి కాకి మాధవరావు

సాక్షి సిటీ ప్లస్
13
హైదరాబాద్, శుక్రవారం
12, సెప్టెంబర్, 2025

పోటీలు అనగానే మనకు టక్కున గుర్తుకొచ్చేది యువతే.. అండర్ 14, అండర్ 17.. ఇలా పలు విభాగాల్లో యువతకు పోటీలు నిర్వహిస్తుండడం తెలిసిందే. అయితే మరి వయసు మళ్లిన వారి పరిస్థితి ఏంటి? వారికేమీ ఆటలు ఉండవా? వారిలో ఎలాంటి ప్రతిభా ఉండదా? అంటే ఉంటుందనే చెబుతున్నారు ముంబయికి చెందిన 'ఖ్యాల్' నిర్వాహకులు. ఈ విషయం మనలో చాలా మందికి తెలిసినా పెద్దగా పట్టించుకోము.. సరిగ్గా దీని కోసమే ఏర్పాటైన వేదికే ఖ్యాల్. అప్పటి వరకూ కుటుంబ బాధ్యతలు, ఉద్యోగల బాధ్యతలతో తల మునకలై.. వయసు మళ్లిన తర్వాత తమలోని ప్రతిభను ప్రదర్శించేందుకే ఖ్యాల్ ఏర్పాటు చేశారు. ఖ్యాల్ అంటే తమలోని సృజనాత్మకతను స్వేచ్ఛగా ప్రదర్శించడానికి, మెరుగుపరచడానికి కల్పించే అవకాశం.. అంటున్నారు నిర్వాహకులు.. – సాక్షి, సిటీబ్యూరో



ఫిఫ్టీ ప్లస్..
టాలెంట్ జోష్..

యాభై దాటాకే లైఫ్ స్టార్ట్ అంటున్న 'ఖ్యాల్'



వయసు మళ్లిన వారు అంటే చాలా మందికి ఓ చులకన భావం.. వారు ఏమీ చేయలేరు.. సాధించలేరు.. మరి అలాంటి భావాన్ని చెరిపేశారు కొందరు ప్రముఖులు.. సాధించాలనే తపన ఉంటే వయసుతో పనేంటి అను నిరూపించారు. 'హార్లాండ్ సాండర్స్ 62 సంవత్సరాల వయసులో కేఎఫ్‌సీని ప్రారంభించారు. ఫల్గుణి నాయర్ 49 సంవత్సరాల వయసులో నైకాను స్థాపించారు. హెన్రీ ఫోర్డ్ 45 సంవత్సరాల వయసులో మొదటి ఫోర్డ్ మోటార్ కారును ప్రజలకు పరిచయం చేశారు..' ఇవన్నీ కథలు కావు విజయాలకు ప్రేరకాలు అంటారు ఖ్యాల్ నిర్వాహకులు హేమాన్షు జైన్, ప్రీతిష్ నెల్లెరి.

యువత కోసమేనా కాంటెస్ట్?

ఏ పోటీ చూసినా అండర్ 25, అండర్ 30 ఇలా యువత, మధ్యవయసు వారికోసమే ఉంటున్నాయి. కానీ సిసలైన జీవితం 50 సంవత్సరాల వయసులో ప్రారంభమవుతుంది, ఆర్థిక స్థిరత్వం, జ్ఞానం, అభిరుచిని ఆస్వాదించే స్వేచ్ఛ అన్నీ ఉండేది అప్పుడే. వర్గీకరించబడేది వయసు మాత్రమే.. టాలెంట్ కాదు.. అందుకే ఖ్యాల్ 50 అబోవ్ 50ని ప్రారంభించింది. ఇందులో సింగర్ ఆఫ్ ది ఇయర్, చెఫ్ ఆఫ్ ది ఇయర్, మాస్టర్ గార్డెనర్ ఆఫ్ ది ఇయర్, పొయెట్ ఆఫ్ ది ఇయర్, క్రాస్ వర్డ్ చాంపియన్ ఆఫ్ ది ఇయర్... ఇలా ఏ రకమైన టాలెంట్ ఉన్నా సరే పాల్గొనేలా రూపొందించాం. వయసు కేవలం ఒక సంఖ్య మాత్రమే అని ఈ పోటీ ప్రపంచానికి గుర్తు చేయనుంది.



50 విభాగాల్లో 50మంది విజేతలు..

వయసు 50 ఏళ్ల దాటిన దగ్గర నుంచి రిటైర్మెంట్ ప్లానింగ్‌లోనో, ఆధ్యాత్మిక యాత్రల షెడ్యూల్ ఖరారులోనో బిజీగా ఉండే వారి ఆలోచనల్ని సమూలంగా మార్చడమే తమ ధ్యేయం అంటున్నారు ఈ కాంటెస్ట్ నిర్వాహకులు. ఫిఫ్టీ ప్లస్ వయసు వారి కోసం 50 అబోవ్ 50 పేరుతో ఏకంగా 50 విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. దేశవ్యాప్తంగా అన్ని ప్రధాన నగరాల్లోనూ దీనికి సంబంధించిన ఆడిషన్స్ నిర్వహిస్తున్నారు. అదే విధంగా గత నెలాఖరున నగరంలోనూ ఆడిషన్స్ నిర్వహించిన సందర్భంగా వీరు పంచుకున్న విశేషాలు వారి మాటల్లోనే..

ఇకిగై.. భావనకు అనుగుణంగా..

జపనీయుల దీర్ఘకాల, సంతోషకర జీవనానికి దోహదం చేస్తున్న 'ఇకిగై' కాన్సెప్ట్‌కు అనుగుణంగా రూపుదిద్దుకుంది. 'ఉద్యోగ విరమణ తర్వాత జీవితం పూర్తిగా కొత్తగా నిర్మించడం' దీని లక్ష్యం. గత 2020లో స్థాపించిన మా ఖ్యాల్, సీనియర్ సిటిజన్లకు సబ్‌స్క్రిప్షన్ ప్రాతిపదికన సేవలను అందిస్తుంది. వారి శారీరక, మానసిక, భావోద్వేగ సామాజిక శ్రేయస్సును పరిరక్షిస్తుంది. మా యాప్‌కు మూడు మిలియన్లకు పైగా వినియోగదారులు ఉన్నారు. 'సీనియర్లు వివిధ రకాల కార్యకలాపాల్లో పాల్గొన డానికి ఇష్టపడే ధోరణిని గమనించాం, ప్రోత్సహిస్తున్నాం, అంతిమంగా విభిన్న ఆసక్తులు కలిగిన సమూహాలను సృష్టించాలన్నదే మా తాపత్రయం.. అదే నేటి ఆడిషన్స్‌కు దారి తీసింది.



- 50 ప్లస్ కోసం 50కి పైగా పోటీల నిర్వహణ
- ముంబయికి చెందిన స్టార్టప్ వినూత్న ఆవిష్కరణ
- హైదరాబాద్ ఆడిషన్స్‌కు భారీ స్పందన
- ప్రతిభను ప్రదర్శించిన పలువురు సీనియర్ సిటిజన్స్
- దేశవ్యాప్తంగా ప్రధాన నగరాల్లో ఆడిషన్స్

నగరంలో ముగిసిన తొలి దశ ఆడిషన్స్..

నగరంలోని హిమాయత్‌నగర్‌లో ఇటీవలే ఈ పోటీ కోసం ఆడిషన్స్ నిర్వహించారు. పదుల సంఖ్యలో హాజరైన అభ్యర్థులు తమ ప్రతిభ, సామర్థ్యం ఆధారంగా పరీక్షించారు. వీరిలో ఎంపికైన వారి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.



ఈవెంట్ జరిగే తీరిది..

50 అబోవ్ 50 కోసం ఈ స్టార్టప్ ఆన్‌లైన్ వీడియో ఆడిషన్‌లను కూడా నిర్వహిస్తోంది. మే 1 నుంచి ప్రారంభమయ్యే పోటీల్లో హైదరాబాద్ అహ్మదాబాద్, బెంగళూరు, ముంబై, ఢిల్లీ, పుణె, లక్నో, జైపూర్, కొచ్చి, ఇండోర్ వంటి 20 నగరాలు పాల్గొంటాయి. ఇందులో భాగంగా పోటీదారులను ఒకచోట చేర్చడానికి కార్నివాల్ నిర్వహిస్తారు. సరదా నిండిన కార్యకలాపాలను నిర్వహిస్తారు. ఈ పోటీలో పాల్గొనడానికి ఆసక్తి ఉన్న వ్యక్తుల కోసం వ్యక్తిగత ఆడిషన్స్ సైతం ఉంటాయి. వడపోత తర్వాత, ప్రతి విభాగం నుంచి టాప్–10 ఫైనలిస్టులను సంబంధిత కేటగిరీ నిపుణులు షార్ట్‌లిస్ట్ చేస్తారు. చివరకు ప్రతి కేటగిరీ కింద బెస్ట్‌ని ఎంపిక చేయడానికి పబ్లిక్ ఓటింగ్ నిర్వహిస్తారు. ఈ జ్యూరీ సభ్యుల్లో ప్రముఖ ఇంద్రజాలికుడు నకుల్ షెనాయ్, రచయిత్రి గీతా రామానుజం, విజువల్ ఆర్టిస్ట్ సెల్వ ప్రకాష్ లక్ష్మణన్, కవి–ఎడిటర్ వినితా అగర్వాల్, కర్ణాటక న్యూమిస్మాటిక్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజేంద్ర మరుధర్ తదితరులు ఉన్నారు. ఖ్యాల్ విజేతలకు మొత్తం కలిపి రూ.1 కోటి నగదు బహుమతిని అందజేస్తారు. గ్రాండ్ ఫినాలే నవంబర్‌లో ముంబైలోని నెస్కో మైదానంలో జరుగుతుంది.






జెన్ కలెక్షన్..
దావన్ వాక్..

- ఫ్యాషన్ షోకేస్‌లో బాలీవుడ్ స్టార్ వరుణ్ ధావన్ సందడి
- ర్యాంప్ వాక్‌తో అలరించిన ధావన్, తారా సుతారియా..
- నగరంలోని ఫ్యాషన్, ఫుడ్ నా ఫేవరెట్ : వరుణ్ ధావన్

సాక్షి, సిటీబ్యూరో : హైదరాబాద్ నగరం 'ఫ్యాషన్, సాంస్కృతిక వైవిధ్యంతో పాటు మోడ్రన్ ట్రెండ్స్‌ను సమ్మిళితం చేసుకునే విధానం' అద్భుతమని ప్రముఖ బాలీవుడ్ నటుడు వరుణ్ ధావన్ తెలిపారు. నగర వేదికగా కల్కి ఆధ్వర్యంలో నిర్వహించిన మొట్టమొదటి స్వతంత్ర ఫ్యాషన్ షోకేజ్ ఫ్యాషన్ వాక్‌లో వరుణ్ ధావన్, తారా సుతారియా సందడి చేశారు. వరుణ్ వాక్‌తో, తారా సుతారియా డిజైనింగ్ వేర్‌తో వావ్ అనిపించారు. ఈ షో భారతీయ 'కచువా' (కొనుగోలుదారు అభిరుచి మేరకు ఫ్యాషన్ దుస్తులు తయారు చేయడం)కు ఐకానిక్ ఫ్యాషన్ షోకేజ్‌గా నిలిచింది. ఈ ప్రదర్శనలో భాగంగా 'జెన్' అనే కలెక్షన్‌ను ఆవిష్కరించారు. హస్తకళలోని సృజనాత్మకతను, పరిణామ క్రమాన్ని ప్రతిబింబిస్తుంది ఈ జెన్ ట్రెండ్స్. భారతదేశ గొప్ప ఎంబ్రాయిడరీ వారసత్వమైన జర్దోజీ, రేషమ్, సీక్విన్స్, మోతీ పని సమకాలీన నైపుణ్యాలతో, వినూత్న హస్తకళతో రూపొందించిన డిజైన్స్ ఈ ఫ్యాషన్ షోలో, జెన్ కలెక్షన్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయని కల్కి సీఈఓ సౌరభ్ గుప్తా అన్నారు. ఈ షోకేజ్‌లో బాలీవుడ్ తారలు 60కు పైగా జెన్ కమాండింగ్ లుక్స్ ప్రదర్శించారు. జెన్‌లో రూ.లక్ష నుంచి 6 లక్షల వరకూ విలువైన కలెక్షన్ ఉండటం విశేషం.

తరచూ వస్తుంటా..

హైదరాబాద్ వచ్చినప్పుడల్లా ఇక్కడి ఆహ్వానం, ఆతిథ్యం చాల గొప్పగా అనిపిస్తుంది. ఇది ఇక్కడి సంస్కృతిలో భాగం అనుకుంటా.. నగరంలోని వారసత్వపు కళకు తోడు అధునాతన ఫ్యాషన్ హంగులు జస్ట్ వావ్ అనిపిస్తాయి. హైదరాబాద్ ఫుడ్ అంటే నాకు అమితమైన ఇష్టం. ఇలా ఈవెంట్స్‌కు మాత్రమే కాకుండా తరచూ నగరానికి వస్తుంటా.. ఇక్కడ నాకు మంచి స్నేహితులు ఉన్నారు. ఈ వేదికపై ఫ్యాషన్ వాక్‌లో భాగం కావడం గొప్ప అను



బ్యాడ్మింటన్‌లో 'రుహి'కి రజతం

- గ్వాటెమాల ఇంటర్నేషనల్ టోర్నీలో మెరుపులు
- సుచిత్ర అకాడమీలో శిక్షణ పొందుతున్న రుహి

సాక్షి, సిటీబ్యూరో: ప్రతిష్ఠాత్మకంగా జరిగిన గ్వాటెమాల ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో నగరానికి చెందిన రుహి రాజు ఉత్కంఠపోరుతో రజత పతకాన్ని గెలుచుకుంది. ఈ టోర్నీలో అన్‌సీడెడ్ క్రీడాకారిణిగా ప్రవేశించిన రుహి క్వార్టర్ ఫైనల్స్‌కు ఆత్మవిశ్వాసంతో దూసుకెళ్లింది. అక్కడ ఆమె టాప్ సీడ్, స్థానిక ఫేవరెట్ నిక్టే సోటోమేయర్‌తో తలపడింది. 90 నిమిషాల ఉత్కంఠభరిత పోరాటంలో, రుహి మొదటి గేమ్‌ను 21–23తో కోల్పోయినప్పటికీ, తిరిగి పోరాడి రెండు గేమ్‌లను 21–19, 21–16తో గెలుచుకుంది. ఆ తర్వాత సెమీఫైనల్స్‌లో పెరూకు చెందిన నమీ మియాహిరాను 21–18, 21–17తో ఓడించి, ఫైనల్‌లో కొలంబియాకు చెందిన జూలియానా గిరాల్డో చేతిలో రన్నరప్‌గా నిలిచింది. ఫైనల్స్ ప్రదర్శన తర్వాత 'ఈ పతకం కేవలం మ్యాచ్‌లను గెలవడం గురించి కాదు, తాను మళ్లీ పైకి ఎదగగలనని నిరూపించుకోవడంలో భాగమని' రుహి తెలిపారు.



రుహి హైదరాబాద్‌లోని సుచిత్ర బ్యాడ్మింటన్ అకాడమీ వ్యవస్థాపకులు, ప్రధాన కోచ్ ప్రదీప్ రాజు మార్గదర్శకత్వంలో శిక్షణ పొందుతోంది. 'రుహికి, ఇది పతకాన్ని మించిన విజయమని' కోచ్ ప్రదీప్ రాజు పేర్కొన్నారు. సుదీర్ఘ విరామం తర్వాత ఆడిన మొట్టమొదటి టోర్నమెంట్‌లో ఫైనల్స్‌కు చేరుకోవడం భవిష్యత్తు విజయాలకు నాంది అని తెలిపారు.

బాలికలకు బాక్సింగ్ ఉచిత శిక్షణ

గోల్కొండ: సబ్‌జూనియర్, జూనియర్ స్థాయిలో బాలికల కోసం బాక్సింగ్ ఉచిత శిబిరం నిర్వహిస్తున్నామని బాక్సింగ్ జాతీయ కోచ్ షేక్ ఎజాజ్ అహ్మద్ అన్నారు. గోల్కొండ ఒవైసీ కమ్యూనిటీహాల్‌లోని బాక్సింగ్ ఎరినాలో బాలికల కోసం ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణ కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. గతంలో తాము నిర్వహించిన ఉచిత శిక్షణ శిబిరాలకు హైదరాబాద్ నలుమూలల నుంచే కాకుండా పొరుగు జిల్లాల నుంచి కూడా బాలికలు హాజరయ్యారన్నారు. అదే విధంగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే బాక్సింగ్ పోటీల్లో సైతం తమ బాక్సర్లు బంగారు పతకాలు సాధించారన్నారు. హైదరాబాద్ బాక్సింగ్ క్లబ్ ఆధ్వర్యంలో తాము నిర్వహిస్తున్న బాలికల బాక్సింగ్ ఉచిత శిబిరాలకు ఎమ్మెల్యే కౌసర్ సహకారం అందిస్తున్నారన్నారు. 45 రోజుల పాటు జరిగే ఈ మాన్సూన్ శిక్షణ శిబిరంలో వివిధ విభాగాల్లో 60 మంది బాలికలు తమ పేర్లు నమోదు చేసుకున్నారన్నారు.

15 నుంచి కోహినూర్ థియేటర్ కార్నివాల్

పంజగుట్ట: బంజారాహిల్స్ లోని ఓ్రైన కేఫ్‌ల్లో 'కోహినూర్ థియేటర్ కార్నివాల్' నిర్వహిస్తున్నట్లు క్రియేటివ్ థియేటర్ వ్యవస్థాపకులు అజయ్ మంకేనపల్లి తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో దీనికి సంబంధించిన కరపత్రాన్ని గురువారం ఆవిష్కరించారు. ఈ నెల 15 నుండి 17వరకు రవీంద్రభారతిలో మూడు రోజులపాటు నిర్వహించే జాతీయ నాటకోత్సవాలతో పాటు, వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులు ప్రదర్శన ఇస్తారన్నారు. వీటితోపాటు వర్క్‌షాప్‌లు కూడా ఉంటాయన్నారు. కార్యక్రమంలో శరత్, ఖాజా, అఫ్రిది, కిరీటి, చిన్న, దేవిక, అన్విక, అనిల్ పాల్గొన్నారు.

'హైలైఫ్'లో పండుగ కలెక్షన్

19 నుంచి నగరంలో ఫ్యాషన్ ప్రదర్శన

బంజారాహిల్స్: ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే హైలైఫ్ ఫ్యాషన్ లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్ ఈ నెల 19వ తేదీ నుంచి హెచ్ఐసీసీ నోవోటెల్ హోటల్‌లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఇందుకు సంబంధించిన సన్నాహక కార్యక్రమాన్ని బంజారాహిల్స్‌లో గురువారం నిర్వహించారు. సినీ నటీమణులు స్రవంతి చొక్కారపు, ప్రీతి సుందర్ పలువురు మోడల్స్ పాల్గొని ఎగ్జిబిషన్ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించనున్న డిజైనరీ దుస్తులు, ఆభరణాలను ధరించి ర్యాంప్ వాక్‌చేశారు. మూడు రోజుల పాటు సాగే ఈ ఎగ్జిబిషన్‌లో పండుగ కలెక్షన్స్‌తో పాటు దేశవ్యాప్తంగా ఎంతో పేరుగాంచిన డిజైనర్లు రూపొందించిన వస్త్రాభరణాలు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.





డిక్లరేషన్ ఇవ్వకుండా.. కొప్పులో మల్లెపూలు పెట్టుకున్నందుకు మెల్‌బోర్న్ విమానాశ్రయ ఇమిగ్రేషన్ అధికారులు నవ్య నాయర్ అనే మలయాళ నటికి రూ.1.14 లక్షల జరిమానా విధించారు. ఈమెకు ఎదురైన చేదు అనుభవం చాలా మందిని ఆశ్చర్యంలో ముంచెత్తింది. అవును. విదేశాల్లో ఇలాంటి చిత్రవిచిత్రమైన నిషేధాలు చాలా ఉన్నాయి.

పండ్లు, పూలు.. ఫైను.. జైలు!

నిషేధిత జాబితాలో పూలు, పండ్లు, కూరగాయలు

బూట్లకు మట్టి ఉన్నా, బ్లూజీన్స్ వేసినా నిషేధమే!

ఫైన్ కట్టాల్సి రావొచ్చు.. కటకటాలపాలూ కావొచ్చు

ఆశ్చర్యం కలిగిస్తున్న విదేశాల్లోని ఇమిగ్రేషన్ రూల్స్



ప్రయాణం అంటేనే వెంట తీసుకెళ్లే వస్తువులతో బ్యాగులు నిండాల్సిందే. మౌత్ ఫ్రెషనర్, పెర్ఫ్యూమ్ వంటి రోజూ వాడే వస్తువులు అయినా.. బంధువులు, స్నేహితులకు ఇచ్చే పిండివంటలు, బహుమతులైనా.. బాధ్యత, ప్రేమతో సూట్‌కేస్ బరువెక్కాల్సిందే. మనతోని అట్లుంటది మరి. మన దేశంలో అయితే ఫర్వాలేదు. పరాయి దేశం వెళితేనే సమస్య. ఎందుకంటే మనదగ్గరిలా ఏదిపడితే అది విదేశాలకు తీసుకెళతామంటే అక్కడి నిబంధనలు ఒప్పుకోవు. ఆస్ట్రేలియాలో ఇటీవలే జరిగిన నటి నవ్య నాయర్ ఘటనే ఇందుకు ఉదాహరణ. న్యూజిలాండ్‌లోని ఆక్లాండ్ విమానాశ్రయంలో 2002లో జరిగిన సంఘటన సైతం ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాలి. క్రికెటర్లు సౌరవ్ గంగూలీ, హర్భజన్ సింగ్ చెరి 200 న్యూజిలాండ్ డాలర్ల జరిమానా కట్టాల్సి వచ్చింది. వాళ్ల బ్యాగుల్లో తీసుకొచ్చిన బూట్లకు మట్టి, గడ్డి ఉండడమే ఇందుకు కారణం. వేడి చేయని పాలను కెనడా, ఆస్ట్రేలియా, అమెరికాలోని కొన్ని ప్రాంతాలకు తీసుకెళ్లకూడదు. గ్రీసులోని ప్రాచీన పర్యాటక ప్రదేశాలకు హైహీల్స్‌తో వెళ్లడం నిషిద్ధం. ఇలాంటివి మరికొన్ని..



సాక్షి, స్పెషల్ డెస్క్

- **ఆస్ట్రేలియా:** బయో సెక్యూరిటీ, కస్టమ్ చట్టాల ప్రకారం తాజా పూలు, పండ్లు, కూరగాయలు, మట్టిని తీసుకెళ్లడానికి వీల్లేదు. ఎందుకంటే ఇబ్బడిముబ్బడిగా వీటిని నాటితే అక్కడి పర్యావరణ వ్యవస్థ దెబ్బతింటుందన్నది వారి వాదన. సోన్‌పాపిడి, మైసూర్ పాక్ వంటి స్వీట్లు, మసాలా దినుసులు, పాల ఉత్పత్తులు కూడా నిషేధమే. ఈ జాబితాలో ఇంకా చాలా ఉన్నాయి.



- **ఆగ్నేయాసియా:** ఘాటైన వాసన వచ్చే డ్యూరియన్ (పనసలాంటి) పండును ప్రయాణంలో తీసుకెళ్లడాన్ని చాలా విమానయాన సంస్థలు నిషేధించాయి. ముఖ్యంగా కోసిన పండును తీసుకెళ్లరాదు. దీన్ని భారత్‌కు తీసుకురావాలంటే సరైన పద్ధతిలో ప్యాక్ చేయాలి. సింగపూర్‌లో చూయింగ్ గమ్ అమ్మకం, దిగుమతి నిషేధం. బహిరంగ ప్రదేశాల్లో గమ్స్‌ను ఉమ్మితే భారీ జరిమానా విధిస్తారు. మెడికల్ గమ్స్‌ను మాత్రమే అనుమతిస్తారు.
- **దక్షిణ కొరియా:** అమెరికాకు చెందిన ట్రేడర్ జో కంపెనీ తయారీ 'ఎవ్రీథింగ్ బట్ ది బేగల్ సీజనింగ్' బ్రాండ్ మసాలాలను విమాన ప్రయాణికుల నుంచి స్వాధీనం చేసుకున్నారు. ఈ మసాలాల్లో గసగసాలు ఉండడమే ఇందుకు కారణం. ఆ దేశం గసగసాలను మాదక ద్రవ్యాలుగా పరిగణిస్తుందట. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సౌదీ అరేబియా, సింగపూర్‌లలోనూ గసగసాలపై బ్యాన్ ఉంది.
- **కరీబియన్ దీవులు:** సైనికులు ధరించే దుస్తుల (క్యామఫ్లాజ్) వంటివి సాధారణ పౌరులు వేసుకోవడం చట్టవిరుద్ధం. సైన్యం మాత్రమే ధరించాలి. సైనికులుగా పొరపడే ప్రమాదం ఉంది కాబట్టి సాధారణ వ్యక్తులు ఈ దుస్తులతో విమానాశ్రయాల్లో కూడా కనిపించకూడదు. అలా చేస్తే జరిమానా వేస్తారు లేదా జైలుకు పంపుతారు.
- **యూఎస్:** ప్రపంచవ్యాప్తంగా పిల్లలు అమితంగా ఇష్టపడే కిండర్ సర్‌ప్రైజ్ ఎగ్స్ (కిండర్‌జాయ్)ను విమానంలో తీసుకురావడం నిషేధం. గొంతులో ఇరుక్కుపోయే ప్రమాదం ఉంది కాబట్టి పిల్లలకు సంబంధించిన ఆహార ఉత్పత్తుల్లో తినడానికి వీలుకాని వస్తువులను ఉంచకూడదు.
- **న్యూజిలాండ్:** పచ్చళ్లు, మాంసం, విత్తనాలు, విదేశీ మట్టి నిషేధం. పర్యావరణాన్ని కాపాడుకోవడంలో భాగంగా సరిహద్దు నిబంధనలను కఠినంగా అమలు చేస్తోంది.
- **ఇటలీ:** దేశంలోని కొన్ని ప్రాంతాల్లో ఫ్లిప్‌-ఫ్లాప్స్ లేదా శబ్దం వచ్చే బూట్లు వేసుకోకూడదన్న నిబంధన ఉంది. శబ్దం వస్తే స్థానికులకు చికాకు కలుగుతుందట.
- **కెనడా:** ఈ దేశంలో బేబీ వాకర్ నిషేధం. పిల్లలకు ఇందులో గాయాలవుతున్నాయని ప్రపంచంలో మొట్టమొదటిసారిగా కెనడా వీటిని తమ దేశంలో నిషేధించింది.
- **ఉత్తర కొరియా :** ఎంతో ఇష్టమని ఈ దేశానికి బ్లూజీన్స్‌తో వెళ్లేరు.. ఫైన్ కట్టాలి లేదా జైలుకు కూడా వెళ్లాల్సి రావొచ్చు. పాశ్చాత్య సంస్కృతికి ఇవి చిహ్నమని, ఇవి తమ సంస్కృతిని పాడుచేస్తాయని వీటిపై బ్యాన్ విధించారట.

క్లుప్తంగా...

సదరన్ ట్రావెల్స్‌కు పురస్కారం



సాక్షి, హైదరాబాద్: దేశంలో పేరెన్నికగన్న సదరన్ ట్రావెల్స్ సంస్థ పర్యాటక రంగంలో తన అసాధారణ సేవలకు మరోసారి గుర్తింపు పొందింది. ఇండియా ట్రావెల్ అవార్డ్స్ లో.. 'ట్రావెలర్స్ చాయిస్ ఎక్స్‌లెన్స్'అవార్డును అందుకుంది. ఢిల్లీలో మంగళవారం జరిగిన ఒక కార్యక్రమంలో కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, కేంద్ర పర్యాటక శాఖ డైరెక్టర్ జనరల్ సుమన్ బిల్లా పురస్కారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా, సదరన్ ట్రావెల్స్ ఎండీ కృష్ణమోహన్ మాట్లాడుతూ.. ఇండియా ట్రావెల్ అవార్డును రెండోసారి అందుకోవడం గొప్ప గౌరవమని అన్నారు.

శ్రీచైతన్య 'ఏఐఎన్ఏ' ఆవిష్కరణ

సాక్షి, హైదరాబాద్: శ్రీచైతన్య విద్యాసంస్థల్లో భాగమై..దేశంలోనే అగ్రగామి అయిన హైబ్రిడ్ లెర్నింగ్ ప్లాట్‌ఫాం ఇన్ఫినిటీ లెర్న్.. ఏఐఎన్ఏ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నర్చరింగ్ అసిస్టెంట్)ను తాజాగా ఆవిష్కరించింది. ఏఐఎన్ఏ భారతదేశపు మొట్టమొదటి వాయిస్‌-ఫెస్ట్, ఏఐ ఆధారిత మెంటార్. ఏఐ ఎన్ఏ సాధారణ చాట్‌బాట్ కాదు. విద్యార్థులకు తక్షణ సందేహనివృత్తి, టెస్ట్ అనలిటిక్స్, ప్రోత్సాహక సహకారం, వ్యక్తిగత ప్రణాళిక.. ఇవన్నీ ఒకే వేదికలో ఎప్పుడైనా, ఎక్కడైనా అందించేలా ప్రత్యేక ఏఐ మెంటార్‌ను రూపొందించారు. ఈ కార్యక్రమంలో శ్రీచైతన్య ఇన్‌స్టిట్యూషన్స్ సీఈవో, డైరెక్టర్ సుష్మ బొప్పన, ఇన్ఫినిటీలెర్న్ సీఈవో ఉజ్వల్‌సింగ్ పాల్గొన్నారు.

డాక్టర్ రఘురామ్‌కు బ్రిటన్ రాయల్ కాలేజ్ ఫెలోషిప్

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ రొమ్ము కేన్సర్ శస్త్ర వైద్యనిపుణుడు డాక్టర్ రఘురామ్ పిల్లరిశెట్టికి బ్రిటన్‌లోని ప్రఖ్యాత గ్లాస్గో రాయల్ కాలేజ్ ఆఫ్ ఫిజీషియన్ అండ్ సర్జన్ (ఆర్‌సీపీఎస్‌జీ) గౌరవ ఫెలోషిప్ ప్రదానం చేసింది. దక్షిణాసియాలో ఈ గౌరవం పొందిన అతి పిన్న వయస్కుడిగా ఆయన రికార్డు సష్టించారు. గ్లాస్గోలోని కాలేజీ హాల్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కాలేజీ అధ్యక్షుడు ప్రొఫెసర్ హనీ ఎటీబా ఈ ఫెలోషిప్‌ను డాక్టర్ రఘురామ్‌కు అందజేశారు. గత రెండు దశాబ్దాలుగా రొమ్ము కేన్సర్ చికిత్సల్లో డాక్టర్ రఘురామ్ ఎనలేని సేవలందిస్తున్నారని ఈ సందర్భంగా ప్రొఫెసర్ హనీ ఎటీబా కొనియాడారు.

హెచ్‌సీఏ బ్యాంక్ ఖాతా డీఫ్రీజ్ చేయండి: హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) బ్యాంక్ ఖాతాను డీఫ్రీజ్ చేయాలని సీఐడీ పోలీసులను హైకోర్టు ఆదేశించింది. హెచ్‌సీఏ అధ్యక్షుడితో పాటు కార్యవర్గంపై నిధుల దుర్వినియోగం, ఫోర్జరీ ఆరోపణల నేపథ్యంలో పోలీసులు కేసు నమోదు చేసిన విషయం విదితమే. ఇందులో భాగంగా దిల్‌సుఖ్‌నగర్ కెనరాబ్యాంక్‌లో హెచ్‌సీఏ ఖాతాను సీఐడీ సూచన మేరకు బ్యాంక్ అధికారులు స్తంభింపజేశారు. దీన్ని సవాల్ చేస్తూ తాత్కాలిక సీఈవో ఇంతియాజ్ ఖాన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ విచారణ చేపట్టారు. వాదనలు విన్న ధర్మాసనం.. అసోసియేషన్‌ను నడపాల్సి ఉన్నందున అకౌంట్‌ను డీఫ్రీజ్ చేయమని ఆదేశించారు.

'20 నుంచి బహుజన బతుకమ్మ'

సాక్షి, హైదరాబాద్: ప్రకృతి రక్షణే ప్రజల రక్షణగా.. బహుజన బతుకమ్మను ఈనెల 20 నుంచి నిర్వహించనున్నామని అరుణోదయ విమలక్క తెలిపారు. ఈనెల 14న ప్రసాద్‌ల్యాబ్స్‌లో 'బహుజన బతుకమ్మ'పాటను ఆవిష్కరించనున్నామని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్త్రీ- పురుషుల సమాన హక్కుల కోసం పోరాడదామని సూచించారు.

దంచికొట్టిన వాన

▶ మొదటి పేజీ తరువాయి

మబ్బులు కమ్ముకున్నాయి. కొన్ని ప్రాంతాల్లో మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు వర్షం కురిసింది. హయత్‌నగర్‌లో 11.2 సెం.మీ., డిఫెన్స్ కాలనీ కమాన్ వద్ద 10.2 సెం.మీ. వర్షపాతం నమోదైంది. హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపైకి భారీగా వరదనీరు వచ్చి చేరడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. రోడ్డుపై నాలుగు అడుగుల ఎత్తు మేర వరద నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. ఎల్బీనగర్ నుంచి మెహిదీపట్నం వరకు ఉన్న ఇన్నర్ రింగ్‌రోడ్డు సహా ఇతర మార్గాల్లో వాహనాల రాకపోకలకు తీవ్ర విఘాతం ఏర్పడింది.

వాగులో ఒకరి గల్లంతు

వాగు దాటుతుండగా ఓ వ్యక్తి గల్లంతైన ఘటన వికారాబాద్ జిల్లా తాండూరు మండలం సంగెంకలాన్‌లో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన భుక్తంపల్లి మొగులప్ప(40) ఆవుల కాపరిగా పని చేస్తున్నాడు. గురువారం అతను ఊరి శివారులోని చెట్టినాడు సిమెంట్ ఫ్యాక్టరీ సమీపంలో వృథాగా పడేసిన టార్పాలిన్, ప్లాస్టిక్ కవర్ల కోసం దిడ్డివాగు దాటి వెళ్లాడు. ఎగువ ప్రాంతంలో కరిసిన వర్షానికి వరద ఉధృతమైంది. అవతలి ఒడ్డున ఉన్న గ్రామస్తులు వద్దని వారిస్తున్నా వినకుండా కవర్ల మూటను నెత్తిపై పెట్టుకుని వాగు దాటుతూ కొట్టుకుపోయాడు. అతని భార్య లలితమ్మ, ఇద్దరు కొడుకులు అక్కడికి చేరుకుని కన్నీటి పర్యంతమయ్యారు. మొగులప్ప ఆచూకీ కోసం చేపట్టిన సహాయక చర్యలకు వర్షం ఆటంకం కలిగించింది.



ఎల్బీనగర్ వద్ద నీట మునిగిన రహదారి

రెండ్రోజులు మోస్తరు వర్షాలు

రాష్ట్రంలో రానున్న రెండ్రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. దక్షిణ ఒడిశా, ఉత్తరాంధ్ర సమీపంలో కొనసాగుతున్న ఉపరితల చక్రవాత ఆవర్తనం గురువారం కూడా కొనసాగింది. ఇది సముద్రమట్టం నుంచి సగటున 4.5 కి.మీ. ఎత్తువరకు కొనసాగుతోంది. మరో ద్రోణి సబ్ హిమాలయన్ పశ్చిమబెంగాల్, సిక్కిం ప్రాంతం నుంచి జార్ఖండ్, దక్షిణ ఒడిశా, ఉత్తరాంధ్ర తీర ప్రాంతం, పశ్చిమ మధ్య బంగాళాఖాతం వరకు కొనసాగుతోంది. వీటి ప్రభావంతో రాష్ట్రంలో పలుచోట్ల రెండు రోజులపాటు ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, కొన్నిచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదు కావొచ్చని వాతావరణ శాఖ వివరించింది. ప్రస్తుత నైరుతి సీజన్‌లో ఇప్పటివరకు సగటున 64.05 సెం.మీ. వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా... 78.52 సెం.మీ. నమోదైంది.

వర్షపాతం ఎక్కడెంత? (సెం.మీ.లో)

మెదక్	17.6
గున్‌గల్ (రంగారెడ్డి జిల్లా)	17.43
మోటకొండూరు (యాదాద్రి జిల్లా)	15.85
రాజ్‌పల్లి (మెదక్ జిల్లా)	13.5
కొలనుపాక (యాదాద్రి)	11.73
డిండి (నల్లగొండ జిల్లా)	11.3
తట్టిఅన్నారం (రంగారెడ్డి జిల్లా)	11.15
హయత్‌నగర్	10.5

వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి: సీఎం

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌తోపాటు రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో.. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. శిథిలావస్థకు చేరిన ఇళ్లలో నివాసముంటున్న వారిని ఖాళీ చేయించి.. సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కోరారు. హైదరాబాద్‌లో హైడ్రా, జీహెచ్‌ఎంసీ, ఎస్డీఆర్‌ఎఫ్, అగ్నిమాపక, ట్రాఫిక్, పోలీసు సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చూడాలన్నారు.

రాష్ట్రానికి పాలనా పక్షవాతం

▶ మొదటి పేజీ తరువాయి

చర్యల్లో విఫలమైందన్నారు. హైడ్రా చర్యల్లో భాగంగా ఎక్కడెక్కడ ఎవరెవరి ఆస్తులు కూల్చారు..సాధించిన ఫలితాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీగా ఈ ఎన్నికల్లో బీసీలకు 42 శాతానికి పైగానే టికెట్లు కేటాయిస్తామని స్పష్టం చేశారు. ఫార్ములా ఈ-కార్ రేస్ అవకతవకలపై ఏసీబీ విచారణలో వెల్లడైన అంశాలను ప్రభుత్వం బయటపెట్టి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ ఉస్మానియా వర్సిటీని సందర్శించిన సందర్భంగా రూ.1,000 కోట్లు ఇచ్చేందుకు సిద్ధమని చెప్పారన్నారు. అయితే అందుకు పూర్తి విరుద్ధంగా ఓయూ ఉద్యోగులకు ఈసారి నెల జీతమే ఆలస్యంగా వచ్చిందన్నారు. జాబ్ కేలండర్ ప్రకటిస్తారు కానీ.. దానిని అమలు చేయడం లేదని విమర్శించారు. గత ప్రభుత్వంలో పేపర్ లీకేజీలు జరిగితే కాంగ్రెస్ హయాంలో 'హోప్ బ్రేకేజ్'జరుగుతోందన్నారు.

కాళేశ్వరం మొత్తం ప్రాజెక్టుపై సీబీఐ విచారణ జరిపించాలి

కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌లపై కాకుండా నాణ్యత, అవినీతి, నిర్వహణ తదితర అంశాలు ముడిపడి ఉన్నందున మొత్తం ప్రాజెక్టుపైనే సీబీఐ విచారణ జరిపించాలని రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. వందరోజుల్లో ఎన్నికల హామీలు అమలు చేస్తామని చెప్పి..రెండేళ్లు కావొస్తున్నా ఏమీ చేయకపోవడంతో ప్రజలు ఇకపై ఏ ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. రెండునెలల్లో బిల్లులకు గవర్నర్ ఆమోదం తెలపాలంటున్న కాంగ్రెస్ నేతలు, మంత్రులు మరి స్పీకర్ వద్ద పెండింగ్‌లో ఉన్న పదిమంది ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల నోటీసులపై కాలపరిమితితో చర్యలెందుకు తీసుకోవడం లేదో చెప్పాలన్నారు. కాంగ్రెస్ సర్కార్ 'మిస్ మేనేజ్‌మెంట్'కారణంగానే తెలంగాణలో యూరియా కొరత ఏర్పడిందని ఒక విలేకరి వేసిన ప్రశ్నకు ప్రతిస్పందించారు. పార్టీలో అన్నీ సర్దుకుంటాయని, రాష్ట్ర కమిటీలో పరిమితంగా పోస్టులున్నందున అందరిని సంతృప్తి పరచలేమన్నారు. ఈ కమిటీలో చోటుదక్కని వారు ఎవరూ బాధపడొద్దని పార్టీలో ఇంకా 650 పోస్టులు ఉన్నాయని ఒక ప్రశ్నకు సమాధానమిచ్చారు. ఎమ్మెల్యే రాజాసింగ్ ఇటీవల పార్టీ ముఖ్యనేతలపై చేసిన వ్యాఖ్యలపై జర్నలిస్టులు అడిగిన ప్రశ్నకు ఆయన బదులిస్తూ 'ఎవరు పడితే వారు చేసే వ్యాఖ్యలకు సమాధానం ఇవ్వాల్సిన అవసరం లేదు'అని అన్నారు. తన వెనుకాల ఎవరూ లేరని కేవలం ప్రధానమంత్రి మోదీ మాత్రం ఉన్నారని చెప్పారు. జర్నలిస్టులపై జరిగిన దాడులను ఖండిస్తున్నామని, జర్నలిస్టులు, న్యాయవాదుల రక్షణకు చట్టం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.

రజాకార్ చిత్రం బాగుంది

బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు ప్రశంస

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ సంస్థానానికి స్వాతంత్ర్యం ఎలా లభించింది, గ్రామీణ ప్రాంతాల్లో నిజాం పాలనలో అత్యాచారాలు, అరాచకాలు.. ఆర్యసమాజ్ వంటి సంస్థలు రజాకార్లకు వ్యతిరేకంగా చేపట్టిన పోరాటాన్ని రజాకార్ సినిమాలో స్పష్టంగా చూపారని బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు ప్రశంసించారు. గురువారం ప్రసాద్ లాబ్స్‌లో ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీలు సి.అంజిరెడ్డి, మల్కకొమురయ్య, ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, చిత్రనిర్మాత గూడూరు నారాయణరెడ్డి, ఇతర నాయకులతో కలిసి ఆయన 'రజాకార్'సినిమా వీక్షించారు. అనంతరం రాంచందర్‌రావు మీడియాతో మాట్లాడుతూ గూడూరు నారాయణరెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. నిజాం పాలనలో జరిగిన ఘటనలను వాస్తవరూపంగా చూపిస్తూ చరిత్రను కళ్ల ముందు ఉంచారన్నారు.



కర్ర సహాయంతో మృతదేహాలను దొత్తివాగు దాటిస్తున్న గ్రామస్తులు

సాహసం చేసి మృతదేహాలను వాగు దాటించారు

పెంబి: నిర్మల్ జిల్లా పెంబి మండలం గుమ్మెన ఎంగ్లాపూర్ గ్రామంలో బుధవారం పిడుగుపాటుకు చనిపోయిన భార్యాభర్తల దేహాలను గురువారం గ్రామస్తులు సాహసం చేసి ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు దాటించారు. పిడుగుపాటుకు భార్యాభర్తలు ఎల్లయ్య, లక్ష్మి, ఎల్లయ్య మేనమామ బండారి వెంకటి పంట చేనులోనే మృతిచెందిన విషయం తెలిసిందే. అయితే దొత్తివాగు ఉధృతంగా ప్రవహించడంతో నాగాపూర్ గ్రామానికి చెందిన ఎల్లయ్య, లక్ష్మి మృతదేహాలను తరలించడం కుటుంబ సభ్యులకు వీలు కాలేదు. దీంతో గురువారం వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నప్పటికీ ఎస్సై హన్మాండ్లు, గుమ్మెన ఎంగ్లాపూర్, నాగాపూర్ గ్రామస్తులు సాహసం చేసి ఎల్లయ్య, లక్ష్మి మృతదేహాలను కర్రకు కట్టి వాగు దాటించారు. వాగు ఒడ్డున పోస్టుమార్టం అనంతరం ట్రాక్టర్‌లో గ్రామానికి తరలించి దహన సంస్కారాలు నిర్వహించారు. కాగా, బండారి వెంకటి మృతదేహానికి గుమ్మెన ఎంగ్లాపూర్ గ్రామంలోనే దహన సంస్కారాలు చేశారు.

పీఆర్ రెండో సవరణ చట్టానికి గవర్నర్ ఆమోదం

సాక్షి, హైదరాబాద్ : బీసీ రిజర్వేషన్ల బిల్లులకు గవర్నర్ ఆమోదం తెలిపారంటూ గురువారం మీడియాలో విస్తృత ప్రచారం జరిగింది. దీంతో స్థానిక సంస్థలకు పోటీ చేయాలనుకుంటున్న నేతలంతా ఒక్కసారిగా అప్రమత్తం అయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుపై మరో అడుగు పడినట్లేననే ఊహాగానాలు మొదలయ్యాయి. అయితే కొంత సమయానికి అసలు విషయం వెల్లడైంది. తెలంగాణ పంచాయతీ రాజ్ (రెండో సవరణ) చట్టం, 2025 బిల్లుపై గవర్నర్ సంతకం చేయడంతో గెజిట్ విడుదలయింది. ఈ సవరణ చట్టం ప్రకారం సంగారెడ్డి జిల్లాలో ఇంద్రేశం, జిన్నారం మున్సిపాలిటీల ఏర్పాటు, ఇస్నాపూర్ మున్సిపాలిటీ విస్తరణ, నల్లగొండ జిల్లాలోని హాలియా మున్సిపాలిటీ పరిధిలోని ఇబ్రహీంపేటను నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేశారు. అయితే అందరూ అనుకుంటున్నట్లు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లకు సంబంధించిన పంచాయతీరాజ్ (మూడో సవరణ) చట్టం, 2025 బిల్లుకు ఇంకా గవర్నర్ ఆమోదం లభించలేదని స్పష్టత వచ్చింది.

స్పీకర్‌కు ఫిరాయింపు ఎమ్మెల్యేల వివరణ

స్వయంగా హాజరు కావాలని స్పీకర్ ఆదేశించే చాన్స్

సాక్షి, హైదరాబాద్: పార్టీ ఫిరాయింపు ఆరోపణలను ఎదుర్కొంటున్న 10 మంది శాసనసభ్యులు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు వివరణ లేఖలు అందజేశారు. స్పీకర్ కార్యాలయం ఆ ఎమ్మెల్యేలకు విడతల వారీగా నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. అక్టోబర్ 31లోగా నిర్ణయం తీసుకోవాలని గడువు విధించిన నేపథ్యంలో 10 మంది ఎమ్మెల్యేలు ఆ నోటీసులకు తమ సమాధానాలు సమర్పించారు. ఆలిండియా స్పీకర్ కాన్ఫరెన్స్‌లో పాల్గొనేందుకు బెంగళూరు వెళ్లిన స్పీకర్ తిరిగి ఈ నెల 16న హైదరాబాద్‌కు చేరుకుంటారు. ఎమ్మెల్యేల వివరణలను పరిశీలించాక అవసరమైతే వారిని వ్యక్తిగతంగా హాజరు కావాలని స్పీకర్ మరోమారు నోటీసులిచ్చే అవకాశం ఉంది. స్పీకర్ నోటీసుల్లోని న్యాయ, రాజకీయపరమైన అంశాలపై ఆయా ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌రెడ్డితో ఈ నెల 7న సుదీర్ఘంగా చర్చించినట్లు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. వ్యక్తిగతంగా హాజరు కావాలని మరోమారు నోటీసులు అందితే న్యాయవాదులతో కలిసి హాజరవుతామని ఓ ఎమ్మెల్యే 'సాక్షి'కి చెప్పారు. తాము బీఆర్‌ఎస్‌లో కొనసాగుతున్నామని ప్రకటనలు చేస్తున్న ఎమ్మెల్యేలు ఇదే అంశాన్ని స్పీకర్ కార్యాలయంలో సమర్పించిన వివరణలోస్పష్టం చేసినట్లు సమాచారం.

అమరుల కుటుంబాలను ఆదుకున్న ఘనత కాంగ్రెస్‌దే: జూపల్లి

ఇంద్రవెల్లిలో స్మృతివనం ప్రారంభం



అమరుల స్తూపం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు,ప్రజాప్రతినిధులు

ఇంద్రవెల్లి: భూమి కోసం, స్వేచ్ఛ కోసం, దోపిడీకి వ్యతిరేకంగా పోరాడి అసువులు బాసిన అమర వీరుల కుటుంబాలను గుర్తించి స్తూపం వద్ద స్మృతివనం ఏర్పాటు చేయడంతోపాటు అమరుల కుటుంబాలను ఆదుకున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం ఆయన ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలో అమరుల స్తూపం వద్ద ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఎమ్మెల్సీ దండే విఠల్‌తో కలిసి స్మృతివనం ప్రారంభించారు. అమరవీరుల స్తూపం వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అమరవీరుల స్మారకార్థం ఇంద్రవెల్లిలో స్మృతివనం ఏర్పాటు చేయాలన్న ఇక్కడి గిరిజనుల చిరకాల కల నెరవేరిందని తెలిపారు. ఈ స్మృతివనం వద్ద ఏటా ఆదివాసీ అమరులకు స్వేచ్ఛా వాతావరణంలో నివాళులు అర్పించేందుకు ప్రభుత్వం అవకాశం ఇచ్చిందని అన్నారు. అనంతరం గిరిజన సంక్షేమ శాఖ, సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఇంద్రవెల్లి అమరవీరుల కుటుంబ సభ్యులకు రూ.10 లక్షల విలువైన ట్రైకార్ యూనిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ, కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలాచారి, మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ ఎంపీ సోయం బాపూరావ్ తదితరులు పాల్గొన్నారు.

శ్లాబ్ ఎక్కడిదాకా అయింది.. బిల్లులు వస్తున్నాయా?

- ఇందిరమ్మ లబ్ధిదారులతో ఫోన్‌లో మాట్లాడిన మంత్రి పొంగులేటి
- ఇందిరమ్మ ఇళ్ల కాల్ సెంటర్ ప్రారంభం
- టోల్ ఫ్రీ నంబర్ 1800 599 5991

సాక్షి, హైదరాబాద్: 'హలో... నేను గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని మాట్లాడుతున్నా. మీకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఇల్లు వచ్చిందా.. దానికి సంబంధించిన బిల్లులు వస్తున్నాయా.. ఇంటి శ్లాబ్ ఎక్కడి వరకు వచ్చింది..అధికారులు మీకు సహకరిస్తున్నారా'అంటూ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. గురువారం మంత్రి హైదరాబాద్‌లోని హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ కాల్ సెంటర్, హెల్ప్‌డెస్క్, ఇందిరమ్మ ఇళ్ల కాల్ సెంటర్‌ను ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులతో ఫోన్‌లో మాట్లాడారు. ముందుగా వనపర్తి జిల్లా ఖిల్లా ఘనపూర్ మండలం లబ్ధిదారుతో మాట్లాడారు. 'బేస్‌మెంట్ వరకు మా ఇల్లు పూర్తయింది. కానీ ఇంకా బిల్లు రాలేదు'అని ఆమె చెప్పారు. దీనికి మంత్రి స్పందిస్తూ బేస్‌మెంట్ పూర్తయి ఎన్ని రోజులైంది, దాని ఫొటోలు అప్‌లోడ్ చేశారా అని అడిగారు. అప్పుడు అక్కడే ఆధార్ నంబర్‌తో అన్నీ పరిశీలించారు. రూ.లక్ష వచ్చే సోమవారం మీ బ్యాంక్ అకౌంట్‌లో పడతాయని పొంగులేటి చెప్పారు. మరో వ్యక్తి ఫోన్ చేసి గ్రేటర్ హైదరాబాద్‌లో ఎప్పుడు ఇళ్లు ఇస్తారని అడగ్గా, పొంగులేటి స్పందిస్తూ నగరంలో స్థల సమస్య ఉందని, త్వరలోనే పరిష్కారం కనుగొని అర్హులందరికీ ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చారు.



టోల్‌ఫ్రీ కాల్ సెంటర్ నుంచి మాట్లాడుతున్న పొంగులేటి

ఉదయం 7 నుంచి రాత్రి 9 వరకు

టోల్‌ఫ్రీ కాల్ సెంటర్ ఫోన్ 1800 599 5991 రోజూ ఉదయం 7 నుంచి రాత్రి 9 గంటల వరకు పనిచేస్తుందని మంత్రి పొంగులేటి అన్నారు. ప్రధానంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించడంతోపాటు వాటిని పరిష్కరించడంలో చొరవ చూపడానికి ఈ కాల్ సెంటర్ ను వినియోగించుకోవచ్చన్నారు. ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి, వాటిని సంబంధిత అధికారుల వద్దకు తీసుకెళ్లి చర్యలు తీసుకుని లబ్ధిదారులకూ ఆ వివరాలను తెలియచేస్తారని పొంగులేటి చెప్పారు. అవినీతికి ఆస్కారం లేకుండా ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ గౌతమ్ పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లలో దేశానికే తెలంగాణ ఆదర్శం

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్ : స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం తన నివాసంలో మంత్రులు సీతక్క, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, వివేక్ వెంకటస్వామి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు తదితరులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఈ నెల 15వ తేదీన కామారెడ్డిలో నిర్వహించనున్న బహిరంగ సభకు సంబంధించిన ఏర్పాట్లను సమీక్షించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ల కోసం కృషి చేస్తుంటే, కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అడ్డుకుంటోందని సమావేశంలో మంత్రులు అభిప్రాయపడ్డారు.

బీజేపీకి ఏ చరిత్రా లేదు..

అందుకే అందరి చరిత్రలను హైజాక్ చేస్తుంది: కూనంనేని, అజీజ్ పాషా



ట్యాంక్ బండ్‌పై ఎర్రజెండా కవాతు నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

కవాడిగూడ (హైదరాబాద్): ఏ చరిత్రా లేని బీజేపీ అందరి చరిత్రను తమదంటూ ఆపాదించుకొని దుష్ప్రరాజకీయాలకు పాల్పడుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని గుర్తించి, సెప్టెంబర్ 17ను విలీన దినోత్సవంగా నిర్వహించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశా రు. సీపీఐ హైదరాబాద్ కౌన్సిల్ ఆధ్వర్యంలో 'తెలంగాణ సాయుధ పోరాటంలో అమరులైన వారిని స్మరించుకుందాం'అంటూ వారోత్సవాల్లో భాగం గా గురువారం ట్యాంక్ బండ్‌పై ఉన్న మఖ్దూం మొహియుద్దీన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ట్యాంక్‌బండ్‌పైనుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు అమరవీరులను స్మరించుకుంటూ రెడ్ సెల్యూట్ ర్యాలీ నిర్వహించారు. అజీజ్ పాషా మాట్లాడుతూ సెప్టెంబర్ 17ను తెలంగాణ విలీన దినోత్సవం లేదా తెలంగాణ రైతాంగ పోరాట దినోత్సవంగా గుర్తించాలని సీఎం రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు. రావి నారాయణరెడ్డి, ఎల్లారెడ్డి, మఖ్దూం మొహియుద్దీన్, కమలాదేవి విగ్రహాలను ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
124	32
81,549	25,005

విదేశీ సూచీలు

నాస్‌డాక్	22,039	▲	154
డోజోన్స్	46,091	▲	600
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,291	▲	66
డాక్స్	23,688	▲	55
హాంగ్‌సెంగ్	3,875	▲	63
నికాయ్	44,372	▲	544

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	87.75	88.77
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	117.90	120.91
€	యూరో	ఎస్‌బీఐ	101.90	104.66
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	59.11	60.62
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	57.25	59.51
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	66.43	70.09
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.59	24.06
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.10	24.35
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.49	13.32

స్టార్టప్‌లకు 'గేమింగ్' నిషేధం సెగ..

- యూనికార్న్‌ల లిస్టు నుంచి 4 స్టార్టప్‌లు ఔట్
- జాబితాలో డ్రీమ్11, ఎంపీఎల్ మొదలైనవి
- ఆస్క్ ప్రైవేట్ వెల్త్ హురున్ ఇండియా నివేదికలో వెల్లడి



ముంబై: దేశీయంగా రియల్ మనీ గేమ్స్ (ఆర్ఎంజీ)పై నిషేధం విధించడంతో పలు అంకురాల వాల్యుయేషన్‌పై ప్రభావం చూపింది. నాలుగు బడా సంస్థలు .. యూనికార్న్ (1 బిలియన్ డాలర్ల విలువ చేసే అంకురాలు) జాబితా నుంచి చోటు కోల్పోయాయి. డ్రీమ్11 (26 కోట్ల యూజర్లు), గేమ్స్ 24 x7 (12 కోట్ల యూజర్లు), గేమ్స్‌క్రాఫ్ట్ (3 కోట్ల యూజర్లు), మొబైల్ ప్రీమియర్ లీగ్ (9 కోట్ల యూజర్లు) వీటిలో ఉన్నాయి. ఇక యూనికార్న్‌లు కాకపోయినప్పటికీ 'జూపీ', 'విన్‌జో గేమ్స్'లాంటి సంస్థల వాల్యుయేషన్లు కూడా పడిపోయాయి. '2025 ఆస్క్ ప్రైవేట్ వెల్త్ హురున్ ఇండియా యూనికార్న్, ఫ్యూచర్ యూనికార్న్' నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి.

ఆన్‌లైన్ మనీ గేమ్స్‌ను నిషేధించే బిల్లును పార్లమెంటు గత నెల ఆమోదించిన సంగతి తెలిసిందే. దీని ప్రకారం ఆన్‌లైన్ మనీ గేమ్స్ సంబంధిత ప్రకటనలపై కూడా నిషేధం వర్తిస్తుంది. అలాంటి గేమ్స్ ఆడేందుకు నగదును బదిలీ చేసే సర్వీసులను సైతం బ్యాంకులు, ఆర్థిక సంస్థలు అందించకూడదు. ''ఇలాంటి మార్పులన్నింటి వల్ల భారత్‌లో పేరొందిన పలు ఆర్ఎంజీ కంపెనీలపై ప్రభావం పడింది. దీనితో వాటి వృద్ధి నెమ్మదించే అవకాశం ఉంది'' అని నివేదిక పేర్కొంది. అలాగే ఈ చట్టం వల్ల పరిశ్రమపై ఇన్వెస్టర్ల నమ్మకం కూడా సడలిందని వివరించింది. మరోవైపు, అంకురాలు క్రమంగా లాభదాయకత, పెట్టుబడులను సమర్ధంగా వినియోగించుకోవడం, దీర్ఘకాలంలో నిలకడగా ఉండే వ్యాపార విధానాల వైపు మొగ్గు చూపుతున్నాయని ఆస్క్ ప్రైవేట్ వెల్త్ ఎండీ రాజేశ్ సలూజా తెలిపారు.

నివేదికలోని మరిన్ని ముఖ్యాంశాలు..

- 8.2 బిలియన్ డాలర్ల వాల్యుయేషన్‌తో అత్యంత విలువైన భారతీయ స్టార్టప్‌గా డిస్కౌంట్ బ్రోకరేజీ సంస్థ జిరోధా అగ్రస్థానంలో ఉంది. చెరి 7.5 బిలియన్ డాలర్లతో ఫిన్‌టెక్ సంస్థ రేజర్‌పే, లెన్స్‌కార్ట్ ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి.
- అత్యధికంగా 26 అంకురాలతో బెంగళూరు యూనికార్న్ హబ్‌గా నిల్చింది. వీటి మొత్తం వాల్యుయేషన్ 70 బిలియన్ డాలర్లుగా ఉంది. ఇక 36.3 బిలియన్ డాలర్ల విలువ చేసే 12 స్టార్టప్‌లతో ఢిల్లీ–ఎన్‌సీఆర్ (నేషనల్ క్యాపిటల్ రీజియన్) రెండో స్థానంలో, 22.8 బిలియన్ డాలర్ల విలువ చేసే 11 సంస్థలతో ముంబై మూడో స్థానంలో నిల్చాయి.
- దేశీయంగా అత్యంత పిన్న వయస్కులైన యూనికార్న్ వ్యవస్థాపకులుగా జెప్టో ఫౌండర్లు కైవల్య ఓహ్రా, ఆదిత్ పలిచా (ఇద్దరికీ 22 ఏళ్లు) నిల్చారు.
- వెంచర్ క్యాపిటల్ సంస్థ పీక్ ఎక్స్‌వీ పార్ట్‌నర్స్ భారతీయ స్టార్టప్స్‌లో అత్యధికంగా ఇన్వెస్ట్ చేసింది. టర్టిల్‌మింట్, వాట్‌ఫిక్స్, గ్రో, ప్రిజమ్ (ఓయో) సహా 68 అంకురాల్లో 200 మిలియన్ డాలర్ల పైగా పెట్టుబడులు పెట్టింది. అత్యంత విలువైన స్టార్టప్‌లు ఏకంగా 3.74 లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. యూనికార్న్‌లలో ఉపాధి పొందుతున్న వారి సంఖ్య 2.06 లక్షలుగా ఉంది.

11 కొత్త యూనికార్న్‌లు ..

కొన్ని ఆర్ఎంజీ కంపెనీలు లిస్టు నుంచి నిష్క్రమించినప్పటికీ ఈ ఏడాది యూనికార్న్‌ల జాబితాలోని స్టార్టప్‌ల సంఖ్య మొత్తం మీద పెరిగి, 73కి చేరింది. ఈ ఏడాది 11 అంకురాలు యూనికార్న్ హోదా దక్కించుకున్నాయి. ఏఐడాట్‌టెక్, నవీ టెక్నాలజీస్, వివృతి క్యాపిటల్, వెరిటాస్ ఫైనాన్స్, ర్యాపిడో, నెట్రాడైన్, జంబోటెయిల్, డార్విన్‌బాక్స్, మనీవ్యూ, జస్‌పే, డ్రూల్స్ వీటిలో ఉన్నాయి.

రూపాయి బేజారు



- 24 పైసలు క్షీణించి 88.35 వద్ద క్లోజ్
- ఇంట్రాడే, ముగింపుల్లో సరికొత్త కనిష్టాలకు

ముంబై: డాలర్ మారకంలో రూపాయి విలువ 24 పైసలు బలహీనపడి సరికొత్త కనిష్టం 88.35 వద్ద స్థిరపడింది. అమెరికా వాణిజ్య ఆంక్షల నేపథ్యంలో భారత కరెన్సీపై భారీ ఒత్తిడి నెలకొంది. అమెరికా ద్రవ్యోల్బణ డేటా వెల్లడికి ముందు డాలర్ పుంజుకోవడం, విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు, క్రూడాయిల్ ధరలు పెరుగుదల అంశాలు దేశీయ కరెన్సీ కోతకు కారణమయ్యాయి. ఉదయం ఫారెక్స్ మార్కెట్లో 88.11 వద్ద రూపాయి ట్రేడింగ్ మొదలైంది. ఒక దశలో 38 పైసలు క్షీణించి 88.49 వద్ద ఇంట్రాడే రికార్డు కనిష్టాన్ని నమోదు చేసింది. అయితే భారత్‌తో వాణిజ్య ఒప్పంద అడ్డంకులను అధిగమించేందుకు తమ యంత్రాంగం చర్చలు జరుపుతుందనే ట్రంప్ వ్యాఖ్యలతో కొంతమేర రికవరీ అయ్యింది. రానున్న రోజుల్లో 88.75 – 88.50 శ్రేణిలో ట్రేడవ్వొచ్చని నిపుణులు తెలిపారు.

కొనసాగిన లాభాలు

- సెన్సెక్స్ లాభం 124 పాయింట్లు
- వాణిజ్య ఒప్పంద చర్చల పునరుద్ధరణ
- కలిసొచ్చిన అంతర్జాతీయ సంకేతాలు
- మళ్లీ 25,000 స్థాయిపైకి నిఫ్టీ



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ లాభాల పరంపర కొనసాగింది. ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్ల తగ్గింపు అంచనాలతో అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లలో నెలకొన్న సానుకూల సంకేతాలు కలిసొచ్చాయి. భారత్–అమెరికా వాణిజ్య చర్చల పునరుద్ధరణ ఇన్వెస్టర్లకు విశ్వాసాన్నిచ్చింది. ఫలితంగా గురువారం సెన్సెక్స్ 124 పాయింట్లు బలపడి 81,549 వద్ద స్థిరపడింది. ఈ సూచీకిది నాలుగో రోజూ లాభాల ముగింపు. వరుసగా ఏడో రోజూ లాభపడిన నిఫ్టీ 32 పాయింట్లు పెరిగి మూడు వారాల గరిష్టం 25,005 వద్ద నిలిచింది. హాంగ్‌కాంగ్ మినహా ఆసియాలో అన్ని మార్కెట్లు 1% పెరిగాయి. యూరప్ మార్కెట్లు అరశాతం లాభపడ్డాయి. అమెరికా స్టాక్ సూచీలు లాభాల్లో ట్రేడవుతున్నాయి.

- ఎక్స్‌పైరీ రోజు ఒడిదుడుకుల నియంత్రణ, స్పెక్యులేషన్ అరికట్టే చర్యల్లో భాగంగా రిటైల్ ఇన్వెస్టర్ల రక్షణార్థం సెబీ దశల వారీగా వీక్లీ డెరివేటివ్స్ కాంట్రాక్టులను నిలిపివేస్తుందనే వార్తలు వెలుగులోకి వచ్చాయి. దీంతో బీఎస్‌ఈ షేరు 4.6%, బ్రోకరేజ్ సంస్థ ఏంజెల్ వన్ 5% పతనమయ్యాయి.

రిలయన్స్ భారీ ఫుడ్ పార్క్

రూ. 1,500 కోట్ల పెట్టుబడులు



న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ దిగ్గజం రిలయన్స్ కన్జూమర్ ప్రొడక్ట్స్ ఆహారోత్పత్తులు, పానీయాల తయారీకి ఏకీకృత ప్లాంటును ఏర్పాటు చేయనుంది. మహారాష్ట్రలోని నాగ్‌పూర్(కాటోల్)లో ఏర్పాటు చేయనున్న ఈ యూనిట్‌పై రూ. 1,500 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. ఈ యూనిట్ ఏర్పాటుకు డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎఫ్ఎంసీజీ విభాగం రిలయన్స్ కన్జూమర్.. మహారాష్ట్ర ప్రభుత్వంతో అవగాహనా ఒప్పందాన్ని(ఎంవోయూ) కుదుర్చుకుంది. ఈ యూనిట్‌తో 500మందికిపైగా ఉపాధి కల్పించనుంది. 2026లో తయారీ యూనిట్ కార్యకలాపాలు ప్రారంభంకానున్నాయి. గత నెలలో నిర్వహించిన వార్షిక సాధారణ సమావేశం (ఏజీఎం)లో రిలయన్స్ చైర్మన్ ముకేశ్ అంబానీ సమీకృత ఫుడ్ పార్క్‌ల ఏర్పాటుకు రూ. 40,000 కోట్లు వెచ్చించనున్నట్లు వెల్లడించిన విషయం విదితమే. ఏఐ ఆధారిత ఆటోమేషన్, రోబోటిక్స్, ఆధునిక టెక్నాలజీలతో ఆసియాలోనే అతిపెద్ద ఫుడ్ పార్క్‌కు తెరతీయనున్నట్లు వివరించారు. రిలయన్స్ రిటైల్ నుంచి ఆవిర్భవించిన రిలయన్స్ కన్జూమర్ మూడేళ్లలోనే రూ. 11,000 కోట్ల టర్నోవర్‌ను సాధించినట్లు ఏజీఎంలో తెలిపారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..	
స్వ్రాప్ సర్టిఫికెట్‌తో అదనపు డిస్కౌంట్..	టాటా క్యాపిటల్ మెగా ఐపీవో వచ్చే నెలలో!

ఇన్ఫీ 18,000 వేల కోట్ల రికార్డ్ బైబ్యాక్

- షేరుకు రూ. 1,800 ధర ఖరారు
- బోర్డు సమావేశంలో ఆమోదం



న్యూఢిల్లీ: ఐటీ సేవల దేశీ దిగ్గజం ఇన్ఫోసిస్ బోర్డు సొంత ఈక్విటీ షేర్ల కొనుగోలు(బైబ్యాక్)కి అంగీకరించింది. గురువారం (11న) సమావేశమైన బోర్డు షేరుకి రూ. 1,800 ధర మించకుండా 2.41 శాతం వాటా బైబ్యాక్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా రూ. 18,000 కోట్లు వెచ్చించనుంది. వెరసి రూ. 5 ముఖ విలువ గల 10 కోట్ల ఈక్విటీ షేర్లను తిరిగి కొనుగోలు చేయనుంది. గురువారం బీఎస్‌ఈలో ముగింపు ధర రూ. 1,510తో పోలిస్తే బైబ్యాక్‌కు 19 శాతం ప్రీమియంను నిర్ణయించింది. కంపెనీ 2025 జూన్ త్రైమాసికంలో 88.4 కోట్ల డాలర్ల (రూ. 7,805 కోట్లు) ఫ్రీ క్యాష్ ఫ్లోను ప్రకటించింది. కాగా.. కంపెనీ తొలిసారి 2017లో ఈక్విటీ షేర్ల బైబ్యాక్‌ను చేపట్టింది. ఈక్విటీలో 4.92 శాతం వాటాకు సమానమైన 11.3 కోట్ల షేర్లను తిరిగి కొనుగోలు చేసింది. ఇందుకు ఒక్కో షేరుకి రూ. 1,150 ధరలో రూ. 13,000 కోట్లు వెచ్చించింది. ఆపై రెండోసారి 2019లో రూ. 8,260 కోట్లు, మూడోసారి 2021లో 9,200 కోట్లు చొప్పున షేర్ల బైబ్యాక్‌కు వినియోగించింది. ఈ బాటలో 2022లోనూ రూ. 9,300 కోట్లతో ఓపెన్ మార్కెట్ ద్వారా రూ. 1,850 ధర మించకుండా బైబ్యాక్ చేపట్టింది.

ఇన్ఫోసిస్ షేరు 1.5% క్షీణించి రూ. 1,510 వద్ద ముగిసింది.

హెచ్‌ఎండీ చౌక 5జీ స్మార్ట్‌ఫోన్

రూ.8,999కే లభ్యం ● రెండు 4జీ ఫీచర్ ఫోన్లు కూడా



న్యూఢిల్లీ: నోకియా హ్యాండ్‌సెట్‌ల తయారీదారు హెచ్‌ఎండీ సంస్థ 'వైబ్ 5జీ' పేరుతో స్మార్ట్‌ఫోన్‌ను భారత మార్కెట్లో విడుదల చేసింది. దీని ధర రూ.8,999 గా ఉంది. కంపెనీ నుంచి రూ.10,000 లోపు ధరలో వస్తున్న తొలి స్మార్ట్‌ఫోన్ ఇది. ఇందులో ఆండ్రాయిడ్ 15 ఆపరేటింగ్ సిస్టమ్, 50 మెగాపిక్సల్ రియర్ కెమెరా ఉంది. 5000 ఎంఏహెచ్ కెపాసిటీ ఉన్న బ్యాటరీని అమర్చారు. దీనికి 18 వాట్ల ఫాస్ట్ చార్జింగ్‌కు సపోర్ట్ ఉంది. 4జీబీ ర్యామ్, 128జీబీ స్టోరేజ్ లభిస్తుంది. ఈ స్మార్ట్‌ఫోన్‌కు ఏడాది రిప్లేస్‌మెంట్ గ్యారెంటీ సదుపాయం ఉంది. అలాగే హెచ్‌ఎండీ 101 4జీ, 102 4జీ పేరిట రెండు 4జీ ఫీచర్ ఫోన్లను లాంచ్ చేశారు. వీటి ధరలు వరుసగా రూ.1,899, రూ.2,199గా ఉన్నాయి.



పూజా రాణికి పతకం ఖాయం

లివర్‌పూల్: ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్ మహిళల విభాగంలో భారత్‌కు మూడో పతకం ఖాయమైంది. ఇప్పటికే నుపుర్ షెరాన్ (ప్లస్ 80 కేజీలు), జైస్మీన్ లంబోరియా (57 కేజీలు) సెమీఫైనల్‌కు చేరి కనీసం కాంస్య పతకాలు ఖాయం చేసుకోగా... 80 కేజీల విభాగంలో పూజా రాణి కూడా సెమీస్‌లో అడుగు పెట్టింది. తొలి రౌండ్‌లో 'బై' దక్కించుకున్న 34 ఏళ్ల పూజ క్వార్టర్ ఫైనల్లో 3:2 తేడాతో ఎమిలియా కొటెరస్కా (పోలాండ్)పై విజయం సాధించింది. సెమీఫైనల్లో ఎమిలీ అస్‌క్విత్ (స్విట్జర్లాండ్)తో పూజ తలపడనుంది. పురుషుల 65 కేజీల విభాగంలో అభినాశ్ జమ్వాల్ 1:4తో ఒలింపిక్ కాంస్య పతక విజేత లాషా గురులి (జార్జియా) చేతిలో ఓడాడు. ఇక భారత్ నుంచి జాదూమణి సింగ్ (48 కేజీలు), మీనాక్షి (48 కేజీలు) మాత్రమే పోటీలో ఉన్నారు. తాష్కెంట్‌లో జరిగిన గత ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత్ నుంచి దీపక్ భోరియా (51 కేజీలు), హుసాముద్దీన్ (57 కేజీలు), నిశాంత్ దేవ్ (71 కేజీలు) కాంస్యాలు సాధించారు.



స్విట్జర్లాండ్‌లో భారత రాయబారి మృదుల్ కుమార్‌తో రిత్విక్

భారత్ X స్విట్జర్లాండ్

నేటి నుంచి డేవిస్‌కప్ వరల్డ్ గ్రూప్ మ్యాచ్

బీల్ (స్విట్జర్లాండ్): వచ్చే ఏడాది డేవిస్‌కప్ క్వాలిఫయర్స్‌లో చోటు కోసం భారత పురుషుల టెన్నిస్ జట్టు కీలకపోరుకు సిద్ధమైంది. నేటి నుంచి రెండు రోజులపాటు స్విట్జర్లాండ్ జట్టుతో వరల్డ్ గ్రూప్ తొలి రౌండ్‌లో భారత్ ఆడనుంది. ముఖాముఖి పోరులో భారత్ 2–1తో స్విట్జర్లాండ్‌పై ఆధిక్యంలో ఉంది. భారత్ తరఫున సింగిల్స్‌లో సుమిత్ నగాల్, దక్షిణేశ్వర్ సురేశ్, డబుల్స్‌లో హైదరాబాద్ ప్లేయర్ బొల్లిపల్లి రిత్విక్ చౌదరి–శ్రీరామ్ బాలాజీ జోడీ బరిలోకి దిగనుంది. నేడు జరిగే రెండు సింగిల్స్ మ్యాచ్‌ల్లో జెరోమ్ కిమ్‌తో దక్షిణేశ్వర్ సురేశ్; మార్క్ ఆండ్రియా హుస్లెర్‌తో సుమిత్ నగాల్ తలపడతారు. శనివారం మూడు మ్యాచ్‌లు జరుగుతాయి. డబుల్స్ మ్యాచ్‌లో జాకబ్ పాల్–డొమినిక్ స్ట్రికర్ జంటతో రిత్విక్–శ్రీరామ్ బాలాజీ ద్వయం పోటీపడుతుంది. అనంతరం జెరోమ్ కిమ్‌తో నగాల్; హుస్లెర్‌తో సురేశ్ ఆడతారు. గురువారం 'డ్రా' కార్యక్రమం కంటే ముందు భారత టెన్నిస్ జట్టుకు స్విట్జర్లాండ్‌లోని భారత రాయబారి మృదుల్ కుమార్ సన్మానించారు.

చైనా చేతిలో భారత్ ఓటమి

హాంగ్జౌ: ఆసియా కప్ మహిళల హాకీ టోర్నీలో చైనా జట్టుతో గురువారం జరిగిన 'సూపర్–4' మ్యాచ్‌లో భారత్ 1–4తో ఓడిపోయింది. భారత్ తరఫున ముంతాజ్ ఖాన్ (38వ నిమిషంలో) ఏకైక గోల్ చేసింది. చైనా తరఫున జు మెరాంగ్ (4వ, 56వ నిమిషాల్లో) రెండు గోల్స్... చెన్ యాంగ్ (31వ నిమిషంలో), టాన్ జిన్‌జువాంగ్ (47వ నిమిషంలో) ఒక్కో గోల్ సాధించారు. 'సూపర్–4' దశలో ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన చైనా ఆరు పాయింట్లతో ఫైనల్లోకి ప్రవేశించింది. శనివారం జరిగే చివరి రౌండ్ 'సూపర్–4' మ్యాచ్‌ల్లో జపాన్‌తో భారత్; చైనాతో కొరియా తలపడతాయి.

అంపైర్లు, రిఫరీలంతా మహిళలే

- మహిళల వన్డే వరల్డ్ కప్‌లో తొలిసారి ఐసీసీ ప్రయోగం



జీఎస్ లక్ష్మి



జనని, గాయత్రి, వృందా (ఎడమ నుంచి)

దుబాయ్: 'మహిళల ప్రపంచ కప్ ఫైనల్లో రిఫరీగా వ్యవహరించాలనేది నా కోరిక'... ఆరేళ్ల క్రితం అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఇంటర్నేషనల్ రిఫరీస్ ప్యానెల్‌లోకి ఎంపికైన తొలి మహిళగా గుర్తింపు పొందిన తర్వాత గండికోట సర్వ (జీఎస్) లక్ష్మి చెప్పిన మనసులో మాట ఇది. ఇప్పుడు ఆమె కల నెరవేరే సమయం వచ్చింది! ఈ నెల 30 నుంచి జరిగే మహిళల వన్డే వరల్డ్ కప్ కోసం ఐసీసీ ఎంపిక చేసిన నలుగురు రిఫరీలో బృందంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 57 ఏళ్ల లక్ష్మికి కూడా చోటు దక్కింది. భారత్, శ్రీలంక సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ ప్రపంచ కప్ కోసమే ఐసీసీ పూర్తిగా మహిళలతో కూడిన అధికారుల బృందాన్ని తొలిసారిగా ఎంపిక చేయడం విశేషం. నలుగురు రిఫరీలతో పాటు 14 మంది అంపైర్లు ఈ మెగా ఈవెంట్లో విధులు నిర్వర్తించనున్నారు. 'వరల్డ్ కప్ మ్యాచ్ అఫీషియల్స్‌గా మహిళలనే ఎంపిక చేయడం ఒక కీలక మలుపు. క్రికెట్‌లో లింగ సమానత్వం దిశగా ఐసీసీ అంకితభావానికి ఇదో నిదర్శనం. మంచి అవకాశం దక్కించుకున్న వీరంతా ముున్ముందు మహిళలకు స్ఫూర్తిగా నిలుస్తారు' అని ఐసీసీ చైర్మన్ జై షా అన్నారు. ఓవరాల్‌గా నాలుగోసారి మహిళలే మొత్తం టోర్నీని పర్యవేక్షించనున్నారు. ఇంతకుముందు 2022 బర్మింగ్‌హమ్ కామన్వెల్త్ గేమ్స్ క్రికెట్ ఈవెంట్, గత రెండు టి20 వరల్డ్‌కప్‌లు మొత్తం మహిళా అంపైర్లు, రిఫరీల ఆధ్వర్యంలోనే జరిగింది.

రిఫరీల జాబితా: జీఎస్ లక్ష్మి, ట్రూడీ అండర్సన్, షాంద్రే ఫ్రిట్జ్, మిచెల్ పెరీరా.

అంపైర్ల జాబితా: ఎస్.జనని, వృందా రాఠి, గాయత్రి వేణుగోపాలన్, లౌరెన్ ఏజెన్‌బాగ్, క్యాండీస్ బోర్డే, కిమ్ కాటన్, సారా దంబనెవన, షాతిరా జాకీర్, కెరిన్ క్లాస్టే, నిమాలి పెరీరా, క్లెయిర్ పొలొసాక్, స్యూ రెడ్‌ఫెర్న్, ఎలోయిస్ షెరిడాన్, జాక్విలిన్ విలియమ్స్.

ఆయుశ్ సంచలనం

- ప్రపంచ 9వ ర్యాంకర్ నరోకాపై గెలుపు
- క్వార్టర్ ఫైనల్లో సాత్విక్–చిరాగ్ జోడీ



హాంకాంగ్: భారత బ్యాడ్మింటన్ రైజింగ్ స్టార్ ఆయుశ్ శెట్టి హాంకాంగ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–500 టోర్నీలో సంచలనం సృష్టించాడు. ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్, 2023 ప్రపంచ చాంపియన్‌షిప్ రన్నరప్ కొడాయ్ నరోకా (జపాన్)ను బోల్తా కొట్టించాడు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 31వ ర్యాంకర్ ఆయుశ్ 72 నిమిషాల్లో 21–19, 12–21, 21–14తో ఐదో సీడ్ నరోకాను ఓడించి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. భారత నంబర్‌వన్ లక్ష్య సేన్ కూడా క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టాడు. సహచరుడు హెచ్ఎస్ ప్రణయ్‌తో జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో లక్ష్య సేన్ 15–21, 21–18, 21–10తో గెలుపొంది క్వార్టర్ ఫైనల్లో ఆయుశ్ శెట్టితో తలపడేందుకు సిద్ధమయ్యాడు. మరో మ్యాచ్‌లో కిరణ్ జార్జి (భారత్) 6–21, 12–21తో చౌ టియెన్ చెన్ (చైనీస్ తైపీ) చేతిలో ఓడిపోయాడు. పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి (భారత్) ద్వయం 18–21, 21–15, 21–11తో పిరత్చాయ్ సుఖ్‌ఫున్–పకాపోన్ తీరత్‌సాకుల్ (థాయ్‌లాండ్) జంటపై గెలిచి క్వార్టర్ ఫైనల్ చేరింది. మహిళల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో రుతపర్ణ–శ్వేతాపర్ణ (భారత్) జోడీ 13–21, 7–21తో లి యి జింగ్–లువో జు మిన్ (చైనా) జంట చేతిలో ఓడిపోయింది.

దబంగ్ ఢిల్లీ 'పాంచ్ పటాకా'

వరుసగా ఐదో విజయం నమోదు ● వైజాగ్‌లో ముగిసిన పీకేఎల్ మ్యాచ్‌లు



విశాఖ స్పోర్ట్స్: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 12వ సీజన్‌లో దబంగ్ ఢిల్లీ జోరు కొనసాగుతోంది. సీజన్ ఆరంభం నుంచి పరాజయం ఎరగకుండా దూసుకెళ్తున్న దబంగ్ ఢిల్లీ వరుసగా ఐదో మ్యాచ్‌లోనూ నెగ్గింది. గురువారం జరిగిన పోరులో దబంగ్ ఢిల్లీ 38–28 పాయింట్ల తేడాతో గుజరాత్ జెయింట్స్‌ను చిత్తు చేసింది. దీంతో ఆడిన అన్నీ మ్యాచ్‌ల్లో నెగ్గిన ఢిల్లీ 10 పాయింట్లతో పట్టిక అగ్రస్థానంలో కొనసాగుతోంది. కెప్టెన్ అశు మలిక్ 14 పాయింట్లతో ఢిల్లీ విజయంలో కీలక పాత్ర పోషించాడు. అజింక్యా పవార్, ఫజల్ చెరో 5 పాయింట్లతో సారథికి అండగా నిలిచారు. రెయిడింగ్‌లో ఇరు జట్లు సమంగానే నిలిచినా... ట్యాక్లింగ్‌లో ఢిల్లీ 13 పాయింట్లు సొంతం చేసుకోగా... గుజరాత్ 5 పాయింట్లకే పరిమితమైంది. జెయింట్స్ తరఫున ప్రతీక్ 9 పాయింట్లతో పోరాడాడు. మరో మ్యాచ్‌లో యు ముంబా 40–39 పాయింట్ల తేడాతో పట్నా పైరేట్స్‌పై గెలిచింది. యు ముంబా తరఫున అమీర్ మొహమ్మద్ 12 పాయింట్లు, అనిల్ 9 పాయింట్లు సాధించారు. పట్నా తరఫున అయాన్ 21 పాయింట్లతో ఒంటరి పోరాటం చేసినా జట్టును గెలిపించలేకపోయాడు. గురువారంతో విశాఖపట్నం అంచె పోటీలు ముగియగా... నేటి నుంచి జైపూర్ వేదికగా టోర్నీ కొనసాగుతుంది. ఈ రోజు మ్యాచ్‌ల్లో జైపూర్ పింక్ పాంథర్స్‌తో బెంగళూరు బుల్స్... తమిళ్ తలైవాస్‌తో బెంగాల్ వారియర్స్ తలపడతాయి.

మళ్లీ ఓడిన గుకేశ్



సమర్‌కండ్ (ఉజ్బెకిస్తాన్): గ్రాండ్ స్విస్ అంతర్జాతీయ చెస్ టోర్నీ ఓపెన్ విభాగంలో ప్రపంచ చాంపియన్, భారత గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్‌కు వరుసగా మూడో పరాజయం ఎదురైంది. గురువారం జరిగిన ఏడో రౌండ్‌లో గుకేశ్ 52 ఎత్తుల్లో ఇదిజ్ గురెల్ (టర్కీ) చేతిలో ఓడిపోయాడు. ఐదో రౌండ్‌లో అభిమన్యు మిశ్రా (అమెరికా) చేతిలో, ఆరో రౌండ్‌లో నికోలస్ (గ్రీస్) చేతిలో ఓడిన గుకేశ్ ... ఏడో రౌండ్ తర్వాత మూడు పాయింట్లతో 84వ స్థానంలో ఉన్నాడు. మరోవైపు తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ తొలి పరాజయాన్ని చవిచూశాడు. మథియాస్ బ్లూబామ్ (జర్మనీ)తో జరిగిన గేమ్‌లో అర్జున్ 51 ఎత్తుల్లో ఓడిపోయాడు. ఓపెన్ విభాగంలో పోటీపడుతున్న భారత మహిళా గ్రాండ్‌మాస్టర్ దివ్య దేశ్‌ముఖ్ రెండో విజయం అందుకుంది. ఇవిచ్ వెల్మిర్ (సెర్బియా)తో జరిగిన గేమ్‌లో దివ్య 49 ఎత్తుల్లో గెలిచింది.

బంగ్లాదేశ్ శుభారంభం

- హాంకాంగ్‌పై 7 వికెట్లతో విజయం
- నేడు ఒమన్‌తో పాకిస్తాన్ 'ఢీ'
- రాత్రి గం. 8 నుంచి సోనీ స్పోర్ట్స్‌లో...

అబుదాబి: ఆసియా కప్ టి20 టోర్నీని బంగ్లాదేశ్ సునాయాస విజయంతో మొదలుపెట్టింది. గ్రూప్ 'బి'లో భాగంగా గురువారం జరిగిన మ్యాచ్‌లో సంపూర్ణ ఆధిపత్యం కనబర్చిన బంగ్లా 7 వికెట్ల తేడాతో హాంకాంగ్‌ను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన హాంకాంగ్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 143 పరుగులు చేసింది. అనంతరం బంగ్లాదేశ్ 17.4 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 144 పరుగులు సాధించి గెలిచింది. తమ తొలి పోరులో అఫ్గానిస్తాన్ చేతిలో ఓడిన హాంకాంగ్‌కు ఇది వరుసగా రెండో పరాజయం. ఓపెనర్ అన్షుమన్ రథ్ (4) తొందరగానే వెనుదిరిగినా... మరో ఓపెనర్ జీషాన్ అలీ (34 బంతుల్లో 30; 3 ఫోర్లు, 1 సిక్స్) చక్కటి షాట్లతో హాంకాంగ్‌కు తగిన ఆరంభాన్ని అందించాడు. సీనియర్ బ్యాటర్ బాబర్ హయత్ (14) విఫలం కాగా, నిజాకత్ ఖాన్ (40 బంతుల్లో 42; 2 ఫోర్లు, 1 సిక్స్) పట్టుదలగా క్రీజ్‌లో నిలిచి పరుగులు సాధించాడు. ఈ క్రమంలో తాను ఆడిన 32వ బంతికి గానీ అతను తన తొలి బౌండరీ కొట్టలేకపోయాడు! చివర్లో కెప్టెన్ యాసిమ్ ముర్తజా (19 బంతుల్లో 28; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) దూకుడు హాంకాంగ్‌కు చెప్పుకోదగ్గ స్కోరును అందించింది. బంగ్లా బౌలర్లు ప్రత్యర్థిని కట్టడి చేయడంలో సఫలమయ్యారు. ముఖ్యంగా 3–13 మధ్య ఆడిన 11 ఓవర్లలో ఒక్క ఓవర్లో మాత్రమే హాంకాంగ్ రెండంకెల స్కోరు చేయగలిగింది. అయితే ఆఖరి 6 ఓవర్లలో 54 పరుగులు రాబట్టడంతో హాంకాంగ్ గౌరవప్రదంగా ముగించగలిగింది. తన్‌జీమ్, తస్కీన్, రిషాద్ తలా 2 వికెట్లు పడగొట్టారు. ఛేదనలో ఓపెనర్లు పర్వేజ్ (19), తన్‌జీద్ (14) ఎక్కువ సేపు నిలబడకపోయినా... కెప్టెన్ లిటన్ దాస్ (39 బంతుల్లో 59; 6 ఫోర్లు, 1 సిక్స్), తౌహీద్ (36 బంతుల్లో 35 నాటౌట్; 1 ఫోర్) భాగస్వామ్యంతో బంగ్లా సునాయాస విజయాన్ని అందుకుంది. వీరిద్దరు మూడో వికెట్‌కు 70 బంతుల్లో 95 పరుగులు జోడించారు. **నేడు దుబాయ్‌లో జరిగే మ్యాచ్‌లో ఒమన్ జట్టుతో పాకిస్తాన్ ఆడుతుంది.**

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.



Own now at ₹ 4862/month*

Samsung Care+ Starting ₹ 638/month#

Pair-up Galaxy Watch8 Classic Get ₹ 15000~ off

Google AI Pro Get 6 months of Google AI Pro with 2TB of cloud storage^

Samsung Upgrade up to ₹ 12000** or Bank cashback up to ₹ 12000**

HDFC BANK | AXIS BANK | HSBC | Samsung Finance+™

samsung.com

Please dispose of e-waste and plastic waste responsibly. Customers can WhatsApp on 180057267664 for information on e-waste/plastic waste.

Image simulated, actual may vary. Actual UX/UI may vary. Color and features as per availability. Samsung account login is required for certain AI features. Samsung does not make any promises, assurances, or guarantees as to the accuracy, completeness or reliability of the output provided by AI features. Samsung promotes responsible use of Artificial Intelligence (AI) features. Samsung disclaims any and all liabilities thereof. *T&C apply. ₹ 4862/month EMI computed on 12 months down payment and 24 months no cost EMI on the price of ₹ 174999 (inclusive of taxes) for 1 unit of Galaxy Z Fold7 12|256GB. #Samsung Care+ T&C apply. 1 unit of Samsung Care+ 2 year Screen protection plan worth ₹ 17999 available at ₹ 638 per month, only when purchased with Galaxy Z Fold7 through Samsung Finance+. Customers eligible for 2 claims/ year for 2 years under Screen protection plan, as per applicable terms of Samsung Care+. Samsung Care+ EMI amount calculated post 15% up-front down payment on the balance 85% amount. ~Discount amount of ₹ 15000 applicable only when purchasing 1 Unit of Galaxy Watch8 Classic together with 1 unit of Galaxy Z Fold7. ^Gemini is a trademark of Google LLC. Terms apply. By subscribing, you agree to terms for Google One, AI Credits and offers. Offer ends July 20, 2026. Only available for ages 18+. Unless cancelled earlier, Google One will charge ₹ 1950/month after the trial ends. Cancel anytime. Return of purchased device may result in cancellation of subscription. See full terms at https://one.google.com/offer/terms-and-conditions/samsung-flipfold7-6month-trial. **Additional upgrade bonus as per Samsung Upgrade program, provided by brand/dealer at their sole discretion upon exchange of select devices. Bank cashback at the sole discretion of issuer/Bank/ NBFCs/Financiers including those listed on Samsung Finance+ (Financier T&C applies) and vary model wise. Bank cashback only available with HDFC Bank, HSBC and Axis Bank. 24 months no cost EMI only applicable on NBFC. Eligibility for EMI at the sole discretion of the financiers including those listed on Samsung Finance+ (Financier T&C applies). Offer can be revised or withdrawn without prior notice. All third party logos/brands are trademarks/registered trademarks of the respective brand/company.

Scan and experience Galaxy AI

Or WhatsApp "Hi" to 9870 494949 to buy at Samsung Experience Store

Cheil-28520/25

ఆదమరిస్తే ప్రాణాలకు సెల్‌వు

అన్నివర్గాల ప్రజలకు సెల్‌ఫోన్ నిత్యావసర వస్తువులా మారింది. కానీ బహిరంగ ప్రదేశాల్లో కూడా కొందరు ఫోనే లోకంగా గడుపుతున్నారు. రోడ్డు దాటేటప్పుడు, వాహనాలు నడిపేటప్పుడు కూడా ఫోన్ చూస్తూ, మాట్లాడుతూ.. పొంచి ఉన్న ప్రమాదాలను మరిచిపోతుండటం ఆందోళన కలిగిస్తోంది.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం



ఫోన్‌లో మాట్లాడుతూ వాహనం నడుపుతున్న మహిళ



సెల్ చూస్తూ రోడ్డు దాటుతున్న వ్యక్తి





ఒక చేత్తో ఫోన్ మాట్లాడుతూ మరో చేతితో ద్విచక్రవాహనాలు నడుపుతూ..

అద్భుతం.. అమ్మాపురం సంస్థానం

- కాకతీయుల కాలం నుంచి రెడ్డి రాజుల వరకు పాలన
- 700 ఏళ్ల పాటు కొనసాగిన పరిపాలన
- కురుమూర్తిస్వామి సేవ కోసం అమ్మాపురంలో మకాం
- నేటికీ ఆలయ ధర్మకర్తలుగా ముక్కెర వంశీయులు



రాజభవనం ముందున్న బావి

చిన్నచింతకుంట: మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం అమ్మాపురం గత చరిత్రకు సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. అమరచింత, ఆత్మకూర్ సంస్థానాల పాలన అమ్మాపురం కేంద్రంగా సాగింది. అప్పట్లో 69 గ్రామాలు, 190 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం కలిగిన అమ్మాపురం సంస్థానాన్ని కాకతీయుల కాలం నుంచి రెడ్డి రాజుల కాలం వరకు ముక్కెర వంశీయులు పరిపాలించారు. 1268 నుంచి 1948 వరకు వీరి పరిపాలన కొనసాగింది. ఇది 19వ శతాబ్దంలో భారత యూనియన్‌లో విలీనమైంది.

కురుమూర్తి క్షేత్రం అభివృద్ధికి..

కురుమూర్తి స్వామి క్షేత్రం అభివృద్ధి కోసం ముక్కెర వంశీయులు అమ్మాపురంలో సంస్థానం ఏర్పాటు చేసినట్లు చరిత్ర చెబుతోంది. కాకతీయుల కాలంలో అమరచింత, ఆత్మకూర్ సంస్థానాలు వెలుగొందాయి. ముక్కెర వంశీయులు ఆ సంస్థానాల్లో పరిపాలన సాగిస్తూ. కురుమూర్తి క్షేత్రం దర్శనానికి వచ్చేవారు. కురుమూర్తి క్షేత్రాన్ని నిత్యం దర్శించుకోవాలనే ఆకాంక్ష, ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతో అమ్మాపురంలో సంస్థానం ఏర్పాటు చేశారు. రాణి భాగ్యలక్ష్మీ దేవమ్మ ఇక్కడి నుంచే అమరచింత, ఆత్మకూర్ సంస్థానాలను పరిపాలించారు.

ఇప్పటికీ నాటి ఆనవాళ్లు..

16వ శతాబ్దంలో రాణి భాగ్యలక్ష్మీదేవి అమ్మాపురంలో నిర్మించిన కోట బురుజు, శివాలయం, మసీదుతో పాటు 200 ఏళ్ల క్రితం వారి వంశీయులు నిర్మించిన రాజ భవనం, సింహద్వారం, రాజ భవనంలోని కోనేరు, గుర్రాల స్థావరాలు, అతిథి గృహాలు నేటికీ ఉన్నాయి.

సజీవ సాక్ష్యాలుగా కట్టడాలు..

ముక్కెర వంశస్తుల పరిపాలనలో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని గ్రామానికో సుభేదారును నియమించారు. వారి ద్వారా వచ్చే కప్పాలతో ఆయా గ్రామాల్లో చెరువులు, బావులను తవ్వించారు. వనపర్తి జిల్లా ఆత్మకూర్ పట్టణం నాటి సంస్థానంలో ఒక భాగంగా ఉండటంతో.. అక్కడే రాజ విడిది భవనాలు నిర్మించారు. ముక్కెర వంశానికి చెందిన పెద్ద సోమ భూపాలుడు తరచూ ఈ ప్రాంతానికి వస్తూ పరిపాలన కొనసాగించే వాడని చరిత్ర పరిశోధకులు చెబుతున్నారు. ఆత్మకూర్‌లో చెరువును తవ్విస్తుండగా.. శివుడి విగ్రహం లభ్యం కావడంతో అక్కడే శివాలయాన్ని నిర్మించారు. ఇప్పటికీ చెర్ల పరమేశ్వరుడిగా పిలుస్తున్నారు. అమరచింతలో గుర్రాలను మేపేందుకు అనువైన స్థలాన్ని గుర్తించి.. వాటి సంరక్షణ బాధ్యతలను హజారి వంశస్తులకు అప్పగించారు. అక్కడ కోటబురుజును నిర్మించారు. వాటితో పాటు తిప్పడంపల్లిలో నిర్మించిన కోట బురుజు నాటి చరిత్రకు సాక్ష్యంగా నిలుస్తోంది. ఆత్మకూర్‌లో సంస్థానాధీశులు నిర్మించిన పలు భవనాలను ప్రస్తుతం ప్రభుత్వ కార్యాలయాలకు వినియోగిస్తున్నారు.

తిరుపతి నుంచి వచ్చి..

వర్ధమానపురం (నేటి వడ్డేమాన్)కు గన్నారెడ్డి సామంత రాజుగా ఉండే వాడు. అప్పట్లో గన్నారెడ్డి తన పరివారంతో తిరుపతి యాత్రకు వెళ్లాడు. తిరుపతి సమీపంలోని చంద్రగిరి ప్రాంతంలో పేరు ప్రఖ్యాతులున్న ముక్కెర వంశీయుడు గోపాల్‌రెడ్డిని కలిశాడు. గోపాల్‌రెడ్డి గుణగణాలు, ధైర్య సాహసాలు మెచ్చి వర్ధమానపురం ఆహ్వానించాడు. గోపాల్‌రెడ్డి తన కుటుంబ సమేతంగా వర్ధమానపురం చేరుకోగా.. గన్నారెడ్డి అతన్ని గౌరవించి మక్తలవాడ పదవి అప్పగించాడు. క్రమంగా గోపాల్‌రెడ్డి మక్తల, ఊట్కూర్, కడేమార్, వడ్డేమాన్, అమరచింత పరిగణాలపై ఆధిపత్యం సాధించారు. అప్పట్లో కురుమూర్తి క్షేత్రం వడ్డేమాన్ పరిధిలో ఉండటం.. గోపాల్‌రెడ్డి వైష్ణవ భక్తుడు కావడంతో తన ఇంటి ఇలవేల్పుగా ఆరాధించాడు. అది మొదలుకొని నేటి వరకు ముక్కెర వంశీయులు కురుమూర్తిస్వామిని ఆరాధిస్తూ వస్తున్నారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తూ శాశ్వత ధర్మకర్తలుగా కొనసాగుతున్నారు.



రాజభవనం వద్ద ఉన్న విడిది సత్రాలు




అమ్మాపురంలో ముక్కెర వంశీయులు ప్రతిష్ఠించిన శివలింగం



రాజులు శ్రీరాంభూపాల్, సోంభూపాల్, సీతారాంభూపాల్




రాజ దర్బార్‌కు సంబంధించిన వస్తువులు



రాజభవనంలో గోడలకు ఏర్పాటు చేసిన డిజైన్



రాజభవనం సింహద్వారం



అమ్మాపురంలో ముక్కెర వంశీయులు నిర్మించిన కోటబురుజు



ఆశల చిగురింత

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో 27 ఏళ్ల కిందట మూతపడ్డ సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) సిమెంట్ ఫ్యాక్టరీ పునరుద్ధరణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమీక్షలు నిర్వహిస్తుండటంతో ఈ ప్రాంత ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ప్రజల ఆశలకు తగినట్లు.. ఇటీవల కురిసిన వర్షాలతో ఫ్యాక్టరీ కనుచూపు మేరంతా పచ్చదనం నిండి కనువిందు చేస్తోంది.

- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

పోలీస్ శాఖలో డ్రైవర్ల నియామకాల తీర్పు రిజర్వు

సాక్షి, న్యూఢిల్లీ: పోలీస్ శాఖలో డ్రైవర్ల నియామకానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సర్వోన్నత న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది. 2022లో పోలీస్, ఫైర్ శాఖకు సంబంధించి డ్రైవర్ల నియామకానికి ప్రభుత్వం నోటిఫికేషన్లు జారీ చేసింది. అయితే ఈ పోస్టులకు దరఖాస్తు చేసే అభ్యర్థుల డ్రైవింగ్ లైసెన్స్‌లో నోటిఫికేషన్‌కు రెండేళ్ల ముందు వరకు ఎలాంటి గ్యాప్ (రెన్యూవెల్, ఇతర సమస్యలతో) ఉండకూడదని ప్రస్తావిస్తూ పలువురిని రిజెక్ట్ చేసింది. ఈ నిర్ణయాన్ని తప్పుబడుతూ పలువురు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించగా... వారికి సానుకూలంగా కోర్టు తీర్పునిచ్చింది. ఈ ఉత్తర్వులను పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు గతేడాది మార్చి 6న సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఈ అప్పీల్‌పై గురువారం జస్టిస్ అసనుద్దీన్ అమనుల్లా, జస్టిస్ ఎస్వీఎన్ భట్టి ధర్మాసనం విచారణ జరిపింది. నోటిఫికేషన్‌కు రెండేళ్ల ముందు వరకు డ్రైవింగ్ లైసెన్స్ ఉండడంతో పాటు అందులో ఎలాంటి గ్యాప్‌లు ఉండకూడదని ప్రభుత్వ తరపు న్యాయవాదులు కోర్టుకు నివేదించారు. ఈ నిబంధన ఆధారంగా రిజెక్ట్ చేసిన ప్రతివాదులందరి డ్రైవింగ్ లైసెన్స్‌ల ఎక్స్‌పైరీ, రెన్యువల్లో గ్యాప్ ఉందని తెలిపారు. అయితే, ఈ వాదనలను ప్రతివాదుల తరపు న్యాయవాదులు ఖండించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు వెల్లడించింది.

నవంబర్ 20 నుంచి తెలంగాణ-నార్త్‌ఈస్ట్ ఫెస్టివల్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆలోచనల మేరకు నవంబర్ 20 నుంచి తెలంగాణ–నార్త్‌ఈస్ట్ కనెక్ట్, టెక్నో, కల్చరల్ ఫెస్టివల్ పేరుతో రెండు విడతలుగా మూడు రోజులపాటు హైదరాబాద్‌లో పలు కార్యక్రమాలను నిర్వహించనున్నారని గవర్నర్ కార్యాలయ ముఖ్య కార్యదర్శి దానకిసోర్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రంతో ఈశాన్య రాష్ట్రాల మధ్య శాస్త్ర, సాంకేతిక, సాంస్కృతికపరమైన బంధాన్ని మరింతగా పటిష్టపర్చేందుకుగాను ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఫెస్టివల్ కార్యక్రమాల నిర్వహణపై దానకిసోర్ గురువారం సంబంధిత ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వైద్య, ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా చోంగ్తూ, సెర్ప్ సీఈవో దివ్య, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సీహెచ్. ప్రియాంక, పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ శ్రీజన, స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ సోని బాలదేవి, సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ తదితరులు ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. గవర్నర్ కార్యాలయ ముఖ్యకార్యదర్శి మాట్లాడుతూ హైదరాబాద్‌లో మొట్టమొదటిసారిగా నిర్వహించే ఈ కార్యక్రమాలను విజయవంతం చేయడంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కోరారు.

విద్యార్థికి సర్టిఫికెట్లు అప్పగించండి

మల్లారెడ్డి కాలేజీకి హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: నాలుగేళ్ల ట్యూషన్ ఫీజు కోసం పట్టుబట్టకుండా విద్యార్థి సర్టిఫికెట్లు అందజేయాలని మల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీని హైకోర్టు ఆదేశించింది. ఫీజు బకాయి ఉందని తన సర్టిఫికెట్లు ఇవ్వకపోవడాన్ని సవాల్ చేస్తూ.. నల్లగొండ జిల్లాకు చెందిన నమిలే సంజయ్‌కుమార్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. కాలేజీ నిర్ణయం చట్టవిరుద్ధమన్నారు. సర్టిఫికెట్లు ఇచ్చేందుకు నిరాకరించడం యూజీసీ, ఏఐసీటీఈ, తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ (టీఎస్‌సీహెచ్ఈ) నిబంధనల ఉల్లంఘన కిందకే వస్తుందని స్పష్టం చేశారు. విద్యార్థుల సర్టిఫికెట్లను నిలిపివేసే అధికారం కాలేజీలకు లేదన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. విద్యార్థి 10వ తరగతి, ఇంటర్మీడియెట్ మెమోలు, టీసీ, బోనఫైడ్ సర్టిఫికెట్లు తిరిగి అందజేయాలని ఆదేశించారు.

సీపీఏ సదస్సుకు స్పీకర్, చైర్మన్

సాక్షి, హైదరాబాద్: బెంగళూరులో జరగనున్న 11వ కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ (సీపీఏ) ఇండియా రీజియన్ కాన్ఫరెన్స్‌లో పాల్గొనడానికి గురువారం శంషాబాద్ విమానాశ్రయం నుంచి శాసన పరిషత్ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ వెళ్లారు. వీరితో పాటు మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ ముదిరాజ్, లెజిస్లేటివ్ సెక్రటరీ డాక్టర్ వి.నరసింహాచార్యులు తదితరులున్నారు.

'బెయిల్ వచ్చిన తర్వాత మరో కేసు పెడతారా'

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడుతున్నారని, బెయిల్ వచ్చిన తర్వాత మరో కేసుతో జైల్లో వేస్తున్నారని బీఆర్ఎస్ నేత వై.సతీశ్‌రెడ్డి ధ్వజమెత్తారు. సోషల్ మీడియా కార్యకర్త నల్ల బాలుపై అక్రమ కేసులు పెట్టి 20 రోజులు జైల్లో వేయడం, బెయిల్ వచ్చిన తర్వాత మరో కేసు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. గురువారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ లీగల్ సెల్ లలితారెడ్డి, బీఆర్ఎస్ నేత పుట్టా విష్ణువర్ధన్‌రెడ్డిలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక బీఆర్ఎస్ సోషల్ మీడియాను అణచివేయాలని చూస్తోందని, పార్టీ సోషల్ మీడియాపై ఇప్పటివరకు 5 వేల కేసులు పెట్టారని ఆయన ఆరోపించారు.

అరెస్టులే ప్రజాపాలనా?

మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్

సాక్షి, హైదరాబాద్: గ్రూప్ వన్ పరీక్షల్లో జరిగిన అవకతవకలపై సీబీఐతో విచారణ జరిపించాలని మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. ప్రజాపాలన అంటే పోలీసులతో విద్యార్థులను అణిచివేయడమేనా అని ప్రశ్నించారు. విద్యార్థులపై అక్రమ నిర్బంధాన్ని ఆపి ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి వెంటనే నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు. గురువారం తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్సీ ఎల్.రమణ, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్‌తో కలిసి శ్రీనివాస్‌గౌడ్ మీడియాతో మాట్లాడారు. బీసీ డిక్లరేషన్ పేరిట హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీలను మోసగించిందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం ఒక్క జీవో కూడా ఇవ్వకపోవడాన్ని శ్రీనివాస్ గౌడ్ ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 22 నెలలు అవుతున్నా బీసీ డిక్లరేషన్ అమలు చేయకుండా కామారెడ్డిలో వంచన సభ పెడుతోందని ఎమ్మెల్సీ ఎల్.రమణ మండిపడ్డారు. ఎన్నికల సమయంలో డిక్లరేషన్ల పేరిట అన్ని వర్గాలను కాంగ్రెస్ మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ విమర్శించారు. కాగా, హన్వాడ మండలానికి చెందిన పలువురు నాయకులు శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.



బ్రహ్మోత్సవాల్లో పారిశుద్ధ్యానికి పెద్దపీట

తిరుమల: శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో పారిశుద్ధ్యానికి పెద్ద పీట వేయాలని టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ అధికారులను ఆదేశించారు. ఈనెల 24 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు జరగనున్న శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలపై గురువారం సాయంత్రం తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో శాఖలవారీగా ఈవో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్యచౌదరి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా బ్రహ్మోత్సవాలకు చేపట్టిన ఏర్పాట్లను వివరించారు. ఈవో మాట్లాడుతూ గరుడ వాహనం రోజున సీనియర్ అధికారులకు మాడ వీధుల్లో విధులు కేటాయించి భక్తుల నుంచి అభిప్రాయాలను సేకరించాలన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా తిరుపతిలో కూడా ప్రత్యేక పార్కింగ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. దాదాపు 3500 మంది శ్రీవారి సేవకులను సిద్ధం చేసుకోవాలని చెప్పారు. 4వేల సీసీ కెమెరాలతో పాటు అదనంగా అవసరమైన సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. భక్తులు స్వామివారి వాహన సేవలను వీక్షించేందుకు ఎస్వీబీసీ ద్వారా హెచ్‌డీ క్వాలిటీ ప్రసారాలు అందించాలన్నారు. టీటీడీ సీవీఎస్వో మురళీకృష్ణ, సీఈ సత్యనారాయణ, ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం పాల్గొన్నారు.

ఆకాశ వీధిలో ఆర్భాటం చేసి.. పాతాళంలో వదిలేసి!

ట్రయల్ రన్‌కే పరిమితమైన సీ ప్లేన్

- విజయవాడ టూ శ్రీశైలానికి ప్రయాణమంటూ సీఎం గొప్పలు
- పది నెలలు గడుస్తున్నా సిద్ధం కాని డీపీఆర్
- ఇరిగేషన్, అటవీశాఖల అనుమతులపై అనుమానం..?



శ్రీశైలం డ్యాం సమీపంలో నీటిపై సీప్లేన్ (ఫైల్)



శ్రీశైల ఆలయం

శ్రీశైలంటెంపుల్: 'దట్టమైన నల్లమల అటవీ మధ్యలో ప్రవహించే కృష్ణమ్మ పరవళ్లపై ప్లేన్‌లో ప్రయాణించి మధురానుభూతి పొందే అవకాశం కల్పిస్తున్నాం. ఇందులో భాగంగా విజయవాడ నుంచి శ్రీశైలానికి సీ ప్లేన్ సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తున్నాం. తద్వారా విజయవాడ నుంచి శ్రీశైలానికి తక్కువ సమయంలో వచ్చి స్వామిఅమ్మవార్లను దర్శించుకునే అవకాశం కల్పిస్తున్నాం. ఏపీని టూరిజం హబ్‌గా మారుస్తాం' అంటూ స్వయాన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు శ్రీశైలంలో సీ ప్లేన్ ట్రయరల్ రన్ వేళ అన్న మాటలు. ఇక సీన్ కట్ చేస్తే.. సీప్లేన్ ట్రయల్‌రన్ చేపట్టి ఇప్పటికి పది నెలలు గడుస్తోంది. ఇంకా సర్వేలు, సమీక్షలకే అధికారులు పరిమితమయ్యారు. ఇప్పటికీ డీపీఆర్ సిద్ధం కాకపోవడంతో సీప్లేన్ ప్రయాణం మరింత ఆలస్యమవుతుందని తెలుస్తోంది. సీఎం ప్రచార ఆర్భాటానికే సీప్లేన్ ప్రతిపాదనను తెరపైకి తీసుకువచ్చి ట్రయల్‌రన్ చేసి వదిలేశారని, ఆచరణ చేసేందుకు అంతగా ఆసక్తి చూపడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మల్లన్న భక్తుల సౌకర్యార్థం ప్రభుత్వం టూరిజం అభివృద్ధిలో భాగంగా శ్రీశైలానికి గతేడాది నవంబరు 9న సీప్లేన్ ట్రయల్‌రన్ చేపట్టారు. రాష్ట్ర సీఎం చంద్రబాబు, కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు, టూరిజం శాఖ మంత్రి దుర్గేశ్ తదితరులు విజయవాడ పున్నమి ఘాట్ నుంచి సీప్లేన్‌లో శ్రీశైలం పాతాళ గంగకు చేరుకున్నారు. సీప్లేన్ ప్రారంభమైతే విజయవాడ నుంచే కాకుండా హైదరాబాద్, బెంగళూర్ తదితర రాష్ట్రాల నుంచి సైతం సీప్లేన్ నడిపేందుకు అవకాశం ఉందని అప్పట్లో పాలకులు, పర్యాటక అధికారులు ప్రకటించారు. భక్తులు, పర్యాటకులు, ప్రభుత్వ ఉద్యోగులు, వారాంతపు సెలవులు ఉంటే ఉద్యోగులు, పారిశ్రామికవేత్తలు తమ సమయాన్ని వృథా చేసుకోకుండా సీప్లేన్ ద్వారా త్వరగా వచ్చి స్వామిఅమ్మవార్లను దర్శించుకుని త్వరగా వెళ్లే అవకాశం ఉండేదని భావించారు. అయితే పది నెలలుగా గడుస్తున్నా ట్రయల్ రన్‌కు పరిమితం కావడంతో కూటమి ప్రభుత్వానికి ప్రారంభంలో హడావుడి చేయడం, ఆ తర్వాత వదిలేయడం సర్వసాధారణమేనని పలువురు విమర్శిస్తున్నారు.

ఇరిగేషన్, అటవీశాఖ అనుమతులు లభించేనా..?

సీప్లేన్ నిర్వహించే ప్రదేశంలో శ్రీశైలం పూర్తిగా నాగార్జునసాగర్–శ్రీశైలం టైగర్ రిజర్వ్ పరిధిలో ఉంది. ఇది పూర్తిగా వన్యప్రాణులు, చిరుతలు, పెద్దపులులు అవాసానికి అనువైన ప్రదేశం. ఇక్కడ సీప్లేన్ సేవలు నిర్వహించాలంటే అటవీశాఖ అనుమతులు తప్పనిసరిగా ఉండాలి. అలాగే సీప్లేన్ టేక్ ఆఫ్, ల్యాండింగ్‌కు డ్యామ్ పరిధిలో ఉండటంతో ఇరిగేషన్ శాఖ అధికారుల అనుమతి కూడా తప్పనిసరిగా కావాల్సి ఉంటుంది. అలాగే ఏవియేషన్, ఇతర శాఖల అనుమతులు తప్పనిసరి. కూటమి ప్రభుత్వం విజయవాడ టూ శ్రీశైలం సీ ప్లేన్ నిర్వహణపై ప్రత్యేక దృష్టిసారించి త్వరితగతిన అనుమతులు అన్ని తీసుకుని సేవలను అందుబాటులోకి తేవాలని పలువురు పర్యాటకులు కోరుతున్నారు.

సర్వేలు, సమీక్షలకే పరిమితం

విజయవాడ నుంచి శ్రీశైలానికి వచ్చే సీప్లేన్ ప్రయాణానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ ఎయిర్‌పోర్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఏడీసీ) అధికారులు డిటేల్డ్ ప్రాజెక్టు రిపోర్టు తయారు చేస్తున్నారు. శ్రీశైలంతో పాటు అరకు, లంబసింగి, విశాఖపట్నం, కాకినాడ, కోనసీమ, గండికోట, నర్సాపూర్, తిరుపతి, ప్రకాశం బ్యారేజ్ మొత్తం 10 ప్రదేశాలలో టూరిజం పరంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం డీపీఆర్ సిద్ధం చేసే పనిలో నిమగ్నమైంది. ఈ ప్రాజెక్టు రిపోర్టు తయారీకి నాలుగు నెలల క్రితం ఓ ప్రైవేట్ కన్సల్టెన్సీకి నియమించారు. వారు మే నెల నుంచి డీపీఆర్ తయారు చేసేందుకు పనులు ప్రారంభించారు. ఏపీఏడీసీ అధికారులు వారానికి ఒకసారి సర్వేలు, సమీక్షలు నిర్వహిస్తున్నారు. డీపీఆర్‌లో సీప్లేన్ ల్యాండ్ అయ్యే ప్రదేశం, సీప్లేన్ టేక్‌ఆఫ్, టేక్ ఆన్‌కు నీటిలో సుమారు 1.16 కిలోమీటర్ల పొడవు, 120 మీటర్ల వెడల్పు ఉండే ప్రదేశం, పర్యాటకులు సీప్లేన్ ఎక్కేందుకు, దిగేందుకు నీటిపై ప్రత్యేక జెట్టీల ఏర్పాటు, టికెట్టు ధరలు, ఎన్ని ప్లేన్ సర్వీసులను తిప్పాలి, రోజుకు ఎన్ని ట్రిప్పులు, సీప్లేన్ ల్యాండింగ్ వద్ద పర్యాటకులకు విశ్రాంతి తీసుకునేందుకు గదులు, టికెట్టు కౌంటర్, సిబ్బంది తదితర పూర్తి వివరాలను డీపీఆర్‌లో పొందుపరుచనున్నారు. వచ్చే జనవరి నాటికి డీపీఆర్ పూర్తి చేయాలని కన్సల్టెన్సీకి ఆదేశాలిచ్చినట్లు తెలుస్తోంది.

అశ్వత్థానికి దీపపు సెగ



రావిచెట్టు మాను వద్ద భారీగా దీపాలు వెలిగిస్తున్న భక్తులు (ఫైల్)

- నల్లగా మాడిపోతున్న రావిచెట్టు మాను
- మొదలులో తీవ్రంగా వేడెక్కిపోతున్న వైనం
- రక్షణ చర్యలు అవశ్యం

అన్నవరం: రత్నగిరికి వచ్చే భక్తుల అనాలోచిత చర్యలు ఆలయ ఆవరణలోని త్రిమూర్తి స్వరూపమైన భారీ అశ్వత్థ వృక్షానికి (రావిచెట్టు) చేటు చేస్తున్నాయి. ఆలయ ఆవరణలో సుమారు 50 ఏళ్ల పైబడిన ఉన్న ఆ వృక్షం చుట్టూ భక్తులు ఆవు నేతితో దీపాలు పెట్టి ప్రదక్షిణలు చేస్తుంటారు. నిత్యం తెల్లవారు ఝాము నుంచి సాయంత్రం వరకు సాధారణ రోజుల్లో ఐదు వేల నుంచీ పర్వదినాల్లో 25 వేలకు పైబడి దీపాలు ఆ వృక్షం చుట్టూ వెలిగిస్తుంటారు. దీంతో సాధారణంగానే ఆ చెట్టు మాను తీవ్రంగా వేడెక్కిపోతుంది. ఈ నేపథ్యంలో దీపాలను ఆ వృక్షానికి ఇబ్బంది లేనంత దూరంలో వెలిగించుకునే ఏర్పాట్లను అధికారులు చేయాల్సి ఉంది.

గతంలో మాను చుట్టూ రేకు ఏర్పాటు

గతంలో దీపాల సెగ వృక్షం మానుకు తగలకుండా చుట్టూ రేకు అమర్చేవారు. అలాగే మాను మొదట్లో నీరు పోసి తడిపే వారు. ఇప్పుడు ఆ చర్యలేమీ లేవు. ఇప్పటికైనా ఆ చర్యలను పునరావృతం చేసి మానుకు వేడి తగలకుండా రక్షణ కంచె ఏర్పాటు చేయాల్సి ఉంది. అలాగే దీపాలు కొండెక్కాక వాటిని అక్కడి నుంచి తొలగిస్తే చాలా ప్రయోజనం ఉంటుంది.



భక్తులు వెలిగించే దీపాల సెగకు నల్లగా మాడిపోయిన రావిచెట్టు మాను

దీపాల ద్వారా ఆదాయం

రత్నగిరిపై ఉన్న దేవతా స్వరూపంగా అలరారుతున్న రావి వృక్షానికి దీపారాధన చేస్తే మంచి జరుగుతుందని ఆలయ వర్గాలు ప్రచారం చేస్తుంటాయి. దీంతో భక్తులు దీపాలు, ఆవు నెయ్యి కొనుగోలు చేయడం ద్వారా దేవస్థానానికి రూ.1.5 కోట్ల ఆదాయం వస్తుండడం గమనార్హం. ఈ నేపథ్యంలో ఆయా దుకాణదారులు సైతం దీపాలను ఆ వృక్షానికి దూరంగా పెట్టాలని భక్తులకు సూచించడం ద్వారా చక్కని ప్రయోజనం చేకూరే అవకాశం ఉంటుందని సర్వత్రా అభిప్రాయం వ్యక్తమవుతోంది.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు



తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. క్యూకాంప్లెక్స్‌లో 22 కంపార్టుమెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 70,086 మంది స్వామివారిని దర్శించుకోగా 28,239 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.56 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తుండగా.. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం పూర్తవుతోంది.

16 నుంచి అప్పలాయగుంట పవిత్రోత్సవాలు

వడమాలపేట (పుత్తూరు): అప్పలాయగుంట శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ పవిత్రోత్సవాలు ఈనెల 16వ తేదీ నుంచి 19 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ డిప్యూటీ ఈఓ శ్రీవాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దోషాల నివృత్తితో ఆలయ పవిత్రతను కాపాడేందుకు ఏటా పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. 16న అంకురార్పణ, 17న పవిత్ర ప్రతిష్ట, 18న పవిత్ర సమర్పణ, 19న మహాపూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. పవిత్రోత్సవాల సందర్భంగా ప్రతిరోజూ ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తామని వెల్లడించారు.

ద్వాదశ జ్యోతిర్లింగార్చన



పెనుగొండ: అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ టెంపుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతి ధాంలో గురువారం తెలంగాణావాసులు ద్వాదశ జ్యోతిర్లింగార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెలంగాణ నుంచి వాసవీ శాంతి ధాంకు గురువారం భారీగా చేరుకున్న వాసవీ భక్తులు తొలుత గోపూజ, ధ్వజారోహణ చేశారు.. అనంతరం మరకత శిల వాసవీ మాతకు అర్చనలు, అభిషేకంలు నిర్వహించారు .అనంతరం దంపతుల పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. 102 అడుగుల రుషీ గోత్ర మందిరంలోని 92 అడుగుల వాసవీ మాత పంచలోహ విగ్రహాన్ని దర్శించుకున్నారు. నగరేశ్వరునికి, ద్వాదశ జ్యోతిర్లింగాలకు స్వయంగా అభిషేకాలు చేశారు.

వైభవంగా కలశ ఊరేగింపు

కాణిపాకం : వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్పవృక్షవాహన సేవను పురస్కరించుకుని కాణిపాకంలోని దేవస్థానం సిబ్బంది, అర్చకులు, వేద పండితుల ఆధ్వర్యంలో గురువారం కలశంతో భారీ ఊరేగింపు నిర్వహించారు. శివాలయం నుంచి 501 కలశాలతో పురవీధుల్లో కోలాటలు, కేరళ వాయిద్యం, తప్పెటగుండ్లు నడుమ అత్యంత వైభవంగా కలశాలతో ఊరేగింపు చేశారు. అనంతరం ఆలయానికి చేరుకుని స్వామివారి ఉత్సవమూర్తులకు ప్రత్యేక అభిషేకం చేశారు.



ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

తిరుపతి అర్బన్: ఫర్నీచర్ సెక్టార్‌లో ఉచిత శిక్షణ ఇవ్వడంతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆర్.లోకనాథం తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హైదరాబాద్‌లోని అంబర్‌పేటలో ఈ నెల 22 నుంచి ఉచిత శిక్షణతో పాటు వసతి కల్పిస్తున్నట్లు ఉంటుందని స్పష్టం చేశారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులతో పాటు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. పదోతరగతి ఉత్తీర్ణత సాధించిన యువతి యువకులతో పాటు ఆ పైన చదివిన వారు అర్హులన్నారు. స్కిల్ ఇండియాలో భాగంగా ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని అంబర్‌పేట ప్రాంతం సమీపంలో ఎఫ్ఎఫ్ఎస్‌సీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, ఎన్ఎస్‌టీఐ వద్ద మూడు నెలలపాటు శిక్షణ ఉంటుందన్నారు. అనంతరం కంపెనీల్లో 6 నెలలు పాటు అప్రెంటిషిప్ స్కీమ్ తర్వాత ఉద్యోగాలు ఉంటాయని చెప్పారు. అదనపు సమాచారం కోసం 7673976699 నంబర్‌లో సంప్రదించాలని చెప్పారు.

డిప్లొమా కోర్సులకు గడువు పొడిగింపు

తిరుపతి తుడా: ఎస్వీ వైద్య కళాశాలలో రెండేళ్ల కాలవ్యవధితో అలైడ్ అండ్ హెల్త్ కేర్ పారామెడికల్ ప్రొఫెషనల్ కోర్సులకు ఈనెల 27వ తేదీ వరకు దరఖాస్తుల గడువు పొడిగించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ రవిప్రభు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ఎంపీసీ, బైపీసీ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ కోర్సులకు అర్హులన్నారు. ఇందులో డిప్లొమా ఇన్ అనస్థీషియా టెక్నాలజీలో 30 సీట్లు, డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ కోర్సులో 30 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 27వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 9440879943 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

డిగ్రీ ప్రవేశాలపై వీడని సందిగ్ధత

తిరుపతి సిటీ: ఉన్నత విద్యామండలి నిర్లక్ష్యానికి విద్యార్థులు నరకం అనుభవిస్తున్నారు. 10వ తేదీన డిగ్రీ ప్రవేశాల సీట్ల కేటాయింపు చేస్తామన్న అధికారులు ఇప్పటి వరకు ఊసే ఎత్తకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు అయోమయంలో పడ్డారు. దరఖాస్తు చేసుకునే క్రమంలో ఆన్‌లైన్ ఇబ్బందులు ఎదుర్కొన్న విద్యార్థులు ఇప్పటికీ సీట్ల కేటాయింపులో ఉన్నత విద్యామండలి అలసత్వం వహించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం డిగ్రీ అడ్మిషన్లు సక్రమంగా చేపట్టలేని కూటమి సర్కార్ విద్యారంగాన్ని సర్వనాశనం చేస్తోందని వాపోతున్నారు.

పార్థసారథి భట్టాచార్యుల జీవితం ఆదర్శనీయం



తిరుపతి సిటీ: ఎస్వీ వేదిక్ వర్సిటీ వైఖానస ఆగమ విభాగంలో రాష్ట్రపతి పురస్కార గ్రహీత, ప్రముఖ వైఖానస ఆగమ పండితులు టీటీడీ ఆగమ సలహాదారులు శ్రీమాన్ రొంపిచర్ల పార్థసారథి భట్టాచార్యుల 130వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అకడమిక్ డీన్ ఆచార్య గోలి సుబ్రహ్మణ్య శర్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంగళగిరికి చెందిన ప్రముఖ వైఖానస ఆగమ పండితులు దీవి శ్రీనివాసాచార్యులు, పార్థసారథి భట్టాచార్యులు కుమారులు శత్రుఘ్నాచార్యులు, తిరుమల వైఖానస దివ్య సిద్ధాంత వివర్ధినీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ పార్థసారథి ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక ప్రాంతాల్లో తిరుగుతూ ఆ ప్రాంతాల్లోని గ్రంథాలను సంకలనం చేయడం, అనేక గ్రంథాలను పరిశీలించి వాటిని తెలుగులో ప్రచురించారని కొనియాడారు. అనంతరం శత్రుఘ్నాచార్యులు మాట్లాడుతూ తన తండ్రి సేవలు కేవలం దక్షిణ భారతదేశంలో కాదు గయాలో కూడా వారి ఫొటో పెట్టి పూజిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో రాఘవ దీక్షితులు, దివి శ్రీనివాస దీక్షితులు, డాక్టర్ రాజేష్, ప్రవ్వా రామకృష్ణ, సూర్యనారాయణ మూర్తి, పురుషోత్తమాచార్యులు, పరాశరం భావనారాయణాచార్యులు, పీఆర్ఓ డాక్టర్ బ్రహ్మాచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలేరమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు



వెంకటగిరి(సైదాపురం) : తిరుపతి జిల్లాలోని వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతర భారీ భక్త జన సందోహం మధ్య గురువారం అత్యంత వైభవంగా ముగిసింది. అమ్మవారిని లక్షలాది మంది భక్తులు పోలేరమ్మ తల్లిని దర్శించుకున్నారు. జాతరలో భాగంగా అమ్మవారిని బుధవారం అర్ధరాత్రి అనంతరం అత్తిగారిల్లు అయిన జీనుగులవారి వీధి నుంచి ప్రత్యేక రథంపై అమ్మవారిని కొలువు దీర్చి భక్తజన సందోహనం నడుమ పోలేరమ్మ తల్లిని అమ్మవారి ఆలయం వద్ద నిలుపు దల చేశారు. గురువారం తెల్లవారు జాము నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. సాయంత్రం వరకు అమ్మవారిని లక్షలాదిగా తరలి వచ్చి దర్శించుకున్నారు.

బడి తరలించడంపై నిరసన

బేస్తవారిపేట: ఎస్సీ కాలనీలోని బడిని రద్దు చేసి దూరంగా ఉన్న మోడల్ స్కూల్‌లో విలీనం చేయడంపై విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాఠశాల వద్ద నిరసన వ్యక్తం చేసిన ఘటన ప్రకాశం జిల్లా బేస్తవారిపేటలో గురువారం జరిగింది. మండలంలోని ఖాజీపురం ఎస్సీ కాలనీలో 1వ తరగతి నుంచి ఐదో తరగతి వరకు పాఠశాల నిర్వహించేవారు. ప్రభుత్వం 3, 4, 5 తరగతులను రద్దు చేసి ఎస్సీ కాలనీకి దూరంగా ఉన్న మోడల్ స్కూల్‌లో విలీనం చేశారు. దాదాపు 40 ఏళ్లుగా ఎస్సీ కాలనీలో ఉన్న పాఠశాలను తీసేయడంతో పిల్లలను దూరంగా ఉన్న బడికి పంపాల్సి రావడంపై విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. గురువారం పాఠశాల వద్ద నిరసన వ్యక్తం చేశారు.

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ఆరంభంలో వర్షాలు చాలా ఆలస్యమయ్యాయి. ఆ తర్వాత వర్షాలు ఎక్కువగా కురవడంతో పంటలు ఎక్కడికక్కడ దెబ్బతిన్నాయి. ఫలితంగా అనంతపురం జిల్లా గుంతకల్లు మండలం నక్కనదొడ్డి తండాలో చేతికొచ్చిన పంట తుడిచిపెట్టుకుపోయింది. చాలా మంది రైతులకు పెట్టుబడులు కూడా దక్కలేదు. గ్రామంలో ఉపాధి పనులు కల్పించకపోవడంతో ఏంచేయాలో దిక్కుతోచని రైతులు వలస వెళ్లారు. వృద్ధులను ఇళ్ల వద్ద వదిలి పొట్ట చేతపట్టుకుని పోయారు. జీవనోపాధి కోసం పల్లె తరలిపోవడంతో పిల్లలు లేక పాఠశాల బోసి పోయింది. జనం లేక నిశ్శబ్దంతో వీధులన్నీ వెలవెలబోతున్నాయి.



ఊరు వలస వెళ్లింది!

- వర్షాభావంతో తగ్గిన వ్యవసాయం
- ఉపాధి హామీ పనుల కల్పనలో వైఫల్యం
- బతుకు తెరువుకు తప్పని వలస బాట









వలసల కారణంగా నక్కనదొడ్డి తండాలో మూత పడిన గృహాలు

గుంతకల్లు రూరల్: వ్యవసాయ పనులు సాకుగా చూపి గత మూడు నెలలుగా అనంతపురం జిల్లా గుంతకల్ మండలం నక్కనదొడ్డి తండాలో ఉపాధి హామీ పనులు నిలిపివేశారు. దీనికి తోడు గ్రామంలో వ్యవసాయ పనులు కూడా అంతంత మాత్రంగానే ఉండడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో కుటుంబాలు ఒక్కొక్కటిగా వలస బాట పట్టాయి. వలసలు రోజురోజుకూ పెరగడంతో నక్కనదొడ్డి తండాలో ఎటు చూసినా తాళం వేసిన ఇళ్లు, ఆ ఇళ్లను కాచుకుని ఉంటున్న వృద్ధులే కనిపిస్తున్నారు.

వ్యవసాయమే జీవనాధారం

నక్కనదొడ్డి తండాలో దాదాపు 110 కుటుంబాలు, 500కు పైగా జనాభా ఉంది. గ్రామంలో ఎక్కువ శాతం మంది ప్రజలు వ్యవసాయం, ఉపాధి పనులపైనే ఆధారపడి జీవిస్తున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వ్యవసాయ పనులకు కూలీలు సక్రమంగా రావడం లేదని మూడు నెలల క్రితం ఉపాధి పనులను నిలిపి వేశారు. దీంతో కూలి పనులు తప్ప మరో ప్రత్యామ్నాయ ఉపాధి మార్గం తెలియని తండా వాసులు దిక్కుతోచలేదు. రోజురోజుకూ ఆర్థిక పరిస్థితి ఇబ్బందిగా మారడంతో చివరకు కొందరు మూటముల్లె సర్దుకుని రైల్వే కోడూరు, రాజంపేట, ప్రొద్దుటూరు వంటి ప్రాంతాలకు వలస వెళ్లారు. తర్వాతి రోజుల్లోనూ ఇంకొందరు... ఆ తర్వాత మరికొందరు వలస వెళ్లడంతో గ్రామంలో ఎటు చూసినా తాళం వేసిన ఇళ్లు కనిపిస్తున్నాయి. ఆరోగ్య పరిస్థితులు, ఇతర కారణాలతో ఇంటిని వదిలి వెళ్లలేని వారు అరకొర వ్యవసాయ కూలి పనులతో ఓ పూట తింటూ మరో పూట పస్తులుంటూ జీవనం సాగిస్తున్నారు. కనీసం ఉపాధి పనులు కల్పించి ఉంటే ఈ పరిస్థితి వచ్చి ఉండేది కాదని ఇళ్ల వద్ద కాచుకుని ఉంటున్న వృద్ధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధి పనులు లేవు



వ్యవసాయ సీజన్ అని చెప్పి గ్రామంలో మూడు నెలలుగా ఉపాధి పనులు కల్పించ లేదు. కనీసం వ్యవసాయ కూలి పనులతోనైనా నెట్టుకొద్దామంటే ఆ పనులూ అరకొరగానే ఉన్నాయి. వారంలో రెండు రోజులు పనికి వెళ్తే మిగిలిన ఐదు రోజులూ ఇంటి వద్దనే ఖాళీగా ఉండాల్సి వస్తోంది. దీంతో కుటుంబాలతో కలసి కొడుకులు వలస పోయారు. ఉన్న దాంట్లోనే ఓ పూట తిని, మరో పూట పస్తులుంటున్నాం.

– భీమా నాయక్, నక్కనదొడ్డి తండా

మూడు వారాల కూలి రావాలి



ఉపాధి హామీ పథకం కింద చేసిన పనులకు సంబంధించి మూడు వారాల కూలి ఇప్పటి వరకూ ఇవ్వలేదు. దీనికి తోడు మూడు నెలలుగా పనులు ఆపేశారు. వర్షాలు లేక వ్యవసాయ పనులూ లేకుండాపోయాయి. ఇలాంటి పరిస్థితుల్లో పిల్లలు ఊరి వదిలి వెళ్లకతప్పలేదు.

– సాలమ్మ, నక్కనదొడ్డి తండా

ఇంటికి కాపలాగా ఉన్నా



నా పెద్దకొడుకు, కోడలు, వారి కొడుకు అందరూ రైల్వే కోడూరుకు వలసవెళ్లారు. దీంతో నేను ఇంటికి కాపలాగా ఉంటున్నా. వ్యవసాయ సీజన్ వచ్చిందంటే చాలు ఏటా ఇదే పరిస్థితి. ఇంకొన్ని రోజులు పోతే ఊరు మొత్తం ఖాళీ అవుతుంది. – బాలమ్మ, నక్కనదొడ్డి తండా

పనులు నిలిపిన మాట వాస్తవం


వ్యవసాయ సీజన్ కారణంగా ఉపాధి పనులు నిలిపిన మాట వాస్తవం. ఉపాధి పనులకు గ్రామస్తులు హాజరయ్యేలా ఉంటే సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్ల ద్వారా డిమాండ్ పెట్టిస్తే వెంటనే పనులు కల్పిస్తాం.

– కృష్ణమూర్తి, ఏపీఓ, డ్వామా

సాక్షి సినిమా

తెలుగు తెరపై కొత్త విలన్లు కనిపించనున్నారు. ఈ విలన్లకు తెలుగు తెలియదు. అయినా ఫైట్ చేయడానికి భాషతో పనేం ఉంది? ఇప్పుడు తెలుగులో సినిమాలు చేస్తున్న ఈ పరభాష విలన్లు తమ నటనతో ప్రేక్షకులకు కొత్త విలనిజమ్‌ని పరిచయం చేయనున్నారు. ఇక తెలుగులో చేస్తున్న ఈ కొత్త విలన్స్ గురించి తెలుసుకుందాం.

కొత్త విలన్ గురూ


ఇమ్రాన్ హష్మి


రాఘవ్


స్పర్శ్ శ్రీవాస్తవ్


పృథ్వీరాజ్ • టొవినో థామస్ • దివ్యేందు శర్మ

ఓజీ వర్సెస్ ఓమి

బాలీవుడ్ పాపులర్ యాక్టర్ ఇమ్రాన్ హష్మి తెలుగు ఎంట్రీ 'ఓజీ' సినిమాతో ఖరారైంది. పవన్ కల్యాణ్ హీరోగా నటించిన గ్యాంగ్‌స్టర్ ఫిల్మ్ ఇది. ఈ చిత్రంలో పవన్ కల్యాణ్ ఓజాస్ గంభీర (ఓజీ)గా నటించగా, విలన్ ఓమీ పాత్రలో ఇమ్రాన్ హష్మి నటించారు. డీవీవీ దానయ్య, దాసరి కల్యాణ్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న విడుదల కానుంది. ప్రియాంకా మోహన్ హీరోయిన్‌గా నటించగా, అర్జున్ దాస్, ప్రకాశ్‌రాజ్, శ్రియా రెడ్డి ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. అలాగే అడివి శేష్ హీరోగా నటిస్తున్న 'జీ2' (గూఢచారి 2) చిత్రంలోనూ ఇమ్రాన్ హష్మి నటిస్తున్నారు. ఈ చిత్రంలోనూ ఇమ్రాన్ విలన్‌గా నటిస్తున్నారని తెలిసింది.

రామ్ బుజ్జిగా వస్తున్నాడు

హిట్ వెబ్ సిరీస్ 'మిర్జాపూర్'లో మున్నాగా మంచి నటన కనబరిచారు దివ్యేందు శర్మ. ఈ పాపులర్ సిరీస్‌ను తెలుగు ప్రేక్షకులూ వీక్షించారు. ఈ 'మిర్జాపూర్' మున్నా ఇప్పుడు టాలీవుడ్‌కు వచ్చారు. రామ్‌చరణ్ హీరోగా నటిస్తున్న మల్టీ స్పోర్ట్స్ పీరియాడికల్ యాక్షన్ డ్రామాలో దివ్యేందు శర్మ ఓ లీడ్ రోల్‌లో నటిస్తున్నారు. రామ్‌బుజ్జిగా దివ్యేందు కనిపిస్తారు. రామ్‌చరణ్ క్రికెట్ బ్యాటింగ్ - దివ్యేందు బౌలింగ్ నేపథ్యంలో వచ్చే సన్నివేశాలు ఆసక్తిక రంగా ఉంటాయట. అలాగే దివ్యేందు పాత్రలో కొంత నెగటివ్ షేడ్స్ ఉంటాయని టాక్. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో జగపతి బాబు, శివ రాజ్‌కుమార్ ఇతర లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ పతాకాల సమర్పణలో వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రం 2026 మార్చి 27న విడుదల కానుంది. ఇక 'మిర్జాపూర్' సిరీస్‌తో పాటు 'టాయిలెట్: ఏక్ ప్రేమ్‌కథ, 2016: ది ఎండ్, అగ్ని' వంటి చిత్రాల్లో నటించారు దివ్యేందు. ఈ బాలీవుడ్ నటుడికి తెలుగులో 'పెద్ది' తొలి చిత్రం.

వృషకర్మలో..

సూపర్ హిట్ హిందీ చిత్రం 'లాపతా లేడీస్'లో తన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు స్పర్శ్ శ్రీవాత్సవ్. ఈ బాలీవుడ్ యువ నటుడిని నాగచైతన్య తెలుగులోకి ఆహ్వానించారు. నాగచైతన్య హీరోగా నటిస్తున్న అడ్వెంచరస్ అండ్ మిథికల్ మూవీ 'వృషకర్మ' (ప్రచారంలో ఉన్న టైటిల్). ఈ చిత్రంలో స్పర్శ్ శ్రీవాత్సవ్ ఓ లీడ్ రోల్ చేస్తున్నారు. అయితే 'లాపతా లేడీస్'లో పాజిటివ్ రోల్ చేసిన స్పర్శ్ శ్రీవాత్సవ్ 'వృషకర్మ' చిత్రంలో మాత్రం నెగటివ్ రోల్ చేస్తున్నారట. 'విరూపాక్ష' ఫేమ్ కార్తీక్ వర్మ దండు దర్శకత్వంలో ఈ సినిమాను బాపినీడు సమర్పణలో బీవీఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్. బి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం వచ్చే వేసవిలో విడుదల కానుంది.

పోటా పోటీ

బాలీవుడ్ యాక్షన్ హిట్ ఫిల్మ్ 'కిల్' (2023)లో విలన్‌గా నటించి, ఆడియన్స్‌ను మెప్పించారు రాఘవ్ జుయల్. లక్ష్య హీరోగా నటించిన ఈ చిత్రంలో రాఘవ్ విలనిజం యాక్షన్ ప్రియులకు కూడా కొత్తగా అనిపించింది. దీంతో రాఘవ్ జుయల్ పేరు బాలీవుడ్‌తో పాటు ఇతర ఇండస్ట్రీలోనూ కాస్త గట్టిగానే వినిపించింది. అలా పాన్ ఇండియన్ మూవీ 'ది ప్యారడైజ్'లో నటించే అవకాశం రాఘవ్‌కు లభించింది. 'దసరా' వంటి హిట్ తర్వాత హీరో నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో రూపొందుతున్న పీరియాడికల్ యాక్షన్ సినిమా 'ది ప్యారడైజ్'. ఈ చిత్రంలో రాఘవ్ జుయల్ నటిస్తున్నట్లుగా ఆల్రెడీ చిత్రయూనిట్ స్పష్టం చేసింది. ఓ మెయిన్ విలన్ రోల్‌ని రాఘవ్ చేస్తున్నారని, నానీతో రాఘవ్‌కు పోటాపోటీ సన్నివేశాలు ఉంటాయని టాక్.

'ది ప్యారడైజ్' చిత్రం ప్రపంచవ్యాప్తంగా 2026 మార్చి 26న విడుదల కానుంది. ఇక బాలీవుడ్‌లో 'కిల్'తో పాటు ప్రభుదేవా 'ఏబీసీడీ 2, సల్మాన్ ఖాన్ 'కిసీ కా భాయ్ కిసీ కీ జాన్', సిద్ధాంత్ చతుర్వేది 'యుద్ర' వంటి చిత్రాల్లో మంచి నటన కనబరిచి, నార్త్ ఆడియన్స్‌ను అలరించారు రాఘవ్. మరి... టాలీవుడ్‌లోనూ రాణిస్తారా? లెట్స్ వెయిట్ అండ్ సీ.

ఇన్‌స్పెక్టర్ స్వామి

అడివి శేష్ హీరోగా నటిస్తున్న పాన్ ఇండియన్ సినిమా 'డెకాయిట్'. ఈ చిత్రంలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. కెమెరామేన్ షానియల్ డియో ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. కాగా ఈ చిత్రంలో ప్రకాశ్‌రాజ్, సునీల్‌తో పాటు బాలీవుడ్ దర్శక-నిర్మాత-నటుడు అనురాగ్ కశ్యప్ ఓ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. ఈ చిత్రంలో ఆయన ఇన్‌స్పెక్టర్ స్వామి అనే పాత్రలో కనిపిస్తారు. అయితే కథ రీత్యా ఇన్‌స్పెక్టర్ స్వామి క్యారెక్టరైజేషన్‌లో కాస్త నెగటివ్ షేడ్స్ ఉంటాయని ఫిల్మ్ నగర్ సమచారం. అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తున్న ఈ సినిమా డిసెంబరు 25న విడుదల కానుంది. కాగా దొంగతనాన్ని వృత్తిగా స్వీకరించిన ఓ అబ్బాయి, అమ్మాయి ప్రేమించుకుంటారు. ఆ తర్వాత కొన్ని కారణాల వల్ల ఈ ఇద్దరూ బ్రేకప్ చెప్పుకుంటారు. కానీ ఊహించని పరిస్థితుల కారణంగా ఈ ఇద్దరూ కలిసి ఓ క్రైమ్ చేయాల్సి వస్తుంది? అప్పుడు ఏం జరుగుతుంది? అన్నదే క్లుప్తంగా 'డెకాయిట్' సినిమా కథాంశం.

డ్రాగన్‌తో పోటీ!

'మిన్నల్ మురళి, 2018, ఏఆర్ఎమ్' వంటి మలయాళ చిత్రాల్లో హీరోగా నటించి, తెలుగు ప్రేక్షకులకు బాగా దగ్గరయ్యారు టొవినో థామస్. కాగా, ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందుతున్న 'డ్రాగన్' సినిమాలో టొవినో థామస్ ఓ లీడ్ రోల్ చేస్తున్నారని సమాచారం. అయితే ఈ చిత్రంలో టొవినో థామస్ చేస్తున్నది విలన్ రోల్ అని, ఆల్రెడీ 'డ్రాగన్' షూటింగ్‌లో ఆయన పాల్గొంటున్నారనే ప్రచారం జరుగుతోంది. త్వరలోనే ఈ సినిమా విదేశీ షూటింగ్ షెడ్యూల్ ప్రారంభం కానుంది. ఎన్టీఆర్‌తో పాటు ఈ చిత్రం కీలక తారాగణం అంతా షూటింగ్‌లో పాల్గొంటారని తెలిసింది. రుక్మిణీ వసంత్ ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్నారు. గుల్షన్ కుమార్, భూషణ్ కుమార్, టీ సిరీస్ ఫిల్మ్స్, మైత్రీ మూవీ మేకర్స్‌ల సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ పతాకాలపై కల్యాణ్ రామ్ నందమూరి, నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి, హరికృష్ణ కొసరాజు నిర్మిస్తున్న ఈ చిత్రం 2026 జూన్ 25న విడుదల కానుంది.

నెగటివ్ క్యారెక్టర్స్ చేయడానికి సీనియర్ హీరోలు సైతం చాలా ఉత్సాహం చూపిస్తున్నారు. రజనీకాంత్ హీరోగా నటించిన 'కూలీ' చిత్రంలో నాగార్జున విలన్‌గా చేశారు. షారుక్ ఖాన్, ఆయన తనయ సుహానా ఖాన్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్న 'కింగ్' (ప్రచారంలో ఉన్న టైటిల్) చిత్రంలో అభిషేక్ బచ్చన్ విలన్ రోల్ చేస్తున్నారు. ప్రభాస్ హీరోగా నటిస్తున్న 'కల్కి 2898 ఏడీ' చిత్రంలో కమల్‌హాసన్ విలన్ రోల్ చేస్తున్నారు. 'దోశె కింగ్' అనే కొత్త చిత్రం కోసం మోహన్‌లాల్ కాస్త నెగటివ్ షేడ్స్ ఉన్న క్యారెక్టర్ చేయనున్నారనే టాక్ వినిపిస్తోంది. 'భ్రమయుగం' చిత్రంలో మమ్ముట్టి విలన్ రోల్ చేశారు. అలాగే జితిన్ కే జోస్ డైరెక్షన్‌లోని మరో సినిమాలో మమ్ముట్టి విలన్ రోల్ చేయనున్నారనే టాక్ వినిపిస్తోంది. ఇలా... మరికొందరు సీనియర్ యాక్టర్స్ విలన్ రోల్ చేసేందుకు ఉత్సాహం చూపిస్తున్నారు.

తెలుగులో విలన్స్‌గా చేస్తున్న నటీమణులూ ఉన్నారు..


బాలీవుడ్ నటి సోనాక్షీ సిన్హా నటిస్తున్న తొలి తెలుగు చిత్రం 'జటాధర'. సుధీర్‌బాబు హీరోగా నటిస్తున్న ఈ ద్విభాషా (తెలుగు, హిందీ) చిత్రంలో సోనాక్షీ సిన్హాతో పాటు దివ్య ఖోస్లా, శిల్పా శిరోద్కర్ ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సూపర్ నేచురల్ మైథలాజికల్ థ్రిల్లర్ చిత్రంలో సోనాక్షీ సిన్హా, శిల్పా శిరోద్కర్ పాత్రల్లో నెగటివ్ షేడ్స్ ఉంటాయని సమాచారం. దాదాపు పదిహేనేళ్ల తర్వాత శిల్పా శిరోద్కర్ సిల్వర్ స్క్రీన్ పై కనిపించనున్న చిత్రం ఇది. జీ స్టూడియోస్, ప్రేరణా అరోరా సమర్పణలో ఉమేష్ కుమార్ బన్సల్, శివిన్ నారంగ్, నిఖిల్ నందా, అరుణ అగర్వాల్, శిల్పా సింగాల్‌లు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రం వచ్చే ఏడాది విడుదల కానుంది.

• హీరో అల్లు అర్జున్, దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో అంతర్జాతీయ స్థాయిలో ఓ చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో ఐదుగురు హీరోయిన్స్ ఉంటారనే ప్రచారం జరుగుతోంది. దీపికా పదుకోన్ ఆల్రెడీ కన్ఫార్మ్ అయ్యారు. హీరోయిన్ మృణాల్ ఠాకూర్ ఈ సినిమా షూటింగ్‌లో పాల్గొంటున్నారని తెలిసింది. అయితే మృణాల్ గురించిన అధికారక ప్రకటన లేదు. అలాగే ఈ చిత్రంలో రష్మికా మందన్నా కూడా నటిస్తున్నారనే టాక్ తెరపైకి వచ్చింది. అయితే ఈ సినిమాలో రష్మికా మందన్నా పాత్రలో నెగటివ్ షేడ్స్ ఉంటాయని, ఆమె విలన్ రోల్‌లో కనిపిస్తారనే ప్రచారం జరుగుతోంది. ఈ విషయంపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. సన్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రం 2027 ఆగస్టులో విడుదలవుతుందనే ప్రచారం సాగుతోంది. ఈ సంగతి ఇలా ఉంచితే... అల్లు అర్జున్, రష్మికా మందన్నాలు 'పుష్ప' ఫ్రాంచైజీలోని 'పుష్ప: ది రైజ్, పుష్ప: ది రూల్' చిత్రాల్లో హీరో, హీరోయిన్లుగా నటించారు. ఇటీవల 'పుష్ప 3' కూడా ఉంటుందని సుకుమార్ ఓ సందర్భంలో కన్ఫార్మ్ చేశారు. ఈ నేపథ్యంలో అట్లీ డైరెక్షన్‌లో అల్లు అర్జున్ హీరోగా నటిస్తున్న చిత్రంలో రష్మికా మందన్నా విలన్‌గా నటిస్తే, ఆమె పాత్ర ఎలా ఉండబోతుందన్న ఆసక్తి సినిమా లవర్స్‌లో ఉండటం సహజం.


రష్మిక


శిల్పా శిరోద్కర్

కెరీర్‌లో హీరోగా మంచి పీక్ స్టేజ్‌లో ఉన్న యంగ్ యాక్టర్స్ కూడా విభిన్నమైన విలన్ రోల్ వస్తే చేయడానికి ఉత్సాహం చూపిస్తున్నారు. హృతిక్ రోషన్ హీరోగా నటించిన 'వార్ 2'లో ఎన్టీఆర్ విలన్‌గా నటించారు. హిందీలో ఎన్టీఆర్‌కు ఇది తొలి చిత్రం. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ 'భైరవం' చిత్రంలో విలన్‌గా నటించారు మంచు మనోజ్. తేజ సజ్జా హీరోగా నటించిన 'మిరాయ్'లోనూ మనోజ్ ప్రతినాయకుడి పాత్ర పోషించారు. మలయాళ దర్శక-నిర్మాత పృథ్వీరాజ్ సుకుమారన్ (బడే మియా చోటే మియా), ఫాహద్ ఫాజిల్ (పుష్ప 3), అర్జున్ కపూర్ (సింగమ్ ఎగైన్) వంటి చిత్రాల్లో విలన్ రోల్ చేశారు. మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న సినిమాలోనూ పృథ్వీరాజ్ విలన్‌గా చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. శివ కార్తికేయన్ హీరోగా నటిస్తున్న 'పరాశక్తి' చిత్రంలో తొలిసారిగా పూర్తి స్థాయి విలన్‌గా నటిస్తున్నారు జయం రవి. తెలుగు నటుడు సుహాస్ తమిళ చిత్రం 'మండాడి'లో విలన్ రోల్ చేస్తున్నారు. ఈ కోవలో మరికొంతమంది ఉన్నారు.


సోనాక్షీ సిన్హా

- మునిమి శివాంజనేయులు

నిజం చెప్పలేదు కదా!

'ఇది చాలా నేచురల్‌గా జరగాల్సిన పని ఇది.. నాకు రాసిపెట్టి ఉన్న అమ్మాయెవరో తనంతట తానే నా లైఫ్‌లోకి రావాలి' అనే డైలాగ్‌తో 'తెలుసు కదా' చిత్రం టీజర్ ప్రారంభమైంది. 'డీజే టిల్లు, టిల్లు స్క్వేర్' చిత్రాల ఫేమ్ సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'తెలుసు కదా'. ప్రముఖ స్టైలిస్ట్ నీరజ కోన ఈ సినిమా ద్వారా దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు. రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రంలో వైవా హర్ష కీలక పాత్ర పోషిస్తున్నారు. టీజీ విశ్వప్రసాద్, టీజీ కృతీ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమా దీపావళి పండుగ సందర్భంగా అక్టోబర్ 17న విడుదల కానుంది. ఈ చిత్రం టీజర్‌ని గురువారం విడుదల చేశారు. ''ఐయామ్ సారీ... నీకు నిజం చెప్పలేదు కదా', 'ఏమున్నావ్ బేబీ... 70 శాతం ఏంజిల్.. 30 శాతం డెవిల్‌వి నువ్వు', 'పెళ్లి చేసుకుందాం', 'నీకు తెలుసు కదా' అంటూ సిద్ధు జొన్నలగడ్డ చెప్పే డైలాగ్స్‌తో పాటు 'నీకు ఇష్టం కదా... ఇలా ఇద్దరిద్దరి మధ్యలో దూరడం, నాకొద్దు ఇది... నా కొద్దు.... అసలు ఏం నడుస్తోంది రా మైండ్‌లో' అంటూ వైవా హర్ష చెప్పే డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి.


సిద్ధు, శ్రీనిధి, రాశీ

నా ఇంటిని పాఠశాలగా మారుస్తున్నా


– రాఘవ లారెన్స్

''నేను నిర్మించుకున్న తొలి ఇంటిని పాఠశాలగా మారుస్తున్నాను'' అంటూ నటుడు, దర్శకుడు రాఘవ లారెన్స్ ప్రకటించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా ఓ పోస్ట్ చేశారు. ''రాఘవ లారెన్స్ ఛారిటబుల్ ట్రస్ట్' ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేయడంతో పాటు అవసరమైన వారికి సాయం చేస్తున్న సంగతి తెలిసిందే. అదేవిధంగా నేను నటించే సినిమాలకు తీసుకునే అడ్వాన్స్‌ను సేవా కార్యక్రమాలకు వినియోగిస్తుంటాను. అందులో భాగంగా 'కాంచన 4' సినిమాకి తీసుకున్న అడ్వాన్స్‌తో మరో సేవా కార్యక్రమం మొదలుపెట్టాను. డ్యాన్స్ మాస్టర్‌గా నేను సంపాదించిన డబ్బుతో కట్టించిన తొలి ఇంటిని గతంలో అనాథాశ్రమంగా మార్చాం. అప్పుడు నేను అద్దె ఇంట్లో ఉండేవాడిని. అనాథాశ్రమంలో ఆశ్రయం పొందిన వారు ఇప్పుడు ఉద్యోగాలు చేస్తున్నారు. ఇప్పుడు ఆ ఇంటిని విద్యార్థుల కోసం పాఠశాలగా మార్చి, ఉచితంగా విద్యనందిస్తున్నాం. మా అనాథాశ్రమంలో పెరిగిన ఓ విద్యార్థి త్వరలో ప్రారంభం కానున్న ఆ పాఠశాలలో టీచర్‌గా పని చేయనున్నారు. నా ఇంటిని మరోసారి సేవా కార్యక్రమానికి వినియోగిస్తున్నందుకు ఎంతో గర్వంగా ఉంది. ఈ కొత్త ప్రయాణానికి మీ అందరి ఆశీస్సులు కావాలి'' అని రాఘవ లారెన్స్ పేర్కొన్నారు.


రాఘవ లారెన్స్

కాంత వాయిదా

'కాంత' చిత్రం రిలీజ్ వాయిదా పడింది. దుల్కర్ సల్మాన్, భాగ్య శ్రీ భోర్సే హీరో హీరోయిన్లుగా సముద్ర ఖని ఓ కీలక పాత్రలో నటించిన పీరియాడికల్ చిత్రం 'కాంత'. 1950 మద్రాస్ నేపథ్యంలో సాగే ఈ ఎమోషనల్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రానికి సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహించారు. స్పిరిట్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్, వేఫేరర్ ఫిల్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్ పతాకాలపై రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్, ప్రశాంత్ పొట్లూరి, జోమ్ వర్గీస్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమాను ఈ నెల 12న విడుదల చేయనున్నట్లుగా గతంలో చిత్రయూనిట్ పేర్కొంది. కానీ ఆ తేదీకి విడుదల చేయడం లేదని, త్వరలోనే కొత్త విడుదల తేదీని ప్రకటిస్తామని గురువారం చిత్రయూనిట్ ఓ నోట్‌ను విడుదల చేసింది. ''కాంత' సినిమా టీజర్ విడుదలైనప్పట్నుంచి మీరు చూపించిన ప్రేమ, ఆప్యాయత, మద్దతు మా హృదయాలను హత్తుకుంది. ఈ చిత్రానికి సంబంధించి మీకు మరింత మెరుగైన అనుభూతిని ఇవ్వాలనుకుంటున్నాం. ఆ దృష్ట్యా విడుదలను వాయిదా వేశామని తెలియజేస్తున్నాం. కొత్త విడుదల తేదీని త్వరలోనే ప్రకటిస్తాం'' అని 'కాంత' చిత్రం యూనిట్ పేర్కొంది.


భాగ్యశ్రీ, దుల్కర్ సల్మాన్

బిజినెస్ రీల్

జేబీఎమ్ గ్రూప్‌నకు ఐఎఫ్‌సీ మద్దతు


రూ. 1,210 కోట్ల పెట్టుబడులు



న్యూఢిల్లీ: దేశీయంగా ఈమొబిలిటీకి ప్రోత్సాహాన్నిస్తూ ప్రపంచ బ్యాంక్ సంస్థ ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్(ఐఎఫ్‌సీ) ఆటో రంగ కంపెనీ జేబీఎమ్ గ్రూప్‌నకు పెట్టుబడులు అందించనుంది. ఇందుకు అనుగుణంగా 13.7 కోట్ల డాలర్లు(సుమారు రూ. 1,210 కోట్లు) సమకూర్చనుంది. వీటిలో ఈబస్సుల తయారీ, నిర్వాహక కంపెనీ జేబీఎమ్ ఆటో లిమిటెడ్‌లో భాగమైన జేబీఎమ్ ఎకోలైఫ్‌కు 10 కోట్ల డాలర్లు కేటాయించనుండగా.. గ్రీన్‌సెల్ మొబిలిటీకి ఈక్విటీ, డెట్ కలయిక(మెజ్జనైన్ క్యాపిటల్)తో 3.7 కోట్ల డాలర్లు అందించనుంది. ఎవర్‌సోర్స్ క్యాపిటల్‌కు పెట్టుబడులున్న ఈబస్‌ల నిర్వాహక సంస్థ ఇది. తాజా పెట్టుబడుల ద్వారా ప్రజా రవాణాను విద్యుదీకరించడంతోపాటు.. ఇన్నోవేటివ్ పట్టణ మొబిలిటీ సొల్యూషన్లను విస్తరించనున్నట్లు ఐఎఫ్‌సీ పేర్కొంది. వీటి ప్రభావంతో మహిళలుసహా 12,000 మందికి ఉపాధి లభించనున్నట్లు తెలియజేసింది. 4,000 ఈబస్సులతోపాటు.. ఆంధ్రప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలలోని 39 మునిసిపాలిటీలలో చార్జింగ్ స్టేషన్లకు తెరతీయనున్నట్లు వెల్లడించింది.

విండ్‌రేసర్స్‌తో భారత్ ఫోర్జ్ జత

డ్రోన్ల తయారీకి అవగాహనా ఒప్పందం



ముంబై: ఫోర్జింగ్, అడ్వాన్స్‌డ్ ఇంజినీరింగ్ దిగ్గజం భారత్ ఫోర్జ్ తాజాగా ఆటానమస్ కార్గో డ్రోన్ల తయారీ యూకే సంస్థ విండ్‌రేసర్స్ లిమిటెడ్‌తో చేతులు కలిపింది. దీనిలో భాగంగా మానవరహిత ఏరియల్ వాహనం (యూఏవీ) అల్ట్రా తయారీ వ్యూహాలు, స్థానికత, అప్లికేషన్‌కు అవగాహనా ఒప్పందాన్ని(ఎంవోయూ) కుదుర్చుకుంది. తద్వారా దేశవ్యాప్తంగా వీటి తయారీలో విండ్‌రేసర్స్ నుంచి సహకారాన్ని పొందనుంది. లండన్‌లో జరుగుతున్న గ్లోబల్ డిఫెన్స్ ఎగ్జిబిషన్, సదస్సు 'డీఎస్ఈఐ యూకే 2025'లో రెండు సంస్థలు ఒప్పందంపై సంతకాలు చేశాయి. తద్వారా దేశీయంగా విండ్‌సర్ ఇన్నోవేషన్, టెక్నాలజీ బదిలీ, వ్యూహాత్మక ఏరోస్పేస్ అప్లికేషన్స్‌ను భారత్ ఫోర్జ్ జత చేసుకోనుంది. ఒప్పందం తొలుత రెండేళ్లపాటు అమల్లో ఉంటుందని భారత్ ఫోర్జ్ పేర్కొంది. యూకే, భారత్ మధ్యగల స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం(ఎఫ్‌టీఏ)లో భాగంగా రెండు సంస్థల మధ్య భాగస్వామ్యం కొనసాగనున్నట్లు తెలియజేసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

12-9-2025

విశాఖ	555-00
చిత్తూరు	563-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	545-00
విజయవాడ	550-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	535-00
వరంగల్	537-00
రిటైల్ ధర	5.95

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ADANIENT	2,408.00	2.9
SHRIRAMFIN	620.2	2.55
NTPC	331.5	1.8
AXISBANK	1,087.60	1.64
ETERNAL	328.35	1.22

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BAJAJ-AUTO	9,119.00	-1.35
INFY	1,512.20	-1.33
EICHERMOT	6,758.50	-1.14
TITAN	3,580.00	-1.12
SBILIFE	1,813.60	-1.01

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	10,221
ఎన్ఎస్ఈ	96,205
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,07,171
ఎఫ్ఐఐ	- 3,472
డీఐఐ	+ 4,046

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	62.56 (రాత్రి 11.30కు)	$	63.67 (క్రితం ముగింపు)
బ్రెంట్	66.39 (రాత్రి 11.30కు)	$	67.49 (క్రితం ముగింపు)

స్క్రాప్ సర్టిఫికెట్‌తో అదనపు డిస్కౌంట్..

- కొత్త వాహనాలపై ఇస్తే పరిశ్రమకే ప్రయోజనం
- జీఎస్‌టీపరంగా కూడా ఊరటనివ్వాలని ప్రధానిని కోరాను
- సియామ్ కార్యక్రమంలో మంత్రి గడ్కరీ వెల్లడి



న్యూఢిల్లీ: పాత వాహనానికి సంబంధించిన స్క్రాపేజీ సర్టిఫికెట్ ఇచ్చే కస్టమర్లకు, కొత్త వాహనాలపై మరిన్ని డిస్కౌంట్లు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని ఆటోమొబైల్ పరిశ్రమకు కేంద్ర రహదారి రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ సూచించారు. అలాగే, పాత వాహనాన్ని తుక్కు కింద మార్చి (స్క్రాప్) కొత్తవి కొంటున్న వారికి, జీఎస్‌టీని కొంత తగ్గించడం రూపంలో కూడా ఊరట కల్పించాలని ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ని కోరినట్లు ఆయన చెప్పారు. భారతీయ ఆటోమొబైల్స్ తయారీ సంస్థల సంఘం సియామ్ వార్షిక సదస్సులో పాల్గొన్న సందర్భంగా మంత్రి ఈ విషయాలు తెలిపారు. స్క్రాపేజీ పాలసీ అనేది ఇటు పరిశ్రమకు అటు ప్రభుత్వానికి కూడా ప్రయోజనకరమైనదని గడ్కరీ చెప్పారు. ''ఇది పరిశ్రమకే మేలు చేస్తుంది. కానీ పరిశ్రమ నా మాట ఇంకా పూర్తిగా వినడం లేదు. కొత్త వాహనాన్ని కొనేందుకు, పాతదాన్ని స్క్రాప్ చేసిన వారికి బాగా డిస్కౌంట్లు ఇస్తే, మీ టర్నోవరే భారీగా పెరుగుతుంది. ప్రభుత్వానికి కూడా జీఎస్‌టీ వస్తుంది. దేశంలో కాలుష్యం తగ్గుతుంది. కాబట్టి దీనికి మీరు కూడా ఇందుకు తప్పకుండా తోడ్పడాలి'' అని గడ్కరీ చెప్పారు. ఇటీవల వస్తు, సేవల పన్నులను (జీ ఎస్టీ) క్రమబద్ధీకరించడం వల్ల ఆటో రంగానికి భారీగా లబ్ధి చేకూరిందని, పరిశ్రమకు ప్రభుత్వం ఎల్లప్పుడు అండగా ఉంటుందని ఆయన తెలిపారు. ''మన ఆటో పరిశ్రమ ఇప్పుడు పరిమాణంపరంగా నంబర్ 3గా ఎదిగింది. మనం అంతా కలిసి పని చేస్తే తప్పకుండా ప్రపంచంలోనే నంబర్ వన్ స్థానానికి చేరుకోగలం'' అని గడ్కరీ వివరించారు.



తుక్కు రీసైక్లింగ్‌తో ఉద్యోగాలకు దన్ను..

తుక్కును రీసైక్లింగ్ చేసే ప్రక్రియ కారణంగా అదనంగా 70 లక్షల ఉద్యోగాల కల్పన జరుగుతుందని గడ్కరీ చెప్పారు. అలాగే ఉక్కు, సీసం, అల్యూమినియం, ప్లాటినం, పల్లాడియం లాంటి లోహాల లభ్యత కూడా పెరగడం వల్ల దిగుమతులపై ఆధారపడే పరిస్థితి తగ్గుతుందని తెలిపారు. వాహనాలన్నింటినీ స్క్రాప్ చేసి అదనంగా కొత్త వాహనాలను కొనుగోలు చేయడం వల్ల జీఎస్‌టీ రూపంలో రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వానికి రూ. 40,000 కోట్ల మేర ఆదాయం సమకూరుతుందని గడ్కరీ చెప్పారు. స్క్రాపింగ్ తర్వాత ఏర్పడే అదనపు డిమాండ్‌తో ఆటోమొబైల్ పరిశ్రమ కూడా ప్రయోజనం పొందుతుందన్నారు. ప్రస్తుతం ప్రతి నెలా సగటున 16,830 వాహనాలను తుక్కు కింద మారుస్తుండగా, ప్రైవేట్ రంగం రూ. 2,700 కోట్లు ఇన్వెస్ట్ చేసిందని ఆయన చెప్పారు.

ఈ–20పై అవాస్తవాలు..

ఈ20 ఇంధనంతో వాహనాల మైలేజీ తగ్గుతుందని, ఇంజిన్ పాడవుతుందని ఆందోళనలు వ్యక్తమవుతుండటంపై స్పందిస్తూ, అవన్నీ అవాస్తవాలే అని గడ్కరీ కొట్టిపారేశారు. దిగుమతులను తగ్గించుకునేందుకు ఇథనాల్ ఉపయోగపడుతుందని, దీని వల్ల కాలుష్యం కూడా తగ్గుతుందని ఆయన చెప్పారు. దీనితో రైతులకు రూ. 45,000 కోట్ల మేర ప్రయోజనం చేకూరుతుందన్నారు. కాలుష్య నియంత్రణకు సంబంధించి దేశీయంగా అంతర్జాతీయ ప్రమాణాలను అమలు చేస్తామని మంత్రి చెప్పారు.

పరిశ్రమకు జీఎస్‌టీ బూస్ట్..

వాహనాలపై జీఎస్‌టీ రేట్ల తగ్గింపు దేశీ ఆటోమోటివ్ పరిశ్రమ వృద్ధికి మరింత దోహదపడుతుందని సియామ్ ప్రెసిడెంట్ శైలేష్ చంద్ర తెలిపారు. దీనితో రేట్లు తగ్గి, ముఖ్యంగా ఎంట్రీ లెవెల్ సెగ్మెంట్ వాహనాలు మరింతగా అందుబాటులోకి వస్తాయని చెప్పారు. తొలిసారిగా వాహనాలు కొనుగోలు చేస్తున్న వారికి, మధ్య స్థాయి ఆదాయవర్గాలకు గణనీయంగా ప్రయోజనం లభిస్తుందని చంద్ర వివరించారు. గత ఆర్థిక సంవత్సరంలో దేశీ మార్కెట్లోను, అలాగే ఎగుమతులపరంగాను భారతీయ ఆటో పరిశ్రమ స్థిరమైన పనితీరు కనపర్చిందని చెప్పారు. ప్యాసింజర్ వాహనాల విభాగంలో 2 శాతం వార్షిక వృద్ధితో, అత్యధికంగా 43 లక్షల యూనిట్ల అమ్మకాలు నమోదైనట్లు వివరించారు. ద్విచక్ర వాహనాల విభాగం కూడా కోలుకుంటోందని 9.1 శాతం వృద్ధితో 1.96 కోట్ల విక్రయాలు నమోదయ్యాయని చంద్ర చెప్పారు.

భారత్-అమెరికా చర్చల్లో పురోగతి

- సానుకూల వాతావరణంలో సాగుతున్నాయి
- కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్



పాట్నా: ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందంపై భారత్–అమెరికా మధ్య చర్చలు సానుకూల వాతావరణంలో ముందుకు సాగుతున్నట్టు కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ గురువారం ప్రకటించారు. చర్చల్లో పురోగతి పట్ల రెండు దేశాలు సంతృప్తిగా ఉన్నట్టు చెప్పారు. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై (బీటీఏ) చర్చలను 2025 నవంబర్ నాటికి ముగించాలంటూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, ప్రధాని నరేంద్ర మోదీ ఈ ఏడాది ఫిబ్రవరిలో తమ దేశ వాణిజ్య మంత్రులకు సూచించినట్టు తెలిపారు. వాణిజ్య ఒప్పందం విషయమై అమెరికాతో భారత్ చురుగ్గా చర్చలు నిర్వహిస్తున్నట్టు మంత్రి గోయల్ బుధవారం సైతం ప్రకటించడం గమనార్హం. రెండు దేశాల మధ్య వాణిజ్య చర్చలు విజయవంతంగా పూర్తయ్యేందుకు ఎలాంటి అడ్డంకుల్లేవని, తన మంచి స్నేహితుడైన ప్రధాని నరేంద్ర మోదీతో రానున్న వారాల్లో మాట్లాడేందుకు వేచి చూస్తున్నానంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రకటనతో.. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం సాకారమవుతుందన్న అంచనాలు ఏర్పడ్డాయి. ట్రంప్ వ్యాఖ్యలపై ప్రధాని మోదీ సైతం వెంటనే సానుకూలంగా స్పందించారు. అమెరికా, భారత్ సహజ భాగస్వాములంటూ.. వీలైనంత ముందుగా వాణిజ్య చర్చలను ముగించేందుకు రెండు దేశాలు చురుగ్గా పనిచేస్తున్నాయంటూ ప్రధాని మోదీ ఎక్స్ ప్లాట్‌ఫామ్‌పై చేసిన పోస్ట్‌లో పేర్కొన్నారు. వాస్తవానికి భారత్–అమెరికా మధ్య పలు విడతల చర్చలు జరిగినప్పటికీ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై అంగీకారం కుదరకపోవడం తెలిసిందే.

రుణాలపై మారటోరియం ఇవ్వండి

- ఆర్థికంగా వెసులుబాటు కల్పించండి
- ఆర్‌బీఐకి ఎగుమతిదార్ల వినతి



న్యూఢిల్లీ: ఎగుమతిదారులు టారిఫ్‌లు, ద్రవ్యోల్బణం, డిమాండ్ అనిశ్చితిలాంటి సవాళ్లను ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఆర్థికంగా వెసులుబాటు లభించేలా తక్షణమే చర్యలు తీసుకోవాలని రిజర్వ్ బ్యాంక్‌కి ఎగుమతి సంస్థల సమాఖ్య ఎఫ్ఐఈవో విజ్ఞప్తి చేసింది. రుణాలకు సంబంధించి అసలు, వడ్డీపై ఒక ఏడాది పాటు వన్–టైమ్ మారటోరియం ప్రకటించాలని కోరింది. అలాగే ప్రాధాన్యతా రంగం కింద వర్గీకరించినప్పటికీ ఎగుమతి సంస్థలకు తగు స్థాయిలో ప్రయోజనం లభించడం లేదని పేర్కొంది. ప్రాధాన్యతా రంగాలకు నిర్దేశించిన 40 శాతం రుణాలకు సంబంధించి ఎగుమతిదార్ల వాటా 2–2.5 శాతంగా ఉండేలా ఆదేశించాలని ప్రతిపాదించింది. గురువారం ఆర్‌బీఐతో సమావేశమైన సందర్భంగా ఎఫ్ఐఈవో ఈ మేరకు విజ్ఞప్తులు చేసింది. బ్యాంకులు సరళతరమైన విధంగా రుణాలు అందించాలని, పరిస్థితిని బట్టి పునర్‌వ్యవస్థీకరించాలని, అంతర్జాతీయంగా లావాదేవీల నిర్వహణ విషయంలో ఎగుమతిదార్లకు మద్దతుగా నిలవాలని కోరింది. అంతర్జాతీయంగా సరఫరా వ్యవస్థల్లో అంతరాయాల కారణంగా కొనుగోళ్లు, ఉత్పత్తి, ఎగుమతి షెడ్యూల్స్‌లో జాప్యం జరుగుతోందని పేర్కొంది. కాబట్టి, ఎగుమతి చేయడానికి ముందు ఇచ్చే స్వల్పకాలిక రుణాల కాలవ్యవధిని పెంచితే ఎగుమతిదార్లకు ప్రయోజనకరంగా ఉంటుందని ఎఫ్ఐఈవో తెలిపింది. తమ పరిధిలో లేని జాప్యాల వల్ల ఆర్థికంగా దెబ్బ తినకుండా నిర్వహణ మూలధనాన్ని సమర్ధవంతంగా ఉపయోగించుకునేందుకు, నాణ్యతా ప్రమాణాలు పాటించేందుకు, కాంట్రాక్టు నిబంధనలను పాటించేందుకు వీలవుతుందని వివరించింది. ఇలాంటి ఊరటనిచ్చే చర్యలతో ఎగుమతిదార్లు, మార్కెట్లలో నెలకొన్న కొత్త పరిస్థితులకు అనుగుణంగా తమ కార్యకలాపాలను, వ్యూహాలను మార్చుకునేందుకు వీలవుతుందని పేర్కొంది. కోవిడ్ మహమ్మారి సమయంలో ఇచ్చిన ఎమర్జెన్సీ క్రెడిట్ లైన్ గ్యారంటీ స్కీమ్ (ఈసీఎల్‌జీఎస్) తరహా పథకాన్నిమళ్లీ ప్రవేశపెట్టాలని ఎఫ్ఐఈవో విజ్ఞప్తి చేసింది. ముఖ్యంగా చిన్న, మధ్య తరహా సంస్థలకు ప్రస్తుతం ఇలాంటివి చాలా అవసరమని వివరించింది.

ఈయూతో వాణిజ్య ఒప్పందం.. ఆటో రంగానికి అవకాశాలు

వాణిజ్య శాఖ స్పెషల్ సెక్రటరీ రాజేశ్ అగర్వాల్



న్యూఢిల్లీ: ఐరోపా సమాఖ్య (ఈయూ)తో ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందం ద్వారా దేశీ ఆటో పరిశ్రమకు పెద్ద ఎత్తున అవకాశాలు అందుబాటులోకి వస్తాయని కేంద్ర వాణిజ్య శాఖ స్పెషల్ సెక్రటరీ రాజేశ్ అగర్వాల్ తెలిపారు. ఎగుమతులను పెంచుకోవచ్చని, 27 దేశాల కూటమికి చెందిన ఆటోమొబైల్ దిగ్గజాలతో కొత్త భాగస్వామ్యాలకు అవకాశాలు లభిస్తాయని చెప్పారు. భారత ప్రజలకు సరైన టెక్నాలజీ, సరైన రవాణా పరిష్కారాలను తీసుకొచ్చేందుకు వీలుంటుందన్నారు. ఈయూతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై ప్రస్తుతం చర్చలు కొనసాగుతున్నాయంటూ.. ఆటోమొబైల్ రంగానికి ఇది ఎంతో ముఖ్యమన్నారు. ఈయూలో మార్కెట్ అవకాశాలపై అవగాహన కుదిరిన వెంటనే చర్చలను త్వరగా ముగిస్తామని చెప్పారు. ఈయూ అధికారుల బృందం ఢిల్లీలో 13వ విడత చర్చలు నిర్వహించిన నేపథ్యంలో అగర్వాల్ వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది. భారత ఆటోమొబైల్ రంగానికి సంబంధించి సుంకాల్లో రాయితీలు ఇవ్వాలని ఈయూ బృందం డిమాండ్ చేస్తుండడం గమనార్హం. ఈ ఏడాది మే 6న బ్రిటన్‌తో కుదిరిన ద్వైపాక్షిక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంలో ఆ దేశ ఆటోమొబైల్ కంపెనీలకు భారత్ రాయితీలను కల్పించడం తెలిసిందే. దీంతో ఈయూ సైతం ఇదే విధమైన డిమాండ్ చేస్తోంది. బ్రిటన్‌తో ఒప్పందం వల్ల ఆటోమొబైల్ దిగుమతులపై టారిఫ్‌లు 100 శాతం నుంచి 10 శాతానికి తగ్గుతాయని అగర్వాల్ చెప్పారు. అది కూడా 10–15 ఏళ్ల కాలంలో క్రమంగా అమలవుతుందన్నారు. సున్నిత రంగాల ప్రయోజనాలను కాపాడేందుకు యూకేతో ఒప్పందంలో జాగ్రత్తలు తీసుకున్నట్టు తెలిపారు. భారత ఆటోమొబైల్ రంగం ప్రయోజనాలు కాపాడేందుకు వీలుగా క్రమంగా భారత్ మార్కెట్ అవకాశాలకు తలుపుల తెరిచే నిబంధనలు పెడుతున్నట్టు వివరించారు.

పొదుపు, పెట్టుబడులకే తొలి ప్రాధాన్యం

- మెజారిటీ ఉద్యోగుల మనోగతం
- తర్వాత రుణ చెల్లింపులకు కేటాయింపు
- నౌకరీ నివేదిక వెల్లడి



ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నుంచి పెద్ద ఎత్తున మినహాయింపులతో కొత్త పన్ను విధానం అమల్లోకి రాగా, అధిక వేతనం ఆర్జించే వారికి గణనీయంగా పన్ను ఆదా కానుంది. ఇలా ఆదా అయ్యే మొత్తాన్ని పొదుపు, పెట్టుబడులకు మళ్లిస్తామని 57 శాతం మంది ఉద్యోగులు నౌకరీ నిర్వహించిన సర్వేలో తెలిపారు. విచక్షణారహిత వ్యయాలకు బదులు పెట్టుబడులకు, రుణాల తిరిగి చెల్లింపులకు ఆదా అయ్యే మొత్తాన్ని వెచ్చిస్తామని నిపుణులు చెప్పారు. రూ.12.75 లక్షల వరకు ఆర్జించే 20వేల మంది నిపుణుల అభిప్రాయాలను నౌకరీ సర్వేలో భాగంగా తెలుసుకుంది.

- కొత్త పన్ను విధానంలో కల్పించిన పన్ను ప్రయోజనాల గురించి తెలుసనని 64 శాతం మంది చెప్పగా, 43 శాతం మంది తమకు దీనిపై స్పష్టత లేదనో, అసలు తెలియదనో చెప్పడం గమనార్హం.
- పన్ను మినహాయింపుల కారణంగా మిగిలే మొత్తాన్ని పెట్టుబడులకు మళ్లిస్తామని 57 శాతం మంది వెల్లడించారు. రుణాల చెల్లింపులకు వినియోగిస్తామని 30 శాతం మంది తెలిపారు.
- 9 శాతం మంది మెరుగైన జీవనం కోసం ఖర్చు చేస్తామని, 4 శాతం మంది ప్రయాణాలు, విహార యాత్రల కోసం ఖర్చు చేస్తామని చెప్పారు.
- ఢిల్లీ, గురుగ్రామ్ ప్రాంతాల్లో అత్యధికంగా 63–64 శాతం మంది నిపుణులు మిగులు ఆదాయాన్ని పక్కన పెడతామని తెలిపారు.
- చెన్నైలో 44 శాతం నిపుణులు రుణ చెల్లింపులకు వినియోగిస్తామని చెప్పగా, ముంబైలో 51 శాతం మంది రిటైర్మెంట్ అవసరాలకు మళ్లిస్తామని తెలిపారు.

ట్రేడ్ వార్‌తో భారత్‌కు సవాళ్లు

మారిషస్ ప్రధాని నవీన్‌చంద్ర రామ్‌గులామ్



ముంబై: ప్రతీకార టారిఫ్‌లు, వాణిజ్య వివాదాలతో భారత్‌కు భారీ సవాళ్లు ఎదురవుతున్నట్లు మారిషస్ ప్రధాని నవీన్‌చంద్ర రామ్‌గులామ్ పేర్కొన్నారు. రక్షణాత్మక విధానాలు పెరిగిపోవడం, ప్రధాన ఆర్థిక వ్యవస్థల మధ్య ఉధృతమవుతున్న ఆందోళనలు, వాతావరణ సంబంధ విఘాతాలు పలురకాల రిస్కులకు తెరతీస్తున్నట్లు తెలియజేశారు. విదేశీ వ్యవహారాల శాఖ, ఇతర పారిశ్రామిక సమాఖ్యలతో కలసి ఫిక్కీ ఇక్కడ నిర్వహించిన మారిషస్ ఇండియా వ్యాపార సదస్సు(బిజినెస్ కాంక్లేవ్)లో నవీన్‌చంద్ర ప్రసంగించారు. సామాజిక, ఆర్థికాభివృద్ధిలో దీర్ఘకాలంగా మారిషస్‌కు భారత్ నమ్మకమైన భాగస్వామిగా నిలుస్తున్నట్లు ఈ సందర్భంగా పేర్కొన్నారు. అన్ని సమయాలలోనూ మారిషస్‌కు మద్దతివ్వడంలో దృఢంగా నిలుస్తున్నట్లు ప్రశంసించారు. ప్రపంచ ఆర్థిక పరిస్థితులు, విధానాలు అస్థిరంగా, అంచనాలకు అందని విధంగా మారినట్లు వ్యాఖ్యానించారు. సరఫరా వ్యవస్థలో అంతరాయాలు, అదుపుతప్పుతున్న రవాణా వ్యయాలు, వాతావరణ సంబంధ విఘాతాలు విభిన్న రిస్కులకు దారి చూపుతున్నట్లు వివరించారు.

సౌదీపై ఆభరణ ఎగుమతి సంస్థల దృష్టి ..

జెడ్డాలో సేజెక్స్ ఎక్స్‌పో ప్రారంభం



జెడ్డా: సౌదీ అరేబియా జ్యుయలరీ మార్కెట్లో మరిన్ని అవకాశాలను అందిపుచ్చుకోవడంపై దేశీయంగా రత్నాభరణాల ఎగుమతి సంస్థలు దృష్టి పెడుతున్నాయి. ఇందులో భాగంగా జెమ్ అండ్ జ్యుయలరీ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ (జీజేఈపీసీ) జెడ్డాలో సౌదీ అరేబియా జ్యుయలరీ ఎక్స్‌పోజిషన్‌ని (సేజెక్స్) నిర్వహిస్తోంది. భారత్‌తోపాటు సౌదీ అరేబియా, యూఏఈ, టర్కీ, హాంకాంగ్ తదితర దేశాల నుంచి 200 పైచిలుకు ఎగ్జిబిటర్లు ఇందులో పాల్గొంటున్నారు. సౌదీలో జ్యుయలరీ మార్కెట్ 2024లో 4.56 బిలియన్ డాలర్లుగా ఉండగా 2030 నాటికి ఇది రెట్టింపై 8.34 బిలియన్ డాలర్లకు చేరుతుందని, లగ్జరీ జ్యుయలరీకి సౌదీ కీలక గమ్యస్థానంగా మారుతుందని అంచనాలున్నట్లు జీజేఈపీసీ చైర్మన్ కిరీట్ భన్సాలీ తెలిపారు.

గ్లోబల్ టూరిజం హబ్‌గా సౌదీ అరేబియా ఎదుగుతున్న నేపథ్యంలో స్థానిక ప్రజల నుంచే కాకుండా, లక్షల సంఖ్యలో అక్కడికి వచ్చే అంతర్జాతీయ పర్యాటకుల నుంచి కూడా జ్యుయలరీకి డిమాండ్ నెలకొనే అవకాశం ఉందని ఆయన వివరించారు. విశ్వసనీయమైన సరఫరాదారుగా భారత్, వజ్రాభరణాలకు అంతర్జాతీయ హబ్‌గా సౌదీ అరేబియా కలిసి పని చేస్తే గణనీయంగా ప్రయోజనాలు ఉంటాయని వివరించారు. వ్యాపార అవకాశాలు ఎక్కువగా ఉండే మార్కెట్లకు ఆభరణాలను ఎగుమతి చేసే దిశగా సేజెక్స్ ఒక ముందడుగు కాగలదని భన్సాలీ చెప్పారు. భారత్ ఏటా 32 బిలియన్ డాలర్ల విలువ చేసే రత్నాభరణాలను ఎగుమతి చేస్తోంది. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మద్దతుతో జీజేఈపీసీ ఈ ఎక్స్‌పో నిర్వహిస్తోంది.

టాటా క్యాపిటల్ మెగా ఐపీవో వచ్చే నెలలో!

- రూ. 17,000 కోట్ల సమీకరణ లక్ష్యం
- గడువు పొడిగింపునకు ఆర్‌బీఐ ఓకే




న్యూఢిల్లీ: అప్పర్‌లేయర్ ఎన్‌బీఎఫ్‌సీ కంపెనీ టాటా క్యాపిటల్ పబ్లిక్ ఇష్యూ అక్టోబర్ తొలి వారంలో వెలువడనున్నట్లు తెలుస్తోంది. తద్వారా టాటా గ్రూప్ దిగ్గజం 200 కోట్ల డాలర్లు(సుమారు రూ. 17,000 కోట్లు) సమీకరించే యోచనలో ఉన్నట్లు సంబంధిత వర్గాలు తెలియజేశాయి. కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టయ్యేందుకు వీలుగా ఆర్‌బీఐ సైతం గడువు పొడిగింపునకు అనుమతించిన నేపథ్యంలో వచ్చే నెల రెండో వారానికల్లా ఐపీవో పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నాయి. తొలుత ఇందుకు సెప్టెంబర్ 30వరకూ ఆర్‌బీఐ గడువు ఇచ్చింది. లిస్టింగ్‌లో కంపెనీ విలువ 18 బిలియన్ డాలర్లుగా నమోదుకావచ్చని అంచనా. అయితే ఈ ఏడాది ఏప్రిల్‌లో ఐపీవో కోసం ప్రాస్పెక్టస్ దాఖలు చేసినప్పుడు మదింపు చేసిన 11 బిలియన్ డాలర్ల విలువతో పోలిస్తే ఇది 63 శాతం అధికంకావడం గమనార్హం! కాగా.. 2024 అక్టోబర్‌లో ఆటో రంగ దిగ్గజం హ్యుందాయ్ చేపట్టిన 3.3 బిలియన్ డాలర్ల(రూ. 27,870 కోట్లు) ఐపీవో తదుపరి రెండో పెద్ద ఇష్యూగా టాటా క్యాపిటల్ నిలవనుంది. నిజానికి అతిపెద్ద ఐపీవోలకు నియంత్రణ సంస్థల నుంచి గడువు పొడిగింపు లభించడం సహజమేనని పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి. ఇంతక్రితం రూ. 4,000 కోట్ల ఎన్ఎస్‌డీఎల్ పబ్లిక్ ఇష్యూకి సైతం సెబీ 4 నెలల గడువును పొడిగించినట్లు ప్రస్తావించాయి. ఎన్ఎస్‌డీఎల్ జూలైలో లిస్టయిన సంగతి తెలిసిందే.

ఐపీవో వివరాలిలా

సెబీకి దాఖలు చేసిన ప్రాస్పెక్టస్ ప్రకారం టాటా క్యాపిటల్ ఐపీవోలో భాగంగా 21 కోట్ల ఈక్విటీ షేర్లను కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 26.58 కోట్ల షేర్లను ప్రమోటర్లు టాటా సన్స్(23 కోట్ల షేర్లు), ఐఎఫ్‌సీ(3.58 కోట్ల షేర్లు) విక్రయానికి ఉంచనున్నాయి. వెరసి ఐపీవోలో మొత్తం 47.58 కోట్ల షేర్లను ఆఫర్ చేయనుంది. ప్రస్తుతం టాటా క్యాపిటల్‌లో ప్రమోటర్ టాటా సన్స్ వాటా 88.6% కాగా.. ఐఎఫ్‌సీ వాటా 1.8%గా నమోదైంది. ఈక్విటీ జారీ నిధులను భవిష్యత్ రుణ మంజూరీలకు మద్దతుగా టైర్–1 మూలధన పటిష్టతకు వినియోగించనుంది. కంపెనీ లిస్టయితే దేశీ ఫైనాన్షియల్ రంగంలో అతిపెద్ద ఐపీవోగా రికార్డు సాధించనుంది. మరోవైపు 2023 నవంబర్‌లో ఐపీవోకు వచ్చిన టాటా టెక్నాలజీస్ తదుపరి టాటా గ్రూప్ నుంచి మరో దిగ్గజం లిస్టయ్యే వీలుంది! అప్పర్‌లేయర్ ఎన్‌బీఎఫ్‌సీగా గుర్తింపు పొందిన సంస్థలు మూడేళ్లలోగా స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్ట్‌కావలసి ఉంది. దీంతో 2022 సెప్టెంబర్‌లో ఈ గుర్తింపు పొందిన టాటా క్యాపిటల్ నిబంధనలకు అనుగుణంగా పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. ఇదేవిధంగా ఇంతక్రితం ప్రయివేట్ రంగ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సంస్థ హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ సైతం లిస్టయిన విషయం విదితమే. జూన్‌లో రూ. 12,500 కోట్ల సమీకరణ ద్వారా ఐపీవోను విజయవంతంగా ముగించింది. అంతకంటే ముందుగానే అంటే 2024 సెప్టెంబర్‌లో బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ సైతం స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్ట్‌కావడం ప్రస్తావించదగ్గ అంశం!!

కౌంటీల్లో వాషింగ్టన్ సుందర్

హాంప్‌షైర్‌తో జతకట్టిన భారత ఆల్‌రౌండర్



లండన్: భారత స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ ఇంగ్లండ్‌లో కౌంటీ క్రికెట్ ఆడేందుకు సిద్ధమయ్యాడు. కౌంటీ జట్టు హాంప్‌షైర్‌తో అతను జత కట్టాడు. ఈ సీజన్‌లో హాంప్‌షైర్ మిగతా రెండు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. సోమర్‌సెట్, సర్రేలతో ఈ రెండు మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ నేపథ్యంలో 25 ఏళ్ల ఆల్‌రౌండర్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఇంగ్లిష్ కౌంటీ జట్టు గురువారం వెల్లడించింది. 'సుందర్‌కు స్వాగతం. ప్రస్తుత కౌంటీ చాంపియన్‌షిప్‌లో భారత ఆల్‌రౌండర్ మాతో కలిసి చివరి రెండు మ్యాచ్‌లు ఆడతాడు' అని హాంప్‌షైర్ క్రికెట్ 'ఎక్స్'లో పోస్ట్ చేసింది. ఈ కౌంటీ జట్టు డైరెక్టర్ గైల్స్ వైట్ మాట్లాడుతూ ఇటీవల తమ దేశంలో జరిగిన అండర్సన్-టెండూల్కర్ ట్రోఫీలో రాణించిన సుందర్ తమ జట్టులోకి రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఆఖరి రెండు మ్యాచ్‌ల్లో అతను తమ జట్టులో కీలకపాత్ర పోషిస్తాడని అన్నారు. ఇటీవల జరిగిన ఐదు టెస్టుల సిరీస్‌లో వాషింగ్టన్ సుందర్ 47 సగటుతో 284 పరుగులు చేశాడు. ఓల్డ్ ట్రాఫోర్డ్‌లో భారత్‌ను ఒడ్డునపడేసేందుకు సెంచరీ కూడా చేశాడు. బౌలింగ్‌లో 7 వికెట్లు కూడా తీశాడు. ఇక ఈ భారత ఆటగాడికి కౌంటీలేమీ కొత్త కాదు. మూడేళ్ల క్రితం 2022లో వన్డే కప్ చాంపియన్‌షిప్‌లో లాంక్‌షైర్ తరఫున ఆడాడు. ఇక హాంప్‌షైర్ జట్టు విషయానికొస్తే... ఈ నెల 15 నుంచి 18 వరకు టాంటన్‌లో జరిగే మ్యాచ్‌లో సోమర్‌సెట్‌తో తలపడుతుంది. తర్వాత ఆఖరి పోరును డిఫెండింగ్ చాంప్ సర్రేతో ఈ నెల 24 నుంచి 27 వరకు ఆడుతుంది.

చైనా, ఉజ్బెక్ క్లబ్‌లతో ఈస్ట్ బెంగాల్ పోరు

నవంబర్‌లో ఏఎఫ్‌సీ మహిళల చాంపియన్స్ లీగ్


సౌమ్య

న్యూఢిల్లీ: భారత ఫుట్‌బాల్ క్లబ్ ఈస్ట్ బెంగాల్ జట్టుకు ఏఎఫ్‌సీ మహిళల చాంపియన్‌షిప్ గ్రూప్ 'బి'లో చోటు దక్కింది. కౌలాలంపూర్‌లో తీసిన 'డ్రా'లో ఈస్ట్ బెంగాల్ మహిళల జట్టుకు ఒక రకంగా ఇది క్లిష్టమైన పోరే! 'బి' గ్రూపులో చైనా, ఇరాన్, ఉజ్బెకిస్తాన్‌లకు చెందిన క్లబ్‌లతో ఈస్ట్ బెంగాల్ తలపడనుంది. ఈ సీజన్ భారత మహిళల లీగ్‌లో విజేతగా నిలువడం ద్వారా ఈస్ట్ బెంగాల్ ఎఫ్‌సీ ఏఎఫ్‌సీ మహిళల టోర్నీకి అర్హత సంపాదించింది. తెలంగాణకు చెందిన సౌమ్య గుగులోత్ ఈస్ట్ బెంగాల్‌కు టైటిల్ దక్కడంలో కీలకపాత్ర పోషించింది. వివిధ దేశాలకు చెందిన దేశవాళీ చాంపియన్లు ఈ టోర్నీలో పోటీ పడతాయి. మొత్తం 12 జట్లను మూడు గ్రూపులుగా విభజించారు. గ్రూప్ 'బి'లో చైనాకు చెందిన వుహాన్ జియాంగ్డా, ఇరానీ చాంపియన్ బమ్ ఖటూన్, ఉజ్బెకిస్తాన్‌కు చెందిన పీఎఫ్‌సీ నసఫ్ మహిళల క్లబ్ జట్లు (డబ్ల్యూఎఫ్‌సీ) ఉన్నాయి. జియాంగ్డా ఐదుసార్లు చైనీస్ లీగ్‌లో విజేతగా నిలిచింది. బమ్ ఖటూన్ (ఇరాన్) అయితే ఏఎఫ్‌సీ టోర్నీకి అర్హత సాధించడం ఇది నాలుగోసారి. ఇక ఉజ్బెకిస్తాన్‌లో తిరుగులేని దేశవాళీ జట్టు పీఎఫ్‌సీ నసఫ్. ఈ జట్టు ఏకంగా 16 సార్లు అక్కడ విజేతగా నిలిచింది. ఇలాంటి ఘనాపాటిలతో భారత అమ్మాయిలు ఏ మేరకు తలపడతారో చూడాలి. నవంబర్‌లో జరిగే చాంపియన్స్ లీగ్ మ్యాచ్‌ల్లో ఈ మూడు జట్లతో ఈస్ట్ బెంగాల్ క్లబ్ తలపడుతుంది. ఒక్కో గ్రూప్ నుంచి తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు నాకౌట్ దశకు అర్హత సాధిస్తాయి. ఈ ఆరు జట్లతో పాటు మూడు గ్రూపుల్లో ఉన్న అత్యుత్తమ మూడో స్థానంలో ఉన్న మరో రెండు జట్లకు నాకౌట్ భాగ్యం దక్కుతుంది. వచ్చే ఏడాది మార్చిలో క్వార్టర్ ఫైనల్ పోటీలు, మే నెలలో సెమీస్ మ్యాచ్‌లు నిర్వహిస్తారు.

ఈస్ట్ బెంగాల్ ఎఫ్‌సీ షెడ్యూల్

నవంబర్ 17: ఈస్ట్ బెంగాల్ x బమ్ ఖటూన్ ఎఫ్‌సీ (ఇరాన్ టీమ్)

నవంబర్ 20: ఈస్ట్ బెంగాల్ x వుహాన్ జియాంగ్డా (చైనా టీమ్)

నవంబర్ 23: ఈస్ట్ బెంగాల్ x పీఎఫ్‌సీ నసఫ్ (ఉజ్బెక్ టీమ్)


తన్మయ్ అగర్వాల్

సౌత్ జోన్ 149 ఆలౌట్

- సౌత్ జోన్‌ను కట్టడి చేసిన సెంట్రల్ జోన్ స్పిన్ ద్వయం
- సెంట్రల్ జోన్ తొలి ఇన్నింగ్స్ 50/0
- దులీప్ ట్రోఫీ ఫైనల్

బెంగళూరు: దేశవాళీ టోర్నీ దులీప్ ట్రోఫీ ఫైనల్లో సౌత్ జోన్ జట్టు తడబడింది. బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ మైదానంలో గురువారం ప్రారంభమైన తుదిపోరులో సెంట్రల్‌జోన్ బౌలర్లు విజృంభించారు. ఫలితంగా మొదట బ్యాటింగ్ చేసిన సౌత్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 63 ఓవర్లలో 149 పరుగులకు ఆలౌటైంది. హైదరాబాద్ రంజీ ప్లేయర్ తన్మయ్ అగర్వాల్ (76 బంతుల్లో 31; 3 ఫోర్లు) టాప్ స్కోరర్ కాగా... సల్మాన్ నిజార్ (52 బంతుల్లో 24; 2 ఫోర్లు, 1 సిక్స్), అంకిత్ శర్మ (64 బంతుల్లో 20; 2 ఫోర్లు) క్రీజులో నిలదొక్కుకుంటున్న దశలో అవుటయ్యారు. సెంట్రల్ జోన్ ఆఫ్ స్పిన్నర్ సారాంశ్ జైన్ 24 ఓవర్లలో 49 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టగా...ఎడంచేతి వాటం స్పిన్నర్ కుమార్ కార్తికేయ సింగ్ 53 పరుగులిచ్చి 4 వికెట్లు తీశాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన సెంట్రల్ జోన్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి 19 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 50 పరుగులు చేసింది. ఈ సీజన్‌లో ఫుల్ ఫామ్‌లో ఉన్న దానిశ్ మాలేవర్ (64 బంతుల్లో 28 బ్యాటింగ్; 3 ఫోర్లు), అక్షయ్ వాడ్కర్ (52 బంతుల్లో 20 బ్యాటింగ్; 3 ఫోర్లు) ఆకట్టుకున్నారు. చేతిలో 10 వికెట్లు ఉన్న సెంట్రల్ జోన్... ప్రత్యర్థి తొలి ఇన్నింగ్స్ స్కోరుకు 99 పరుగులు వెనుకబడి ఉంది.

స్పిన్‌కు విలవిల...

టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన సౌత్ జోన్ జట్టుకు ఏదీ కలిసిరాలేదు. సెంట్రల్ జోన్ స్పిన్‌ను తట్టుకోలేక సౌత్‌జోన్ ప్లేయర్లు విలవిలలాడారు. హైదరాబాదీ తన్మయ్ అగర్వాల్ ఒక్కడే కాస్త పోరాడగా... మరో ఓపెనర్ మోహిత్ కాలే (50 బంతుల్లో 9), రవిచంద్రన్ స్మరణ్ (19 బంతుల్లో 1) క్రీజులో నిలదొక్కుకునేందుకు ప్రయత్నించినా పరుగులు సాధించలేకపోయారు. ఆంధ్ర ఆటగాడు రికీ భుయ్ (53 బంతుల్లో 15; 2 ఫోర్లు) గంటకు పైగా క్రీజులో ఉన్నా పరుగులు చేసేందుకు ఇబ్బందిపడ్డాడు. కెప్టెన్ మొహమ్మద్ అజహరుద్దీన్ (4) విఫలం కాగా... అండ్రె సిద్ధార్థ్ (12) కూడా ఎక్కువసేపు నిలవలేకపోయాడు. సల్మాన్, అంకిత్ తలా కొన్ని పరుగులు చేయడంతో సౌత్ జోన్ జట్టు ఆ మాత్రం స్కోరు చేయగలిగింది. సెంట్రల్ జోన్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న టీమిండియా బౌలర్ దీపక్ చాహర్ ఆరు ఓవర్లకే పరిమితం కాగా... స్పిన్నర్లు చెలరేగిపోయారు. సారాంశ్ జైన్, కుమార్ కార్తికేయ కలిసి 45 ఓవర్లు వేసి 9 వికెట్లు పంచుకున్నారు. మిగిలిన ఒక్క వికెట్ రనౌట్ రూపంలో వచ్చింది. కార్తికేయ వేసిన ఇన్నింగ్స్ 16వ ఓవర్‌లో నిర్లక్ష్యంగా స్వీప్ షాట్ ఆడేందుకు ప్రయత్నించిన మోహిత్ క్లీన్ బౌల్డ్ కాగా... ఇక అక్కడి నుంచి ప్రారంభమైన వికెట్ల పతనం ఏ దశలోనూ ఆగలేదు. లంచ్ సమయానికే సౌత్ జోన్ 4 వికెట్లు కోల్పోయింది. ఆ తర్వాత కూడా ఏమాత్రం ఆటతీరు మార్చుకోలేకపోయింది. దీనికి తోడు పరుగు తీసే క్రమంలో రికీ భుయ్‌తో సమన్వయలోపం కారణంగా తన్మయ్ అగర్వాల్ రనౌట్ కావడం జట్టును మరింత దెబ్బతీసింది.

స్కోరు వివరాలు

సౌత్ జోన్ తొలి ఇన్నింగ్స్: తన్మయ్ అగర్వాల్ (రనౌట్) 31; మోహిత్ కాలే (బి) కార్తికేయ 9; స్మరణ్ (సి) సారాంశ్ జైన్ (బి) కార్తికేయ 1; రికీ భుయ్ (ఎల్బీ) (బి) సారాంశ్ జైన్15; అజహరుద్దీన్ (బి) కార్తికేయ 4; సల్మాన్ నిజార్ (సి) పాటీదార్ (బి) సారాంశ్ జైన్ 24; సిద్ధార్థ్ (స్టంప్డ్) ఉపేంద్ర యాదవ్ (బి) సారాంశ్ 12; అంకిత్ శర్మ (ఎల్బీ) సారాంశ్ జైన్ 20; గురజపనీత్ సింగ్ (ఎల్బీ) కార్తికేయ 2; నిధీశ్ (సి అండ్ బి) సారాంశ్ జైన్ 12; వాసుకి కౌశిక్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 17; మొత్తం (63 ఓవర్లలో ఆలౌట్) 149. వికెట్ల పతనం: 1-27, 2-35, 3-47, 4-57, 5-65, 6-97, 7-116, 8-129, 9-142, 10-149. బౌలింగ్: దీపక్ చాహర్ 6-1-11-0; ఆదిత్య ఠాకరే 4-2-7-0; కుల్దీప్ సేన్ 8-3-15-0; కుమార్ కార్తికేయ 21-1-53-4; సారాంశ్ జైన్ 24-2-49-5.

సెంట్రల్ జోన్ తొలి ఇన్నింగ్స్: దానిశ్ మాలేవర్ (బ్యాటింగ్) 28; అక్షయ్ వాడ్కర్ (బ్యాటింగ్) 20; ఎక్స్‌ట్రాలు 2; మొత్తం (19 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా) 50. బౌలింగ్: గుర్‌జపనీత్ సింగ్ 4-1-21-0; అంకిత్ శర్మ 8-1-22-0; నిధీశ్ 3-1-6-0; వాసుకి కౌశిక్ 4-3-1-0.

సారాంశ్‌కు 5 వికెట్లు




కార్తికేయకు 4 వికెట్లు



ఉద్యోగానికి 'జై'... క్రికెట్‌కూ 'సై'

- ఒమన్ ఆటగాళ్ల క్రికెట్ గాథ
- తొలిసారి ఆసియా కప్ టి20 టోర్నీ బరిలోకి


జతిందర్

సాక్షి క్రీడా విభాగం

మన దేశంలో క్రికెట్ ఓ మతమైంది. కోట్ల మంది జీవితాల్లో భాగమైంది. సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లిల అంత స్థాయికి ఎదగలేకపోయినా సరే ఒక్కసారి భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) సెంట్రల్ కాంట్రాక్టు దక్కితే చాలు... 'గ్రేడ్'తో పని లేకుండా కోట్ల రూపాయల్లో వార్షిక పారితోషికం... పోటీలకు ఇంతని లక్షల్లో మ్యాచ్ ఫీజులు లభిస్తాయి. కాబట్టి ఆటగాడైతే చాలు... దేశవాళీ క్రికెట్‌తోనూ ఆటతోనే విలాసవంతంగా బ్రతికేస్తాడు. అంతెందుకు ఒక్క ఐపీఎల్ సీజన్‌లో జూనియర్ స్థాయి ఆటగాడైన సరే అదృష్టం తలుపుతట్టి వేలంలో ఆయా జట్లకు ఎంపికైనా చాలు మిగతా జీవితమంతా సుఖమయం అవుతుంది. అయితే ఇదంతా భారత్‌లోనే చెల్లుతుంది. కానీ ఇతర దేశాల్లోని క్రికెటర్లు మైదానంలో చెమటోడ్చాలి. ఆఫీస్‌లో ఉద్యోగం చేయాలి.

చాలా దేశాల్లో ఇలానే...

క్రికెట్ ఆడే ఎన్నో దేశాల్లో ఇలాగే ఉంటుంది. కేవలం బ్యాట్ పట్టి నెట్స్‌లో ప్రాక్టీస్ చేసి, మ్యాచ్‌లపుడు మైదానంలో దిగితే సరిపోదు. జీవనాధారం కోసం ఉద్యోగం లేదంటే వ్యాపారం ఏదో ఒకటి తప్పనిసరిగా చేయాల్సిందే! తాజా ఆసియా కప్ టి20 టోర్నీలో బరిలో ఉన్న ఒమన్ క్రికెటర్లు కూడా ఇదే చేస్తారు. రూపాయి మారకం విలువ పరంగా ఒమని రియాల్ (ఒమన్ కరెన్సీ) మనకంటే చాలా విలువైందే అయినా... క్రికెట్‌లో మాత్రం బలహీనమైంది. అక్కడి ప్రొఫెషనల్ క్రికెటర్లు సైతం తెల్లారితే లంచ్ బాక్స్‌లు కట్టుకొని ఆఫీస్‌కు వెళ్తారు. సాయంత్రమైతేనే ఆటకు సిద్ధమవుతారు. మ్యాచ్‌లు, పెద్ద పెద్ద సిరీస్‌లు ఉంటేనే పక్షం లేదంటే నెలకు మించి సెలవులు పెట్టి మెగా ఈవెంట్లు ఆడతారు. ఇది ముగియగానే ఒమన్ ఆటగాళ్లు మళ్లీ ఆఫీస్ వ్యవహారాలు చూసుకుంటారు. ఇవి ఎవరో 'నెట్టింట' పెట్టిన విషయాలో, 'షార్ట్స్', 'రీల్స్'లో చెప్పిన కబుర్లో కాదు... స్వయంగా ఒమన్ కెప్టెన్ జతిందర్ సింగ్, ఆల్‌రౌండర్ సుఫియాన్ మెహమూద్ వెల్లడించిన వాస్తవాలు.



ఉద్యోగానికే తొలి ప్రాధాన్యం

క్రికెటే తమ కెరీర్ కానేకాదని జతిందర్ స్పష్టం చేశాడు. తమ తొలి ప్రాధాన్యం ఉద్యోగమేనన్నాడు. ఆటను మొదలు పెట్టిన తొలినాళ్లలో మా ప్రాధాన్యమంతా ఉద్యోగానికే ఉండేదని, క్రికెట్ ఆట తమకు రెండో ప్రాధాన్యమని ఒమన్ కెప్టెన్ చెప్పాడు. 'నేనే కాదు చాలామంది ఇదే చేస్తారు. తంచనుగా ఉద్యోగం చేసేందుకు బయల్దేరతారు. క్రికెట్‌ను ఓ ప్రత్యామ్నాయంగానే చూస్తారు. అయితే ఇప్పుడు ఆసియా కప్ లాంటి పేరొందిన సిరీస్ ఆడటం ద్వారా క్రికెట్ కల పెద్దగా అనిపిస్తుంది. తొలిసారి ఈ టోర్నీ ఆడేందుకు ఆటగాళ్లంతా చాలా ఉత్సాహంగా ఉన్నారు' అని జతిందర్ అన్నాడు.

కాంక్రీట్‌పై కష్టాలెన్నో...

ఒమన్‌లో క్రికెట్‌కు ప్రత్యేకించి టర్ఫ్ గ్రౌండ్లు అంటూ లేని రోజుల్లో తాము సిమెంట్ వికెట్‌ల పైనే ఆడాల్సి వచ్చిందని, 2008లో ఆస్ట్రోటర్ఫ్ వినియోగంలోకి వచ్చినా... మూడేళ్ల తర్వాతే 2011 నుంచి పూర్తిస్థాయి టర్ఫ్ గ్రౌండ్‌పై క్రమం తప్పకుండా ఆడుతున్నామని జతిందర్ ఒమన్ క్రికెట్ కష్టాలను చెప్పుకొచ్చాడు. ఇలాంటి క్లిష్ట సమయాల్లో ఫలితం (ప్రాభవం లేని క్రికెట్)లేని ఆట కోసం ఎందుకు కష్టపడాలని ఎన్నోసార్లు అనిపించినా... ఏదో క్రికెట్‌పై ఉన్న కాస్త మక్కువే ఇక్కడి దాకా తీసుకొచ్చిందని వివరించాడు. 36 ఏళ్ల జతిందర్ ఇప్పటి వరకు 36 వన్డేలాడి 1704 పరుగులు చేశాడు. ఇందులో 4 సెంచరీలున్నాయి. అంతర్జాతీయ టి20ల్లో 115 స్ట్రయిక్‌రేట్‌తో 1120 పరుగులు సాధించాడు. మరోవైపు 34 ఏళ్ల ఆల్‌రౌండర్ సుఫియాన్ 8 వన్డేలాడి 107 పరుగులు చేయడంతో పాటు 24.50 సగటుతో 6 వికెట్లు కూడా తీశాడు. తనకు టీమిండియాలో గిల్, సూర్యకుమార్, అభిషేక్ శర్మ, అర్ష్‌దీప్, తిలక్ వర్మ అంటే ఇష్టమని చెప్పాడు.

క్రికెటెందుకు... చదువుకో ముందు!

సుఫియాన్ ఒమన్ క్రికెట్ జట్టుకు ఎంపికవగానే అతని తల్లిదండ్రులు ససేమిరా అన్నారట! ఒమన్‌లో క్రికెట్‌కు భవిష్యత్తే లేదని, ఉన్నత చదువులు చదివి ఉన్నతోద్యోగంపైనే దృష్టి సారించాలని తన తల్లిదండ్రులు గట్టిగా చెప్పారని పేర్కొన్నాడు. 'కానీ క్రికెట్ అంటే పిచ్చి. నాపై ఉన్న నమ్మకమే ఆటవైపు నడిపించింది. 2016 టి20 ప్రపంచకప్ అర్హత సాధించగానే మేం పడిన కష్టాలకు సాంత్వన చేకూరింది' అని సుఫియాన్ తెలిపాడు. ఒమన్ క్రికెట్ నిలబడటానికి ఆ మెగా ఈవెంట్ ఎంతగానో దోహదం చేసిందన్నాడు. భారత ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా తన అభిమాన క్రికెటర్ అని చెప్పుకొచ్చాడు.

దక్షిణాఫ్రికా విజయం

తొలి టి20లో ఇంగ్లండ్ ఓటమి



కార్డిఫ్: ఇంగ్లండ్ పర్యటనలో భాగంగా వన్డే సిరీస్ చేజిక్కించుకున్న దక్షిణాఫ్రికా... టి20 సిరీస్‌లో సైతం శుభారంభం చేసింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా బుధవారం అర్ధరాత్రి దాటాక జరిగిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా డక్‌వర్త్ లూయిస్ పద్ధతి (డీఎల్‌ఎస్) ప్రకారం విజయం సాధించింది. వర్షం అంతరాయం మధ్య సాగిన ఈ పోరులో సఫారీ జట్టు 14 పరుగుల తేడాతో నెగ్గి 1-0తో ముందంజ వేసింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా 7.5 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 97 పరుగులు చేసింది. వర్షం కారణంగా ఆలస్యంగా ప్రారంభమైన ఈ మ్యాచ్‌ను తొలుత 9 ఓవర్లకు కుదించగా... సఫారీ బ్యాటర్లు ఆరంభం నుంచే ధాటిగా ఆడారు. అయితే 7.5 ఓవర్ల తర్వాత భారీ వర్షం ముంచెత్తడంతో దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్‌ను అక్కడికే ముగించారు. కెప్టెన్ మార్క్‌రమ్ (14 బంతుల్లో 28; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), డెవాల్డ్ బ్రేవిస్ (10 బంతుల్లో 23; 3 సిక్స్‌లు), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' డొనొవాన్ ఫెరీరా (11 బంతుల్లో 25 నాటౌట్; 3 సిక్స్‌లు) మెరిపించారు. ఇంగ్లండ్ బౌలర్లలో ల్యూక్ వుడ్ 2 వికెట్లు పడగొట్టాడు. అనంతరం వర్షం కారణంగా ఇంగ్లండ్ లక్ష్యాన్ని 5 ఓవర్లలో 69 పరుగులుగా నిర్దేశించగా... ఆ జట్టు 5 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 54 పరుగులకే పరిమితమైంది. జోస్ బట్లర్ (11 బంతుల్లో 25; 1 ఫోర్, 3 సిక్స్‌లు) ఒక్కడే పోరాడాడు. ఫిల్ సాల్ట్ (0), బెథెల్ (7), కెప్టెన్ హ్యారీ బ్రూక్ (0), టామ్ బాంటన్ (5) భారీ షాట్‌లు కొట్టడంలో విఫలమయ్యారు. సఫారీ బౌలర్లలో మార్కో యాన్సెన్, కార్బిన్ బాష్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ఇరు జట్ల మధ్య నేడు రెండో మ్యాచ్ జరగనుంది.

భారత షూటర్లకు మళ్లీ నిరాశే


ఉమామహేశ్

నింగ్బో (చైనా): భారత షూటర్ల నిరాశాజనక ప్రదర్శన కొనసాగుతోంది. వరుసగా మూడో రోజు కూడా క్వాలిఫికేషన్ రౌండ్లలోనే గురి కుదరక పతకం బరికి దూరమవుతున్నారు. చైనాలో జరుగుతున్న అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య (ఐఎస్ఎస్ఎఫ్) ప్రపంచకప్‌లో గురువారం జరిగిన పోటీల్లో ఆంధ్రప్రదేశ్ షూటర్ మద్దినేని ఉమామహేశ్ సహా దివ్యాన్ష్, రాహీ సర్నోబత్‌లు క్వాలిఫయింగ్‌లోనే వెనుదిరిగారు. పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ క్వాలిఫికేషన్‌లో దివ్యాన్ష్ 630 స్కోరుతో 19వ స్థానంలో నిలిచాడు. ఉమామహేశ్ 627.7 పాయింట్లు స్కోరు చేసి 39 స్థానంలో, మరో భారత మరో షూటర్ నీరజ్ కుమార్ (626.1) 54వ స్థానంలో నిలిచారు. మహిళల ర్యాపిడ్ ఫైర్ క్వాలిఫికేషన్‌లో అభిజ్ఞ అశోక్ పాటిల్ 583 స్కోరుతో 11వ స్థానంలో నిలిచింది. టీఎస్ దివ్య (581), ఒలింపియన్, ఆసియా క్రీడల చాంపియన్ రాహీ సర్నోబత్ (581)లు వరుసగా 16, 17 స్థానాలు పొందారు. ఇప్పుడిక భారత్ ఆశలన్నీ మహిళల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ ఈవెంట్‌పైనే ఉన్నాయి. మెహులీ ఘోష్, తెలంగాణ అమ్మాయి సురభి రాపోలు, మానిని కౌశిక్‌లు బరిలో ఉన్నారు.



గురువారం ముంబై నుంచి ప్రపంచయాత్రకు బయలుదేరిన త్రివేణి నౌక నుంచి విజయ సంకేతం చూపుతున్న మహిళా ఆర్మీ అధికారులు

ప్రపంచయాత్రకు నారీశక్తి

- త్రివేణి పడవలో బయల్దేరిన త్రివిధదళాలకు చెందిన 10 మంది మహిళాధికారుల బృందం
- ముంబై గేట్‌వే ఆఫ్‌ఇండియా వద్ద జెండా ఊపి ప్రారంభించిన రాజ్‌నాథ్

సాక్షి, న్యూఢిల్లీ: భారత త్రివిధ దళాల చరిత్రలో నారీశక్తి మరో సువర్ణాధ్యాయానికి శ్రీకారం చుట్టింది. త్రివిధ దళాలకు చెందిన పది మంది మహిళా అధికారుల బృందం తొలిసారిగా సముద్రమార్గంలో భూమిని చుట్టేసేందుకు సాహస యాత్రకు బయల్దేరింది. ఈ యాత్రకు 'సముద్ర ప్రదక్షిణ' అని నామకరణం చేశారు. ఈ చరిత్రాత్మక పడవ యాత్రను కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ ఢిల్లీ నుంచి వర్చువల్‌గా జెండా ఊపి ప్రారంభించారు.

సాగరంలో సాహస యాత్ర

ఈ యాత్రలో భాగంగా బృందం సముద్రంలో ఏకధాటిగా 26,000 నాటికల్ మైళ్లు పయనించనుంది. రెండుసార్లు భూమధ్యరేఖను దాటడంతో పాటు, అత్యంత ప్రమాదకరమైనవిగా పేరొందిన మూడు గ్రేట్ కేప్‌లైన కేప్ లీవిన్, కేప్ హార్న్, కేప్ ఆఫ్ గుడ్ హోప్‌లను ఈ బృందం చుట్టి రానుంది. ప్రపంచంలోనే అత్యంత కఠినమైన దక్షిణ మహాసముద్రం, డ్రేక్ పాసేజ్ జలాల్లో వీరి ప్రయాణం సాగుతుంది. ఈ బృందం 2026 మే నెలలో తిరిగి ముంబై తీరానికి చేరుకుంటుందని అంచనా.

మూడేళ్ల కఠోర శిక్షణ

లెఫ్టినెంట్ కల్నల్ అనూజ వరూద్కర్ నేతృత్వంలోని ఈ బృందంలో స్క్వాడ్రన్ లీడర్ శ్రద్ధా పి. రాజు, మేజర్ కరమ్‌జీత్ కౌర్, మేజర్ ఓమితా దాల్వి, కెప్టెన్ ప్రజక్తా పి నికమ్, కెప్టెన్ దౌలీ బుటోలా, లెఫ్టినెంట్ కమాండర్ ప్రియాంక గుసాయిన్, వింగ్ కమాండర్ విభా సింగ్, స్క్వాడ్రన్ లీడర్ అరువి జయదేవ్, స్క్వాడ్రన్ లీడర్ వైశాలి భండారీ ఉన్నారు. గత మూడేళ్లుగా ఈ బృందం కఠోర శిక్షణ పొందింది. శిక్షణ, సన్నాహక చర్యల్లో భాగంగా ఈ ఏడాది ముంబై నుంచి సుదూర సీషెల్స్ వరకు సముద్రయాత్రను విజయవంతంగా పూర్తిచేసి తమ సన్నద్ధతను ఈ బృందం ఇప్పటికే చాటింది.

ఆత్మనిర్భర్ భారత్‌కు ప్రతీక: రక్షణ మంత్రి

ఈ సందర్భంగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడారు. పుదుచ్చేరిలో దేశీయంగా నిర్మించిన 50 అడుగుల ఐఏఎస్‌వీ త్రివేణి నౌక 'ఆత్మనిర్భర్ భారత్' సంకల్పానికి ప్రతీక అని కొనియాడారు. ఈ నౌక ప్రయాణించే ప్రతీ నాటికల్ మైలు.. దేశ వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తి, స్వావలంబన దిశగా వేసే అడుగు అని ఆయన పేర్కొన్నారు. ఇటీవల ఐఎన్ఎస్ తారిణి నౌకపై ప్రపంచాన్ని చుట్టివచ్చిన లెఫ్టినెంట్ కమాండర్లు దిల్నా, రూపాలను ఆయన అభినందించారు. ఇప్పుడు 'త్రివేణి' బృందం కూడా నౌకాయానంలో మరో ప్రపంచస్థాయి ప్రమాణాన్ని నెలకొల్పుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ వర్చువల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో పాటు చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్, ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, నేవీ చీఫ్ అడ్మిరల్ దినేశ్ కె త్రిపాఠి, ఎయిర్‌ఫోర్స్ చీఫ్ ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ పాల్గొన్నారు.

ఖిలాఫత్ ఉగ్ర మాడ్యూల్ బట్టబయలు

- దేశవ్యాప్తంగా ఢిల్లీ పోలీసుల దాడులు
- తెలంగాణ వాసి సహా ఐదుగురి అరెస్ట్

న్యూఢిల్లీ: పాకిస్తాన్‌తో లింకులున్న ఉగ్ర మాడ్యూల్ ఒక దానిని ఢిల్లీ పోలీసులు బట్టబయలు చేశారు. వేర్వేరు రాష్ట్రాల్లో దాడులు జరిపి ఇందుకు సంబంధించి ఐదుగురిని అరెస్ట్ చేశారు. పాకిస్తాన్ హ్యాండ్లర్ ద్వారా వీరు ఆన్‌లైన్‌లో యువతను ఉగ్ర ఊబిలోకి లాగుతున్నారు. కొంత భూభాగాన్ని స్వాధీనం చేసుకుని ఖిలాఫత్ జోన్‌గా ప్రకటించడం ద్వారా భారత్‌లో జిహాద్‌ను ప్రారంభించాలన్నది వీరి ప్రణాళిక అని అదనపు పోలీస్ కమిషనర్ (స్పెషల్ సెల్) ప్రమోద్ కుష్వాహా మీడియాకు తెలిపారు. ఘజ్వా–ఇ–హింద్ (భారత్‌పై దాడి) నినాదంతో దేశవ్యాప్తంగా హింసాత్మక కార్యకలాపాలకు పాల్పడేందుకు వీరు ప్రయత్నిస్తున్నారన్నారు. పట్టుబడిన వారిలో రాంచీకి చెందిన అషర్ దానిష్ అలియాస్ అష్రార్ ఖురేషి(23), ముంబైకి చెందిన అఫ్తాబ్ ఖురేషి, సుఫియాన్ అబూబకర్‌లు, తెలంగాణకు చెందిన మహ్మద్ హుజైఫా, మధ్యప్రదేశ్‌కు చెందిన కమ్రాన్ ఖురేషి ఉన్నారు. వీరితోపాటు మరో ఆరుగురిని అదుపులోకి తీసుకుని, విచారిస్తున్నట్లు వివరించారు. ఈ మాడ్యూల్‌కు డానిష్ సారథ్యం వహిస్తూ పాకిస్తాన్‌లోని హ్యాండ్లర్ తరఫున కార్యకలాపాలు సాగిస్తున్నాడు. ఈ హ్యాండ్లకు సీఈవో, గజ్బా, ప్రొఫెసర్ అనే సంకేత నామం ఉందని ఏసీపీ కుష్వాహా చెప్పారు. సోషల్ మీడియా చాట్ల ద్వారా పాక్ హ్యాండ్లర్ వీరికి మందు పాతరల డిజైన్లు, తయారీలో సలహాలిస్తున్నాడు. గత ఆరు నెలలుగా వీరి కార్యకలాపాలపై కన్నేసి ఉంచామని, ఢిల్లీలోని హజ్రత్ నిజాముద్దీన్ రైల్వే స్టేషన్‌లో అఫ్తాబ్, సుఫియాన్‌లను మొదటగా అరెస్ట్ చేశామన్నారు. మేవాడ్‌కు చెందిన వ్యక్తి నుంచి ఆయుధాలను కొనుగోలు చేసేందుకు వచ్చి వీరు పట్టుబడ్డారని తెలిపారు. వీరి మరికొంత మందిని కూడా చేర్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని వివరించారు. ఐఈడీలను తయారు చేసేందుకు అవసరమైన వివిధ రకాల సామగ్రి, రసాయనాలను స్వాధీనం చేసుకుని, విశ్లేషణ కోసం ల్యాబ్‌కు పంపించినట్లు చెప్పారు. ఖిలాఫత్ గతంలో పట్టుబడిన ఉగ్ర మాడ్యూల్‌లతో సంబంధం లేకుండా కొత్తగా ఏర్పాటైన గ్రూపుగా పేర్కొన్నారు. ఖిలాఫత్ జోన్‌కు అవసరమైన భూమి కొనుగోలు కోసం వీరు నిధుల సేకరణలో బిజీగా ఉన్నారన్నారు.

243 సీట్లు.. 2,300 దరఖాస్తులు

బిహార్‌లో గెలుపు గుర్రాల కోసం కాంగ్రెస్ వేట

సాక్షి, న్యూఢిల్లీ: బిహార్‌లో సీఎం నితీశ్‌కుమార్ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వాన్ని గద్దె దింపి అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ పథక రచన చేస్తోంది. త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు 243 స్థానాల్లో గెలుపు గుర్రాల కోసం వేట కొనసాగిస్తోంది. సీట్ల పంపకాల విషయంలో ఇండియా కూటమి ఆమోద ముద్ర వేసేవరకూ ఈ స్థానాల్లో అభ్యర్థుల ఎంపిక కొనసాగనున్నది. ఆశావహుల నుంచి ఇప్పటికే 2,300పైగా దరఖాస్తులు అందాయి. దరఖాస్తుల ఆధారంగా పార్టీ బలం, బలహీనతలపై ఒక అవగాహనతోపాటు.. కొత్తగా ఎదుగుతున్న నేతలపై ప్రధానంగా దృష్టి సారించడమే రాష్ట్ర కాంగ్రెస్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ఈ నెల 16న కాంగ్రెస్ ఎన్నికల కమిటీ సమావేశం కానున్నది. 14వ తేదీలోగా అభ్యర్థుల జాబితాను పంపాలని రాష్ట్ర పార్టీ కోరింది. 16న జరిగే సమావేశంలో ఈ పేర్లపై చర్చించి ఆమోదముద్ర వేయనున్నారు.

ఒక్కో సీటుకు ముగ్గురు పోటీ: రాష్ట్ర పార్టీ ఎన్నికల కమిటీ మొత్తం 243అసెంబ్లీ స్థానాల్లో ఒక్కో సీటు నుంచి ముగ్గురి పేర్లను సిద్ధం చేసి స్క్రీనింగ్ కమిటీకి పంపించనున్నది. ఈ నెల 19న జరగనున్న కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ సమావేశంలో దరఖాస్తులను పరిశీలించనున్నారు. అంతిమంగా ఒకరి పేరును ఎంపిక చేసి ఆమోదం కోసం ఢిల్లీలోని అధిష్టానానికి పంపించనున్నారు. ఇదే జాబితాను యథాతథంగా లేదా కొద్ది మార్పులతో అధిష్టానం ప్రటించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.


పొంగి ప్రవహిస్తున్న అజొయ్ నది ఒడ్డున ఫుట్‌బాల్ ఆడుతున్న ఓ బాలుడు. పశ్చిమబెంగాల్‌లోని బీర్భూమ్ జిల్లాలోనిదీ ఫొటో

ఇండోనేసియాలోని బాలిలో భీకర వరదలు

15 మంది మృతి, 10 మంది గల్లంతు

డెన్‌పసర్: ఇండోనేసియాలోని పర్యాటక బాలి దీవిలో సంభవించిన భారీ వర్షాలు, ఆకస్మిక వరదల్లో కనీసం 15 మంది చనిపోయారు. మరో 10 జాడ గల్లంతైంది. బాలితోపాటు తూర్పు నుసా టెంగ్గర ప్రావిన్స్‌లలో సోమవారం నుంచి ఏకధాటిగా వర్షాలు కురుస్తున్నాయి. బాలిలో నదులు ఉప్పొంగి 9 జిల్లాల్లోని నగరాలను ముంచెత్తాయి. కొండప్రాంతాల్లోని నివాసాలను బురద, రాళ్లు, చెట్లు నేలమట్టం చేశాయి. గత పదేళ్లలో ఇంతటి తీవ్ర నష్టం ఎన్నడూ జరగలేదని అధికారులు తెలిపారు. బాలి రాజధాని డెన్‌పసర్‌లో అత్యధికంగా 8 మంది చనిపోగా ఇద్దరు గల్లంతయ్యారు. బాలిలో 24 గంటల వ్యవధిలో 36 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు. దీవిలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వ్యర్థాల నిర్వహణ లోపం, మౌలిక వసతుల లేమి కారణంగా వరదల ప్రభావం మరింత తీవ్రంగా ఉంది.

డెంగీ, మలేరియాలతో అప్రమత్తంగా ఉండండి

సాక్షి, న్యూఢిల్లీ: డెంగీ, మలేరియా వ్యాధుల వ్యాప్తి నేపథ్యంలో రాష్ట్రాలు అప్రమత్తంగా ఉండాలని కేంద్ర ఆరోగ్య, సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా సూచించారు. వాతావరణంలో వచ్చిన మార్పులు కారణంగా ఆ రెండు వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని నడ్డా ఆదేశించారు. మున్సిపల్ కార్పొరేషన్లు, పంచాయితీలు, స్థానిక సంస్థలు కమ్యూనిటీలు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అన్ని ఆసుపత్రుల్లో మందులను సరిపడా ఉంచుకోవాలన్నారు. గురువారం ఆయన రాష్ట్రాల ఆరోగ్య అధికారులతో వర్చువల్‌గా సమీక్ష నిర్వహించారు. పరిస్థితులను వ్యక్తిగతంగా సమీక్షించి వ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు 20 రోజుల్లోగా కార్యాచరణ రూపొందించాలన్నారు.

నాపై రాజకీయ దుష్ప్రచారం

'ఈ20'వ్యతిరేక వాదనలపై నితిన్ గడ్కరీ వ్యాఖ్య

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన ఇథనాల్ కలిపిన పెట్రోల్(ఈ20) విక్రయాల విధానంపై దుష్ప్రచారం జరుగుతోందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆరోపించారు. ఈ విధానానికి వ్యతిరేకంగా సామాజిక మాధ్యమాల్లో కొనసాగుతున్న రాజకీయ ప్రచారానికి తాను బాధితుడయ్యానని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి గురువారం ఢిల్లీలో జరిగిన 65వ సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫాక్చరర్స్(సియామ్) వార్షిక సమావేశంలో ప్రసంగించారు. పెట్రోల్‌లో 20% ఇథనాల్ కలపడంపై ఆన్‌లైన్‌లో అనవసర రాద్ధాంతం చేస్తున్నారని ఆరోపించారు. ఈ మిశ్రమ ఇంధనం సురక్షితమైందని, ఈ విషయాన్ని నియంత్రణ సంస్థలు, ఆటోమొబైల్ కంపెనీలు కూడా ధ్రువీకరించాయని వివరించారు. ఆటోమోటివ్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, సియామ్‌తోపాటు సుప్రీం కోర్టు కూడా అభ్యంతరం చెప్పలేదని మంత్రి తెలిపారు. దీనివల్ల నష్టం జరుగుతుందనేందుకు ఒక్క కారు లేదా ఇతర వాహనాన్ని ఉదాహరణను కూడా చూపలేకపోయాయన్నారు. ఇథనాల్‌ను కలపడం వల్ల చమురు దిగుమతులు తగ్గడమే కాదు, ఉద్గారాలు సైతం తక్కువవుతాయన్నారు. రైతుల ఆదాయం పెరుగుతుందని మంత్రి వివరించారు. మొక్కజొన్న నుంచి ఇథనాల్ ఉత్పత్తి చేయాలని తీసుకున్న నిర్ణయం ఫలితంగా యూపీ, బిహార్‌లతోపాటు దేశవ్యాప్తంగా మొక్కజొన్న సాగు మూడు రెట్లు పెరిగిందని వివరించారు. కాలం చెల్లిన వాహనాలను అధీకృత స్క్రాప్ కేంద్రంలో ఇచ్చేసి, కొత్తగా కొనుగోలు చేసే వాహనాలకు జీఎస్‌టీలో మినహాయింపు ఇవ్వాలని ప్రధాని మోదీని కోరినట్లు మంత్రి గడ్కరీ వెల్లడించారు.

అత్యంత తీవ్ర అస్థిర పరిస్థితుల్లో నేపాల్‌ను ఐక్యంగా ఉంచారు..!

ఆర్మీ చీఫ్ అశోక్ రాజ్ సిగ్దెల్ ఘనత

- భారత్‌లో శిక్షణ పొందిన అధికారి


దేశ ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న సిగ్దెల్

న్యూఢిల్లీ: హిమాలయ రాజ్యం నేపాల్ ఇటీవలి కాలంలో ఎన్నడూ లేనంతగా తీవ్ర సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొన్నది. ఈ సమయంలో హుందాగా వ్యవహరించి, దేశాన్ని ఒక్క తాటిపై నడపడంలో కీలకంగా వ్యవహరించారు దేశ ఆర్మీ చీఫ్ జనరల్ అశోక్ రాజ్ సిగ్దెల్. ఆందోళన తీవ్రతకు ప్రభుత్వ యంత్రాంగం పునాదులే కదిలిపోయాయి. ప్రధానమంత్రి కేపీ శర్మ ఓలి 8న పదవి నుంచి వైదొలిగారు. దేశంలో అధికార శూన్యత ఏర్పడింది. అల్లకల్లోలం కొనసాగుతున్న వేళ నేపాల్ ఆర్మీ ముందుకు వచ్చింది. శాంతి, భద్రతలను కాపాడే బాధ్యతను భుజాన వేసుకుంది. శాంతియుతంగా ఉండాలని, సంయమనం పాటించాలని ఆర్మీ చీఫ్ అశోక్‌రాజ్ సిగ్దెల్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. హింసను విడనాడి చర్చలకు రావాలని ఆయన యువ ఆందోళనకారులకు పిలుపునిచ్చారు. దేశ ప్రజల ప్రాణాలను, ఆస్తులను కాపాడేందుకు, దౌత్య ప్రతినిధులకు భద్రత కల్పించేందుకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. దేశ ప్రజలను ఉద్దేశించి టీవీలో మాట్లాడిన ఆయన.. నేపాల్ వారసత్వ సంపదను పరిరక్షించుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. నేపాల్ వ్యాప్తంగా జరిగిన తీవ్ర నిరసనలు, పోలీసు కాల్పుల్లో కనీసం 20 మంది ప్రాణాలు కోల్పోగా, తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. ఈ సమయంలో మరింత రక్తపాతాన్ని నివారించడానికి గద్దె దిగాలని ప్రధాని ఓలీకి సలహా ఇచ్చింది జనరల్ సిగ్దెల్ అని సమాచారం. రూపందేహి జిల్లాలో 1967లో జన్మించిన అశోక్ రాజ్ సిగ్దెల్ 1986లో నేపాల్ ఆర్మీలో చేరారు. ఆ తర్వాతి సంవత్సరం ఉద్యోగంలో చేరారు. ఈయన మంచి బాక్సర్ మాత్రమే కాదు తైక్వాండో, టేబుల్ టెన్నిస్ క్రీడాకారుడు కూడా. 2024లో సిగ్దెల్ భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా భారత ఆర్మీ గౌరవ జనరల్ హోదాను అందుకోవడం విశేషం.

భారత్, చైనా సైనిక కార్యక్రమాలకు భాగస్వామి

నేపాల్‌లోని త్రిభువన్ వర్సిటీ నుంచి ఎంఏ పట్టా అందుకున్న సిగ్దెల్ భారత్, చైనాల్లో జరిగిన పలు సైనిక కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు. చైనాలోని నేషనల్ డిఫెన్స్ యూనివర్సిటీ నుంచి స్ట్రాటజిక్ స్టడీస్‌లో మాస్టర్స్ డిగ్రీ పొందారు. అదేవిధంగా, సికింద్రాబాద్‌లో డిఫెన్స్ మేనేజ్‌మెంట్ కాలేజీ నుంచి డిఫెన్స్ మేనేజ్‌మెంట్ కోర్సు చదివారు. నేపాల్ సైన్యంలోని వివిధ బెటాలియన్లు, బ్రిగేడ్లు, డివిజన్లకు నాయకత్వం వహించారు. 2023లో లెఫ్టినెంట్ జనరల్‌గా పదోన్నతి పొందిన సిగ్దెల్ ఆర్మీ స్టాఫ్ వైస్ చీఫ్‌గా నియమితులయ్యారు. 2024లో ఆర్మీ 45వ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించారు. 2024లో భారత్‌కు అధికారిక పర్యటనకు వచ్చిన సిగ్దెల్‌ను రాష్ట్రపతి ముర్ము భారత్ ఆర్మీ గౌరవ జనరల్ హోదాతో సత్కరించారు. నేపాల్, భారత్‌లు తమ మధ్య కొనసాగుతున్న సన్నిహిత సంబంధాలకు గుర్తుగా ఆర్మీ చీఫ్‌లకు గౌరవ జనరల్ హోదా ప్రదానం చేయడమనే ఆనవాయితీ 1950నుంచి కొనసాగుతూ వస్తోంది.

మోహన్ భాగవత్‌కు జన్మదిన శుభాకాంక్షల వెల్లువ

న్యూఢిల్లీ: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) అధినేత మోహన్ భాగవత్ 75 జన్మదినం సందర్భంగా గురువారం పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన 2009 నుంచి ఆర్ఎస్ఎస్ సర్‌సంఘ్ చాలక్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోదీతోపాటు కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, జేపీ నడ్డా, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే తదితరులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సంఘ్‌ను సమర్థంగా ముందుకు నడిపిస్తున్నారని భాగవత్‌ను ప్రశంసించారు. వందేళ్ల సంఘ్ చరిత్రలో భాగవత్ నాయకత్వం అత్యంత ముఖ్యమైన మార్పులు జరిగిన కాలంగా నిలిచిపోతుందని మోదీ కొనియాడారు. 'వసుధైవ కుటుంబం' అనే భావనను భాగవత్ నిలువెత్తు ఉదాహరణ అని పేర్కొన్నారు. ఈ మేరకు మోదీ గురువారం పలు పత్రికల్లో వ్యాసాలు రాశారు. మోహన్ భాగవత్‌తో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.

భాగవత్‌ను మంచి చేసుకోవడానికి మోదీ తంటాలు: కాంగ్రెస్

ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్‌ను మంచి చేసుకోవడానికి ప్రధాని మోదీ పడరాని పాట్లు పడుతున్నారని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ గురువారం ఎద్దేవా చేశారు. పత్రికల్లో భాగవత్‌పై మోదీ రాసిన వ్యాసాలను ప్రస్తావించారు. 1893 సెప్టెంబర్ 11న షికాగోలో స్వామి వివేకానంద ఇచ్చిన ప్రసంగం, 2001 సెప్టెంబర్ 1న అమెరికాపై అల్‌ఖైదా ఉగ్రవాదుల దాడి గురించి మోదీ రాశారని చెప్పారు. 1906 సెప్టెంబర్ 11న జోహన్నెస్‌బర్గ్‌లో సత్యాగ్రహం కోసం మహాత్మాగాంధీ పిలుపునిచ్చారని, దాని గురించి ఎందుకు ప్రస్తావించలేదని మోదీని ప్రశ్నించారు. ఈ మేరకు జైరామ్ రమేశ్ ఎక్స్‌లో పోస్టుచేశారు. సత్యాగ్రహం అనే పదం అంటే మోదీకి నచ్చదని పేర్కొన్నారు.

మూకాంబిక ఆలయానికి రూ.4 కోట్ల కిరీటం

ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా విరాళం

ఉడుపి(కర్నాటక): ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా కర్నాటకలోని ఉడిపి జిల్లా కొల్లూర్‌లో ఉన్న ప్రఖ్యాత మూకాంబిక ఆలయానికి వజ్రాలు పొదిగిన రూ.4 కోట్ల విలువజేసే బంగారు కిరీటాన్ని గురువారం బహూకరించారు. ఆలయంలోని వీరభద్రస్వామికి వజ్రాలు పొదిగిన వెండి కిరీటాన్ని, వెండి ఖడ్గాన్ని అందజేశారు. గతంలో ఈయన అమ్మవారికి వజ్రాలు పొదిగిన బంగారు గాజును అందజేశారు. ఒలగ మంటపం నుంచి ప్రధాన ఆలయానికి మేళతాళాలతో కిరీటాన్ని, కానుకలను ఊరేగింపుగా తీసుకెళ్లారు. పురోహితులు పూజలు చేసిన అనంతరం వీటిని అమ్మవారికి, స్వామికి అలంకరింపజేశారు. ఈ సందర్భంగా ఇళయరాజాను ఆలయ కమిటీ సత్కరించింది. కుమారుడు కార్తీక ఇళయరాజా, మనవడు యతీశ్‌తో కలిసి వచ్చిన ఆయన ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఉద్వేగంతో మాట్లాడారు. 'నాదంటూ ఏమీ లేదు. ఉన్నదంతా మూకాంబికా మాత కృప, ఆశీర్వాదమే'అన్నారు. ఎంతో కాలం నుంచి ఆలయానికి ఇళయరాజా వస్తున్నారని ఆలయ కమిటీ అధ్యక్షుడు బాబు శెట్టి చెప్పారు. 2006లో ఆయన వజ్ర కిరీటాన్ని అమ్మ వారికి బహూకరించారని వెల్లడించారు.

ఐశ్వర్యా రాయ్ పేరు, చిత్రాలను అనధికారికంగా వాడరాదు: ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ: బాలీవుడ్ నటి ఐశ్వర్యా రాయ్ వ్యక్తిగత హక్కులకు రక్షణ కల్పిస్తామని ఢిల్లీ హైకోర్టు తెలిపింది. వాణిజ్య ప్రయోజనాల కోసం ఆమె పేరును, ఫొటోలను, ఏఐ జనరేటెడ్ పోర్నోగ్రఫీ చిత్రాలను ఆన్‌లైన్ వేదికలు వాడకుండా నిషేధం విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు వెలువరించింది. అనుమతి, సమ్మతి లేకుండా ప్రముఖ వ్యక్తుల గుర్తింపును వాడుకోవడం వల్ల సంబంధిత వ్యక్తులకు వాణిజ్య ప్రయోజనాలకు హాని కలిగించడమే కాదు, వారి జీవించే హక్కుకు సైతం భంగం కలిగించినట్లవుతుందని హైకోర్టు పేర్కొంది. 'ఒకరి వ్యక్తిత్వ హక్కులను అనధికారికంగా దుర్వినియోగం చేసిన సందర్భాల్లో కోర్టులు చూస్తూ ఊరుకోలేవు. బాధితులకు హాని కలగకుండా రక్షించాలి'అని జస్టిస్ తేజస్ కరియా ఈనె 9న జారీ చేసిన ఉత్తర్వులో పేర్కొన్నారు. ఈ విషయమై సంబంధిత వెబ్‌సైట్లు తదితరాలకు కోర్టు సమన్లుజారీ చేసింది. నెల రోజుల్లో సమాధానమివ్వాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను వచ్చే ఏడాది జనవరి 15వ తేదీకి వాయిదా వేసింది. ఈనెల 10న ఐశ్వర్యా రాయ్ భర్త అభిషేక్ బచ్చన్ కూడా వేసిన ఇదే రకమైన పిటిషన్‌ను వేశారు.

సోనియా గాంధీపై పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్ర నేత సోనియా గాంధీ మన దేశ పౌరురాలు కావడానికి మూడేళ్ల ముందే ఓటరు జాబితాలో ఆమె పేరు నమోదైందంటూ దాఖలైన పిటిషన్‌ను ఢిల్లీలోని అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ వైభవ్ చౌరాసియా కొట్టివేశారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వు పూర్తి వివరాలు వెల్లడి కావాల్సి ఉంది. భారత పౌరురాలు కాకుండానే సోనియా గాంధీ పేరు 1980 జనవరిలో ఢిల్లీ ఓటరు జాబితాలో నమోదై ఉందని వికాస్ త్రిపాఠీ అనే వ్యక్తి తన పిటిషన్‌లో ఆరోపించారు. ఆ సమయంలో ఆమె రేషన్ కార్డు లేదా పాస్‌పోర్టును ధ్రువీకరణకు చూపి ఉంటారని పేర్కొన్నారు. ఈ విషయంలో ఫోర్జరీ జరిగి ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తూ, దీనిపై దర్యాప్తు చేయించాలని మేజిస్ట్రేట్‌ను కోరారు.

దక్షిణ కొరియా సిబ్బందికి విముక్తి..

అట్లాంటా: అమెరికాలోని సవన్నాలో నిర్మాణంలో ఉన్న హ్యుండాయ్ బ్యాటరీ ఫ్యాక్టరీపై దాడిచేసి ఇమిగ్రేషన్ అధికారులు నిర్బంధించిన 475 మంది కొరియా సిబ్బందికి విముక్తి లభించింది. జార్జియాలోని డిటెన్షన్ సెంటర్‌లో ఉన్న వీరందరినీ గురువారం ఉదయం బస్సుల్లో అట్లాంటాకు తరలించారు. మధ్యాహ్నం ప్రత్యేక విమానంలో వీరు సియోల్‌కు బయలుదేరారు. తిరుగుముఖం పట్టిన సిబ్బందిలో దక్షిణ కొరియాకు చెందిన 316 మంది, 10 మంది చైనీయులు, ముగ్గురు జపనీయులు, ఒక ఇండోనేసియన్ ఉన్నారు. శుక్రవారం మధ్యాహ్నం వీరు గమ్యస్థానానికి చేరుకుంటారు. గత వారం వీరందరినీ ఇమిగ్రేషన్ అధికారులు నిర్బంధించడం తీవ్ర కలకలం రేపింది. అనంతరం అమెరికా అధికారులతో చర్చలు జరిపింది. వీరంతా స్వచ్ఛందంగా స్వదేశాలకు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపింది. దీంతో, వీరి విడుదలకు ఇమిగ్రేషన్ విభాగం అంగీకరించింది.

ఉత్తరాఖండ్‌కు రూ.1,200 కోట్ల సాయం

- ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటన
- వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన

డెహ్రాడూన్: భీకర వర్షాలు, వరదల కారణంగా నష్టపోయిన ఉత్తరాఖండ్‌కు రూ.1,200 కోట్ల ఆర్థిక సాయం అందించనున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. ఆయన గురువారం ఉత్తరాఖండ్‌లో వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. హెలికాప్టర్‌లో ఏరియల్ సర్వే నిర్వహించాల్సి ఉండగా, వాతావరణం అనుకూలించకపోవడంతో ఆ కార్యక్రమాన్ని నిలిపివేశారు. సహాయ, పునరావాస చర్యలపై ప్రధాని మోదీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. వరదల కారణంగా మృతి చెందినవారి కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున, గాయపడినవారికి రూ.50,000 చొప్పున పరిహారం ఇవ్వనున్నట్లు వెల్లడించారు. పీఎం కేర్స్ పథకం కింద బాధిత చిన్నారులను ఆదుకుంటామని చెప్పారు. వరదలు, కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో చాలామంది చిన్నారులు తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారారని ఆవేదన వ్యక్తంచేశారు. బాధిత ప్రజలను మోదీ కలుసుకున్నారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బందితో సమావేశమయ్యారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో వారు అందిస్తున్న సేవలను ప్రశంసించారు. వరదల్లో ధ్వంసమైన ఇళ్లను పీఎం ఆవాస్ యోజన కింద పునర్నిర్మించాలని అధికారులను మోదీ ఆదేశించారు. ఉత్తరాఖండ్‌లో ప్రకృతి విపత్తుల కారణంగా ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటిదాకా 85 మంది మృతిచెందారు. 128 మంది గాయపడ్డారు. 94 మంది గల్లంతయ్యారు.

మణిపూర్, మిజోరంలలో రేపు ప్రధాని మోదీ పర్యటన

ఇంఫాల్‌జ్వాల్: అస్థిర పరిస్థితులు నెలకొన్న ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌తోపాటు మిజోరంలో ప్రధాని మోదీ శనివారం చేపట్టే పర్యటనకు అధికార యంత్రాంగం భారీగా భద్రతా ఏర్పాట్లను చేపట్టింది. రాష్ట్రంలోని అన్ని పోలీస్ విభాగాలను అలెర్ట్ చేసినట్లు మిజోరం ఐజీపీ(శాంతిభద్రతలు) హెచ్ రామ్‌తెంగ్లియానా చెప్పారు. పోలీసులతోపాటు ఐజ్వాల్‌లో రెండు కంపెనీల బీఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్ బలగాలను మోహరించనున్నామన్నారు. ప్రధాని మోదీ పర్యటించే మార్గంలో ఎటువంటి వాహనాలను పార్కు చేయరాదు, ఎలాంటి వస్తువులను ఉంచరాదని ఈ ఆంక్షలు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అమల్లో ఉంటాయని ఐజీపీ తెలిపారు. థువాంపుయి–లమ్మునాల్ రోడ్డు మార్గంలో అన్ని దుకాణాలు, ప్రైవేటు కార్యాలయాలను ప్రధాని మోదీ పర్యటన ముగిసే వరకు మూసివేయాలని ఐజ్వాల్ యంత్రాంగం ఆదేశాలు జారీ చేసింది. పర్యటన సందర్భంగా మోదీ ఐజ్వాల్, ఢిల్లీ మధ్య నడిచే రెండు రైలు సర్వీసులను ప్రారంభిస్తారు. అనంతరం ఆయన మణిపూర్ వెళ్లే అవకాశముందని అధికారులు తెలిపారు. ప్రధాని రాకను పురస్కరించుకుని ఇంఫాల్, చురాచంద్‌పూర్‌లలో భద్రతా చర్యలను కట్టుదిట్టం చేశారు. చురాచంద్‌పూర్ పట్టణంలోని పీస్ గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభలో ప్రధాని ప్రసంగించనున్నారు.2023 మేలో రాష్ట్రంలో ప్రధాన తెగలైన మెయితీలు, కుకీల మధ్య ఘర్షణలు మొదలయ్యాక ప్రధాని పర్యటనకు రానుండటం ఇదే మొదటిసారి. ప్రధాని పర్యటనకు సంబంధించిన ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

విష్ణువర్ధన్, సరోజా దేవిలకు కర్నాటక రత్న అవార్డు

బెంగళూరు: కన్నడ నటులు విష్ణువర్ధన్, బి.సరోజా దేవిలకు మరణానంతరం కర్నాటక రత్న అవార్డుతో గౌరవించాలని కర్నాటక మంత్రివర్గం గురువారం నిర్ణయించింది. అదేవిధంగా, రాష్ట్ర కవి కువెంపునకు భారత రత్న ఇవ్వాలని కోరుతూ కేంద్రానికి లేఖ రాయాలని నిశ్చయించుకుంది. ఈ విషయాలను రాష్ట్ర న్యాయశాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ మీడియాకు తెలిపారు. నటుడు విష్ణువర్ధన్ అసలు పేరు సంపత్ కుమార్. 1950లో జన్మించిన ఈయన 220పైకి సినిమాల్లో నటించారు. సాహస సింహగా బిరుదుంది. కన్నడతోపాటు తెలుగు, తమిళ, మలయాళం, హిందీ సినిమాల్లో నటించారు. 2009 డిసెంబర్ 30వ తేదీన కన్నుమూశారు. అదేవిధంగా, సరోజా దేవి 1938లో జన్మించారు. 200కు పైగా సినిమాల్లో నటించిన ఈమె కన్నడలో కిట్టూర్ రాణి చెన్నమ్మ సినిమాలో ప్రధాన పాత్రతో అందరినీ మెప్పించారు. బహుభాషా నటి అయిన సరోజా దేవి అన్ని దక్షిణాది భాషా చిత్రాలతోపాటు హిందీలో ససురాల్ అనే సినిమాలో నటించారు. 2025 జూలై 14వ తేదీన కన్నుమూశారు. తాజాగా, విష్ణువర్ధన్, సరోజా దేవిలు 10, 11వ కర్నాటక రత్న అవార్డుకు ఎంపికయ్యారు. కర్నాటక రత్న అవార్డును చివరిసారిగా 2022లో పునీత్ రాజ్‌కుమార్‌కు మరణానంతరం అందజేశారు.

రెండో రౌండ్ టేబుల్ సమావేశం ఎప్పుడు జరిగింది?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

ప్రాథమిక హక్కులు

భారత రాజ్యాంగంలోని మూడో భాగంలో ప్రకరణలు 12 నుంచి 35 వరకు ప్రాథమిక హక్కుల గురించి తెలుపుతాయి. ప్రాథమిక హక్కులను భారత రాజ్యాంగంలోని అత్యంత ముఖ్యమైన లక్షణంగా పేర్కొంటారు. వీటిని అమెరికా సంయుక్త రాష్ట్రాల రాజ్యాంగం నుంచి గ్రహించారు. అమెరికా రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులను 'బిల్ ఆఫ్ రైట్స్' రూపంలో పొందుపరిచారు. చట్టబద్ధమైన హక్కులకు రాజ్యాంగంలో స్థానం కల్పించి, ప్రత్యేక ప్రతిపత్తితో గుర్తిస్తే వాటిని 'ప్రాథమిక హక్కులు'గా పేర్కొంటారు. వ్యక్తి వికాసానికి ఇవి కనీస అవసరాలు. దేశ ప్రాథమిక శాసనమైన రాజ్యాంగంలో గుర్తించడం వల్ల వీటిని 'ప్రాథమిక హక్కులు' అని అంటారు.

ప్రాథమిక హక్కుల నేపథ్యం

రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులకు సుదీర్ఘ చారిత్రక నేపథ్యం ఉంది. లోకమాన్య బాలగంగాధర తిలక్ 1895లో 'స్వరాజ్య బిల్లు'లో మొదటి సారిగా ఈ హక్కులను ప్రతిపాదించారు. ఆ తర్వాత..

- 1911లో కలకత్తాలో నిర్వహించిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశంలో హక్కులపై తీర్మానాన్ని ఆమోదించారు.
- 1922లో మహాత్మా గాంధీ సాధారణ ప్రజల హక్కుల గురించి 'యంగ్ ఇండియా'లో ప్రస్తావించారు.
- 1925లో అనిబీసెంట్.. కామన్‌వెల్త్ ఆఫ్ ఇండియా బిల్లులో, ఐర్లాండ్ రాజ్యాంగంలో ప్రస్తావించిన విధంగానే భారతీయులకూ ప్రాథమిక హక్కులు ఉండాలని ప్రతిపాదించారు.
- 1927లో మద్రాసులో ఎం.ఎ. అన్సారీ అధ్యక్షతన జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశంలో భావి రాజ్యాంగానికి ప్రాథమిక హక్కులు ప్రాతిపదిక కావాలనే తీర్మానాన్ని ఆమోదించారు.
- 1928లో మోతీలాల్ నెహ్రూ కమిటీ వెల్లడించిన నివేదికలో 'ప్రాథమిక హక్కులకు ఆమోదం పొందడం పౌరుల అవసరం'గా పేర్కొన్నారు.
- 1931లో కరాచీలో వల్లభాయ్ పటేల్ అధ్యక్షతన కొంతమంది ప్రముఖులు ప్రాథమిక హక్కుల గురించి డిమాండ్ చేశారు. మన రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులను చేర్చడానికి వీరి నివేదికే ప్రాతిపదిక అయింది.
- 1931లో నిర్వహించిన రెండో రౌండ్ టేబుల్ సమావేశంలో మహాత్మా గాంధీ భావి భారత రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులను చేర్చాలని కోరారు.
- 1945లో తేజ్ బహదూర్ సప్రూ నాయకత్వంలో ఏర్పడిన పార్టీ రహిత మేధావుల సంఘం కూడా ప్రాథమిక హక్కులు కావాలని డిమాండ్ చేసింది.

రాజ్యాంగ పరిషత్తు - ప్రాథమిక హక్కులు

హక్కులను రాజ్యాంగంలో చేర్చి, వాటికి ఒక నిర్దిష్ట స్వరూపాన్ని కల్పించడానికి రాజ్యాంగ పరిషత్తు 1947 జనవరి 24న సర్దార్ వల్లభాయ్ పటేల్ అధ్యక్షతన 54 మంది సభ్యులతో ఒక సలహా సంఘాన్ని నియమించింది. ఈ సలహా సంఘం ప్రాథమిక హక్కుల పరిశీలన కోసం 1947 ఫిబ్రవరి 12న ఆచార్య జె.బి. కృపలాని అధ్యక్షతన ఒక ఉప సంఘాన్ని నియమించింది.

ఉప సంఘం సూచన మేరకు రాజ్యాంగ పరిషత్ సలహాదారు బి.ఎన్. రావు హక్కులపై ఒక ముసాయిదా తయారు చేశారు. ఈ ముసాయిదాలో హక్కులను.. న్యాయ సంరక్షణ ఉన్న హక్కులు, న్యాయ సంరక్షణ లేని హక్కులుగా వర్గీకరించారు.

ప్రాథమిక హక్కులు - లక్షణాలు

- ప్రవేశికలో పేర్కొన్న న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం అనే తాత్విక ఆదర్శాలకు వాస్తవికతను చేకూర్చే విధంగా ప్రాథమిక హక్కులను పొందుపరిచారు.
- ప్రాథమిక హక్కులకు న్యాయ సంరక్షణ (Justiciable) ఉంది. ఇది అత్యంత ముఖ్యమైన లక్షణం. వీటి రక్షణ, అమలుకు రాజ్యాంగంలో న్యాయపరమైన ఏర్పాట్లు ఉన్నాయి.
- ప్రాథమిక హక్కులు ప్రభుత్వ నిరపేక్ష అధికారాల (Absolute Authority)పై పరిమితులు. ప్రభుత్వాలు తమ అధికారాలను రాజ్యాంగానికి లోబడి, ప్రజల హక్కులకు భంగం కలిగించకుండా వినియోగించాలి.
- కొన్ని ప్రాథమిక హక్కులు నకారాత్మకమైనవి (Negative). అంటే ఇవి ప్రభుత్వ అధికారితపై పరిమితులు.

ఉదా: నిబంధనలు 14, 15, 16, 20, 21 మొదలైనవి. ఇవి ప్రభుత్వం ఏయే అంశాలను చేయకూడదో సూచిస్తాయి.

- మరికొన్ని హక్కులు సకారాత్మకమైనవి (Positive). ఇవి ప్రభుత్వ బాధ్యతలను సూచిస్తాయి.

ఉదా: నిబంధన 17లోని అస్పృశ్యత నిషేధం, నిబంధన 24లోని బాల కార్మిక వ్యవస్థ నిషేధం.



- ప్రాథమిక హక్కులన్నింటినీ జాతీయ అత్యవసర పరిస్థితుల్లో రద్దు చేయవచ్చు. నిబంధనలు 20, 21 మాత్రం రద్దుకావు.
- ప్రాథమిక హక్కులన్నీ స్వతహాగా అమల్లోకి వస్తాయి. కానీ, నిబంధనలు 17, 23, 24లో ప్రస్తావించిన అంశాలు స్వతహాగా అమల్లోకి రావు (Non self-executory). వీటి అమలు కోసం పార్లమెంటు ప్రత్యేక చట్టాలు చేయాల్సి ఉంటుంది.
- ప్రాథమిక హక్కులను సవరించే అధికారం పార్లమెంటుకు ఉంది. దీని కోసం రాజ్యాంగ సవరణ అవసరం. కానీ, సవరణ పేరుతో వీటి స్ఫూర్తికి భంగం కలిగించకూడదు.
- కొన్ని ప్రాథమిక హక్కులు కొన్ని వర్గాలు, సాయుధ బలగాలు, పోలీసులు, ఖైదీలు, అత్యవసర సర్వీసుల్లో పనిచేస్తున్నవారికి పరిమితంగా వర్తిస్తాయి.
- కొన్ని ప్రాథమిక హక్కులు పౌరుల చర్యలకు వ్యతిరేకంగా కూడా లభిస్తాయి.

ఉదా: ప్రకరణ 17 - అస్పృశ్యత నివారణ, ప్రకరణ 23 - వెట్టిచాకిరి రద్దు, ప్రకరణ 24 - బాలకార్మిక వ్యవస్థ రద్దు.

- కొన్ని హక్కులను అల్పసంఖ్యాక వర్గాల ప్రయోజనాలు కాపాడి, జాతీయ సమగ్రత నిలపడానికి ఉద్దేశించారు.

ఉదా: మతస్వేచ్ఛ హక్కు, విద్యా సాంస్కృతిక హక్కు.

- ప్రాథమిక హక్కుల్లో పేర్కొన్న నిషేధాలు/ వివక్షలు.. ప్రభుత్వాలు, పౌరులకు సమానంగా వర్తిస్తాయి.

ఉదా: జాతి, మత, కుల, లింగ, జన్మ సంబంధ వివక్షలను ఎవరూ పాటించకూడదు.

ప్రాథమిక హక్కుల వర్గీకరణ

భారత రాజ్యాంగంలో 7 రకాల ప్రాథమిక హక్కుల గురించి తెలిపారు.

1. సమానత్వ హక్కు (Right to Equality): ప్రకరణలు 14-18.
2. వ్యక్తి స్వేచ్ఛ, స్వాతంత్ర్య హక్కు (Personal Freedoms): ప్రకరణలు 19-22.
3. పీడనాన్ని నిరోధించే హక్కు (Right against Exploitation): ప్రకరణలు 23, 24.
4. మత స్వాతంత్ర్య హక్కు (Right to Religion): ప్రకరణలు 25-28.
5. సాంస్కృతిక, విద్యా హక్కులు (Cultural & Educational rights): ప్రకరణలు 29, 30.
6. ఆస్తి హక్కు (Right to Property): ప్రకరణ 31.
7. రాజ్యాంగ పరిహార హక్కు (Right to Constitutional Remedies): ప్రకరణ 32.

ప్రత్యేక వివరణ

పైన పేర్కొన్న ప్రాథమిక హక్కుల్లో అత్యంత వివాదాస్పదమైన ఆస్తి హక్కు (ప్రకరణ 31)ను, ఆస్తి సంపాదన విషయంలో వ్యక్తి స్వేచ్ఛకు సంబంధించిన 19(1)(f)ను 1978లో 44వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రాథమిక హక్కుల జాబితా నుంచి తొలగించారు. వీటిని 12వ భాగంలోని 300(ఎ)లో చేర్చారు. ప్రస్తుతం ఆస్తి హక్కు రాజ్యాంగబద్ధ హక్కు (Constitutional Right) మాత్రమే. దీన్ని ఒక చట్టబద్ధమైన హక్కుగానూ పరిగణిస్తున్నారు.

ప్రకరణ 12 - రాజ్యం నిర్వచనం

ప్రాథమిక హక్కులను మౌలికంగా రాజ్యం నిరపేక్ష అధికారాలకు వ్యతిరేకంగా పొందుపరిచారు. రాజ్యాంగంలో రాజ్యం అనే పదాన్ని చాలా చోట్ల ప్రయోగించారు. అయితే రాజ్యం నిర్వచనాన్ని మాత్రం ప్రకరణ 12లో పేర్కొన్నారు. రాజ్యం అనే పదానికి విస్తృతమైన నిర్వచనాన్ని ఇచ్చారు. ప్రాథమిక హక్కులను రాజ్యం లేదా ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా గుర్తించారు. కాబట్టి ఏయే సంస్థలు రాజ్య పరిధిలోకి వస్తాయి? అనే అంశాన్ని స్పష్టంగా నిర్వచించకపోతే కొన్ని సంస్థలు ప్రాథమిక హక్కులను ఉల్లంఘించినా వాటిపై న్యాయస్థానంలో ప్రశ్నించే అవకాశం ఉండదు. అందువల్ల దీనికి విస్తృతమైన నిర్వచనం అవసరం. దీని ప్రకారం రాజ్యం అంటే..

ఎ. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు; కేంద్ర, రాష్ట్ర శాసనసభలు

బి. స్థానిక ప్రభుత్వాలు (మున్సిపాలిటీలు, పంచాయతీలు, జిల్లా బోర్డులు, ట్రస్టులు)

సి. ప్రభుత్వ ఆదేశాల ద్వారా ఏర్పాటైన చట్టబద్ధ, చట్టేతర సంస్థలు (ఎల్.ఐ.సి., ఓ.ఎన్.జి.సి., ఎన్.టి.పి.సి. మొదలైనవి)

డి. న్యాయవ్యవస్థ కూడా రాజ్య నిర్వచన పరిధిలోకి వస్తుందని సుప్రీంకోర్టు తన తీర్పుల్లో తెలిపింది. అదేవిధంగా ప్రభుత్వ భాగస్వామ్యం ఉన్న ప్రైవేట్ సంస్థలు కూడా రాజ్య నిర్వచన పరిధిలోకి వస్తాయని పేర్కొంది.

పైన పేర్కొన్న సంస్థలతో పాటు ఎలాంటి ఇతర సంస్థలు రాజ్య పరిధిలోకి వస్తాయనే అంశాన్ని సుప్రీంకోర్టు వివిధ కేసుల తీర్పుల సందర్భంగా స్పష్టపరిచింది. అవి:

అజయ్ సహాయ్ వర్సెస్ ఖలీద్ ముజీబ్ (1981): సుప్రీంకోర్టు ఈ కేసు తీర్పులో ఒక సంస్థను రాజ్యం అనే నిర్వచనంలోకి చేర్చడానికి కింది ప్రాతిపదికలను పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొంది.

- మూలధనంలో ప్రభుత్వ వాటా ఉండాలి.
- ఆ సంస్థ మొత్తం ఖర్చును ప్రభుత్వం భరించాలి.
- ఆ సంస్థపై సంపూర్ణ పరిపాలనా నియంత్రణ ఉండాలి.
- ఆ సంస్థ ఆర్థిక లావాదేవీలు ప్రభుత్వ నియంత్రణలో ఉండాలి.

న్యాయస్థానాలు రాజ్య నిర్వచన పరిధిలోకి వస్తాయి - సుప్రీంకోర్టు తీర్పులు

ఎ.ఆర్. అంతులే వర్సెస్ ఆర్.ఎస్. నాయక్ కేసు (1988): న్యాయస్థానాల కొన్ని చర్యలు రాజ్య నిర్వచనంలోకి వస్తాయని ఈ కేసులో సుప్రీంకోర్టు పేర్కొంది. దీనికి రాజ్యాంగంలో స్పష్టమైన ఆధారాలున్నాయి.

ప్రకరణ 145, 146 ప్రకారం సుప్రీంకోర్టు సొంత నియమ, నిబంధనలను రూపొందించుకోవచ్చు. అదేవిధంగా తన సిబ్బందిని నియమించుకునే అధికారం కూడా సుప్రీంకోర్టుకు ఉంది. ఈ చర్యలు కార్యనిర్వాహకపరమైనవి. వీటివల్ల పౌరుల ప్రాథమిక హక్కులకు భంగం కలిగినప్పుడు వాటిని న్యాయస్థానంలో ప్రశ్నించవచ్చు.

కాబట్టి న్యాయశాఖ కార్యనిర్వాహక విధులను నిర్వర్తిస్తున్నప్పుడు మాత్రమే రాజ్యమనే పరిధిలోకి వస్తుందని సుప్రీంకోర్టు ప్రకటించింది.

రాజ్యం నిర్వచనం - మినహాయింపులు

సహకార సంఘాలు; బోర్డ్ ఆఫ్ కంట్రోల్ ఫర్ క్రికెట్ ఇన్ ఇండియా; ప్రభుత్వ ధన సహాయం పొందని ప్రైవేట్ విద్యాసంస్థలు; ప్రభుత్వ పరిపాలన, ఆర్థిక నియంత్రణ లేని ఇతర సంస్థలు రాజ్యం నిర్వచనం పరిధిలోకి రావు.

ప్రకరణ 13 - చట్టం నిర్వచనం, ప్రాథమిక హక్కులకు వ్యతిరేకమైన చట్టాలు - న్యాయ సమీక్షాధికారం

ప్రకరణ 13(1) ప్రకారం రాజ్యాంగం అమల్లోకి వచ్చిన వెంటనే అంతవరకు అమల్లో ఉన్న చట్టాలు ప్రాథమిక హక్కులకు వ్యతిరేకమైతే.. అవి చెల్లకుండా పోతాయి.

ప్రకరణ 13(2) ప్రకారం ప్రాథమిక హక్కులను హరించే లేదా పరిమితం చేసే చట్టాలు, ఆదేశాలు చెల్లవు.

ప్రకరణ 13(3)లో పేర్కొన్న చట్టం నిర్వచనం కిందకి వచ్చే అంశాలు:

- కేంద్ర, రాష్ట్ర శాసనసభలు రూపొందించిన శాసనాలు.
- రాష్ట్రపతి, గవర్నర్ జారీ చేసిన ఆదేశాలు, ఆర్డినెన్స్‌లు.
- ప్రభుత్వ రూల్స్, రెగ్యులేషన్స్, నోటిఫికేషన్స్, ప్రకటనలు.
- ప్రభుత్వం గుర్తించిన, చట్టబద్ధత ఉన్న ఆచార వ్యవహారాలు.

ప్రత్యేక వివరణ

1971లో 24వ రాజ్యాంగ సవరణ ద్వారా.. నిబంధన 368 ప్రకారం రాజ్యాంగానికి చేసిన సవరణలను నిబంధన 13లో పేర్కొన్న 'చట్టం' నిర్వచన పరిధి నుంచి మినహాయించారు. ఈ అంశాన్ని గోలక్‌నాథ్ కేసు(1967)లో సుప్రీంకోర్టు తీర్పును అధిగమించడానికి చేర్చారు. కానీ, సుప్రీంకోర్టు 1973లో కేశవానందభారతి కేసులో ఈ సవరణ చెల్లదని తీర్పు చెప్పింది. కాబట్టి రాజ్యాంగ సవరణ కూడా చట్టం నిర్వచన పరిధిలోకి వస్తుంది.

చక్కెర వ్యాధిగ్రస్థుని మూత్ర నమూనాలో ఉండేది?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

బయాలజీ

జనరల్‌సైన్స్ విభాగం నుంచి గతంలో వచ్చిన ప్రశ్నలు

1. మానవ శరీరంలో ఎన్ని ఎముకలుంటాయి? (ఏఈఈ-2007)
1) 330 2) 280
3) 206 4) 220
2. మానవ శరీరంలో అతి కఠిన భాగం? (ఏఎస్‌వో-2008)
1) గోర్లు 2) ఎముకలు
3) కొమ్ములు 4) ఎనామిల్
3. చెవుల్లోని మొత్తం ఎముకల సంఖ్య? (ఏఎస్‌వో-2008)
1) రెండు 2) నాలుగు
3) ఆరు 4) ఎనిమిది
4. దంతక్షయాన్ని అరికట్టడానికి నీటి సరఫరాలో కలిపే రసాయన పదార్థం? (గ్రూప్-2, 2000)
1) క్లోరైడ్ 2) ఫ్లోరైడ్
3) బ్రోమైడ్ 4) సల్ఫైడ్
5. పాలలోని చక్కెర? (జె.ఎల్.-2007)
1) ఫ్రక్టోజ్ 2) గ్లూకోజ్
3) సుక్రోజ్ 4) లాక్టోజ్
6. పాలు అంటే ఏమిటి? (గ్రూప్-1, 2002)
1) కొవ్వు విస్తరించి ఉన్న రక్తం
2) కొవ్వు విస్తరించి ఉన్న నీరు
3) నీరు విస్తరించి ఉన్న కొవ్వు
4) నీరు విస్తరించి ఉన్న చమురు
7. పాలలో కొవ్వు శాతం ఏ సమయంలో తగ్గుతుంది? (ఏఈఈ-2009)
1) చలికాలం 2) వేసవికాలం
3) వర్షాకాలం 4) ఏదీకాదు
8. ఆవు పాలు పసుపు రంగులో ఉండటానికి కారణం? (గ్రూప్-2, 2012)
1) జాంతోఫిల్ 2) మాల్టోజ్
3) రైబోఫ్లావిన్ 4) కెరొటిన్
9. కండరాలకు వచ్చే కేన్సర్ ఏది? (గ్రూప్-1, 2003)
1) లింపోమా 2) ల్యూకేమియా
3) సార్కోమా 4) అనీమియా
10. నేత్రదానంలో దాత తన కంటిలోని ఏ భాగాన్ని దానం చేస్తాడు? (గ్రూప్-1, 2003)
1) కార్నియా 2) లెన్స్
3) రెటీనా 4) పూర్తి కన్ను
11. పాలిష్ చేసిన బియ్యాన్ని ఎక్కువగా తీసుకుంటే ఏ విటమిన్ లోపిస్తుంది? (డిప్యూటీ ఈవో-2008)
1) A 2) B_2 3) D 4) B_1
12. ఏ విటమిన్‌లోపం వల్ల చిగుళ్ల నుంచి రక్తస్రావమవుతుంది?
1) A 2) D 3) K 4) C
13. తాడు రక్తం (Cord Blood) అంటే ఏమిటి? (గ్రూప్-2, 2005)
1) కూతుళ్లకు తండ్రి దానం చేసే రక్తం
2) కృత్రిమ రక్తం
3) గుండె కాండ కణాల నుంచి వృద్ధి చేసిన రక్తం
4) మాయ కాండ కణాల నుంచి వృద్ధి చేసిన రక్తం
14. హిమోగ్లోబిన్‌లో ఉండే లోహం? (గ్రూప్-1, 1987-88)
1) మెగ్నీషియం 2) ఇనుము
3) కోబాల్ట్ 4) మాంగనీస్
15. పేస్‌మేకర్ దేనికి సంబంధించింది? (గ్రూప్-1, 2010)
1) గుండె 2) ఊపిరితిత్తులు
3) కాలేయం 4) కిడ్నీ
16. రక్తం ఒక..? (గ్రూప్-1, 2010)
1) ద్రావణం 2) కొల్లాయిడ్
3) తరల పదార్థం 4) జెల్
17. శిశువు పితృత్వాన్ని నిర్ధారించేందుకు ఏ పరీక్ష నిర్వహిస్తారు? (సివిల్స్-2010)
1) ఆమ్నియో సెంటాసిస్
2) డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్
3) జన్యు సైక్లింగ్ 4) ఏదీకాదు
18. AB రక్త గ్రూపునకు చెందిన ఒక వ్యక్తిని విశ్వగ్రహీత అని ఎందుకంటారు? (గ్రూప్-1, 2007)
1) ప్రతిరక్షక జనకాలు లేనందువల్ల
2) ప్రతిరక్షకాలు ఉన్నందువల్ల
3) ప్రతిరక్షకాలు లేనందువల్ల
4) ప్రతిరక్షకాలు - ప్రతి రక్షక జనకాలు లేనందువల్ల
19. సిరా రక్తాన్ని ఆక్సిజన్ కోసం ఊపిరితిత్తులకు చేరవేసేది? (గ్రూప్-2, 2008)
1) పుపుస సిరలు 2) పుపుస ధమనులు
3) కుడి జఠరిక 4) మహాధమని
20. చాలా కీటకాలు గాలిని సంగ్రహించే పద్ధతి?
1) చర్మం ద్వారా 2) మొప్పల ద్వారా
3) ట్రాకియల్ వ్యవస్థ ద్వారా
4) లంగ్స్ ద్వారా
21. బయోగ్యాస్‌లోని ప్రధానాంశం? (గ్రూప్-1, 1987)
1) ఈథేన్ 2) మీథేన్
3) బ్యూటేన్ 4) ఎసిటలిన్
22. ఆక్సిజన్ లేకుండా ఒక జైవిక పదార్థాన్ని విచ్ఛిన్నం చేయడం ద్వారా ఏ వాయువును ఉత్పత్తి చేయొచ్చు? (గ్రూప్-2, 2001)
1) బొగ్గుపులుసు వాయువు
2) నత్రజని
3) SO_2 4) మీథేన్
23. ఆల్కహాల్‌ను తయారు చేయడానికి ఏది అవసరం? (గ్రూప్-2, 2001)
1) ప్రోటోజోవా 2) శిలీంధ్రాలు - ఈస్ట్
3) బ్యాక్టీరియా 4) వైరస్
24. పురుషుడి గొంతు కంటే స్త్రీ గొంతు కీచుగా ఉంటుంది. ఎందుకంటే? (గ్రూప్-2, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్- 2009)
1) అధిక పీడన వ్యాప్తి
2) అల్ప పీడన వ్యాప్తి
3) అధిక కంపన పరిమితి
4) అల్ప కంపన పరిమితి
25. సిలికోసిస్ వ్యాధి ఏ అవయవానికి సంక్రమిస్తుంది?
1) మూత్రపిండాలు 2) కాలేయం
3) నరాలు 4) ఊపిరితిత్తులు
26. మొదటిసారిగా కృత్రిమంగా తయారు చేసిన జీవ సమ్మేళనం? (గ్రూప్-2, 2008)
1) మీథేన్ 2) బెంజీన్
3) గ్లూకోజ్ 4) యూరియా
27. సాధారణంగా మూత్రం ద్వారా విసర్జితమయ్యే పదార్థం? (గ్రూప్-2, 2003)
1) పంచదార 2) గ్లూకోజ్
3) క్రియాటిన్ 4) ప్రోటీన్
28. మానవ కిడ్నీలో ఏర్పడే రాళ్లలో అధికంగా ఉండేది?
1) కాల్షియం ఆక్జలేట్ 2) సోడియం ఎసిటేట్
3) మెగ్నీషియం సల్ఫేట్
4) సోడియం సిట్రేట్
29. మూత్రపిండాల్లోని ఏ భాగంలో మూత్రం వడపోత అవుతుంది? (డీఎల్-2012)
1) వృక్కం 2) మూత్ర కోశం
3) ప్రసేకం 4) వృక్క సిర
30. మానవ మూత్రంలోని యూరియా తయారయ్యే భాగం? (గ్రూప్-2, 2000)
1) మూత్రపిండాలు 2) పెద్దపేగు
3) కాలేయం 4) మూత్రాశయం
31. కృత్రిమంగా మూత్రపిండాలు వ్యర్థ పదార్థాలను శుద్ధి చేయడాన్ని ఏమంటారు? (గ్రూప్-2బి,1984)
1) పనోరిసిస్ 2) మానోమీటర్
3) డయాలసిస్ 4) డయామెంటేషన్
32. చక్కెర వ్యాధిగ్రస్థుని మూత్ర నమూనాలో ఉండేది? (ఏఈఈ-2009)
1) లాక్టోజ్ 2) మాల్టోజ్
3) గ్లూకోజ్ 4) సుక్రోజ్
33. క్లోమం ఒక ..? (గ్రూప్-1, 1999)
1) అంతస్స్రావ గ్రంథి
2) బహిస్స్రావ గ్రంథి
3) అంతస్స్రావ - బహిస్స్రావ గ్రంథి
4) ఏదీకాదు
34. శరీరంలో తాప నియంత్రణను కలిగి ఉన్న గ్రంథి? (గ్రూప్-1, 2007)
1) పీనియల్ గ్రంథి
2) పిట్యూటరీ గ్రంథి/ హైపోథలమస్
3) థైరాయిడ్ 4) అడ్రినలిన్
35. మానవ శరీరంలో 'ఆడమ్స్ ఆపిల్' అని పిలిచే గ్రంథి? (గ్రూప్-1, 2007)
1) అడ్రినల్ గ్రంథి 2) లివర్/కాలేయం
3) థైరాయిడ్-బాలగ్రంథి
4) థైమస్-బాలగ్రంథి
36. తన జాతి జీవులపై ప్రభావం చూపే, జీవి శరీరం నుంచి బాహ్యంగా స్రవించే సమ్మేళనాన్ని ఏమంటారు? (గ్రూప్-1, 1995)
1) సబ్ హార్మోన్ 2) న్యూరో హార్మోన్
3) ఫిరామోన్స్ 4) న్యూరో ట్రాన్స్‌మీటర్
37. పాల పొదుగు నుంచి - చూషణ ద్వారా పాలను స్రవించేందుకు తోడ్పడే హార్మోన్? (సివిల్స్-1989)
1) ప్రోలాక్టిన్ 2) ఆక్సిటోసిన్
3) అడ్రినలిన్ 4) థైమోసిన్
38. రక్తపోటు(బ్లడ్ ప్రెజర్)కు కారణమైన హార్మోన్? (అసిస్టెంట్ తెలుగు ట్రాన్స్‌లేటర్-2010)
1) కాలేయం 2) థైమోసిన్
3) అడ్రినలిన్ 4) సెక్రిటిన్
39. కణం శక్తి గృహం (కణ శక్తి భాండాగారం) అని పిలిచే కణాంగం? (గ్రూప్-1, 1994, ఎ.ఎం.వి. ఇన్‌స్పెక్టర్- 2009)
1) క్లోరోప్లాస్ట్ 2) మైటోకాండ్రియా
3) గ్రానా 4) ప్రోటోప్లాజమ్
40. తుమ్ములు, మింగడం, వాంతులు, వెక్కిల్లు దేని నియంత్రణలో ఉంటాయి? (గ్రూప్-1, 1990)
1) మజ్జాముఖం 2) మస్తిష్కం
3) అనుమస్తిష్కం 4) హైపోథాలమస్
41. అనుమస్తిష్కం (సెరిబెల్లమ్) దేనికి సంబంధించింది? (టౌన్ ప్లానింగ్ - 2010)
1) కండరాల కదలిక సమన్వయం
2) గ్రాహకాంగం
3) జ్ఞాపక శక్తి 4) దృష్టి
42. జంతు రాజ్యంలో అతిపొడవైన కణం? (గ్రూప్-1, 2010)
1) ఆస్ట్రిచ్ అండం 2) శుక్రకణం
3) నాడీకణం 4) మైకోప్లాస్మా
43. మెదడును కప్పి ఉంచే లోపలి పొర? (డీఎల్-2012)
1) ప్లూరా 2) డ్యురామ్యాటర్
3) పియామ్యాటర్
4) అరాకినాయిడ్ మెంబ్రేన్
44. పార్కిన్సన్ వ్యాధి ఏ అవయవానికి వస్తుంది? (ఏఈఈ-2006)
1) గుండె 2) కాలేయం
3) మెదడు 4) చర్మం
45. శరీరంలో వార్తలను గ్రహించి సమన్వయ పరిచే కేంద్రం? (జె.ఎల్.-2007)
1) గుండె 2) మెదడు
3) మూత్రపిండాలు 4) పీయూష గ్రంథి
46. మెదడులో ఏ భాగం జ్ఞాపకశక్తికి మూలం? (జె.ఎల్.-2004)
1) మస్తిష్కం 2) అనుమస్తిష్కం
3) దవ్వ 4) అధోపర్యంకం
47. కిందివాటిలో జీర్ణక్రియా ఎంజైమ్ కానిది? (సివిల్స్-2007)
1) ట్రిప్సిన్ 2) పెప్సిన్
3) టయలిన్ 4) గ్యాస్ట్రిన్
48. హెపటైటిస్ వ్యాధి దేనికి సంబంధించింది? (గ్రూప్-2, 2000)
1) కాలేయంలో మంట 2) గుండెలో మంట
3) మూత్రపిండాల్లో మంట
4) పేగులో మంట
49. బేరియాట్రిక్ శస్త్ర చికిత్స అంటే ఏమిటి? (గ్రూప్-1, 2004)
1) గుండె బైపాస్ శస్త్ర చికిత్స
2) పొట్ట బైపాస్ శస్త్ర చికిత్స
3) మెదడు సర్జరీ
4) సియామీ కవలలను విడదీసే సర్జరీ
50. కోసిన తర్వాత 2-3 వారాల్లోనే తన పూర్వ స్థితిని తిరిగి దాదాపు 85 శాతం వరకు పెంచుకునే సామర్థ్యం ఉన్న మానవ శరీర అవయం ఏది? (గ్రూప్-1, 2004, ఏఈఈ-2008)
1) మెదడు 2) మూత్రపిండాలు
3) కాలేయం 4) ఊపిరితిత్తులు
51. మానవుని సొల్లు (సెలైవా)లో ఉండే ఎంజైమ్? (గ్రూప్-2, 2003)
1) రెనిన్ 2) అమైలేజ్
3) లైపేజ్ 4) టయలిన్
52. 'రూట్ కెనాల్ థెరపీ' వేటికి సంబంధించిన చికిత్స? (గ్రూప్-2, 2000)
1) దెబ్బతిన్న పళ్లు
2) దెబ్బతిన్న మూత్రనాళం
3) రక్తనాళాలు 4) గోర్లు
53. మానవుడిలో అతిపెద్ద గ్రంథి? (ఆర్కియాలజీ అండ్ మ్యూజియమ్స్-2012)
1) కాలేయం 2) ఊపిరితిత్తులు
3) ప్లీహం 4) క్లోమం
54. మానవ ఉదరంలో ఉత్పత్తి అయ్యే ఆమ్లం? (గ్రూప్-1, 2012)
1) ఎసిటికామ్లం 2) హైడ్రోక్లోరికామ్లం
3) ఫార్మికామ్లం 4) నైట్రికామ్లం
55. కిందివాటిలో సరైన వరస క్రమం ఏది?
1) గడ్డి-తోడేలు-జింక-గేదె
2) గడ్డి-కీటకం-పక్షి-పాము
3) బ్యాక్టీరియా-కీటకం-పాము-జింక
4) బ్యాక్టీరియా-గడ్డి-కుందేలు-తోడేలు
56. అండోత్పత్తి స్థానం నుంచి అండాలు గర్భాశయంలోకి ప్రవేశించడానికి ఏ భాగం సహాయపడుతుంది? (గ్రూప్-1, 2004)
1) సెర్విక్ 2) యోని
3) జరాయువు 4) ఫెల్లోపియన్ నాళాలు

సమాధానాలు

1) 3; 2) 4; 3) 3; 4) 2; 5) 4; 6) 2; 7) 2; 8) 3; 9) 3; 10) 1; 11) 4; 12) 4; 13) 4; 14) 2; 15) 1; 16) 2; 17) 2; 18) 3; 19) 2; 20) 3; 21) 2; 22) 1; 23) 2; 24) 4; 25) 4; 26) 4; 27) 3; 28) 1; 29) 1; 30) 3; 31) 3; 32) 3; 33) 3; 34) 2; 35) 3; 36) 3; 37) 2; 38) 3; 39) 2; 40) 1; 41) 1; 42) 3; 43) 3; 44) 3; 45) 2; 46) 1; 47) 4; 48) 1; 49) 2; 50) 3; 51) 4; 52) 1; 53) 1; 54) 2; 55) 2; 56) 4.

సాక్షి ప్లస్
శుక్రవారం । 12-9-2025

పీష్వాలను ఓడించిన పరాక్రమశీలి శంకరమ్మ

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
తెలంగాణ హిస్టరీ

స్వాతంత్ర్యం రాక ముందు భారతదేశంలో 562 సంస్థానాలు ఉండేవి. తెలంగాణ ప్రాంతంలోనూ అనేక సంస్థానాలున్నాయి. కాకతీయులు, కుతుబ్‌షాహీలు, అసఫ్‌జాహీల కాలంలో ఇవి ఆవిర్భవించాయి. వీటిలో ఆత్మకూరు, బోరవెల్లి, సీర్నవెల్లి, దుబ్బాక, దొంతి, దోమకొండ, గద్వాల, జటప్రోలు, పాల్వంచ, పాపన్నపేట, నారాయణపురం సంస్థానాలు ప్రధానమైనవి. సైనిక చర్య అనంతరం నిజాం రాష్ట్రంతో పాటు ఇవి భారత దేశంలో విలీనమయ్యాయి.

తెలంగాణలో ముఖ్యమైన సంస్థానాలు

తెలంగాణ సంస్కృతి నిర్మాణంలో, సాహిత్య వికాసంలో సంస్థానాల పాత్ర మరువలేనిది. ఆంధ్ర ప్రాంతంలో నాయక రాజులు పోషించిన పాత్రను తెలంగాణలో సంస్థానాలు పోషించాయి.

ఆత్మకూరు సంస్థానం

మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఆత్మకూరు సంస్థానం వైశాల్యం 190 చ.కి.మీ. దీని తొలి రాజధాని తివుడంపల్లి. వర్ధమానపురం పాలకుడైన గోన బుద్ధారెడ్డి తిరుపతి వెళ్లినప్పుడు చంద్రగిరికి చెందిన గోపాలరెడ్డి అతడికి సకల సౌకర్యాలు కల్పించాడు. గోపాలరెడ్డి ఆతిథ్యానికి ముగ్ధుడైన బుద్ధారెడ్డి అతణ్ని మగతలనాడు గౌడ పదవిలో నియమించాడు. ఇతణ్నే ఈ సంస్థాన స్థాపకుడిగా చెప్పవచ్చు. ఇతడి చిన్న కుమారుడు చినగోపిరెడ్డి యుద్ధాల్లో బహమనీ సుల్తాన్లకు సహకరించాడు. ఇందుకు ప్రతిఫలంగా ముజఫర్ పరగణాలో నాడగౌడ, సర్ నాడ గౌడ, దేశ్‌ముఖ్, దేశ్‌పాండ్య, దేశాయిగిరి పదవులను పొందాడు. చినగోపిరెడ్డి మనవడు రెండో గోపిరెడ్డి. ఇతడు అబ్దుల్లా కుతుబ్‌షా సమకాలీనుడు. రెండో గోపిరెడ్డి కుతుబ్‌షా దగ్గర నుంచి అల్లిపురం జాగీర్‌ను పొందాడు. గోపిరెడ్డి సోదరుడు సాహెబ్ రెడ్డి. కడేచూరు, మగతల సీమలను పాలించేందుకు సాహెబ్‌రెడ్డికి కుతుబ్‌షా అనుమతిచ్చాడు. గోపిరెడ్డి తర్వాత సర్వారెడ్డి ఈ సంస్థానాన్ని పాలించాడు. సర్వారెడ్డి మనవడు రెండో సర్వారెడ్డి. ఇతడు యుద్ధాల్లో ఔరంగజేబుకు సహకరించి దుప్పల్లి జాగీర్‌ను పొందాడు. ఇతడి కుమారుడైన మొదటి తిమ్మారెడ్డి తర్వాతి కాలంలో రాజ్యాన్ని పాలించాడు. తిమ్మారెడ్డి మనవడు రెండో సాహెబ్‌రెడ్డి. ఇతడు కర్ణాటక దండయాత్రల్లో అసఫ్‌జాహీలకు సహకరించి 'సవైరాజా' బిరుదును పొందాడు. ఈ వంశంలో రెండో సాహెబ్‌రెడ్డి తర్వాత ఏడో తరానికి చెందినవాడు పెద వెంకటరెడ్డి. ఇతడు నిజాం రాజైన సికిందర్ జాకు యుద్ధాల్లో సహకరించాడు. ప్రతిఫలంగా అమరచింత, వడ్డెమాను పరగణాల పట్టా పొందాడు. ఇతడు రాజధానిని తివుడంపల్లి నుంచి ఆత్మకూరుకు మార్చాడు. పెద వెంకటరెడ్డి తర్వాత అతడి కుమారుడు బాలకృష్ణారెడ్డి, మనవడు సోమభూపాలరావు సంస్థానాన్ని పరిపాలించారు. సోమభూపాలరావు అమరచింత, వడ్డెమాను పరగణాలను శాశ్వతంగా బిల్‌మఖ్తాగా పొందాడు. సోమభూపాలుడి కుమారుడు రాజా సీతారామభూపాలరావు. ఇతడి కుమారుడైన సవైరాజా రామభూపాలరావు బల్వంత్ బహద్దూర్ సంస్థానాన్ని పరిపాలించాడు. ఇతడు ప్రజలకు ఉపయోగపడే అనేక నిర్మాణాలను చేపట్టాడు. ఇతడి మరణానంతరం భార్య భాగ్యలక్ష్మమ్మ నిజాం నుంచి పరిపాలనా అనుమతి పొందింది. ఈమె కాలంలోనే ఈ సంస్థానం హైదరాబాద్ రాష్ట్రంలో విలీనమైంది.

నారాయణపురం, రాజాపేట

ఇవి నల్లగొండ జిల్లాకు చెందిన చిన్న సంస్థానాలు వీటికి సొంత అధికారాలు ఉండేవి కావు. నిజాం ఉల్‌ముల్క్ కాలంలో నల్లగొండ జిల్లా గట్టుప్పల్ ప్రాంతంలో ఒక గజదొంగ దురాగతాలకు పాల్పడేవాడు. మంచల్‌రెడ్డి అనే వ్యక్తి ఆ దొంగను చంపి, నారాయణపురం ప్రాంతాన్ని ఇనామ్‌గా పొందాడు. ఇతడి సోదరుడు సోమిరెడ్డి నారాయణపురం పటేల్‌గా నియమితుడయ్యాడు. తర్వాత మంచల్‌రెడ్డి కుమారుడైన రాయన్‌రెడ్డి పాలకుడయ్యాడు. నిజాంను ధిక్కరించిన ఒక సామంతరాజును ఇతడు బంధించి తెచ్చాడు. ఈ చర్యకు మెచ్చిన నిజాం ఇతడికి సర్‌మన్నెవార్, సర్దేశ్‌ముఖ్, సర్దేశ్‌పాండే, సర్‌నాడగౌడ బిరుదులు ఇచ్చి గౌరవించాడు. తర్వాత ఇతడిని రాచకొండ, భువనగిరి, అడవిమర్రి, షాద్‌నగర్, నర్సికొండ, ఇందుర్తి, ఇంద్రియాల, ఇబ్రహీంపట్నం పరగణాల మీద అధికారం కల్పించాడు. రాయన్‌రెడ్డి 1775లో రాజాపేట కోటను నిర్మించాడు. 1782లో ఇతడి కుమారుడు వెదిరె వెంకట నారాయణరావు పాలకుడయ్యాడు. ఇతడే నారాయణపురం సంస్థానాన్ని స్థాపించాడు. ఇతడి కుమారుడైన రాయన్న మీర్ లాయక్ అలీ, సాలార్జంగ్ లాంటి గొప్ప వారితో కలిసి చదువుకున్నాడు. ఇస్లాం మతాన్ని స్వీకరించాడు. ఇతడికి ఆరుగురు భార్యలు. చివరి భార్య హుస్సేన్ బేగంకు మాత్రమే ఒక కూతురు జన్మించింది. ఆమె పేరు జహీరున్నీసా బేగం. ఆమే ఈ సంస్థాన చివరి పాలకురాలు. రాజాపేట సంస్థానం పరిధిలో కుర్రారం, నమిలె, మాసాయిపేట, కోరుకొండ, పెదపాడు, సాదువెల్లి, చల్లూరు, వెంకిర్యాల, రాజాపేట గ్రామాలుండేవి.

పాపన్నపేట సంస్థానం

పాపన్నపేట అతి ప్రాచీన సంస్థానం. ఇది ఒకప్పుడు అన్ని సంస్థానాల కంటే పెద్దది. మెదక్ జిల్లా మొత్తం ఈ సంస్థాన పరిధిలో ఉండేది. రాణి శంకరమ్మ పాలనా కాలం నుంచి సంస్థాన చరిత్ర తెలుస్తోందని బి.ఎన్.శాస్త్రి తెలిపారు. సురవరం ప్రతాపరెడ్డి కూడా గోల్కొండ పత్రికలో ఈ సంస్థాన చరిత్రను రాశారు. అందులో రాణి శంకరమ్మ, సదాశివరెడ్డి గురించి మాత్రమే పేర్కొన్నారు. తర్వాతి కాలంలో కొన్ని గ్రంథాల ద్వారా ఈ సంస్థాన చరిత్ర కొంత వెలుగులోకి వచ్చింది.

చిదిరె వంశీయులు ఈ సంస్థాన రాజపురోహితులు. ఈ వంశానికి చెందిన చిదిరె లక్ష్మణశాస్త్రి 1928-29లో సంస్థాన చరిత్రను రచించాడు. ఇందుకోసం రాణి లింగాయమ్మ రాసిన మా పూర్వ వంశావళి, రాజా వెంకట నరసింహారెడ్డి ఉర్దూలో రాసిన మా వంశ చరిత్ర, వెంకటాద్వరి రచించిన మా సంస్థాన చరిత్ర, లింగాయమ్మ చరిత్ర; తిరుమలాచార్యుల శౌర్యరాజ్య వంశావళి, ముదిగొండ రామకృష్ణ కవి శ్రీమజ్జోగినాథ చరిత్ర అనే గ్రంథాలను ఆధారంగా చేసుకున్నాడు. వీటితోపాటు తమ పూర్వీకులు చెప్పిన విషయాలను కూడా పరిగణనలోకి తీసుకున్నాడు. లక్ష్మణశాస్త్రి సంస్థాన చరిత్ర రాతప్రతిని సురవరం, బిరుదురాజు రామరాజుకు ఇచ్చాడు. కానీ కొన్ని కారణాల వల్ల దాన్ని తిరిగి పొందలేదు. దీంతో తన వద్దనున్న చిత్తుప్రతి ఆధారంగా 1979-80లో మెదక్ రాజుల చరిత్రను ముద్రించాడు. ముడుంగ రంగ కృష్ణమాచార్యులు 2006-07లో 'ఆందోల్-జోగిపేట', 2012లో 'శౌర్యవీర్యరెడ్డి త్రయం' అనే పుస్తకాలు రాశాడు. ఆందోల్ రాజుల చరిత్ర, మెదక్ రాజుల చరిత్ర, రంగంపేట చరిత్ర అనే వివిధ పేర్లతో పాపన్నపేట సంస్థాన రాజుల చరిత్ర వ్యవహారంలో ఉంది. కాకతీయుల సేనానుల్లో అనంతరెడ్డి ఒకరు. కాకతీయ రాజ్య పతనం తర్వాత ఇతడు సంగారెడ్డి సమీపంలోని కల్పగూరు వచ్చి స్థిరపడ్డాడు. ఇతడు నాటి పాలకులకు సాయం చేసి, వారి నుంచి కల్పగూరు పరగణాను పొందాడు. ఇతడే ఈ వంశ స్థాపకుడు. తర్వాత ఇతడి మనవడైన రామినేడు 1398లో పట్టాభిషిక్తుడయ్యాడని ఆందోల్ తహశీల్దార్ రాసిన మెదక్ చరిత్రలో ఉంది. రామినేడు ఆందోల్ కోటను నిర్మించాడు. 1418లో ఆందోల్‌ను రాజధానిగా చేసుకున్నాడు. కొండాపూర్, ఓంకారపురం, పొటన్ చెర్వు (పటాన్ చెరువు), తెలంగాణాపురం, రుద్రారం, మెతుకు, కాపాల, అతినగరం, డాకూరు మొదలైనవి ఇతడి సంస్థానంలో భాగంగా ఉండేవి. తర్వాత భువనగిరి, నిజాంపేట, చందంపేట, దేవరకొండ, నర్సాపూర్, దౌల్తాబాద్ తదితర ప్రాంతాలు కూడా ఇతడి సంస్థానంలో భాగమయ్యాయి.రామినేడు తర్వాత ముసలారెడ్డి, పెద్దరెడ్డి, అల్లమయ్య చౌదరి, రామిరెడ్డి, మొదటి సదాశివరెడ్డి, పెద్దనరసింహారెడ్డి, లింగాయమ్మ, లింగారెడ్డి తదితరులు ఈ సంస్థానాన్ని పరిపాలించారు. రామదుర్గా వెంకట నరసింహారెడ్డి (1720-60) కాలంలో ఈ సంస్థాన పరిధి తగ్గి చిన్న సంస్థానంగా మారింది. శంకరమ్మ పరాక్రమం చూసిన నరసింహారెడ్డి ఆమెను వివాహమాడాడు. నరసింహారెడ్డి మరణం తర్వాత శంకరమ్మ సంస్థాన పాలన బాధ్యతలను చేపట్టాల్సింది. కానీ ఒక కుట్ర వల్ల రెండో లింగాయమ్మ రాణి అయింది. ఈమె 1760-64 వరకు సంస్థానాన్ని పాలించింది. మహారాష్ట్ర పీష్వాలు నిజాం రాజ్యంపై దండెత్తారు. కానీ శంకరమ్మ తన శక్తియుక్తులతో వారిని ఓడించింది. దీంతో నిజాం ఆమెకు రాయ్ భాగన్ (ఆడ సింహం లాంటి రాణి) అనే బిరుదు నిచ్చి రాణిగా నియమించాడు. 1764లో అధికారంలోకి వచ్చిన శంకరమ్మ రాజ్యాన్ని పునర్ నిర్మించింది. తన తండ్రి పేరు మీద సంగారెడ్డిని, తల్లి పేరు మీద రాజంపేటను నిర్మించింది. తన పేరు మీద శంకరంపేటను, మీరెల్లి పాపన్న పేరు మీద పాపన్నపేటను నిర్మించింది. ఈమె గొప్ప పరాక్రమవంతురాలు, పరిపాలనాదక్షురాలు. శంకరమ్మ పేరు మీద అనేక జానపదులు, వీరగాథలు ప్రచారంలో ఉన్నాయి. అందుకే చరిత్రకారులు ఈమెను రుద్రమదేవి, అహల్యాబాయితో పోల్చారు. వ్యవసాయాభివృద్ధికి శంకరమ్మ అనేక చెరువులు నిర్మించింది. ఈమె గొప్ప సంస్కరణ శీలి. దళితుడైన నీరుడి పాపన్నను దళపతి చేసింది.

శంకరమ్మకు సంతానం లేదు. అందువల్ల పేద బాలుడైన సదాశివరెడ్డిని దత్తత తీసుకుంది. 1774లో ఈమె మరణించింది. దీంతో సదాశివరెడ్డి రాజ్యానికి వచ్చాడు. గద్వాల సంస్థానాధీశుడైన సోమనాథ భూపాలుడు ఇతడి ధైర్య సాహసాలకు ముగ్ధుడయ్యాడు. అందుకే ఇతడికి తన కుమార్తె అయిన పార్వతీదేవినిచ్చి వివాహం చేశాడు. సదాశివరెడ్డి కూడా మరాఠా పీష్వాలను ఓడించి నిజాం అలీఖాన్ (రెండో అసఫ్‌జా)కు సహాయం చేశాడు. నిజాం అలీఖాన్ పెద్ద కుమారుడు అక్బర్ అలీ. ఇతడు తండ్రి మీద తిరుగుబాటు చేసి సదాశివరెడ్డి, గాలీబ్‌జంగ్ సహాయం కోరాడు. ఈ సందర్భంగా జరిగిన మూడు యుద్ధాల్లో సదాశివరెడ్డి గెలుపొందాడు. కానీ చివరి యుద్ధంలో ఓటమిపాలై హత్యకు గురయ్యాడు. తర్వాత ఇతడి భార్య పార్వతీదేవి అధికారంలోకి వచ్చింది. రాజా రామచంద్రారెడ్డి బహద్దూర్ ఈ సంస్థాన చివరి పాలకుడు. ఇతడి కాలంలోనే పాపన్నపేట సంస్థానం హైదరాబాద్ రాష్ట్రంలో విలీనమైంది.

వనపర్తి సంస్థానం

తెలంగాణలోని పెద్ద సంస్థానాల్లో మహబూబ్‌నగర్ జిల్లాలోని వనపర్తి సంస్థానం ఒకటి. ఈ సంస్థానం సాహిత్యంలో మేటి. దీని పరిధిలో 124 గ్రామాలుండేవి. నూగూరు రాజధానిగా పాలించారు కాబట్టి వీరిని నూగూరు సంస్థానాధీశులని పిలిచేవారు. వీరి పూర్వీకులు నంద్యాలకు చెందినవారు. ఈ సంస్థాన స్థాపకుడు జనుంపల్లి వీరకృష్ణారెడ్డి. ఈ వంశంలో నాలుగో తరం వాడు వేమడి వెంకటరెడ్డి(1625-53). నెల్లూరు, ఉదయగిరి దుర్గాలను జయించడంలో అబ్దుల్లా కుతుబ్‌షాకు ఇతడు సహాయపడ్డాడు. ఈ వంశంలో అష్టభాషా గోపాలరావు ప్రసిద్ధుడు. ఇతడు రెండో వెంకటరెడ్డి కుమారుడు. ఈ వంశంలో బహారి బిరుదును పొందిన తొలి వ్యక్తి గోపాలరావు. ఇతడు 8 భాషల్లో ప్రసిద్ధుడు. ఇతడు రామచంద్రోదయం అనే కావ్యాన్ని, బాణం అనే సంస్కృత గ్రంథాన్ని రచించాడు. మిన్‌జానీబ్ సర్కారు తరఫున గోపాలరావు రెండేళ్లపాటు జటప్రోలు సంస్థానాన్ని పాలించాడు. ఇతడి దత్తపుత్రుడు మూడో వెంకటరెడ్డి. ఢిల్లీ సుల్తాన్ ఇతడికి సవై బిరుదును ఇచ్చాడు. వెంకటరెడ్డి తన తండ్రి పేరుమీద గోపాలపేట సంస్థానాన్ని స్థాపించాడు. నూగూరు సంస్థానంలోని 12 గ్రామాలను అందులో చేర్చి, దానికి తన సోదరుడైన రంగారెడ్డిని పాలకుడిగా నియమించాడు. ఈ కాలంలో మొగలుల పరిస్థితి దిగజారింది. ఇదే అదనుగా వెంకటరెడ్డి పన్ను ఎగ్గొట్టాడు. దీంతో సుల్తాన్ సైన్యం ఇతడిపై దండెత్తింది. ఈ దాడిలో ఓడిపోయిన వెంకటరెడ్డి 1711లో ఆత్మహత్య చేసుకున్నాడు. గోపాలరావు కాలంలో ముద్రించిన నూగూరు సిక్కాలు (నాణేలు) సంస్థానానికి ఎంతో పేరు తెచ్చాయి. కానీ 'నూగూరు వెట్టి' వల్ల ఈ సంస్థానం అప్రతిష్ఠ పాలైంది. తర్వాతి కాలంలో ఈ వంశంలో చెప్పుకోదగిన వ్యక్తి మొదటి రామకృష్ణారావు (1807-1822). ఇతడు సంస్థానాన్ని వనపర్తికి మార్చాడు. నిజాం ఇతడికి 1817లో రాజబహద్దూర్ బిరుదునిచ్చాడు. ఇతడు మంచి పండితుడు. చాలా మంది ఫకీర్లు ఇతడి స్నేహితులుగా ఉండేవారు.ఈ సంస్థానంలో అందరిలోకెల్లా ప్రసిద్ధి చెందినవాడు రాజా రామేశ్వరరావు. ఇతడిలో ఆధునిక భావాలు మెండు. ఆంగ్ల విద్య ఆవశ్యకతను గుర్తించిన రామేశ్వరరావు మద్రాస్ వెళ్లి ఆంగ్లం నేర్చుకున్నాడు. 1802లో రెవెన్యూ సెటిల్‌మెంట్ భూమిని కొలిచి సర్వే నంబర్లు వేశాడు. రైతులకు పట్టాలు ఇచ్చే పద్ధతిని ప్రవేశపెట్టాడు. తెలంగాణలో రైతులకు పట్టాలు ఇచ్చిన తొలి సంస్థానం ఇదే. సాలార్జంగ్ కంటే ముందే ఇక్కడ సంస్కరణలు చేపట్టారు. అందుకే సాయుధ పోరాటం ఇక్కడ ప్రభావం చూపలేదు. రాజా రామేశ్వరరావు కులాంతర ప్రేమ వివాహం చేసుకోవడానికి సిద్ధపడ్డాడు. సంస్థానంలో ఆధునిక సిద్ధాంతాలను ప్రవేశపెట్టి నిజాం సర్వసైన్యాధ్యక్ష పదవి పొందాడు. బ్రిటిషర్లు ఇతడికి 'హిస్ హైనెస్' అనే బిరుదును ప్రకటించారు. మూడో రామేశ్వరరావు కాలంలో ఈ సంస్థానం హైదరాబాద్ రాష్ట్రంలో విలీనమైంది.

Common nouns followed by 'of'..



BANK EXAMS
GENERAL ENGLISH

NOUNS

We use nouns to refer to animals, people, places and things.

Kinds and uses

» **Proper nouns:** The specific names by which we know an individual animal, a person, a place, such as an institution, a building or a town, or something such as a month, a day of the week, a season or a festival.
E.g. Smith; Delhi; India Gate; January; Sankranthi.. etc.
Note: that all proper nouns begin with a capital letter.

» **Common nouns:** words that name people, animals, places and things of the same kind Dog (as in my dog, Goldie), doctor (as in Satish, a doctor), library (as in central library), spoon(as in a plastic spoon)
Note: that all common nouns begin with a lower-case letter.

» **Common nouns are countable when:**
- We use a / an in front of them.
A bag, an orange, a shirt, an engineer
- We can talk about many of them using their plural forms, with or without numbers in front of them.
Ships, two books, seven women, many sheep, a few lemons.
- We can use them in questions that begin with 'how many'.
How many pens do you need? How many children are present today?

» **Common nouns are uncountable when:**
- We do not use a/an in front of them.
Not a slat, but salt; not an oil, but oil.
- We do not use their plural forms, with or without numbers in front of them, to specify what quantity we are talking about.
Not a sugar, two sugars, many milks, but a grain of/two spoons of/four bags of/ ten kilograms of / many packets of / a lot of sugar, a little milk.
- We do not use them in questions that begin with 'how many', but only in those that begin with 'how much'.
Not How money do you owe him? but How much money do you owe him? not A How many plastic is manufactured in a day?, but How much plastic is manufactured in a day?

» **Note:** that some nouns can be used both as countables, when they refer to a thing, and as uncountables, when they refer to the substance or material it is made up of.
There are three glasses on the tray. ('glasses', countable noun).
The tray is made of glass. ('glass', uncountable noun).
Some countable nouns are concrete and represent people, things or activities that can be seen, touched or heard, for example rose, table, basket. Other countable nouns are abstract and represent states, feelings or qualities, which can only be felt or imagined, for example hop, ambition, joy. Similarly, some uncountable nouns are concrete, for example cotton, clothing, bread, while others are abstract, for example peace, pain, anger.

» **Collective nouns:** common nouns followed by 'of' and referring to groups of people or things.
A team of players, an army of soldiers, a bouquet of flowers.

» **Note:** that when using collective nouns, you will usually have to use the complete expression in order to make sense. For example, the collective noun 'bunch' by itself would not tell people what you are talking about because it could be used for grapes, roses or letters. Exceptions to this are, for example, 'an army', 'a bouquet' and 'a gang', which are usually used for soldiers, flowers and thieves respectively.

Plural forms of nouns

We use plural forms of nouns to talk about people, places and things that are more than one in number, for example 'two trolleys', 'a box of brushes', 'a few monkeys'.

Regular forms: You can follow the patterns below to form the plural forms of most nouns.

1. **Add-s in the case of most nouns:** mugs, pets, beds, cups, tubs, chiefs, cans, sums, teachers, dolls, months, smiles, tongues, days, windows.
2. **Add-es after nouns ending in:**
-s: glasses, classes, passes, masses.
-x: boxes, taxes, faxes.
-ch: matches, clutches, stitches.
-sh: wishes, bushes, dishes.
3. **Add-s after nouns ending in -ay, -ey,-oy, -uy:** rays, keys, toys, guys.
4. **In nouns ending in a consonant letter+-y, replace the final-y with 'i-es':** countries, cities, ladies, babi es.
5. **In nouns ending in-fe, replace the letters with-ves:** knives, lives, wives.

Irregular forms: There are some nouns for which you cannot find the plural forms by following the patterns above. You will have to learn the plurals of these nouns through reading or by looking them up in a standard dictionary Look at some plurals that do not follow the usual pattern.

1. **Nouns ending in-f forms plurals:**
- **With a final -f :** roof/ roofs, chief/ chiefs, proof/ proofs.
- **With a final -ves in place of the -f :** calf/calves, loaf/loaves, leaf/ leaves.
- **With either a final-s or a final -ves:** dwarf/ dwarfs or dwarves, hoof / hoofs or hooves, scarf/ scarfs or scarves.
2. **Nouns ending in -o form plurals:**
- **Always with a final-oes:** potatoes, tomatoes, echoes.
- **With either a final-oes or-os:** buffaloes/ buffalos.
- **Always with a final-os:** kilos, radios, videos, photos.
3. **Nouns whose plural forms are formed by adding-en/-ren:** oxen, children
4. **Nouns whose plural forms are formed by changes in letters within the singular form:** foot/feet, mouse/mice, man/men.

Tips to remember

- The following words are countable and are normally used in singular form only. The indefinite article a/an should not be used with them.
- The words such as measles, mumps, ethics, maths, politics, phonetics, rickets, billiards and innings look like plural nouns but give singular meaning. So, they take singular form of verbs.
- Some nouns have the same form whether singular or plural.
Sheep, deer, service, series, species, apparatus.
- The following nouns are always used in the plural form only.
Cattle, scissors, spectacles, electorate, binoculars, crackers, clergy.
These are used with plural form of verbs.
- Add's' to the main word in compound noun to make it plural.
Sister-in-law, sister's- in-law
- The possessive case of a compound noun is formed by adding's' to the last word.
Father-in-law's property.
- After the phrases *one of, some of, each of, either of, neither of, any of, none of,* a plural form of a noun is used.
- Nouns indicating numerals should be used in singular form.
A dozen eggs/ two dozen oranges.
- After collective noun either a singular or plural form of verb is used.
- An apostrophe and 's' is used with living beings only to show possession.
- When two nouns are connected by **'and'** and are closely related add an apostrophe and **s** to the last noun.
- Collective nouns, such as ***family, majority, audience,*** and ***committee*** are singular when they act in a collective fashion or represent one group. They are plural when the members of the collective body act as individuals. Collective nouns will usually be singular in Sentence Correction sentences.

A majority of the shareholders wants the merger.

This sentence is grammatically correct - but confusing. To determine whether a confusing noun requires a singular or plural verb, it might be helpful to visualize what's actually going on in the sentence. Is the sentence talking about something that acts as a *singular entity*? Or is it talking about the individual elements *within* that entity?

In the sentence here, there is no indication that the sentence is referring to the *individuals within* the majority. The "majority" acts as one - as a singular entity - and therefore requires a singular verb, "wants."

Again, the "flock of birds" is referred to as a singular group - we're not talking about *each bird's* direction of flight, but the direction of the flock as a whole - thus it requires the singular verb "is" not the plural verb "are".

The team are always fighting amongst themselves.

This is an example of a collective noun that requires a ***plural*** verb. While 'team' is often used as a singular collective noun, in this case, the sentence describes the fighting that occurs *between the individual members of the team.* "Team" therefore refers to several *individual members*, and requires a plural verb, "are," as a result.

The key to these questions is simplicity: recognize the collective noun, visualize what's going on in the sentence, and proceed.

Directions (Q. 1-15): *Each question below has a blank, indicating that something has been omitted. Choose the word from the five options for the blank that best fits the meaning of the sentence as a whole.*

1. The work increases our ___ about how the body fights disease.
1) knowledge 2) knowledges
3) knowledgably 4) acknowledge
5) knowledgeable
2. They are doing some fascinating-__________ into the language of dolphins.
1) Researches 2) researcher 3) research
4) re searches 5) re search
3. In our family, we share the ______ between us.
1) Houseworks 2) housework
3) houses works 4) house works
5) house working
4. The first task is to clean up the _____ left behind by the factories.
1) Pollutions 2) pollution
3) polluting 4) pollute
5) polite
5. They are suffering from _____ lack of medical supplies.
1) a serious 2) serious
3) seriously 4) seriousness
5) series
6. He's starting to get a few grey _____ now.
1) Hair 2) heirs 3) heir
4) hairs 5) hairy
7. Would you like some more ___ on your plate?
1) Cauliflower 2) cauliflowers
3) the cauliflowers
4) a cauliflowers
5) an cauliflowers
8. The doctor said that she was making _____ and she would probably be out of hospital by next week.
1) a good progress
2) good progress
3) good progresses
4) better progress
5) good progressing
9. The book has ______ at the end of every chapter.
1) Exercises 2) exercise
3) excess 4) exceed
5) execute
10. Do you want any help in bringing your ______ from the van?
1) stuffs 2) stuff 3) stuffing
4) stuffy 5) stuffed
11. _____ was the ideal punishment for her.
1) A prison 2) Prison 3) prisons
4) the prisons 5) an prison
12. Emily ate six _____ and two eggs for breakfast.
1) bacons 2) rashers of bacon
3) bacon 4) rash of bacon 5) bake
13. Is there _____ for all of us to fit in?
1) a room 2) rooms 3) room
4) the room 5) room's
14. They think she put _____ on their family.
1) a curse
2) curse 3) cursory
4) curses
5) an curse
15. Their offices have small upholstered _____ and comfortable chairs.
1) sofa 2) sofa's
3) sofas 4) an sofa
5) the sofas

Key

1) 1	2) 3	3) 2	4) 2
5) 1	6) 4	7) 1	8) 2
9) 1	10) 2	11) 2	12) 1
13) 3	14) 1	15) 3	